భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

డిసెంబరు 1970

★

సంపుటము : 47 : సంచిక : 12 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

డిసెంబరు 1970

భగవాన్! నన్ను క్షమించు!!

శ్రీ గంధం జోయెల్

ఎన్నేళ్ళని?
ఇంకెన్నాళ్ళని?
నన్నీ సుషుప్తి జగత్తులో
బ్రతకమంటావు? భగవాన్!
పదేళ్ళా? నూరేళ్ళా?
సమాధానమే లేదా?
ఏముందని? ఈ పుడమిమీద!
అంతా పాతకథ; అర్థంకాని సొద!
భగవాన్! నన్ను క్షమించు!!

రంగు రంగుల స్వప్నాల
మేడలు కూలిపోయాయి!
రత్నఖచిత సింహాసనం
ఇతరుల పాలైపోయింది!
తామరపువ్వులాంటి నా వదనం
వికసించిన యవ్వనం రోజులు
గుర్తొచ్చినప్పుడల్లా ఏదో తీరని బాధ
జ్ఞాపకాల దీపాల వరుసలు వెలిసినప్పుడల్లా
ఏవో విలువైన వస్తువుల్ని జీవితంలో
పోగొట్టుకున్న పాంథుడిలా, మౌనంగా
నన్ను బ్రతకమంటావా? భగవాన్;

నిరాశా తిమిరపు తెరలు ఆశల
వెలుగురేఖల వెనక అదృశ్యంకాలేదు
చెలి చెక్కిళ్లపై తొలిసిగ్గు మచ్చు
అలిగి కనుపించడం మానేసింది?

నుదిటిమీద దిద్దిన ప్రేమతిలకం
చెరిగి పోయిందన్నడో!
ఆశల 'ఆసరా' పందిరికూలి
అంతమైనవి అనంతమైన కోర్కెలు
ఎండిపోయినది ఎముకలగూడులా
అర్థం లేని ఆవేదనతో నిత్యమూ.
బ్రతకమంటావా?
భగవాన్! నన్ను క్షమించు!

బ్రతకాలనీ, ఏదో సాధించాలనీ,
అస్తమానం అంతంకాని అంతర్యుద్ధం
ఏమిటి పరీక్ష!
అనుక్షణం వదలని దీక్ష!!

ఇక్కడి లోకంలో నా జీవితాన్ని వేదాంతులు
గడ్డిపోచతో పోలుస్తున్నారు!
నీటిబుడగలా నా మనుగడ క్షణకాలమేనని
ఎగతాళి చేస్తున్నారు మనుష్యులు!
అందుకే భగవాన్ నన్ను రక్షించు!

ఈ బ్రతుకు భారం మోయలేను
అవజయాలకు అర్థం చెప్పలేను!
ఈ కల్లోల ప్రపంచం దాటి
సప్త సముద్రాల ఆవలితీరాన,
ఎక్కడో మనసు కుదుటపడే మరోలోకానికి,
మమతలు చిగురించే ధరణికి,
ఆకలి దాహం లేని అవనికి,
క్రోధం, బాధలు లేని నవజగతికి
పాపపుణ్యాల తేడా లేని చోటుకి
పచ్చనిఆకులు, ఎండిపోని ప్రేమలు వాడిపోని
కాంతుల వేడిదల్లారని విశ్వానికి
నన్ను నడిపించు! కడతేర్చు
భగవాన్! నన్ను క్షమించు!!

బహుముఖ ప్రజ్ఞ

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

వ్యాకరణము

కాళిదాసుని వ్యాకరణాభిజ్ఞత ఉపమాలంకార వివరణ ప్రకరణముతో 'ధాతోః స్థాన ఇవాదేశం', 'ధాతోరర్థ ఇవాభవత్'।, 'అపవాదై రివోత్సర్గాః' అనుచోట్ల విపులముగా ప్రస్తావింపబడినది. అందు సామాన్య అపవాద సంప్రదాయము సర్వశాస్త్ర సాధారణమైనను వ్యాకరణమున బహుళ ప్రసక్తమగుటచే ఇం తుదాహృతమైనది. ఇట్లు ధారాళముగా ఉపమించుటకు ఆ శాస్త్రమునందలి గాఢపరిచయమును, వానియందలి ఆసక్తియును కారణములుగాని పాండిత్యప్రకటనార్థము కాదని ఆతని రచనా సౌలభ్య మెఱిగినవారు గ్రహింపగలరు.

> 'తం వినిష్పిష్య కాకుత్స్థౌ
> పురా దూషయతి స్థలీమ్'
>
> రఘు. 12-30

అను విరాధవధ సందర్భమున 'పురాదూషయతి' అను విశేష ప్రయోగము వ్యాకరణజ్ఞులను సంతోష పెట్టును.

'రామలక్ష్మణులు విరాధుని ముద్దచేసి ఈ కళేబరముచే నీ ప్రదేశము దోషభూయిష్ఠమగునని తలచి దానిని భూమితో పతిపెట్టిరి' 'దూషయతి' అను వర్తమానక్రియకు ముందు 'పురా' అను నవ్యయమును వాడిన భవిష్య దర్థము వచ్చును. వర్తమానమునకు 'స్మ' చేరిన భూతార్థము వచ్చుట ప్రసిద్ధమైనది. సూ. 'స్మోత్తరే లఙ్ చ' 3-3-176. 'యావత్పురా నిపాతయో ర్లట్' 3-3-4 అను సూత్రముచేవచ్చు భవిష్యదర్థ ప్రయోగములు క్వాచిత్కములు. అట్లే 'తస్మిన్నాస్థ దిషీకాస్త్రమ్' రఘు. 12.23 అను కాకాసుర కథా సందర్భమున ఆస్థత్ అను లఙ్ ప్రయోగము చమత్కారమైనది. ఇది చూడగానే స్థాధాతు రూపమేమో యను భ్రాంతి కల్గును. కాని ఇది అసు-క్షేపణే అను దివాదిధాతువునకు లఙ్ రూపమని తెలియగానే చిఱునవ్వు వచ్చును. ఇట్టి చమత్కృతులు కాళిదాససముద్రమున ఎన్నని యెన్నగలము?

ఈతని రచనములందు అపాణినీయ ప్రయోగములున్నవని పలువురు వ్యాఖ్యాతలు ఉటంకించిరి. పాణినీయము బహుళ ప్రచారమును, పరమ ప్రామాణికత్వమును, పొందని రోజులలో కాళిదాస రచనములు సాగుటచే ఇట్టివి నెలకొనుట సహజమని చెప్పుదురు. అట్టి అపాణినీయములకు కొన్ని మచ్చులు:

1. 'తం పాతయాం ప్రథమ
   మాస పపాత పశ్చాత్' రఘు. 9.66
2. 'ప్రభ్రంశయాం యో నహుషం చకార'
   రఘు. 13.36.

సూ. కృఞ్చానుప్రయుజ్యతే లిటి' (3. 140) అను సూత్రముచే ధాతువునకును అనుప్రయోగమునకును వ్యవధానము ఉండరాదని పాణినీయ నిర్ణయము. కాగా, 'పాతయామాస, ప్రభ్రంశయాం చకార' అని యుండవలెను. కాని, ఇట మొదట ప్రథమశబ్దముతోను, తర్వాత యచ్ఛబ్దముతోడను వ్యవధానముండుట పాణినీయ విరుద్ధము.

ప్రస్తుత రఘువంశప్రతులందు 'అవేహి మాం కింకర మష్టమూర్తేః' (రఘు. 2.35.) అని

యున్నను భట్టోజీదీక్షితునికాలపు పాఠము 'అన్వైహి' అని యుండుటచే కాబోలు దీక్షితులు దానిని అన్వైహీతి వృద్ధిరసాధురేవ (సిద్ధాంత కౌముది-పుట 10) అని ఆక్షేపించుట జరిగినది. కనుక అన్వైహి అను అపాణినీయ సంధినే కాళిదాసు వాడినట్లు విశ్వసింప వలసియున్నది. ఇచ్చట 'ఏత్యేధత్యూఠ్సు' 6—1—89 అను సూత్రమును బాధించి 'ఓమాఙోశ్చ' 6.1.95 అను సూత్రమే ప్రవర్తించునని దీక్షితాభిప్రాయము.

ఇట్లే 'త్రియంబకం సంయమినం దదర్శ' (కుమా. 3) అనుచోట త్రి+అంబక అను శబ్దములకు యణాదేశసంధి యగుట శాస్త్రీయము. కాని, ఇచట నా యణాదేశమునకు మారుగా 'ఇయ' వచ్చుట అపాణినీయము. ఈ ప్రయోగము లౌకిక సంస్కృతమున లేకున్నను, వైదిక సంస్కృతమున 'త్రియంబకం యజామహే...' అని ఉండవచ్చును.

'దృఢభక్తిరితి జ్యేష్ఠే' (రఘు. 12.19.) అను స్థలమున దృఢా భక్తిః యస్య యను విగ్రహమున భక్తిశబ్దము ప్రియాదిగణపఠిత మగుటచే 'న పూరణీప్రియాదిషు' అను నిషేధము ప్రవర్తించి దృఢశబ్దమునకు పుంవద్భావము రాదు. కనుక దృఢాభక్తిః అనియే యుండవలెనుగాని, దృఢభక్తిః అని యుండరాదు. కాని, దీనికి దృఢమ్ భక్తిః అని విగ్రహము చెప్పిన గణవ్యాఖ్యానమునుబట్టియు, భోజుని వేరొక వచనమునుబట్టియు, మల్లినాథుడు దీనిని సమర్థించెను.

జ్యోతిషము

కాళిదాసుని జ్యోతిశ్శాస్త్ర పరిచయము ఎడనెడ మనకు దర్శనమిచ్చును.

సుదక్షిణాదిలీపులు వశిష్ఠాశ్రమమునకు పోవుచున్నప్పుడు చెప్పిన 'కాప్యభిఖ్యా తయోరాసీత్' అను శ్లోకమునందలి ఉపమాన వివరణమునందు ఇందలి జ్యోతిష పరిజ్ఞానము వ్యాఖ్యాతమైనది.

రఘువు జన్మించునప్పుడు అతని జన్మకాలము ఇట్లు వర్ణింపబడినది.

గ్రహైస్తతః పంచభి
రుచ్చసంస్థితైః
అసూర్యగైః సూచిత
భాగ్యసంపదమ్॥ రఘు. 3.

'అస్తమితములు కాని ఐదు గ్రహములు యథాసంభవముగా తమ తమ ఉచ్చస్థానము లందుండగా భాగ్యవంతుడు కాదగిన కుమారుని సుదక్షిణా దేవి కనెను.'

జన్మకాలమ్ము స్పష్టముగా తెలియకుండున ఏ గ్రహము ఏ రాశిలో ఉచ్చలో ఉన్నదో తెలియకున్నను, ఆ సమయమునకు తగినట్లు ఐదు గ్రహములు ఉచ్చస్థితిలో నున్నవని భావింపవలెను.

[1]కొందఱు విమర్శకులు ఐదు గ్రహములకు ఉచ్చ సంభవించుట అసంభవమని భావించి 'కాళిదాసు ఇట్లు చెప్పుట 'ఉజ్జాయింపు' అని వ్రాసిరి. కాని ఐదు గ్రహములకు ఉచ్చస్థితిని వాల్మీకి రామజనన సందర్భమున చెప్పెను

'నక్షత్రేఽదితి దైవత్యే
స్వోచ్చ సంస్థేషు పంచసు
గ్రహేషు కర్కటే లగ్నే
వాక్పతా విందునా సహ॥
ప్రోద్యమానే జగన్నాథం
సర్వలోక నమస్కృతమ్।
కౌసల్యా జనయ ద్రామం
సర్వలక్షణ సంయుతమ్॥

రామా. బాల. 9. 10

అను శ్లోకముల వ్యాఖ్యాన సందర్భమున గోవిందరాజులు మేష, కర్కాటక, తులా, మకర మీనములందు సూర్య, గురు, శని, కుజ, శుక్రులు క్రమముగా ఉచ్చస్థితులు కావచ్చునని నిరూపించెను.

1 భారతి 1943 ఆగస్టు కాళిదాసు— జ్యోతిషము. డా. కుప్పన్నరాజా.

ఈ రామాయణ సందర్భమునుబట్టి కాళిదాస వచనము శాస్త్రదూరముకాదని చెప్పవొప్పును.

మన్మథుడు శివాశ్రమముచేరి, ఎదుట శుక్రుడున్న దిక్కువైపు ప్రయాణమును పరిహరించినట్లు శివదృష్టిని పరిహరించి ప్రాంతప్రదేశమున నిలిచెను.

'దృష్టి ప్రపాతం పరిహృత్య తస్య
కామః పురశ్శుక్ర మివ ప్రయాణే॥'
కు. 3.43

దీనినే మనవారు విరుద్ధమైన దానికి 'చుక్కెదురు'రందురు. ముహూర్తవేత్తలు దీనిని గొప్ప దోషముగా పరిగణించి 'ప్రతిశుక్రం, ప్రతిబుధం, ప్రత్యంగారక మేవచ! అపి శక్రసమో రాజా హత సైన్యో నివర్తతే' అని నిషేధించిరి.

ఈ క్రింది సందర్భమున ఈతని ఖగోళ పరిచయము మనకు స్పష్టమగును.

తాభి ర్గర్భః ప్రజాభూత్యై
దధ్రే దేవాంశ సంభవః
సౌరీభి రివ నాడీభిః
అమృతాఖ్యాభి రమ్మయః॥

అమృతములను సూర్యనాడులు (కిరణ) జలమయ గర్భములు ధరించునట్లు దశరథుని రాణులు గర్భవతులు ఐరని వర్ణించెను. ఈ ఉపమానములోని ఖగోళరహస్యమును యాదవనిఘంటువు ఇట్లు వివరించును.

'శతం శతం వృష్టివహాః
తా స్సర్వా అమృతాః స్త్రియః'

'సూర్యకిరణములు వందలకొలది వృష్టినామకములై అమృతస్త్రీలని చెప్పబడుచున్నవి'. ఈ విశ్వాసమునే రఘు. 13.3 శ్లో. లో 'గర్భం దధ త్యర్కమరీచయో స్మాత్' అని సముద్ర సందర్భమున పునరుద్ఘాటించెను.

ధర్మశాస్త్రము

దిలీపుడు పతిసమేతముగా వసిష్ఠాశ్రమమునకు వెళ్లినపుడు మహర్షి సాయంకాల జపహోమ విధియందుండెను.

'విధే స్సాయంతన స్యాంతే
సదదర్శ తపోనిధిమ్' 2.56 రఘు.

సాయంకాలానుష్ఠానానంతరము రాజు మునిని పత్నీసమేతముగా సందర్శించెను.

'తతో జగృహతుః పాదౌ
రాజా రాజ్ఞీ చ మాగధీ.' 2.57 రఘు.

పిమ్మట రాజును, రాణియును, గురు పుని పాదములకు నమస్కరించిరి.

రాజంతవరకు గురువును చూచి ఏల నమస్కరింపలేదు? మౌనముగ నమస్కరించి తన భక్తిని వెల్లడింపవచ్చునే—కాని, అది ధర్మశాస్త్రవిరుద్ధము.

సమి త్పుష్ప కుశాగ్న్యంబు
మృదన్నాక్షత పాణికః
జపం హోమం చ కుర్వాణో
నాభివాద్యో ద్విజో భవేత్॥

'సమిధలు, పువ్వులు, దర్భలు, అగ్ని, నీరు, మన్ను, అన్నము, గంధము (వీనిలో ఏవో కొన్ని) మున్నగు వానిని చేతిలో నుంచుకొని జపహోమములు చేయు బ్రాహ్మణునకు నమస్కరింపరాదు.'

ఈ ధర్మసూక్ష్మత నెఱిగిన రాజు వెళ్లిన వెంటనే గురునకు నమస్కరింపలేదు. ఈ ధర్మము రాజుకంటె కవికి ముందు తెలియును.

అజుడు స్వయంవరమునకు పోవుచు త్రోవలో నర్మదా నదీతీరమున అలజడిచేసిన అడవియేనుగును బెదరించి మరలించెను. అతని కొడుకు దశరథుడు ఏనుగనుకొని మునికుమారుని చంపెను. దీనివలన తండ్రి మేలును కుమారుడు కీడును పొందిరి. కారణమేమి?

ఈ ధర్మశాస్త్ర వచనము గమనింపుడు.
'లక్ష్మీకామో యుద్ధా దన్యత్ర కరివధం నకుర్యాత్!
ఇయం హి శ్రీః యే కరిణః (చాతుష్కః)'

ఈ విషయమును మరల దశరథ సందర్భమున ఇట్లు చెప్పెను.

నృపతేః ప్రతిషిద్ధ మేవ తత్
కృతవాన్ పంక్తిరథో విలంఘ్య యత్।
అపథే పద మర్పయంతి హి
శ్రుతవంతోఽపి రజోనిమీలితాః॥

'దశరథుడు చేయదలచిన గజవధము శాస్త్రనిషిద్ధమైనది. కాని దాని నతడు చేసెను. విద్యావంతులైనను రజముచే కన్నులు కప్పబడగా అమార్గమున సంచరింతురు'

కుమార సంభవపు అష్టమ సర్గమున శివుడు పార్వతితో శృంగారక్రీడలలో మునిగి తేలుచు, సంధ్యాసమయమగు సరికి క్రీడలను విడచి యథావిధిగా సంధ్యావందనము చేసినాడు. ఆ ఎడబాటునకు కోపగించి దేవి అసూయావతి యయ్యెను. అప్పుడు మహేశ్వరుడు సంధ్యావందన ప్రాశస్త్యమును ఇట్లు ఉగ్గడించెను.

నిర్మితేషు పితృషు స్వయంభువా
యా తను స్సుతను పూర్వ ముజ్ఝితా
సేయ మస్త ముదయం చ సేవ్యతే
తేన మానిని మ మాత్ర గౌరవమ్॥

'పూర్వము బ్రహ్మదేవుడు పితృదేవతలను సృజించి, ఆ శరీరమును విడువగా అదియే ఉదయ, అస్తమయ సమయములందు సంధ్యారూపమున పూజ్యభావముతో పూజింపబడుచున్నది. మానినీ, కనుకనే నాకీ సంధ్యయందు ఇంత గౌరవము'

ఈ అంశమునకు ఈ భవిష్యత్పురాణవచనము ప్రమాణము.

'పితామహః పితౄన్ సృష్ట్వా
మూర్తిం తా ముత్ససర్జ హ,
సా ప్రాత స్సాయమాగత్య
సంధ్యా రూపేణ పూజ్యతే.
ఏతాం సంధ్యాం యతాత్మానో
యే తు దీర్ఘ ముపాసతే,
దీర్ఘాయుషో భవిష్యంతి
నీరుజః పాండునందనేతి'

సాక్షాత్ పరమేశ్వరుడే శాస్త్రసంప్రదాయమును ధర్మవచనమును గౌరవించి సంధ్యా ప్రణామము చేసినాడనగా మానవుడు కామపురుషార్థము కంటె ధర్మపురుషార్థమును ఎట్లు మన్నింపవలెనో కవి నిరూపించెను.

"కామ శాస్త్రము

ధర్మార్థములు మానవుల కెంత సంసేవ్యములో కామమును అంత స్వీకార్యమే. వాని పరిజ్ఞాన మెంత యవసరమో దీని యవసరమును మానవుని కంత యున్నది. కనుక ధర్మార్థ పరిజ్ఞానమునకు శాస్త్రములు పుట్టినట్లే కామమునకును లోకశ్రేయస్కాములైన మహర్షులు శాస్త్రములను రచించిరి. దీని పరిచయమునకు సిగ్గు పడనక్కరలేదు. కాళిదాసునకు తక్కిన వానితోపాటు కామశాస్త్రజ్ఞానము పరిపూర్ణముగా నున్నదని అతని అగ్నివర్ణ శృంగార క్రీడలను బట్టియు, గౌరీశంకర నవసమాగమ వర్ణనమును బట్టియు మనము గ్రహింపగలము.

చూర్ణబభ్రు లులిత స్రగాకులమ్
ఛిన్నమేఖల మలక్త కాంకితమ్।
ఉత్థితస్య శయనం విలాసినః
తస్య విభ్రమరతా న్యపావృణోత్॥ రఘు. 19

అగ్నివర్ణుడు శయనించి లేచిన పాన్పు చూడగా, తలమున్కలైన అతని శృంగార పాండిత్యము వెల్లడి యగుచున్నదట.2

నవవధువు పార్వతి ముగ్ధా, మధ్యా, ప్రౌఢా రీతులను కుమారకావ్యపు అష్టమసర్గమున మిక్కిలి మెలకువతో హృదయంగమముగ వర్ణించెను.

మానవ మనస్తత్త్వము

కాళిదాసు మానవమనఃప్రవృత్తులను బాగుగా నెఱిగిన కవి. ఒక సుందరాంగిని చూచినపుడు యువ

2. చూ. రఘు 19. మల్లినాథవ్యాఖ్య

హృదయములోని గిలిగింతలను శృంగారచేష్టితము లనుపేర ఇందుమతీ స్వయంవర సందర్భమున చమత్కరించి చూపినాడు.

'ఇందుమతి స్వయంవర మండపమున ప్రవేశింపగనే రాజకుమారులకు—చెట్లకు చివుళ్లు పుట్టినట్లు — అనేక శృంగారచేష్టలు ఉత్పన్నము లైనవి'. 6.12

ఒకరాజపుత్రుడు చేతితో ఒయ్యారముగ ఒక తామరపువ్వు కాడతో పట్టుకొని త్రిప్పుచుండెను. ఆతని ఉద్దేశములో దానికర్థము 'నీ చేతిలో నేనిట్లు సొగసుగ తిరుగుదును' అని చెప్పుటకాగా ఇందుమతి దృష్టిలో ఇది చేతులాడించు అవలక్షణముగా పరిణమించెను. 6.13.

వేఱొక విలాసి భుజమునుండి జారి భుజకీర్తికి తగులుకొన్న మాలను ఓరగా శిరసువంచి మరల మెడలోనికి తెచ్చుచుండెను! ఆతడు 'రాజకుమారీ, నిన్నిట్లు హృదయమున చేర్చుకొందునని సూచింపగా రాకుమారి ఈతని వక్షమున కప్పవలసిన దేదో యున్నదని తలచెను.

ఇంతవరకు కవీంద్రుని భారత సంస్కృతి పరిజ్ఞానము స్థాలీపులాకముగా చూపబడినది.

లలితకళలు

కవీంద్రునకు గభీరములగు శాస్త్రవిషయములలో ఎంత చక్కని పరిచయమున్నదో చూచినమీదట ఆతని మధురకళాహృదయమును సమీక్షింతము.

అజుడు ఇందుమతిని గూర్చి విలపించుచు 'ప్రియశిష్యా లలితే కలావిధౌ' (రఘు. 8.67) అని చెప్పెను. లలితకళ లను మాటను కవి సాభిప్రాయముగా వాడెను. లలితశబ్దమునకు మధురమను అర్థము వ్రాసి మల్లినాథుడు 64 కళల పట్టికను ఇచ్చెను. మానవహృదయమునకు ఆపాత మాధుర్యము నిచ్చు సంగీత, చిత్ర, కవితా, నాట్యములకే ఈ మాటను వాడుట సమంజసమని తోచును. ఏమనగా అజునకు ఇందుమతి శిష్యురాలైనది, ఈమధుర కళలలోనేగాని కుట్టుట (సీవ్యం) దండకట్టుట (మాల్యవిధి) వంటి సామాన్య విషయములందు కాదుగదా!

ఈతని లలితకళాభిరుచి కథాసందర్భమున ఆయాపాత్రల ముఖమున, ఉపమానాదుల సాక్షాత్కరించు చుండును.

సంగీతము

రాజదంపతులు వసిష్ఠాశ్రమమునకు పోవుచుండగా నెమళ్లు రథచక్రధ్వనికి తలలెత్తి షడ్జస్వరమువలె రెండు విధములైన కేకారవములను చేసినవి. మనోహరములైన ఆ ధ్వనులను వినుచు వారు ప్రయాణముచేసిరి. రఘు. 1. 39.

మనోభిరామాః శృణ్వన్తౌ
రథనేమి స్వనోన్ముఖైః,
షడ్జ సంవాదినీః కేకా
ద్విధాభిన్నాః శిఖండిభిః.

'షడ్జం మయూరో వదతి' అను న్యాయమున నెమలికూత షడ్జధ్వనిని పోలియుండును. నాసాది షట్ స్థానములందు పుట్టుటచే దానికా పేరు వచ్చినదట! అది శుద్ధ వికృత భేదముచే రెండు విధములు. ఆ ద్వైవిధ్యము కన్పడునట్లు నెమళ్లుకూసినవి. అవి మనోభిరామములు. ఇది కాళిదాసుని సంగీత మర్మదర్శిత. ఇట్టి సాంకేతిక పరిజ్ఞానము మరి రెండు చోట్ల కాననగును.

కుమార కావ్యమున 'హిమవంతుడు గుహాముఖమునుంచి వచ్చు గాలితో చెంతనున్న వేణువులను పూరించి ఉచ్చైః స్వరమున పాడు కిన్నరులకు స్వరవిన్యాసముతో సహకారగానము చేయుచున్నట్లుండెను.' (కుమా. 1.8) అని వర్ణింపబడెను.

యః పూరయన్ కీచకరంధ్రభాగాన్
దరీముఖోత్థేన సమీరణేన।
ఉద్గాస్యతా మిచ్ఛతి కిన్నరాణాం
తానప్రదాయిత్వ మివోపగంతుమ్॥

దేవతలు గాంధార గ్రామమున పాడుదురు. మానవుల కది అసాధ్యము. కనుక గుహాముఖము నుండి వచ్చిన గాలితో ఉన్నతస్వరమున మ్రోగు వేణువులు మాత్రమే సహకారగానము చేయసమర్థములు. గాయకుడు పాడదలచిన గీతమునకు తగిన స్వరములు చూపి సహకరించుట సంగీతగోష్ఠి సంప్రదాయము!

గాతా యం యం స్వర గచ్ఛేత్
తం తం వంశేన తాన యేత్'

అని సంగీత దామోదరము.

మేఘ దూతమున యక్షుడు మేఘములతో చెప్పుచున్నాడు. 'నీకు హిమవంతమున ఒక రాతి పలకపై మహేశ్వరుని పాదముద్ర కాన్పించును. దానిని భక్తులు భజింతురు. (మేఘ 1.59.) దాని చెంత వేణువనములు గాలిపోసికొని మధురముగ ధ్వనించును. దాని ననుసరించి కిన్నరస్త్రీలు పరమేశ్వరుని త్రిపురవిజయమును గానము చేయుదురు. అపుడు గుహలందు ప్రతిధ్వనించు నీ గర్జనములు మర్దల ధ్వనులైనచో అప్పటికి శివునికి సంగీత సేవ పూర్తి యగును. (మేఘ 1.60.)

శబ్దాయంతే మధుర మనిలైః
కీచకాః పూర్యమాణాః
సంసక్తాభిః త్రిపుర విజయో
గీయతే కిన్నరీభిః,
నిర్హ్రాద స్తే మురజ ఇవ చేత్
కందరేషు ధ్వనిః స్యాత్
సంగీతార్థో నను పశుపతే
స్తత్ర భావీ సమగ్రః॥

సంగీతమనగా సమ్యగ్గీతము. ఇది శ్రుతి, మృదంగము, గాత్రము అను వానితో సంగతమగును. ఈ సమగ్ర సంగీతముతో కవీంద్రుడు ఈశ్వర సేవ నుద్దేశించెను.

సంగీత గోష్ఠిలోని వేరొక సొగసు ఇట్టిది.

వసంతము వచ్చినది. పడుచు తుమ్మెదలు తిలకవృక్షాగ్రము అనెడు హర్మ్యములలో పరిమళ భరితమగు పుష్పమధు సేవనము చేయుచు, ఆడు తుమ్మెదలతోగూడి అవ్యక్తమధురముగా పాడుచున్నవి. (రఘు. 9. 40.)

శాతకర్ణియను మహర్షి అప్సరసల వలలో బడి ఒక సరస్సులో సౌధము నిర్మించి అందు అప్సరస్సంగీతములో ఓలలాడు చుండెను. ఆ సంగీతములోని మృదంగ ఘోషము శ్రీరాముడు పుష్పకముతో పోవుచుండగా ఆ విమాన శిఖరములందు ప్రతిధ్వనించెను. (రఘు 13. 40.)

అగ్నివర్ణుడు రాజ్యపాలనము విడిచి కళాలోలుడై మునిగి తేలుచుండెను. ఆ మహారాజుఒడిని మధురస్వరము లాలికించు వీణగాని మంజువాదిని యగు మదవతిగాని విడువకుండ అలంకరించుచుండ వలెను. (రఘు. 19. 13.)

పార్వతీకన్య సంగీత రసజ్ఞురాలు. ఆమె శంకరునందలి ప్రేమతో ఆతనిచరిత్ర గానము చేయుచు మధ్యను ఆతడు దూరమగుట జ్ఞాపకము వచ్చి, వెక్కివెక్కి ఏడ్చుచు, సంగీతమునందు తనకు సఖులైన కిన్నరకన్యకలనుగూడ ఏడ్పించెను. (కుమా: 5.)

ఇట్లు పలుచోట్ల ఆతని సంగీతాభిరసము దర్శన మిచ్చుచుండును.

నృత్యము

సంగీతముతోబాటు ఈతని నృత్యాభిమానము ఎన్నదగినది.

అగ్నివర్ణుడు మహారసికుడు. మెడలో పూలమాలలు కదలగ, తాను మృదంగము వాయించుచు నృత్యసుందరులచే నృత్యము చేయించుచు వారి యభినయమునందు లోపము కాన్పింపగా వారి నృత్యగురువుల యెదుటనే వారి నాక్షేపించును.

స స్వయం ప్రహతపుష్కరః కృతీ
లోలమాల్య వలయో హరన్మనః

నర్తకీ రభినయాతిలంఘినీః
పార్శ్వవర్తిషు గురు ష్వలజ్జయత్॥
రఘు. 19. 14.

ఆతని అభినయపాండిత్యము నిపుణులకే వంకలు దిద్దునట్టి దన్నమాట. నృత్యప్రియుడైన ఆరాజు అంగిక సాత్త్విక వాచికాభినయ రూపమైన నృత్యమును నర్తకీమణులకు బోధించి మిత్రుల యెదుట ప్రదర్శనములు చేయించుచు నృత్యనిశార దులతో వాని గుణదోషమును గూర్చి వివరించు చుండెను. (రఘు. 19. 36.)

నృత్య మాస్వాదించుటయేగాదు శిక్షణ మిచ్చి, చర్చింపదగిన కళాకుశలు డాతడు. ఈ వివాదమే రసవంతమైన మాళవికాగ్నిమిత్రకథకు పునాది వేసినట్లు కాన్పించును. చూడగా ఈ అగ్నివర్ణుని రాసిక్యము కొంత , అగ్నిమిత్రునియందు లీలగా గాన్పించును.

కుమారకావ్యమున గౌరీశంకర కల్యాణమైన పిదప నవవధూవరుల యెదుట అచ్చరలు రసవంత మైన నాట్యము ప్రదర్శించిరి.

'తౌ సంధిషు వ్యంజిత వృత్తిభేదం
రసాంతరేషు ప్రతిబద్ధరాగమ్
అపశ్యతా మప్సరసాం ముహూర్తం
ప్రయోగ మాద్యం లలితాంగహారమ్॥'

ముఖాదిసంధులలో రసానుగుణముగ కైశిక్యాది వృత్తులను ప్రకటించి, శృంగారాది రసప్రదర్శ నములో ఉచితమైన రాగములు పాడి సొగసైన అంగ విన్యాసములతో అప్సరసలు ప్రదర్శించిన నాటకమును కొంతసేపు ఆ నూత్నదంపతులు చూచిరి. (కుమా. 7.91.)

చి త్ర ర చ న ము

కవీంద్రుడు పలుతావుల చిత్రరచనమును గూర్చి ఆసక్తితో ప్రస్తావించెను.

రాముడు అయోధ్యలో ప్రవేశించి సర్వవస్తు పూర్ణములైన భవనములను సుగ్రీవాది మిత్రుల కిచ్చి, తండ్రి చిత్రపటము మాత్రము మిగిలిన పూజ్యగృహమున కన్నుల నీరు నించుకొనుచు తాను ప్రవేశించెను. (రఘు. 14.15.)

'బాష్పాయమాణో బలి మన్నికేతం
ఆలేఖ్యశేషస్య పితు ర్వివేశ'.

సీతారాములు చిత్రరచనములతో శోభించు గృహములందు సుఖముల ననుభవించుచు చిత్ర లిఖితములైన తమ అరణ్యవాస ప్రవాసాది దుఃఖము లను తలచుకొని ఆ యనుభూతిని సుఖముగనే భావించుచుండిరి.

తయో ర్యథా ప్రార్థిత మింద్రియార్థా
నాసేదుషోః సద్మసు చిత్రవత్సు
ప్రాప్తాని దుఃఖా న్యపి దండకేషు
సంచింత్యమానాని సుఖా న్యభూవన్॥
(రఘు. 14.25.)

ఈ చిత్రదర్శనము, సుఖదుఃఖానుభవములు, భవభూతి చిత్రదర్శనరంగమునకు దారిచూపినవని తెలియుచున్నది గదా!

పార్వతి యౌవనము కుంచెతో రూపుకట్టిన చిత్రమువలె నున్నదట.

'ఉన్మీలితం తూలిక యేవ చిత్రం' (కు. 1.32)

'పార్వతి శివవిరహమున పరితపించుచు చేతు లార ఆతని చిత్రము లిఖించి 'ఏమయ్యా, చంద్ర శేఖరా! వేత్తలు నిన్ను సర్వాంతర్యామివని చెప్పె దరు. కాని నీ యందింత ప్రేమగల నన్నే ఎఱుగ జాలకున్నావా! అని ఎత్తి పాడిచెను.'

యదా బుధైః సర్వగత స్త్వ ముచ్యసే
నవేత్సి భావస్థ మిమం కథం జనమ్?
ఇతి స్వహస్తోల్లిఖిత శ్చ ముగ్ధయా
రహ స్యుపాలభ్యత చంద్రశేఖరః. (కుమా. 5.58)

'గాలి తీసికొనిపోగా కొన్ని మబ్బులు అలకా సౌధాగ్ర గృహములలోనికి చొచ్చి అచ్చట గోడలందలి

చక్కని ఆలేఖ్యములక్షై సీటిబిొట్లుచల్లి వానిని తెరచి ఈ కొంటెతనము నెవర్నైనా తూతురేమో యని పొగవలె రూపము మార్చుకొని సన్న సన్నగా కిటికీలనుండి జారిపోవుచున్నవి.'

నేత్రా నీతాః సతత గతినా
యద్విమానాగ్రభూమీః
ఆలేఖ్యానాం స్వజలకణికా
దోష ముత్పాద్య సద్యః
శంకా స్పృష్టా ఇవ జలముచ
స్త్వాదృశో జాలమార్గైః
ధూమోద్గా రానుకృతి నిపుణా
జర్జరా నిష్పతంతి. (మేఘ. 2.)

కుశుడు పాడ్పడిన అయోధ్యకు వచ్చి ఉత్తమ ప్రతిమాగృహములకుముందు వాస్తు విధాన వేత్తలచే బలికర్మను చేయించెను. (రఘు. 16.39.)

కాళిదాసు శిలాశిల్పమును ప్రత్యేక శ్రద్ధతో ఎచ్చటను స్మరింపకున్నను ఈ ప్రతిమాగృహము లందు శిలాశిల్పముతే ఉన్నవని భావింపవచ్చును. భాసుని ప్రతిమాగృహకల్పనము ఈతని కీ సందర్భమున జ్ఞాపకము వచ్చియుండును.

శిల్పమనగా నీతని దృష్టితో చెక్కడపు పనియే గాక లలిత కళలన్నియును చేరును. 'పాత్ర విశేషే న్యస్తం గుణాంతరం వ్రజతి శిల్ప మాధాతుః' అను మాళవికలోని శిల్పశబ్దమును, 'శిల్పకార్య ఉభయేన వేజితాః' అని రఘు. 19 సర్గమునందలి వాక్యమును ఈ యభిప్రాయమును బలపరచును. ఈతని కాలమున శిలా శిల్పమంత ఆసక్తికరము కాలేదేమో అనిపించును.

సౌందర్యారాధనము

కాళిదాసుని సౌందర్యదృష్టి అనన్యాదృశమైనది. అతడు తన కావ్యముల నన్నింటిని గొప్ప సౌందర్యదర్శనముతో నింపివేసెను. సూక్ష్మ సూక్ష్మతరమైన అతని సౌందర్యజ్ఞానము వస్తువుయొక్క బాహ్యాభ్యంతరస్వరూపములను తరచి తెరచి చూడగలదు. సుకుమారమైన అతని హృదయరసికత సోకిన వస్తుభావములందు అమృతము కురియును. ఇంత అర్ధాంతరంగముతో ఆత్మీయతతో సృష్టిని సృష్టిలోని వస్తువులను చూడగల్గుట ఒక్క వాల్మీకిలో మాత్రమే కాన్పించును.

ఈతని నిశితసౌందర్యాభిరతికి పాత్రమైన వస్తువులు రెండు. ఒకటి ప్రకృతి. రెండు స్త్రీ.

ఈ రెండిటి సౌందర్యోత్తేజనమువలన అతని లేఖిని నృత్యము చేసినది. ముక్తకంఠముగ గానమొనర్చినది. అతడు ప్రకృతివైపు చూచెనా, అది మనసిచ్చి మాటలాడును. స్త్రీని దర్శించెనా ఆమె తన సౌందర్య సర్వస్వముతో సాక్షాత్కరించును.

కవీంద్రుని దృష్టిలో ప్రకృతి జడముకాదు. ఆమెదేవత. ఆమె మానవోత్తములను పూజించును. తీగకన్నెలు పూలు చల్లుదురు. (రఘు. 2. 10.) వేణుకుంజములు కీర్తిగానములు చేయును. (2. 12.) సువాసన లీను కొండగాలులు సేద దేర్చును. (2. 13.) చమరీ మృగములు వింజామరలు విసరును. (కు. 1. 13.) కొండనేస్తములు మేఘప్రియులను శిరసావహింతురు. (మే. 1. 17.) నదీ సుందరులు మేఘప్రియులకు ప్రేమరసములు ధారవోయుదురు. (మేఘ. 1.)

హిమగిరిపై హఠాత్తుగా మనకు ప్రత్యక్షమైన ఈ దృశ్యమును చూడుడు

తలవంచుకొని మేయుచున్న ఎర్రని నందినీ ధేనువుపై తెల్లని జూలు విదళించుకొనుచు ఒక సింహము దుమికి పట్టుకొనెను. ఈ వికృత దృశ్యము నుండి కవీంద్రుడు పిండిన సుకృత దృశ్యము ఇదీ. ఆ దృశ్యము ఎర్రని గైరికాది ధాతువులతో ప్రకాశించు పర్వతసానుతలమున విరియబూచిన లొద్దుగ చెట్టువలె నున్నది. (రఘు. 2. 29.)

వైతాళిక కుమారులు నిద్రించుచున్న అజరాజును మేల్కొల్పు చున్నారు. 'రాజకుమారా!

తెల్లవారుచున్నది. చెట్లచివుళ్ల ఎఱ్ఱని పొట్టులలో పడిన అణిముత్తెమువంటి మంచుబిందువు నీ ఎఱ్ఱని పెదవియందలి విలాసస్మితమువలె మెరయుచున్నది.' (రఘు. 5. 70.)

ఇంద్రుడు కార్యసిద్ధికై మన్మథుని స్మరించెను. శృంగారపురుషుడు మన్మథుడు ప్రత్యక్షమైన రూపచిత్రణ మిది.

'సుందరాంగి కనుబొమ్మల వంటి కొనలుగల పూలవింటిని రతీదేవి చేతిగాజుల నొక్కులుగల మెడలో తగిలించుకొని మావి చివురు బాణము చేత ధరించి మిత్రుడు వసంతుడు వెంటరాగా ఇంద్రుని సన్నిధికి వచ్చెను.' (కు. 2.64.)

శివుని గభీరతపోరూపమును చూచి ఇంతటి మన్మథుడును కొయ్యబారగా వాని ధైర్యమును రెక్కలువుచు సౌందర్యలహరి గౌరీకుమారి సాక్షాత్కరించెను. ఆ ఇంపుసొంపులు ఏ కుంచెకొనల కందును? ఒక కాళిదాస లేఖినియే దానిని సుతారముగా పట్టి చూపకలదు.

వసంతము వెల్లివిరిసియున్నది. ఉమాకుమారికి సువర్ణరత్నాభరణములపై విసుగు జనించినది. పద్మరాగములకు బదులుగా అశోకపుష్పములను, సువర్ణమునకు మారుగా కర్ణికారకుసుమములను, ముత్తెములకు ప్రతిగా సిందువారసుమములను అలంకరించుకొన్నది. (కు. 3.53.)

లేతసూర్యుని రంగు వలువ ధరించి, పాలిండ్ల నిండుదనమున కొంచెము వంగి వచ్చుచున్న ఆమె లేజివుళ్లతో పూలగుత్తుల బరువుతో నడచివచ్చు బాలవల్లరివలె శోభించెను. (3.54.)

పొగడపూదండను మొలనూలుగా ధరించినది. నడకతొందరలో అది జారుచుండగా సర్దుకొనుచున్నది. అది, మన్మథుడు ఆమెయొద్ద దాచుకొన్న పూలవింటి అల్లెత్రాటివలె ఉన్నది. (3.55.)

ఆమె సుగంధనిశ్వాసములకు మరగి, ఎఱ్ఱని పెదవిచెంత తుమ్మెదలు మూగగా చేతితామరతో వాని నదలించుచు, చంచలేక్షణములతో వచ్చుచున్నది (కు. 3.56.)

ఈ బాహ్యసౌందర్యముతో తృప్తిపడక కవీంద్రుడు గిరికుమారి హృదయసౌందర్యమును, తరువాత నిట్లు చిత్రించెను కంటియెదుటనే మదనుడు మసికాగా, ఆమె తన సౌందర్యమును నిందించుకొనెను. (5.1.)

ఏల?

సౌందర్యమునకు ఫలము భర్తృప్రాపల్లభ్యము కదా! అది లేనినాడు ఈ రూపలావణ్యములు వ్యర్థములు. కనుక, భర్తృప్రేమ సిద్ధించువరకును ఏనాడును ఆమె మానసికముగా సుఖపడలేదు. (5.55)

తరువాత తపస్సుచేసి, జగదీశ్వరుని హృదయమును గెలుచుకొన్నది.

జడములకు చేతనత్వము కల్పించిన ఈ సౌందర్యము చూడదగినది.

కైలాసపర్వతపు టొడిలో అలకానగర మున్నది. ఆ నగరసౌధోపరిభాగములందు మేఘమాలలు నిలిచి, జలబిందువులను జాలుజాలుగా జార్చుచున్నవి. ఈ యథార్థ దృశ్యమునకు కవీంద్రుడిచ్చిన కల్పనా సౌందర్యము చూడుడు.

కైలాసము ప్రియుడు. ఆతని ఒడిలోని అలక ఆతని ప్రేయసి. ఆమె ముంగురుల కొనలయందు ముత్తెపు జాలరులు వ్రేలుచున్నవి వానిని తాకుచు ప్రియుడామెను లాలించును.

అలకానగర మొక శృంగార ప్రపంచము. ఆ సౌందర్య లోకములోని నగరస్త్రీలు పూలరాణులు. వారిచేతియందు విలాస కమలము. ముంగురులంతట మల్లెమొగ్గలు. ముఖమున లొద్దుగపుప్పొడి. ధమ్మిల్లమున కురవక కుసుమము. చెవిలో శిరీషము. పాపటలో నీపసుమము (మేఘ. 2.2)

కాళిదాసుని ఈ కల్పనాగంధర్వలోకము నిత్యనూతనము.

కాళిదాసుని స్త్రీ సృష్టిలో హృదయములేని సౌందర్యముగాని, సౌందర్యములేని హృదయముగాని లేదు.

అతని స్త్రీ నాజూకు శరీరము కలది.

యౌవనవతి.

కొనలు తేలిన తెల్లని పలువరుస కలది.

సన్నని నడుము కలది.

లోతైన పొక్కిలి గలది.

జఘనభారమున ఒయ్యారపు నడక కలది.

పాలిండ్ల బరువున ఇంచుక వంగినది.

వేయేల—

ఆమె సృష్టికర్త తొలి కల్పనాఫలము.

ఈ సుందరశిల్పమునకు కనులవిందువే ఫలితమా?

కాదు—

ఆ శిల్పమునకు నిండు హృదయ మున్నది. ఆమె గృహిణి. సచివుడు. ప్రాణమిత్రుడు. అంతే కాదు – తన పురుషునకు హృదయమిచ్చి పుచ్చుకొనును. అతని ఎడబాటున మితభాషిణి యగును. అప్పడామె ఒంటరివ్రతచారిణి. శిశిరహతమున చిక్కిసగమైన సరోజిని. ఇప్పుడు కాళిదాసుని సర్వాంగసుందర సృష్టికి ప్రాణప్రతిష్ఠ జరిగెను.

సాంఘిక — రాజకీయములు

కాళిదాసుని కావ్యములలోని జనులు దివ్యాదివ్యులు. నాటకములోని పాత్రలవలె అచ్చపు మనుష్యులుగా కాన్పింపరు. వారి చరిత్ర కొంత దైవికము. కొంత మానవికము. కనుక నాటకమునందలి పాత్రల స్వరూపస్వభావములు విప్పి చెప్పినట్లు వీరి సంఘజీవనమును గూర్చి నికరముగా చెప్పుట కష్టము. కాని, కథాగతచిత్రమును పరిశీలించి కొంత చెప్పవచ్చును.

కాళిదాసునకు మానవులమీద పరమాసక్తి. అతని సుఖదుఃఖములమీద అగ్గలమైన సానుభూతి. అతని ప్రకృతిమీద తగని అనురాగము. తాను కావ్యవస్తువునందు గ్రహించిన ఏ వ్యక్తియందుగాని జాతియందుగాని అతనికి పక్షపాతము కాన్పించదు. ఏవర్ణమును వ్యవస్థను పొగడుటగాని తెగడుటగాని అతడు పనిగా పెట్టుకొనలేదు. తటస్థుడై తాను దర్శించిన సత్యమును, చూచిన విలువలను కళాత్మకముగా చిత్రించుటయే అతని ఏకైకలక్ష్యము. అతడు తీసికొన్న కథలనుబట్టి పాత్రలనుబట్టి, అతడు రాజుల 'మనిషి'గా బ్రాహ్మణధర్మప్రశంసకునిగా కొందరు గణింపవచ్చును. అది అతని తత్త్వము తరచి చూడనిమాట. అతడెచ్చటను నోరార వస్తుపరిధిని దాటి ప్రస్తుతిశంఖముల నూదలేదు. తాను రాజాశ్రితుడు గనుక రాజకథలను స్వీకరింపలేదు. బ్రాహ్మణుడై వైదికధర్మమునకు కైంజలి పట్టలేదు. తన కావ్యనాయకులు ఉదాత్త ధర్మశీలురు. త్యాగగుణ గరిష్ఠులు. ధైర్యసాహస పటిష్ఠులు. యదార్థవీరులును కావలెనని కోరెను. ఈ గుణములు రాజన్యులందు మాత్రమే లభించును. వారినే లోకమున కాదర్శప్రాయముగా నిలుపదలచెను.

అట్టి రాజులను, వారి వెంటనంటిన లోకమును, సత్పథమున నడిపించు వెలుగు కావలెను. అది స్వార్థరహితము, తపస్సంపన్నము, సత్త్వగుణ భూషితము, భోగపరాఙ్ముఖము అను విలువలతో గూడి యుండవలయును. దాని కేపేరైన పెట్టుడు. అభ్యంతరమేమి? ఆ విలువలు నాటి బ్రాహ్మ్యము నందు కాన్పించెను. దానిని యథాతథముగా చిత్రించెను. అతని సంఘచిత్రమునందు జనులలో ఉత్తమ, మధ్యమ, నీచాత్మకమైన తరగతులుగాని, ధనిక దరిద్ర సంఘర్షణములుగాని కాన్పించవు. నిర్దిష్టమైన వర్ణాశ్రమవ్యవహారప్రణాళికయందు నిశ్చింతముగా ప్రజావాహిని నడచిపోవుచుండెను. దానివెనుక నిలిచి రాజు పరిరక్షించుచుండెను. 'వర్ణాశ్రమాణాం గురవే స వర్ణీ' (రఘు. 5. 19.)

పనిబడినప్పుడు ఈ రాజులనుగాని బ్రాహ్మణులనుగాని గేలిచేయుటకును, నిరసించుటకును కవీంద్రుడు జంకలేదు.

1. 'నవయౌవ నాపేక్షితయా ప్రభూణాం।
ప్రాయశ్చలం గౌరవ మాశ్రితేషు॥'(కు.3.1)

2. దర్శనం ప్రకృతి కాంక్షితం దదౌ।
తద్గవాక్ష వివరావలంబినా
కేవలేన చరణేన కల్పితమ్॥ (రఘు 19.7.)

అని రాజుల వికారములను ఉగ్గడించుటకు వెనుదీయ లేదు.

3. వేదాభ్యాస జడః కథంను
విషయ వ్యావృత్త కౌతూహలః
అని బ్రహ్మదేవునే దూయబట్టెను.

జాత్యాది బాహ్యావరణములను దూరము చేసి నచో ఈతని పాత్రములందు మహోదాత్తములగు మానవత్వపు విలువలే చూడగల్గుదుము. అతని మానవ పాత్రములందు దివ్యగుణ సుగంధములను, దివ్యపాత్రలందు మానవతామాధుర్యములను సందర్శింతుము.

అతని పురుష పాత్రలలో రాజు—ప్రజలు, తండ్రి—కొడుకులు, అన్న—తమ్ములు, మామ—అల్లుండ్రు, గురు—శిష్యులు, దేవుడు—భక్తులు, మున్నగువారు ఎందరో కాన్పింతురు.

ఇందలి రాజ ప్రజాసంబంధమును రాజకీయ భాగమున వివరముగ చూడగలము.

పితాపుత్రానుబంధము

దిలీప రఘు సందర్భమునను, రఘుఅజ సందర్భమునను చక్కగా నిది నిరూపితమయ్యెను.

దిలీపునకు నందినీ వరప్రసాదమున వంశోద్ధారకుడైన రఘువు పుట్టెను. స్పర్శచే అమృతము కురియుచున్నట్లున్న రఘుకుమారుని కౌగిలించు కొని తండ్రి పారవశ్యమున కనులు మూతలు వడగా ఎట్టకేలకు పుత్రపరిష్వంగ సుఖమును గ్రహింపగల్గెను. (రఘు. 3.26.)

దుష్కృత్యములుచేసి రాజపుత్రులు రాజ్యముకు వడయగోరుదురు. అట్టి రాజ్యము చేపడు చుండగా అజకుమారుడు తండ్రి ఆజ్ఞ యని దానిని స్వీకరించెనుగాని, భోగముల నోలలాడవచ్చునని కాదు. (రఘు. 8. 2.)

అజుడు రాజ్యము స్వీకరింపగా రఘువు వనవాసోన్ముఖుడయ్యెను. అప్పుడు కుమారుడు తలపాగతో శోభించు శిరమువంచి తండ్రిపాదములకు నమస్కరించి, తన్ను వీడి పోవలదని ప్రార్థించెను. 8.12

పుత్రస్నిగ్ధుడైన రఘువు అతని కోర్కెను మన్నించెనుగాని, రాజ్యము నంటలేదు. 8.13

దశరథునకును, సంతానమునకును ఉన్న మధురానుబంధము లోకప్రసిద్ధము. దానిని గూర్చి ఒక్కమాటలో కాళిదాసు ఇట్లనెను. దశరథ సంతానము మూర్తిభవించిన అతని చతుర్వర్గమువలె నుండెను. 10.85

సౌభ్రాత్రము

రఘువుల సొమ్ము. అది రామాదులందును కుశాదులందును పరమావధి నందెను.

పరస్పరము ఎట్టి విరోధములేని, రామాది సోదరులు బుతువులారును, అవిరోధముగ ఒకేసారి నందనవనము నలంకరించినట్లు రఘువంశము నలంకరించిరి. (రఘు 10.81)

రామాదులకు ఇద్దరిద్దరు పుత్రులు. వారిలో ఏడుగురు సర్వజ్యేష్ఠుడును, గుణజ్యేష్ఠుడు, నగు కుశునకు శ్రేష్ఠవస్తువుల నిచ్చి గౌరవించిరి. (రఘు. 17.1.)

మామ – అల్లుండ్రు

అజకుమారునకు పిల్ల నియదలచిన భోజుడు మామ కాకున్నను, శ్వసురస్థానీయుడు. అజకుమారుడు తన నగరసమీపమునకు రాగానే, భోజుడు సముద్రుడు, ఉదయచంద్రునివలె ఎదుర్కొనెను. (రఘు. 5.61)

అతడు వరుని యెడల చూపిన గౌరవమును చూచి ప్రజలు భోజునే ఆగంతుకుడనియు, అజునే యజమానుడనియును భావించిరి. (రఘు—5.66.)

విదర్భరాజు చెల్లెలి పెండ్లిచేసి ఉత్సాహానుగుణముగ అరణ మిచ్చి, మూడురాత్రులు వారితో నుండి సాగనంపి తిరిగివచ్చెను. (6.32, 33)

మామ హిమవంతుడు లోకేశ్వరునకు పుత్రిక నీయదలచెను. అతడు తరలిరాగా మహాదరముతో ఎదురేగి పురప్రవేశము చేయించెను. శివుడు సర్వేశ్వరుడైనను గౌరవబుద్ధితో మామకు నమస్కరించెను. (కు. 7.54.)

గురు—శిష్యులు

ఇందు మూడువిధముల గురుశిష్యు లున్నారు. వారు దిలీపవసిష్ఠులు, కౌత్సవరతంతులు, రామవిశ్వామిత్రులు. దిలీపునకు వసిష్ఠుడు, సర్వశ్రేయఃప్రదాత, ఉత్తమ మార్గోపదేష్ట. ఈ రాజునకు, ఆ గురువునందు పరమవిశ్వాసము.

'నా ప్రజలు భయరహితులై, ఈతిబాధలు లేక చిరంజీవులై సుఖపడుచున్నారనగా, నీ బ్రహ్మవర్చసము కాక వేఱుకారణ మేమున్నది? కాని —నీ కోడలు సంతానహీనురాలైనందున నేను పాలించు ఈ రత్నగర్భకూడ నాకు ప్రీతిప్రద మగుటలేదు.' అని శిష్యు డనగా, గురువు సాదరముగా 'నీ అనపత్యతకు కారణ మున్నది. నా వద్ద నున్న ఈ కామధేను సంతానమును సేవింపుము. నిర్విఘ్నముగ పుత్రవంతులలో అగ్రగణ్యుడ వగుదు' వని పల్కెను.' (రఘు. 1.91)

కౌత్సవరతంతువుల శైష్యోపాధ్యాయిక విద్యాసంబంధి. కౌత్సుడు గురుకులక్లిష్టముగా పదునాలుగువిద్యలు కరచెను. విద్యాపరిసమాప్తియందు గురుదక్షిణ చేకొను మని గురుదేవుని బలవంతము చేసెను. (5.20.) గురునకు కోపము వచ్చి 14 కోట్ల నాణెములు తెమ్మనెను. (5.21.) శిష్యుడు రఘువు నాశ్రయించెను. ఆ రాజు విశ్వజిద్యజ్ఞము చేసి మృణ్మయపాత్రావశిష్టముగ నుండెను. ధనము కుబేరునినుండి సంపాదించి, సువర్ణరాశిని దానము చేసెను. గురుదక్షిణకంటె చిల్లిగవ్వ అధికముగ స్వీకరింప నని మునికుమారుడు, అడిగినంతయే యిచ్చుట అది ఏమి గొప్ప ఈ రాశినంతయు నీవే స్వీకరింపు మని దాత. ఇందులో నెవ్వరు ఘనులు? ఏమి గురుభక్తి. ఏమి మహారాజాదరణము.

రాముని అంతవానిని చేసినది నిజముగ కౌశిక గురుత్వము. రాముని దశరథుడు పెళ్లి పుత్రవాత్సల్యమున విశ్వామిత్రునితో పంపలేదనుము. అపుడు రాముడు శ్రీరాముడుకాడు. అయోధ్యలోని నలుగురిలో 'ఒకడు' కాని—ఇప్పుడు 'ఏకైకవీరుడు'. రామునకు నిజమైన గురువు విశ్వామిత్రుడు. అతడు తాటకను చంపుమనెను. ఈతడు స్త్రీయని యైన తలపక చంపెను. దానికి సంతసించి గురువు రాక్షససంహారక మగు అస్త్ర మిచ్చెను. (11.21.)

వసిష్ఠుడు రాజ్యమునకు రమ్మని ఇతి మాలెను, రాముడు తిరస్కరించెను. ఇప్పుడు రాముడు ఆచార్యదేవునిగా ఎవ్వని భావించెను?

ఈ గురుశిష్యానుబంధము మహావిచిత్రమైనది.

దైవము – భక్తులు

రాక్షసపీడితులైన దేవతలు ఒకసారి బ్రహ్మదేవుని, వేఱొకసారి విష్ణుమూర్తిని దర్శించి, తమ బాధలు మొఱపెట్టుకొనిరి. వేదచోదితములగు మహార్థములతో తమ హృదయము క్రుమ్మరించి ఆ భగవంతులను ప్రార్థించిరి. ఆ ప్రభువులు వారిపై దయగొని, 'నాయనలారా! మంచుకప్పిన నక్షత్రముల వలె మీ ముఖములు కాంతిహీనములై యున్నవేమి? (కు. 2.19). కొలది కాలములో మీ కోరిక నెరవేరగలదు. కొంతకాలము ఓపికపట్టుడు' అని యొకరును, 'మీ మహిమయును పరాక్రమమును రాక్షసాక్రాంతములైనవని నాకు తెలియును. (10.39.) నేను దాశరథినై పుట్టి వాని తలల తామరపూలతో యుద్ధభూమిని పూజింతును.' (10.45) అని వేఱొకరును, ఆశ్రితుల ఆర్తినెఱిగి సాదరముగా పల్కిరి.

ఈగలు

శ్రీ డి. ప్రభాకర్

(గత సంచిక తరువాయి)

అదిగో పెంకుటిల్లు. ఆ పెంకుటింటికి పెంకుటిల్లులానే వుండటం యిష్టం కాబోలు! దాన్ని పడగొట్టి మేడ కట్టిద్దామన్న ఆ యింటి యజమాని ప్రయత్నాలన్నీ ప్రయత్నాలుగానే వుండిపోతున్నై. ప్రస్తుతం ఆయింట్లో మూడు యిష్టాలుంటున్నై. అవి సుజాతవి, సుభద్రవి, యింట్లో వాళ్ళకి పెద్దబ్బాయ్, బయటివాళ్ళకుడాక్టరూ అయిన సుబ్బారావ్వీను. సుజాత సుభద్రకి ఆడబిడ్డైతే సుభద్ర సుబ్బారావ్‌కి పెళ్ళాంవవుతుంది!

ఉన్న నలుగురు కొడుకులూ ఎవడిజీతం వాడు ఖర్చుపెట్టుకుని తిండికోసం తండ్రిమీద ఆధారపడినట్టు ఆ పెంకుటింట్లోవున్న గదుల్లో ఓ గదిని సుజాతా, ఓ గదిని సుభద్రా సుబ్బారావూ 'మావి' అనుకుని మిగిలినవాటిని 'మనవి'గా చేసుకుని వుంటున్నారు.

ప్రస్తుతం సుజాత తనగదిలో మంచంమీద బోర్లాపడుకుని రేపొచ్చే సినిమానా? ఎల్లుండొచ్చే పరీక్షా? – ఏది ముఖ్యం?? అని సీరియస్‌గా ఆలోచిస్తోంది (డబ్బుల్లేవుగాని ఆ సమస్యమీద ఓ సినిమా తీసుండును).

సుభద్ర హాల్లో కూచుని గలేబుమీద గులాబి కుడ్తూ వూరికే వాకిటివేపు చూస్తోంది—పట్నం పోయిన నాన్న ఎప్పుడొస్తాడో ఏం తెస్తాడో అని ఆశగా ఎదురుచూసే చిన్నారిలా.

సుభద్ర అలా చూడగా చూడగా వీధి తలుపులు ప్రోగి, తెరుచుకుంటూ ప్రోగి ఆగిపోయినై. సుబ్బారావ్ వీధిలోంచే నవ్వుతూ లోపలి కొచ్చేడు.

సుభద్ర సుబ్బారావుని చూస్తూనే నవ్వుతూ లేచినిలబడి 'ఏవిటివాళ యింత ఆలస్యమైంది' అంది. అంటూనే అతనిమించి వాకిట్లోకి చూసింది.

'అర్జంటు కేసొకటొచ్చింది గాని ఏవిటి నువ్వింకా అటేచూస్తున్నావ్?'

'ఆ... రిక్షావాడు బాయిలర్ పట్టుకొస్తున్నాడేమోనని!'

సుబ్బారావు చిన్నతనంనుండి చొక్కాలు సొంతగానే తొడుక్కుంటున్నాడు— విప్పుతున్నాడు. అయినా ఆక్షణంలో, సుభద్ర బాయిలర్ ప్రసక్తిని ఆసక్తిగా తెచ్చిన సమయంలో షర్టు విప్పటం యెల్లానో చేతకానివాడిలా ఆగిపోయేడు. ఆ క్షణంలోనే అతడి ముఖం 'తెలుపు'కు వ్యతిరేకపదం చెప్తున్నదాన్లా నల్లగా అయిపోయింది ఆ తర్వాత క్షణాల్లో అతగాడు చావుకబురు చెప్పాలొచ్చినవాడిలా బుర్రవొంచుకుని అన్నాడు –

'సారీ సుభా! ఓ నూటయాభై రూపాయిలు అర్జంటుగా కావాలని నాన్నగారు టెలిగ్రాం యిచ్చేరు. ఆడబ్బు అటు పంపటంతో బాయిలర్ కొన్లేకపోయేను!'.

సుభద్ర కప్పుడప్పుడు కోపమొస్తుంది. ఏడుపుకూడా వస్తుంది. కాని యిప్పుడు సుబ్బారావు మాటలు విన్నప్పుడు అవి రెండూ కలిసొచ్చినై. కళ్ళలోం చొచ్చినై.

సుబ్బారావ్ సుభద్రని చూసేడు. న్యాయం జరుగుతుందని ఆశపడ్డ ముద్దాయికి అన్యాయం ఎదురైనప్పుడు అతడి కళ్ళెలా వుంటాయో సరిగ్గా

అల్లాగేవున్న సుభద్ర కళ్ల మ్యాపేశం. అంచేత యేదో కొనిపెడ్తానని ఆశపెట్టి యేమీ కొనిపెట్ట(లే)ని తండ్రి కొడుకును (లేపోతే కూతుర్ని) అనున యించినట్టు సమనయించాడు సుభద్రని—

'ఏం చేస్తాం సుభా! ప్రతిసారీలానే ఈసారీ కూడా బాయిలర్ కొన్లేకపోయేం. వచ్చేనెల్లో ఏవైనా సరే తప్పక కొందాం గా!'

'ఇప్పటి కిల్లాటి నెలసరి వాయిదాలు పద్దై పోయిన్నై. ఇంకా యెందుకూ వచ్చేనెల వచ్చేనెల అని వూరిస్తారు. ఏకంగా వచ్చే సంవత్సరానికి వాయిదా వెయ్యండి. రేపోమాపో అని ఎదురు చూట్టమైనా తప్పుతుంది!'

'అది కాదోయ్ సుభా, యీ నెల కొందామంటే నాన్నగారి దగ్గర్నుండి ఉత్తరం వొచ్చిందాయె! పోయిన్నెల్లో తమ్ముడికి ఎగ్జామినేషన్ ఫీజు కట్టాల్సొచ్చె. ఆ పోయిన్నెల్లో......'

'ఇప్పుడ్నాకె దుకా సంజాయిషీలన్నీ. మీడబ్బు. మీయిష్టం. మీ యిష్టమొచ్చినట్టు చేసుకోండి. మధ్య నాకెందుకీ గోల!'

'అందుకే నాకు వళ్లు మండేది. ఇప్పుడే మయిందని ఆ కోపతాపాలు? మనిషన్నోడికి బాయిల రొక్కటే కాదు అవసరం యింకా చాలా వుంట్నై. నోట్లోవాట నోట్లో వుండగనే కొట్లో సరుకులు ఇంట్లోకి రావాలంటే మనంవేవన్నా మహారాజులమా! అయినా బాయిలర్ లేకపోతే కొంపేం మునిగిపోదు. చేతనైతే వున్నవాటితోనే నీళ్లుకాయి. లేపోతే ఆ చన్నీళ్లే తగలెయ్. అమాత్రం దానికేనో వేదం రాద్ధాంతం చేస్తావేమిటి ?'

పంచ ప్రాణాలు పైప్రై చదువులమీద వున్నప్పటికీ చదువు చెప్పించలేని అమ్మానాన్నల పట్టుదలవల్ల ముసలివాడికి మూడో పెళ్లాంగా వెళ్లాల్సొచ్చిన కన్నె పిల్లలా ఏడ్చేసింది సుభద్ర. ఏడుస్తూ మొగుడి కెదురుగా నుంచుంటే అతగాడు మరింత రెచ్చి పోయి 'ఏవిటా ఏడుపు మొహం ఫో లోపలికి' అని కసుర్తాడనీ, కరుస్తాడనీ భయపడినదాన్లా లోపలికి వెళ్లిపోయింది? వంటిట్లోని నేన్నీళ్లు తీసికెళ్లి, పెరట్లోపెట్టి మళ్లీ వంటింట్లోకొచ్చి, 'నీళ్లు తోడాను' అని అరచింది— నచ్చని ఆఫీసరు దగ్గర పన్చేస్తున్న నౌకరులా.

సుబ్బారావ్వెళ్లి స్నానం చేసొచ్చేలోపల కంచంలో అన్నం సర్ది అతడు హాల్లోకి వెళ్లగనే తను పెరట్లోకి వెళ్లి 'భోజనం' అని కేకేసింది.

సుబ్బారావ్వెళ్లి భోజనం ముందు కూచు న్నాడు—అప్పుడే శవంముందు శోకతప్తుడై వున్న వాడు పెద్దల బలవంతంమీద వెళ్లి భోజనంముందు కూచున్నట్టు కూచున్నాడు. కూచున్న అతడికి పెర ట్లోంచి గాజుల గలగలలు విన్పించినై. అయితే అవి శృంగార సంగతులూ, సంగీతాలూ వినిపించటంలేదు— నీళ్లు నిండుతున్న కళ్లని ముక్కుతూ గ్రాదికే ఓదారు స్తూన్న చేతికి సానుభూతిగా 'చ్చొచ్చొచ్చొ' అంటున్నై. అది విన్నాక సుబ్బారావ్కి జాలేసింది. అంచేత నిరపరాధికి ఉరిశిక్షవేసిన జడ్జీలా బాధ పడ్డాడు. అందుచేతనే ఉరికంబం ఎక్కిన నిర్దోషిని గుర్తుకు తెచ్చుకున్న జడ్జీలా అన్నం (సయించక) వదిలేసి లేచి వెళ్లిపోయేడు.

అతడువెళ్లిపోయిన కాస్సేపటికి సుభద్రవచ్చి, వంటిల్లు సర్ది మరచెంబుతో మంచినీళ్లు త్రాగి మరచెంబులో నీళ్లు తీసుకుని గదిలోకెళ్లింది.

పగవాడి యిల్లు తగలడ్తోందని ఆనందించి, చివరికి లబోదిబో మంటున్న పగవాణ్ణిచూసి ఆనం దించలేక జాలిపడి సొమ్మసిల్లి ఓదార్చబోయిన పెద్ద మనిషిలా సుబ్బారావ్ గదిలోకొచ్చిన సుభద్రను చూసి అప్పుడే హనీమూన్‌కి బయల్దేరబోతున్న వాడిలా కులాసాగా అన్నాడు—

'ఏం దేవిగారు యివాళ పెందరాడే దయ చేశారు'

'దేవణ్ణో వరం అడుగుదామని!'—చింత, బరి కతో చావబాదిన మాష్టారితో మాట్లాడాల్సొచ్చిన విద్యార్థి (ని) లా అంది సుభద్ర.

'ఏమిటి కొంపతీసి చీరెగాని కొన్నావా?'

'ఊఁ! అదొక్కటే తక్కువ!'—సుభద్ర వెళ్ళి పోబోయింది.

'అరె...ఆగవోయ్ (సుబ్బారావు సుభద్రను చేయిపుచ్చుకుని ఆపి తన మంచంమీద కూచో బెట్టేను) వూ...ఇప్పుడుచెప్పు సంగతేవిటో'

'......................'

'అదేవిటోయ్ యింతవరకూ కోపంగా వున్నావ్. అంతలోనే సిగ్గుపడి పోతున్నావ్. కథేవన్నా రా సేవా?'

సుభద్ర నవ్వీనవ్వనట్టునవ్వి సుబ్బారావ్‌ని చూసీ చూడ్నట్టు చూసింది.

'చెప్పు మరి!'

'మరీ...మరీ...నేను...కాదు... మీరు ...కాదు మనం. అమ్మా నాన్నా కాబోతున్నాం!'

'నిజంగా! హార్టీ కంగ్రాట్స్!!' రాజ్యాలు జయించిన మహారాజులా ఆనందపడి పోయేడు సుబ్బారావ్. విజయవార్త మోసుకొచ్చిన భటుణ్ణి మహారాజా వూపేసినట్టు సుభద్రని పట్టుకుని కుదిపేశాడు.

'అబ్బ! ఏమిటిది...అరే...వదలమంటుంటే...' సుభద్ర విడిపించుకుని దూరంగా నిలబడింది.

సుబ్బారావు 'తొక్కుళ్లాట' ఆడుతున్నవాళ్లా వుత్సాహంగా సుభద్రపక్కకి చేరేడు.

'చెప్పు డియర్. నీకేం కావాలో! నిమిషాలమీద, కాదు క్షణాలమీద ప్రెజంట్ చేస్తాను!'

'బాబు పుడ్తాడని మీకింత సంతోషంగా వుంటుంది గాని నాకల్లాటి దేమాత్రంవూ లేదు!'

'ఏం! పాప పుడుతుందేమోనని బెంగెట్టుకున్నావా?'

'లేదు! పిల్లలు పుడ్తున్నారని దిగులు పడుతున్నాను!!'

'సుభద్రా!!'

'అవునండీ! మీరుగనక యే రావూబహద్దూర్ గారింట్లోనో, మిస్టర్ వారి బంధువులింట్లోనో పుట్టివుంటే వెనుక తరగని ఆస్తితో, ముందు వడ్డించిన విస్తరిలో పరుపులజీవితం అనుభవిస్తూ వుండే వారు. వెనకొచ్చినదాన్ని అన్ని విలాసాలకూ ఖర్చు చేసుకుంటూ ముందొచ్చే జీతాన్ని కేవలం సిగరెట్లకి కేటాయించి హాయిగా నౌకరు కాలుమీద మీకాలు వేసి బ్రతగ్గలిగేవారు. కాని మీరు పుట్టింది--కాదు—మిమ్మల్ని కన్నది గుప్పెడు బియ్యంకోసం రాగిచెంబు తీసుకుని కాళ్లరగతిరిగే కృష్ణయ్య పంతులుగారు. ఆయన మిమ్మల్ని చూసుకుని మీరు యిప్పుడు ఆనందిస్తున్న దానికంటే యెక్కువే ఆనందించి వుంటారు. మీరు యిప్పుడు మీరాబోయే సుపుత్రుడి వున్నతిగురించి వూహించిన దానికంటే ఎక్కువే వూహించివుంటారు. అయినా ఆయన మీకివ్వ గలిగిందేమిటి?—డబ్బు అవసరమొచ్చిందంటూ అడపా దడపా టెల్లిగ్రాంలు! మీరు పుచ్చుకోగలిగిం దేమిటి?—మీ నాయన చేస్తున్నఅప్పులు తీరుస్తున్నట్టు నెల్నెలా ఓ రసీదుముక్క! రేపు మనమూ అంతే! మనకు పుట్టుకొచ్చే పిల్లలకు మనం పేర్చి యివ్వగలగేవి అవే!!'

'మరీ అన్యాయంగా మాట్లాడకు సుభా! మా నాన్న నాకు ఆస్తిపాస్తులేవీ యివ్వలేకపోయినా అప్పోసొప్పోచేసి లక్షణంగా చదువు చెప్పించేడు. డాక్టర్ని చేసేడు!'

'నిజమేనండి! మీరు డాక్టరయేరు. దేశంలో బాగా చదువుకున్న చాలామందికంటే కొద్దో గొప్పో ఎక్కువే సంపాదిస్తున్నారు. కాని మీరు యేం సాధించ గలిగేరు? అద్దెకొంపా, అద్దె ఫర్నిచరూ, వాయిదాల మీద రేడియో, ఫ్యానూ, పాతగుడ్డలకొచ్చే స్టీలు సామానూ...యింతేగా!'

'సుభద్రా! డాక్టరనగానే తెల్లచొక్కా, లెక్కలేనంత డబ్బూ, చిక్కుల్లేని బ్రతుకూ అని నోరూరేలా అనుకునే వాళ్లల్లోని దానివి కావను

కున్నాను. నా జీతాన్ని, నా న్నాటున్నప్పుడు జీవితాల్ని వాటి సమస్యల్ని సమంగా బేరీజు వేసుకోగల సామర్థ్యంవున్న యిల్లాలి ననుకున్నాను, కానీ......'

'తెలుసండీ! నాకంతా తెలుసు! ఒకటో తారీఖున ఒకేఒక మార్గంగుండా వచ్చే ఏడొందల జీతపురాళ్లు రెండోతారీఖు...రెండో తారీఖొచ్చేసరికి రెండొందల. మార్గాలగుండా ఎగిరి పోతున్నాయని తెలుసు!'

'అవి ఎగిరి పోయేదెక్కడికో కూడా నీకు తెలుసు!'

'తెలీకేం! మెడ్రాస్‌లో చదువుతున్న మీ తమ్ముడు సుందరంకి నెల్నెలా నూటయాభై పంపుతున్నారని తెల్సు. మీ అమ్మా నాన్నలకి వాళ్లతో వుంటున్న మీ చిన్నతమ్ముడి ఖర్చులకి కలపి రెండొందలు పంపుతున్నారని తెలుసు. మిగిలిం దాంట్లో డెబ్భై రూపాయలు ఈకొంప మింగుతుందని, మీ చదువుకి చేసినఅప్పు, మీ అమ్మ జబ్బున వడ్డప్పుడు తీసుకున్నబదుళ్లూ, మీ నాయనమ్మ ఋణం తీర్చుకుందుకు మీరుచేసిన ఋణం యిప్పట్లో తీరేవిగావని తెలుసు. ఇక మిగిలిన రెండొందల యాభైలో యిక్కడ మనం ముగ్గురం సర్దుకు పోతున్నామనీ తెల్సు!!

'ఇన్ని తెలిసుండి నన్ను ఇబ్బంది పెడ్తున్నావా?'

'మిమ్మల్ని యిబ్బంది పెట్టాలని కాదు. ఈ పరిస్థితుల్లో పిల్లల్ని కనటమంటే వాళ్లను యిబ్బంది పెట్టటానికే నంటున్నాను!'

'అయితే ఏవిటి నువ్వనేది? ఇప్పుడు నన్ను వెళ్లి ఆపరేషన్ చేయించుకో మంటావా?? నువ్వు 'ఎబార్షన్' చేయించు కుంటావా??'—సుబ్బారావుకి సుభద్రవైఖరి చిరాకెత్తించి నట్లుంది. శివమెత్తి నట్లు మాటాడేడు.

సుబ్బారావు మాటలకి సుభద్ర కెవ్వుమంది! చేతిలోని చేంతాడు చేతిలావు త్రాచై కాటేసినట్లు ఫీలౌతుంది. శిక్ష తప్పదనుకున్న ముద్దాయి కోర్టుని, కోర్టులోని జడ్జిని, జడ్జి ముందుండే వకీళ్లని తులిపేసినట్లు సుబ్బారావ్‌ని దులిపే సింది—

'ఎంత క్రూరంగా మాటాడుతున్నారండీ మీరు! పిల్లల్ని కనటమే ఓ వరంగా భావించే ఆడదాన్ని, తొలిబిడ్డకోసం ఆరాటపడుతున్న దాన్ని, నన్ను ఎబార్షన్ చేయించుకోమంటారా. ఛీ...ఛీ...మనుషు లేనా మీరు?'

సుబ్బారావ్ బిత్తరపోయేడు. నోటమాట రాదనుకుని నోరు తెరిచేడు. కాని నోటమాట లొచ్చినై—

'ఆడదంటే అర్థం కానిదని పుస్తకాల్లో చదువుకున్నాను గాని యింతవరకు చూళ్లేదు. యిప్పుడే...నీలో చూస్తున్నాను! రెండు నిమిషాల ముందు పిల్లల్ని కనటం వాళ్లని కష్టపెట్టటానికే అన్నదానివి యిప్పుడు...'

'అన్నాను. అంటే పుట్టేవాళ్లకి పురుట్లోనే సంధి కొట్టించమనా అర్థం! ఇంతకు ముందెలాగో జరిగిపోయింది యిహనైనా రాబోయే వాళ్లకోసం మనం మురిసిపోవటంవే కాకుండా వాళ్ల ముద్దూ మురిపేలు తీర్చటంకోసం ముందు జాగ్రత్త అవసర మని అర్థంకాదా? వెనకటి కెవరో నాబోటావిడ వ్రతకథలోపాటు గాంధీగారి లెంపకాయ కథలు కూడా భట్టీయం వేసిందిట. అవి వంటబట్టేసరికి గాంధీగార్లా అతిమంచి మనిషినై పోదామని తాగొచ్చిన మొగుడు నిష్కారణంగా వో చెంప చెళ్లుమనిపించి నప్పుడు పళ్ళున్న గాంధీగార్లా నవ్వుతూ రెండో చెంప అందించిందట. అతగాడు అంచక్కా ఆరెండో దవడకూడా వాతలు పొంగేలా వాయించి మరీ పోయేట్ట. అలా వుంది నా పరిస్థితి. పిల్లలు పుట్టా కొస్తున్నారు జాగ్రత్త అంటే వాళ్ల పీకల్నులి మెయ్యమంటున్నారు దయార్ద్రహృదయులు!!'

'లాభం లేదు సుభద్రా, నువ్ మనసులో ఒకటుంచుకుని పైకొకటి మాట్లాడుతున్నావ్.

నీ వాలకం చూస్తుంటే నా జీతమంతా పరోపకారానికి తగలేసి పిల్లలకి కనీసం కారపు మెతుకులు గూడా మిగల్చలేనేమోనన్న భయం, బాధా కన్పిస్తున్నై. అదే నిజమైతే సుభద్రా—చెప్పు—యీ ప్రపంచంలో ఎన్ని కష్టాలైనా పడి కన్నబిడ్డల్ని పోషించాలన్న రూలుందిగాని కష్టాల్లోవున్న తల్లిదండ్రుల్ని ఎదిగొచ్చిన పిల్లలు ఆదుకోవాలన్న రూలెక్కడా లేదుగా! అంచేత అడ్డొచ్చిన వాళ్ళని గోడవతల నిలబెడ్దాం. వాళ్ళ గొడవే వదిలేద్దాం! మన సుఖంవ్వూ, మన బిడ్డల సుఖంవ్వూ చూసుకుందాం! ఇప్పుడు చెప్పు. సుందరానికి డబ్బు పంపటం మానెయ్యమంటావా? అమ్మ వాళ్ళకి పైకం పంపొద్దంటావా?? బేబిని అమ్మ దగ్గరకు పంపెయ్యమంటావా??? చెప్పు సుభద్రా ఏం చెయ్యమంటావో చెప్పూ!'—సుబ్బారావ్ ఆవేశంతో వూగిపోతుండు.

సుభద్ర నెత్తురు మడుగుని చూసినట్టు చలించిపోయింది. అప్పరాల్ పిల్లిపిల్లగా అని గది తలుపులు మూసి కర్రుచ్చుకు కొట్టబోతే అది కాస్తా ఎదురు తిరిగి మీదపడ్డట్టు భయపడి పోయింది. చివరికి కంపిత స్వరంతో అంది—

'అయ్యో ఆ పాపం నా కెందుకండీ!'

'మ రేపాపం కావాలి?'

'డబ్బు ఖర్చయే మార్గాలు ఎక్కువైనప్పుడు డబ్బొచ్చే మార్గాన్ని విశాలం చేసుకోవటమే పాపమైతే—ఆ పాపం కావాలి! నాక్కాదు—మీక్కాదు—మన కుటుంబానికి కావాలి!!'

'అంటె...లంచం తీసుకోమంటావా?'

'తీసుకుంటే తప్పేం లేదంటాను!'

'మ వ్వనొచ్చు! కాని గోనసను. గవర్నమెంటు అనదు. రూల్సు అనవు సరిగదా టూళ్ళకర్రలై నెత్తిన మొటి గళ్ళచొక్కాతొడిగి కటకటాల వెనక కుంచోబెడతై!'

'ఆ మంచోబెడతై — కంతుణ్ణి అతళ్ళాటి కాక్షసుల్నిగాడు. శ్రీ కృష్ణుల్ని వాళ్ళమ్మా నాన్నల్లాటి మెమ్మెమ్మేళని! అసలు రూల్సునూ్చసి గూడ్సుబండిలా (భయపడి) ఆగిపోయేవాళ్ళకే యివన్నీను. ఏ భయంలేనివాళ్ళకి ధనలక్ష్మి ఎప్పుడూ అభయం యిస్తూనే వుంటుంది. కావాలంటే మీ హాస్పిటల్లోనే పన్చేస్తున్న కంపౌండర్ని చూడండి—కొన్న స్థలం కొన్నాడు. నిన్న యిల్లు కట్టేడు. యివాళ 'కాంపౌండ్‌వాల్' కట్టిస్తున్నాడు! రేపు లోపల తోటవేసి అందులో, అతగాడి పెళ్ళాంపిల్లల కళ్ళు మెరిసేలా, అద్దెకొంపలవాళ్ళ పళ్ళుపులిసేలా షికారు చేస్తాడు. మరి అతడివన్నీ తనకొచ్చే నెల జీతంతోనే చేయగలుగుతున్నాడా? లేదండీ! ఆస్పత్రిలో కంపౌండరుగా వుండి యింటిదగ్గరా, యింటింటిదగ్గరా డాక్టరు ప్రాక్టీసు చేస్తున్నాడు గనక అవన్నీ చేయగలుగుతున్నాడు. ఆస్పత్రిలో ధర్మంగా యిచ్చే మందుల్ని అంగట్లో ధర కమ్ముకుంటున్నాడు గనక చేయగలుగుతున్నాడు. అవునా! మరి అతడికాళ్ళకి ఏ రూల్సూ అడ్డుపడటం లేదేమిటండీ??'

సుబ్బారావు కొత్తగా కోర్టుకెళ్ళిన పిల్లప్లీడర్లా కళ్ళు తేలేసేడు!

సుభద్ర తను చెప్పదలచుకుంది అయిపోయినట్లు బయటకి వెళ్ళింది—అంతలోనే లోపలికొచ్చింది. తను చెప్పవలసిందింకా వున్నట్లు—

'ఇంతా విన్నాక 'ఆం. అవినీతికి పాల్పడే వెధవల్తో మనకి పోలికేవిటి! అయినా యింతమంది అవినీతిపరులమధ్య వున్నదాంట్లో నీతిగా బతుకుతూ, దగ్గరివాళ్లను ఆదుకుంటున్న నేనే గొప్ప!' అన్న తృప్తి మీకు కలుగుతున్నట్టుంది. కాని అల్లాటి తృప్తేదీ అందుకుంటున్న వాళ్ళల్లో కన్పించటం లేదు. మద్రాస్‌లో చదువుతున్న సుందరం నాటయాభై అందుకుంటూనే మీ అమ్మకి, 'ఏవిటమ్మా అన్నయ్య మరీను. నూటయాభైలో హాస్టలుబిల్లుతో సహా అన్నిఖర్చులూ అందులోనే యిముడ్చుకోవాలంటాడూ' అంటూ అసంతృప్తితో వుత్తరాలు రాయటం నే నెరుగుదును. మీ నాన్నగారు మీకు

జీత మందులతోనే పంపుతున్నదానితో తృప్తిపడుతు వస్తుంటే మధ్యమధ్య ఆ ఔర్జిగాంలు యివ్వరు. ఇవా సుజాత కారు కోరికలు మీకు తెలియవికాని. ఎందుకొచ్చిన బాధ చెప్పండి. 'అమ్మా అన్నమూ ఇంత వచ్చేదిపడేయ్ తల్లీ ఆకలిగా వుంది' అంటూ వాకిటి దగ్గరకొచ్చిన బిచ్చగాణ్ణి 'ఏం లేదు పో' మ్మన్నా తిట్టుకుంటాడు వుత్త అన్నం పెట్టి పచ్చడి వేయలేకపోయినా గొణుక్కుంటాడు. మీ వాళ్లూ అంతే! ఎవరి గొప్ప వారు మీరు. అయిన వాళ్లకెల్లాగూ మొండి చెయ్యి చూపలేరు గనుక ఏదో ఏమీ లేని చెయ్యి చూపండి. అలా చూపేందుకు కావలసిన ధైర్యాన్ని కూడగట్టుకుని నాలుగురాళ్లు కూడబెట్టండి! ఏమంటారు?'

సుబ్బారావు మొదటికేసు ఓడిపోయిన కొత్త ప్లీడర్లా తలదించేసుకున్నాడు.

సుభద్ర మౌనంగా మూల్గుతున్న పాప, మంచం మీది దిండూ తీసుకుని పోబోయింది.

'ఎక్కడికి?'

'నా కిక్కడ గాలి రావటం లేదు!'

సుభద్ర బయటకు వెళ్లిపోయింది. సుబ్బారావు ఆమె వెళ్లిన వేపే చూస్తూ నడుం వాల్చేడు. వాలుస్తూ, అన్ని అర్హతలుండే ఉద్యోగం సంపాయించలేక —కుమిలిపోతున్నవాళ్లా నలిగిపోతూ 'అయితే పై సంపాదన గురించి పట్టించుకోక బుర్రబద్దలు కొట్టుకుని అలవికాని రోగాల్ని సైతం ఓ కొలిక్కి తెచ్చి 'ధర్మప్రభు'వన్న పేరు సంపాదించుకున్నానే అదెందుకూ కొరగాదా' అని దిగులుగా ప్రశ్నించుకున్నాడు.

'కొరగాదు! ఎర్రని ఏగానికి కొరగాదు!'— పదివేల సుభద్రలూ, సుజాతలూ, సుందరంలూ, మునస్, అమ్మా నాన్నలూ అందరూ ఒక్క పెట్టున, పెద్ద పెట్టున అరిచేరు.

సుబ్బారావు ఖిన్నుడయిపోయేడు.

అదే అదనుకుని అన్నివేల కంఠాలు ఖంగు ఖంగున మ్రోగినై.

'మంచి పేరనే దాంట్లో కుంచం బియ్యమైనా సంపాయించలేని అసమర్థత పేరుకు పోయింది పెద్దబ్బాయ్! నీకు తెలీదని కాదుగాని బళ్లో పేగులు తెగేలా పాఠాల్చెప్పి, యింటి కొచ్చిన వాళ్లని కాదనకుండా కానీ ఆశించకుండా విద్యాభిక్ష పెడుతున్న ఆ పరంధామయ్య మేష్టరెలా వున్నాడు? కడుపు నిండా తిండీ, కంటినిండా కునుకూలేక గాలిలో దీపంలా మినుకు మినుకు మంటున్నాడు. తనని కన్న వాళ్లనీ, తను కన్నవాళ్లనీ చూసి నేరం చేసిన వాళ్లా తలదించుకుంటున్నాడు. కాని బళ్లో జీతా తీసుకుని పాఠాల్చెప్పక, యింటి దగ్గర డబ్బు పుచ్చుకుని ప్రైవేట్లు చెప్తూ, పరీక్ష పేపరు పరీక్షకుముందే చెప్తే యింత, పాస్ చేయిస్తే కొంత, క్లాస్ తెప్పిస్తే మరికొంత అంటూ డబ్బు గుంజుతూన్న పరాంకుశం మేష్టరెలా వున్నాడు! పేరుకు బడి పంతులైనా గుడికంటె పదిలమైన యిల్లు కట్టుకుని పనసపండులా వున్నాడు! యీ యిద్దరి 'మేష్టర్లలో ప్రయోజకుడెవరూ?' అవడిగితే 'పరాంకుశమే'నని కళ్లులేనివాడుకూడా యిట్టే చెప్పేస్తాడు. కళ్లున్నవాడూ గుడ్డిగా నమ్మేస్తాడు! బ్రతకలేక బడిపంతులైనవాడే ప్రయోజకుడనిపించుకుంటుంటే బంగారంలాంటి డాక్టరువి నువ్వనిపించుకోటానికేమి? నువ్ మాట్లాడితే మంచి, నీతి అంటూ నీతికథలు చెప్తుంటావ్. కడివెడు పాలని చిటికెడు విషం విరిచిపారేసినట్టు సుఖపడేందుకున్న లక్షమార్గాల్ని నిర్దాక్షిణ్యంగా మూసి పారేస్తై నువ్వాశ్రయించిన మంచి, నీతినిజాయితీలు. అటువంటివాటి నీడనుండే నువ్వు నీవాళ్లనేం సుఖపెట్టగలవ్? నీవాళ్లను సుఖపెట్టలేని నువ్వుమాత్రం ఏం సుఖపడగలవ్? చెట్టు పచ్చగావున్నప్పుడే పదిమందికి నీడనివ్వగలుగుతుంది. నువ్ హాయిగా వున్నప్పుడే పదిమంది రోగులకు సేవ చేయగలుగుతావ్—నీ ఆశయం నెరవేర్చుకో గలుగుతావ్. కాబట్టి ముందు నీ సుఖం,

పివాళ్ళసుఖం చూసుకో. అయినా మాకు తెలీకడుగుతున్నాం - లంచం తీసుకుంటూ మంచివాడి వనిపించుకోవటమన్నది అంత అసాధ్యమైనపనా ఏమిటి?'

సుబ్బారావ్ ఆలోచించేడు. 'లంచం తీసుకుంటూ గూడా మంచివాణ్ణని ఎలా అనిపించుకోగలవూ' అని ఆలోచించేడు. అతడిలా ఆలోచిస్తూండగా శర్వరాత్రి అవ్వారు ఎలా వుంటుందో చూదామని వచ్చిన చంద్రుడు ఏ రావిచెట్టు తాలూకు నీడను తీసుకొచ్చి సుబ్బారావ్ పెంకుటింటిమీద వేసేడోగాని అతడికి జ్ఞానోదయమైంది. దాంతో 'ఏముంది. యిప్పుడెల్లాగూ అందరూ రోగుల్ని కన్నబిడ్డల్లా చూసుకుంటున్నా నను కుంటున్నారు. యికనుండి వాళ్ళదగ్గర కొద్దోగొప్పో వసూలుచేస్తూ వాళ్ళపట్ల మరింత ఆదరణ, సంపాయించి పెట్టే కొడుక్కి తల్లిదండ్రులదగ్గిర లభించే ఆదరణలాటి ఆదరణ కనపరిస్తేసరి! 'డబ్బు తీసుకుంటేమాత్రమేరా రోగుల్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడు! ఎవలోకేను తీసుకున్నాడంటే ఆ బబ్బు నయమయ్యేదాకా నిద్రపోడుకదా మానవుడు! డబ్బుతిన్నా ఆమాత్రం సేవచేసే డాక్టరు ఇంకెక్కడా దొరకడబ్బా !!' అన్న మంచిపేరు అంచెలంచెలుగా వస్తుందని అర్థమైంది. అంచేత అతడికి వెంటనే నిద్రొచ్చేసింది—మంచంలోని నల్లులూ, గదిలోని దోమలూ చెరపలేనంత నిద్రొచ్చేసింది.

తెల్లవారేసరికి సుబ్బారావ్ పద్మవ్యూహం కథవిని సుభద్ర కడుపులోంచి బయటపడ్డ అభిమన్యుడిలా లేచేడు. అరగంటలో అన్నిపన్లు ముగించుకుని శ్రీ కృష్ణుడి గీతోపదేశం విని కర్తవ్యం జ్ఞప్తికి తెచ్చుకున్న అర్జునుడిలా ఆస్పత్రికి పరుగెత్తేడు.

అప్పటికే రోగులు ఆస్పత్రిదగ్గర శనివారం వాడు సేఠ్ కొట్టుముందు గుమిగూడే బిచ్చగాళ్ళలా వున్నారు. సుబ్బారావుని చూడగనే దణ్ణాలుపెట్టేరు. సుబ్బారావు ప్రతినమస్కారాల్చేస్తూ ఏపుగా పెరిగిన పైరునిచూసి ఆనందపడిపోయే రైతులా ఎక్కువగా వున్న రోగుల్నిచూసి తృప్తిగా 'ఫరవాలేదు. మనిషికి రూపాయి వసూలుచేసినా పాతిక ముప్పై గిట్టొచ్చు' అనుకుంటూ హాస్పిటల్ గడప దాటబోయేడు. దాటబోతూ ఎందుకో 'గిల్టీగా', దేవుడి నగలు కాజేసి అమ్ముకు తిందామన్న దురుద్దేశ్యంతో గుళ్ళో కడుగుపెట్టే పూజారిలా గిల్టీగా ఫీలయ్యేడు—కాని వెనకడుగు మాత్రం వేయలేదు. హత్యచేసేందుకై నిశ్చయించుకున్న తెంపరిలా ముందడుగువేసివెళ్ళి తన సీట్లో కూచున్నాడు. ఎదురుగావున్న దేవుడి బొమ్మను చూసి మామూలుగా కళ్ళు మూసుకున్నా అలా మూసుకుని మామూలుకంటే ఎక్కువసేపున్నాడు. తర్వాత కళ్ళు తెరిచి బయటకు తొంగిచూసేడు.

బయట రోగిష్టిక్యూ రోగబలంతో మరింత బలసిపోయింది. ఆ క్యూలో కొందర్ని చూస్తుంటే 'ధర్మాసుపత్రికి మందుకోసం వచ్చిన యీ పేద ముండా కొడుకుల్దగ్గర డబ్బుచ్చుకోవటం ధర్మమా?' అన్నప్రశ్న పుట్టుకొచ్చింది. కాని గడచిన రాత్రి విడచిన ప్రశ్నలన్నీ కలిసి ఆ ప్రశ్నని తన్నుకుపోయినై. దాంతో సుబ్బారావు ఓ నిర్ణయానికి—ఫైనల్‌గా ఓ నిర్ణయానికొచ్చిన వాడిలా తేలిగ్గా గాలివదుల్తూ తోటీని పిలిచి 'ఒక్కొక్కళ్ళనే పంపు' అన్నాడు

తోటీ వెళ్ళేడు.

ఒకడు కణతలు నొక్కుకుంటూ, గుండె రుద్దుకుంటూ, మూలుక్కుంటూ లోపలికొచ్చేడు.

సుబ్బారావతణ్ణి బోణీ కొట్టేందుకొచ్చిన కస్టమర్ని షాపువాడు చూసినట్టు అభిమానంగా చూస్తూ 'ఏం బాబూ ఏమిటి కంప్లెయింట'ని అడిగేడు. అడుగుతూ నాడి చూసేడు. నుదుటిమీద చేయివేసేడు. పొట్టనొక్కేడు స్టెతస్కోపు గుండెలమీదపెట్టి 'బ్రనూపీ యిప్పు మంచి మందిస్తా' అని కుండబద్దలు కొట్టినట్టు అడుగుదామనుకున్నాడు—కాని తన గుండెలవేగం విపరీతంగా పెరగటంతో ఆడగలేక ఆ రోగికో చీటీ రాసిచ్చి పంపి 'నెక్స్ట్' అన్నాడు.

ఓ పండుటాకు ఎగిరొచ్చిపడింది. దాని వెనకే

ఓ ముసలాడొచ్చేడు. అతడి కళ్ళల్లో కాంతిలేదు. కడుపులో శాంతిలేదు. కాళ్ళల్లో శక్తిలేదని వాటి వణుకు చూస్తేనే తెలుస్తూంది. అతడి కడుపుకూ, వీపుకూ రెంటికీ బొంకుకీ వున్నంతదూరం వుంది. అతని చేతులకి ఎండిపోయిన బీరతీగెలకీ పోలికవుంది. మనిషి మొత్తంగాచూస్తే చిన్నపిల్లలు గీసిన ఒంటిగీత బొమ్మలా వున్నాడు. అతడు వున్నపళంగా బలిచక్రవర్తైపోతే వామనమూర్తి అతగాణ్ణి పాతాళానికి పాదంతో తొక్కడు—తన గొడుగులోంచి ఓ తాటాకులాగి దాంతో అణచేస్తాడు. అతడే గనక వున్నపళంగా శిబిచక్రవర్తిగా మారిపోతే పావురం బరువు తూగే తొడమాంసం యివ్వలేక తొడ ఎముకని మాత్రంతీసి త్రాసులో వేస్తాడు. కాని అతడు అటు బలిచక్రవర్తీ కాదు, ఇటు శిబిచక్రవర్తీ కాదు. కేవలం ఎండి ఈనెలు బయటపడిన రావి ఆకులానో, కాళ్ళ కింద నలిగిపోయిన ఖాళీ సిగరెట్టు పెట్టెలానో వున్న రోగి—డబ్బువుంటే అస్థితికి ఛస్తేరానిమనిషి! అతణ్ణి చూసిన సుబ్బారావు కరిగి—అతని పుండ్లని కడిగించి—పదేపదే ఆలోచించి తను ఎంతో మంచి దనుకుంటున్న మందురాయించి పంపేడు (ముసలాడు అడగలేదుగాని అడిగితే పావలో అర్ధో సర్దివుణ్ణు!) కాని డబ్బడగలేదు. 'తర్వాత' అన్నాడు చనిపోయిన తండ్రికి దహన సంస్కారాలెలా చేయాలో తెలీని వాడిలా!

తర్వాత—వాతలు పెట్టుకున్న నక్కలా, పులివేషంవేసిన మనిషిలా భారీ డిజైన్లు, గాఢ రంగులూవున్న బట్టలు వేసుకున్నవాడు, విద్యార్థో ఉద్యోగో అర్థంకాకుండా వున్నవాడు వచ్చేడు. రోడ్డంట వెళ్తుంటే కుక్క వెంటబడి మరీ కరిచిందని గగ్గోలు పెట్టసాగేడు. సుబ్బారావతడికివ్వవలసిన పధ్నాలుగు ఇంజక్షన్లలో ఒకటిచ్చి డబ్బడగబోయేడు. అడగబోతూ పేషంటు ముఖంచూసేడు. గోడనున్న డాలుకి బిగించిన కత్తుల్లా పేషంటు ముదురు మూతిమీది మీసాలు, తలుచుకుంటే అంతు చూడగలను అన్నట్టున్న ఎర్రజీరల కళ్ళూ కన్పించేయి. డబ్బడిగితే ఈ వెధవ రిపోర్టిచ్చినా యివ్వగలడని భయపడిపోయిన సుబ్బారావు ఆ పేషంటుని వొదిలేసేడు.

ఆ తర్వాత మంహాడొచ్చేడు—అతడు వెళ్ళిపోయేడు. ఆతర్వాత మరోపేషంటు ఆడపేషంటు... మగపేషంటు... ముసలి.. వయసు... బాల .. బేల... ఎందరో రోగులొచ్చి రాగాల్తీసి వెళ్ళిపోయేరు. సుబ్బారావు మాత్రం ఏదోకారణంగా ఎవర్నీ డబ్బడగలేకపోయేడు. చివరికి ఏదయితే అదవుతుందని యీసారొచ్చేవాడ్ని తప్పక అడిగేయాలని 'నెక్స్టు' అన్నాడు దృఢంగా.

తోటి వచ్చేడు—'అంతా అయిపోయేరు సార్' అంటూ!

అందరూ అయిపోయేరా! సుబ్బారావు వుస్సురన్నాడు. నీటికోసం ఏటికివెళ్ళి, ఏటినిచూసి భయపడి వుత్తబిందెతో తిరిగొచ్చిన కొత్త కోడల్లావుంది మన పరిస్థితి అనుకున్నాడు. అనుకుని నవ్వుకున్నాడు. నవ్వుకుంటూ 'నవ్వుకూడా వెధవ మొహానికి' అని తనను తనే తిట్టుకుంటూ విసురుగావెళ్ళి నర్సుతో కబుర్లుచెప్తున్న కంపౌండర్ని తిట్టి ఏవేం మందులు కలపాలో చెప్పి, కంపౌండరుతో అంతవరకూ కబుర్లు చెప్తూ కూచున్న నర్సును మందలించి వెంటబెట్టుకుని ఆ ఆస్పత్రిలో వుంటున్న పదిమంది మంచం పేషంట్లనీ, నలుగురు నేలపేషంట్లనీ చూసేందుకు వెళ్ళేడు. చూసేడు—వచ్చేడు—వచ్చి పేపరు చదివేడు. చదివి టైము చూసుకుని, ఒంటిగంటవరకు కారియర్‌కోసం 'వెయిట్' చేసి, ఒకటిన్నరకు భోజనం ముగించి 'రోగుల్దగ్గర డబ్బు గుంజాటెలా?' అన్న విషయమై పదేపదే ఆలోచించ సాగేడు. మధ్య మధ్య 'పోనీ కంపౌండర్‌గాడ్ని అడుగుదామా' అనుకున్నాడుగాని ఇప్పటివరకు తనంటె భయపడిఛస్తున్న వెధవ ఈవిషయం అడిగిందగ్గర్నుండి తనని భయపెట్టి చంపుతాడేమోనని భయపడి అలా అనుకోవటం మానేశాడు—ఆలోచించటం మాత్రం మాన్లేదు.

మొత్తానికి సుబ్బారావు ఆలోచనలు వాటంతటవి తెగలేదు—గడియారం తెంపింది మూడు గంటలుకొట్టి! సుబ్బారావు సర్దుకు కూచున్నాడు. మెల్లమెల్లగా పాతరోగులు పాతచీటీల్తో పాత ఖైదీల్లా రాసాగేరు. వాళ్ళలో తాతలాటి వాళ్లెవరైనా కానుకల్లాటి వేమైనా తెస్తారేమోనని చూసేడు, సుబ్బారావు. కాని వాళ్ళు రోగలక్షణాలు, పొగడ్తలఅక్షరాలూతప్ప మరేం మోసుకురాలేదు.

సుబ్బారావు నిర్లిప్తంగా నాలుగున్నర వరకూ వాళ్ళతోనూ, ఐదున్నరవరకూ ఏకాంతంగానూ గడిపి 'ఇక ఇంటికైనా వెళ్దాం' అనుకుంటూ లేచాడు.

అప్పుడే హాస్పిటల్ ముందుకో కారొచ్చి ఆగింది. అందులోంచి మహారాజులాంటి పెద్దమనిషి, అతన్తోపాటు కాబోయే మహారాజులాటి వో చిన్న మనిషి దిగేరు.

సుబ్బారావుకు ముందుదిగిన పెద్దమనిషిపేరు తెలుసు— హరిశ్చంద్రరావని. అతనిపదవి తెలుసు— పలుకుబడి తెలుసు! అయితే అతడెందుకొచ్చేడో తెలీదు! అందుకే లేచి ఎదురువెళ్తున్నట్టు రెండడుగులువేసి 'రండి రండి ఏదో పనిమీద వచ్చినట్టున్నారు' అన్నాడు.

'పుట్టిన ప్రతివాడికి మావంటివాళ్ళతో పనుండక పోవచ్చుగాని డాక్టర్లతో పనిపడక పోతుందా సుబ్బారావుగారూ!' మీతో పనుండే వచ్చేను...మీకు...'

'పనేంలేదు కూచోండి ... వూ ... ఇప్పుడు చెప్పండి.'

'ఏం లేదండీ! వీడు నా బావమరిది. కాలేజీకి పోరా అంటే కాబేజీ పువ్వులా తయారై మేతకు బయల్దేరిన గువ్వపిట్టలా వూరంతా బలాదూరు తిరిగొస్తాడేగాని కాలేజీకివెళ్లిన పాపానపోడు. అయితే వీళ్లో ఓ సుగుణం వుంది. 'సంవత్సరమంతా అల్లా తిరిగినా చివర్లో కష్టపడి చదువుతాడు—అన్ని పరీక్షలు రాస్తాడు. ఫస్టున కాకపోయినా పాసవుతాడు!!'

'మంచిదే!'

'కాని యిప్పుడా మంచికాస్తా జరక్కుండా పోయేట్టుంది 'సుబ్బారావుగారూ! వీళ్ల కాలేజీలో విన్నా యివాళా య్యేవో పరీక్షలు పెట్టేరుట. వాటికంటే ముందూ, వాటికి హాజరుకాని వారిని పెద్ద పరీక్షలకి పంపేది లేదని నోటీసు పెట్టేరుట. ఆ నోటీసు యీ వెధవాయి నోటీసుకు రాలేదు. అంచేత కాలేజీ పరీక్షలేగదా అవి ఎగ్గొట్టేసేడు. ఓ గంట క్రితం, ఆ నోటీసు సంగతి తెలుసుకుని ఒహటే ఏడుపూ! అక్కడికీ నేను వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాటాడేను. ఆయన 'ససేమిరా వీల్లేద'న్నాడు. 'ఇప్పుడు వీణ్ణి వదిలేస్తే వీడితోపాటు పరీక్షలెగ్గొట్టిన వాళ్లంతా ఎగబడతారు. కాబట్టి యీ విషయంలో నేనేం చేయలేను. చేయగలిగింది ఒక్క గవర్నమెంటు డాక్టరే' అనికూడా అన్నాడు!'

'నేనా...నేనేం చేయగలను సార్!'—తన శక్తి తనకు తెలీని ఆంజనేయుళ్లా బిడియపడి పోయేడు సుబ్బారావు.

'మీరా...మీరు మా వెధవకి పరీక్ష భిక్ష పెట్టగలరు సార్! మీరు 'ఎలా' అని అడక్కుండా ఎలాగో నేనే చెప్తున్నా వినండి. ఏంలేదూ...మా వాడికి యేదో జబ్బు పట్టుకుందని నిన్నా యివాళ యీ హాస్పిటల్లోనే వున్నాడని చిన్న సర్టిఫికెటు ముక్క పారెయ్యండి తర్వాతదంతా నేను చూసుకుంటాను!'

సుబ్బారావ్ అయ్య బాబోయ్ అన్నట్టు కొయ్యబారి పోయేడు. ఆ తర్వాత కాసేపటికి మెత బడి 'తత్తత్తప్పండీ' అన్నాడు.

'ఇందులో తప్పేముందయ్యా పిచ్చిబ్రాహ్మడా! నువ్వేవన్నా తాగినోణ్ణి పట్టుకుని తాగలేదన్నట్టు సర్టిఫికెటిస్తున్నావా? లేకపోతే (డబ్బుతిని) కత్తిపోటుకు చచ్చినవాణ్ణి పరీక్షచేసి గుండెపోటుకు చచ్చేడని తప్పుడు సాక్ష్యం చెప్తున్నావా? కేవలం ఓ బీదముండాకొడుక్కి సాయం చేస్తున్నా వంతే!!'

[ఎందుకురా హరిశ్చంద్రుడూ వ్యాపారికే అబద్ధాలాడతావ్! అంతలేసి ఖరీదైన బట్టలూ, మెళ్ళో బంగారపుగొలుసు చేతికి బంగారంలాంటి వాచీ, అయిదింట్లో నాలుగువేళ్ళకి ముద్దొచ్చే వుంగరాలూ—వీటితో కొత్తమందుల కంపెనీవారి శాంపిల్ సీసాలా వెలిగిపోతున్నవాణ్ణి పట్టుకుని బీద ముండాకొడుకని చెప్తావ్. అంత పచ్చిఅబద్ధం వనికి రాదు రోరేయ్!]

సుబ్బారావు అన్యాయాన్ని సహించవలసి వచ్చినవాళ్ళా వో వెర్రినవ్వు నవ్వేడు.

'ఏమిటి డాక్టరుగారూ నవ్వుతున్నారు? సూటూబూటూ వేసుకున్న వాణ్ణి పట్టుకుని బీదవాడంటున్నాననా? మీకు తెలీం దేముంది... యివన్నీ పాకింగ్ డాబుసర్లే! నిజానికి ఈనెధవ వెనక వీడెప్పుడు సంపాయిస్తాడా, కష్టాలెప్పుడు గట్టెక్కుతాయా అని ఎదురుచూచే తల్లీ, వీడెప్పుడు సంపాయిస్తాడో నన్నొకయ్యచేతిలో ఎప్పుడు పెడ్తాడో అని చింతపడే చెల్లితప్ప చిల్లికాణీకూడా లేదు! యిహ నేనున్నానంటే దేశంమనిషిని. మీకెంతవరకు వుపయోగపడగలనో వీడికీ అంతే వుపయోగపడగలను గాని అంతకుమించి వీసమెత్తు సాయంకూడా చేయలేను. ఈ పరిస్థితుల్లో వీడు పరీక్షలకు పోకపోతే ఒకయేడు నష్టమవుతుంది. ఒకయేడు నష్టమైతే— చదువూ, చదువుకి పెట్టినడబ్బు, డబ్బుతో పన్లేని వయసూ, వయసుతో పనివున్న వుద్యోగం, చెల్లి పెళ్ళి, అమ్మ ఆశ—అన్నీ నష్టమవుతాయి డాక్టరూ... కనికరించు...వీడికీ సాయం చేయి!'

సుబ్బారావు యిరుకునపడ్డాడు. పిల్లల కన్నీళ్ళు తుడవటానికి సర్టిఫికెటిస్తే ఆ దొంగ సర్టిఫికెటిచ్చిన నేరానికి తనూ తనవాళ్ళూ కళ్ళనీళ్ళు నింపుకోవాల్సొస్తుందేమోనన్న భయంలో పడ్డాడు.

సంశయిస్తున్న సుబ్బారావుకేసి హరిశ్చంద్రరావు విశ్వామిత్రుడి చూపొకటి చూసేడు. అంతలోనే వశిష్ఠుడిలా చల్లగా చూసేడు. మరు నిముషంలో క్లయిమాక్స్‌లో తనతప్పులు తెలుసుకున్న ఇంద్రుడిలా తనని తనే తిట్టుకుంటున్నట్టుగా అన్నాడు—

'అయ్యయ్యో నాతెలివి మండిపోనూ! యింత పెద్దపని మీ నెత్తినపెట్టి మీకేమాత్రంవూ సాయం చేయకుండా, యిలా కూచుండి పోయానేమిటీ బడుద్ధాయిని!' అంటూ జేబులోంచి పది కొత్త పదిరూపాయల నోట్లను తీసి బల్లమీద పెట్టేడు హరిశ్చంద్రరావు.

సుబ్బారావు తలెత్తి చూసేడు ఎదురుగా నోట్లు! నోట్లమీంచి 'పిల్లనచ్చిందా' అన్నట్టు చూస్తున్న హరిశ్చంద్రుడు'!

[మహానటు డవడంటే మొట్టమొదట నీపేరు చెప్పుకోవాల్రా హరిశ్చంద్రుడూ! ఇచ్చేలంచాలన్నీ, పుచ్చుకునే దొంగ సర్టిఫికెట్లూనూ మానవత్వం, సహాయాల ముసుగులో నడిచే గారడి చేస్తున్నావ్. ఆ వచ్చేదేదో నిన్నునచ్చి, యీ యిచ్చేదేదో నిన్ను యిచ్చి యిప్పుడు వాగుతుందేదో నిన్ను వాగుంటే నీసని పట్టుండే వాణ్ణి! నీ నాలుక పీకి చేతికిచ్చి నిన్ను యింటికి పంపుండేవాణ్ణి. నీ అదృష్టం బాగుండి యివాళొచ్చేవ్! యివాళ...యివాళ...]

సుబ్బారావ్ 'యమ్ స్ట్రిక్ట్' అన్నవిషయం హరిశ్చంద్రరావుకి తెలిసాకనే అందరికీ తెలిసింది. అయినా అతడు అదేమీ పట్టనివాళ్ళా యేమాత్రం తొణక్కుండా మానవప్రయత్నంగా, బజార్లో అయిదు రూపాయిలకు దొరికే సర్టిఫికెట్టుకు వందరూపాయిలు పెట్టుబడి పెట్టేడు. సుబ్బారావు ఆ వందకేసి వోపక్క అసహ్యంగానూ, మరోపక్క ఇంటికొచ్చి వెళ్ళేచుట్టం ముచ్చటపడి యిచ్చేరూపాయని 'తీసుకోనా వద్దా' అన్నట్టు తల్లికేసిచూసే చిన్నారిలాగూ చూట్టం కనిపెట్టేడు. అంచేత యింకొంచెం కష్టపడితే సుబ్బారావు మెత్తబడటం ఖాయం అని తియ్యగా, పుట్టలోని పాముని బుట్టలోకి తెచ్చేందుకు పాములవాడు వూదే నాగస్వరంలా అతితియ్యగా, అంతే వినయంగా అన్నాడు—

'మీరుచేసే సాయానికి యీ చిన్నమొత్తం ఏంతమాత్రం సరితూగేది కాదు. అయినా తమరు అనుగ్రహించక తప్పదు!'

సుబ్బారావు తటపటాయించేడు.

'మీరేం భయపడకండి సుబ్బారావుగారూ! యీ కానుక స్వీకరించండి. యిందులో తప్పేం లేదు! ఓ వేళ ఏ గాడిదన్నావచ్చి 'యిందులో తప్పుందీ నిన్ను జైల్లో వేయిస్తానూ' అనంటే మీరు ఆ గాడిద కాళ్లు పట్టుకోక వెంటనేవచ్చి నా కళ్లపడండి. నేను ఆ గాడిద కలలో కన్పించి మిమ్మల్నాదుకుంటాను.'

సుబ్బారావు డబ్బు ముట్టుకోలేదు—డ్రాయరు సొరుగు లాగేడు. అందులోంచి లెటర్‌పేడ్‌తీసి హరిశ్చంద్రుడి బావమరిదిని పూర్తి పేరడిగేడు.

బావమరిది 'ఏ. నరోత్తమరావని' చెప్పేడు.

సుబ్బారావు బుర్రవంచుకుని 'ఏ. నరోత్తమరావు మొన్న అనగా ఫలానా తేదీ సాయంత్రం ఫలానా జబ్బుతో హాస్పిటల్లో చేరేడు. యివాళ అంటే ఫలానా తేదీ రాత్రికి బాధావిముక్తుడై హాస్పిటల్ వదిలేడు' అని రాసి, ఒకసారి చదువుకుని కింద సంతకంచేసి సర్టిఫికెట్టును హరిశ్చంద్రరావు కందించేడు.

హరిశ్చంద్రరావు కాగితాన్ని కిందనుండి... కాదు...పైనుండి కిందకోసారిచూసి బావమరిది కిచ్చేడు. బావమరిది ఆ కాగితాన్ని జేబులో భద్రం చేసి లేస్తూ 'మీ మేలు జన్మలో మరిచిపోలేను డాక్టర్! మరి పోదామా బావగారూ ఆలవొచ్చింది' అన్నాడు.

హరిశ్చంద్రరావుకూడా లేస్తూ 'యీ జన్మలోనే కాదురా వెధవా వచ్చే జన్మలోకూడా మరచిపోలేవ్' అన్నాడు, సుబ్బారావ్‌కేసి చూస్తూ.

సుబ్బారావు సిగ్గుపడిపోయేడు. అతడందు లోంచి తేరుకునే లోపలే హరిశ్చంద్రరావు 'వస్తా మండి. అప్పుడప్పుడూ కన్పిస్తూండండి' అన్చెప్పి బావమరిదిని తీసుకువెళ్లిపోయేడు.

పెద్దవాడి చావుతో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సంపాయించుకున్న చిన్నవాడిలా సుబ్బారావు హరిశ్చంద్రరావు వాళ్లటు వెళ్లగనే యిందాకట్నుండి గుండెలో పేరుకుంటున్న సంతోషాన్ని శబ్దంలేని నవ్వులో కక్కేశాడు. ఎదురుగా టేబుల్‌మీదున్న పది పదిరూపాయల నోట్లను దోసిట్లోకి తీసుకు పదే పదే చూసుకున్నాడు. అలా చూసుకుంటుంటే ఎక్కడ్నుండో, ఎవరో ఎందరో కోర్టుని నమ్మించలేని వచ్చినిజంలా, కసిగా, అసహాయంగా, రుద్ధకంఠంతో 'నీ చేతిలో వున్నది పాపం. నీ నవ్వులో వున్నది మలినం! నువ్ నిజంగా పాతిపెడుతున్నది నీలోని ధర్మప్రభువుని! నీ ఆత్మని!! నీ అభిమానాన్ని!!!' అనంటున్నట్లనిపించింది.

సుబ్బారావు గాభరాగా నోట్లను జేబులో కుక్కుకున్నాడు. ఆస్తికోసం నిలువెత్తు మనిషిలో తళతళలాడే కత్తిని దించి ఉవ్వెత్తునలేచే రక్తంలో అతన్ని పొడిచి, ఆ రక్తంలోనే తన చేతులు కడుక్కుని...చివరికి ఆ హృదయ విదారక దృశ్యాన్ని గుర్తించుకోని నిశ్చింతగా బతకటం దుర్భరమని గ్రహించి దాన్ని మరిచిపోయేందుకు ఆ చచ్చినవాడి ఆస్తితెచ్చే సౌఖ్యాలను ఊహల్లో అనుభవించే హంతకుడిలా సుబ్బారావుకూడా నీతినిజాయితీలాంటి వాటిని మరచిపోయేందుకు ప్రయత్నిస్తూ, తీసుకున్న వందరూపాయల్నిచూసి సుభద్ర ఎంతగా ఆనందిస్తుందో తలచుకుంటూ 'యిక వెళ్దాం' అనుకుంటూ లేచేడు.

కాని సుబ్బారావు వెళ్ళేందుకు వీల్లేకుండా నర్సు పరుగెట్టుకొచ్చింది — 'డాక్టర్ డాక్టర్' అంటూ.

'ఏమిటి ?'

'మూడోనంబరు పేషంటూ...'

'ఏం పోయేడా '

నర్సు పరువుపోయిందని తెల్సుకున్నదాన్లా నోరు తెరిచింది. అందులోంచి 'ఎప్పుడూ పేషంటును

ప్రేమించుమన్నా అంటుండే డాక్టరు యిప్పుడిలా అనేశాడేవిటా !?' అన్న ఆశ్చర్యం బయటపడింది.

'ఏవిటీ అసలుసంగతి చెప్పకుండా అలా నోరు తెరిచేవ్ ?'

'ఆఁ... ఆ మూడోనంబరు పేషంటుకు యింజక్షనిస్తే రియాక్షన్ వచ్చింది.'

'అల్లాగా...పదపద !'

సుబ్బారావు హడావిడిగా వార్డుకు వెళ్లి మూడోనెంబరు పేషంటుకో యింజక్షన్ పొడిచి, పన్లోపనని పక్కపేషంట్లను కూడా పలకరించి, మళ్లీ మూడోనంబరు పేషంటు దగ్గరకొచ్చి ఓ అరగంట కూచుని 'యిహపర్లేదు...' అనుకుంటూ లేచేడు.

కాని మళ్లీ నర్స్ అడ్డొచ్చింది— 'డాక్టర్ ఏదో కాజువాలిటీ...'

సుబ్బారావు క్కోపం వచ్చింది. చేస్తూ చేస్తూన్న మంత్రిపదవిని చూస్తూ చూస్తూ వదులుకోవాల్సొచ్చిన పెద్దమనిషి కొచ్చేకోపం వచ్చింది. కాని తమాయించుకుని నర్సుకేసి తిరిగి 'కాజువాలిటీ అని అలా నిలబడిపోతావేం... నడూ' అని కసిరేడు.

నర్సు కమ్చీ దెబ్బతిన్న గుర్రంలా పరుగెత్తింది.

సుబ్బారావు బక్కచిక్కిన గుర్రం లాగుతున్న బండిలా నడుస్తూ 'కన్సల్టింగ్ రూమ్'లో కొచ్చేసరికి రోగులకోసం వేసిన బల్లమీద యిద్దరు కూచుని వున్నారు. మోకాళ్లదాకా పంచె, పైన బనీను, మాసిన తలగుడ్డ—పీటిలో ప్రభుత్వం వారు ప్రచురించే 'జై జవాన్ జై కిసాన్' బొమ్మల్లోని కిసాన్లల్లా— కాపోతే కాస్త బక్కచిక్కిన కిసానుల్లా వున్నారు. డాక్టర్ని చూడగానే పోలీసును చూసిన పాతకేడీల్లా ఠక్కునలేచి వినయంగా నిలబడ్డారు.

'ఏంకావాలి మీకు?'—సుబ్బారా వడిగాడు.

'వాళ్లే ఆ కేసు తెచ్చింది !'— నర్సు చెప్పింది.

'కేసు' అనేసరికి కిసానుల్లో వణుకు ప్రారంభమైంది. అంతెత్తు మనుషులూ తలచుకుంటే సుబ్బారావు జుత్తే అందుతుందిగానీ వాళ్ళు అలా తలచుకోక కిందపడి డాక్టరు కాళ్ళు పట్టుకున్నంత పనిచేసేరు— 'రచ్చించండి బాబూ ! మాకేటి తెల్దు మమ్మల్ని రచ్చించండి' అంటూ.

నర్సు డాక్టరు సుబ్బారావుకేసి చూసింది.

సుబ్బారావు కిసాన్లకేసే చూస్తున్నాడుగాని జాలిగా చూట్టంలేదు. విసుగ్గా చూస్తున్నాడు.

అంచేత నర్సమ్మ కిసాన్లతో 'మీకేం భయం లేదు లేవండి బాబూ ! జరిగిందేవిటో డాక్టరు గారికి నెమ్మదిగా చెప్పండ' అని అనునయంగా అన్లేదు. 'మీకు తెలిసిందేవిటో త్వరగా చెప్పి అవతలకు వెళ్లండయ్యా ! మాకింకా పన్లున్నై!' అని గదిమింది.

కిసాన్లు లేచి నిలుచున్నారు. రెండునోళ్లూ కలిపి ఒక్కనోటితో చెప్పినట్టు చెప్పేరు

'మా పొలాలకి ఎరువుతోలి మాపిటేలకి మేఁ విద్దరం యింటికి బయల్దెల్లాఁవండి. నేను తొట్లో—అదు బండ్లో. కాదుకాదు.. అడేతొట్లో... నేను బండ్లో కూకుని ఆమాటా యీమాటా మాట్లాడుకుంటు ఎడ్లని అదిలిస్తున్నామండి. యింతలో బండి మన రాజాగారి తోట్లోదూ... ఆ తోటకాడికొచ్చింది... అక్కడికొచ్చేసరికి మాకేదో మూలుగు యినిపించింది. అదేదో ఎలుగు మూలుగైతే మేం ఆసాయలకే పొయ్యేవాల్లం కాదు కాని ఆ యినిపించింది మడిసి మూలుగ్గాయె! అందుకే మాకు కాళ్లాడక బండినాపి మెల్లగా తోటలో కెల్లినం. లోపల మర్రిచెట్టుకింద...చెట్టంతలేదుగాని పచ్చటి చెట్టులాంటి మడిసి సిందర వందరగా, బండికింద పడ్డ బంతి పువ్వులా మూలుగుతూ పడుంది. మేం యిద్దరఁ ఆ సుట్టుపక్కల వోరన్నా వున్నరేమో

వనీ గాలించినంగాని ఓరూ కనపడ్లే! మరి చేసేది లేక ఆ మడిసిని అట్టా ఒదిలెయ్యటానికి మన సొప్పక అట్టాగే బండిలో యేసుకుని బయలెల్లినం. పెందలాడే వూర్లో పడాలని మా ఆలోచన కాని యెంత అదలించినా, యెన్ని తగిలించినా ఎద్దు నడక ఎద్దు నడకేగదా! అయ్యి మా బండిని వూల్లోకి తెచ్చేసరికి దీపాలు ఎలుగుతున్నై. దగ్గరగా వున్నాడు గదా అని ఆ కోనేటి దగ్గర డాక్టరు కాడికెల్తే ఆయన సినిమాకి పోయినాడన్నారు. సరేనని సిని మాలు దగ్గరి డాక్టరు కాడికి పోయినం. ఆయన గీసి గీసి బేరమాడి పదిఋపాయల కొప్పుకొని ఆమడి సికి యింజీసనిచ్చినడు. యింజీసనిచ్చిన పావుగంటకు ఆ యమ్మ లేచింది. లంకమ్మ శివాళ్ల మొదలెట్టింది. కాసేపు ఏడిచింది—కాసేపు నవ్వింది—కాసేపు పెద్ద పెద్దగా అరిచింది. చివరికి అందుబాట్లో వున్న డాక్టరు చెయ్యి కరవబోయింది. యిహ డాక్టరు ఒహాటే బెంబేలెత్తిపోయ్యి అడ్డమొచ్చిన యింజీస నేదో అమ్మడికి పొడిచేసేడు. దాంతో అమ్మడు గమ్మున నిద్రపోయింది. అమ్మడు నిద్రపోయేక డాకటరు మాతో 'యీ అమ్మాయి నిక్కడుంచకూడదూ పెద్దాసుపత్రికి తోలుకెల్లండి' అన్నాడు. మేం తోలు కొచ్చినం. యింతే దొర! మేం పున్నేనికి పోయినం. మా కేపాపం తెల్దు.. రచ్చించండి...'

సుబ్బారావు కిసాన్లు చెప్పిందంతా సావధానంగా కాకపోయినా విన్నడు. విని,

'నర్సు! మీరు చెప్పాల్సిందేదో చెప్పారుగా. కాస్సేపలా కూచోండి మేం పేషంటుని చూసొస్తాం' అన్నాడు. అంటూ నర్సుకేసి చూసేడు 'నడు' అన్నట్టు.

నర్సు దారి తెలసిన దొంగలా గబగబ పేషం టున్న గదిలోకి దారి తీసింది.

సుబ్బారావు నర్సును అనుసరిస్తూ గదిలోకి వెళ్ళేడు. పేషంటుకేసి రెండడుగులువేసి పేషంటు ముఖంలోకి చూసేడు—

అంతే సార్ అంతే!

అంత డాక్టరూ నడుంవరకూ పూడ్చిపెట్ట బడిన వాడిలా, గోడకు కొట్టిన మేకులా నిలబడి పోయేడు.

పై రెప్పకి దారంవేసి యింటికప్పుకి, కింది రెప్పకు దారంవేసి కాలి వేలికి కట్టినట్లు తెరిచిన కళ్ళు మూయకుండా అలాగే చూస్తుండి పోయేడు!

ఎదురుగా — గిన్నెనిండుగా వున్న వెన్నని నాలుగువేళ్లతో తోడినట్లు తెల్లగా—కాదు—పచ్చగా — బంగారు పచ్చగా వుండాల్సిన పేషంటు చెక్కిళ్ల పైన రాక్షసి గోళ్ళగుర్తుల్ని, గుర్తుల్లోని రక్తపు చారికల్ని చూస్తుండి పోయేడు!

కొత్త సబ్బుబిళ్లకు సరికొత్త కాగితపు మూతలా అమరివున్న చీరే జాకెట్టూ చిన్నపిల్ల వాడు చింపిన కాగితంలా చీలికలై వుండటం గమనించేడు!!

చేతులమీద, కాళ్లమీద, ముఖంమీదా, ముక్కు మీదా గాయాలతో కాకులు పొడిచిన సబ్బుబిళ్లలా వున్న ఆమెని చూస్తూ...చూస్తూ...ఒక్కగావుకేక పెట్టేడు— 'బేబీ!' అని.

నర్సు జడుసుకుంది. శవం లేచి గొంతు పట్టుకున్నట్టు భయపడింది — బిత్తరబోయింది! తేరుకుని, ధైర్యంచేసి 'డాక్టర్' అంది.

సుబ్బారావప్పటికే సుజాత దగ్గర కెళ్లి పోయేడు. ఆ అమ్మాయి ఒంటిమీద దెబ్బల్ని నిము రుతూ, ఆ దెబ్బలన్నీ తనకే తగిలినట్లూ, ఆ గాయాలు తెగసలుపుతున్నట్లూ బాధపడుతూ కన్నీటి కథ చెప్తున్నట్టు, కరుడుగట్టిన గుండె సైతం కరిగిపోయేలా అన్నాడు—

'నా చెల్లెలు సిస్టర్! నా చెల్లెలు సుజాత!! యీ నా చిట్టితల్లిలో యెంత అందముందో అంత మంచితనముంది! యెంత తెలివుందో అంత జాలి గుండెవుంది. తెలిసి ఎవ్వరికీ, చివరికి చీమక్కూడా అపకారం చేయలేదు నా చెలెలు. ఆ అందానికి

అంత మంచితనానికి ఎంతమంచి బహుమతి లభించిందో చూడు సిస్టర్ !'

నర్సు మాట్లాడలేక పోయింది.

కాని సుబ్బారావు కొట్లాటలో ఓడిపోయిన వాడు ఆవేశపడినట్లు వూగిపోతూ—

'వదిలిపెట్టకు సిస్టర్ ! నా చెల్లినిలా చిత్రహింస పెట్టినవాడిని యింతకు పదింతలు బాధించిగాని వదల్ను !'

'డాక్టర్ ! మందు...మందు !'

'అవును...మందు నా బేబిని రక్షించుకోవాలి ..రక్షించుకోవాలి...' సుబ్బారావు గబగబవెళ్లి మెడికల్ చెస్టు తెరిచి అందులోంచి రెండు సీసాలు తీసి నర్సుకిచ్చేడు.

'ఈ ఇంజక్షనివ్వు సిస్టర్! నువ్వే యివ్వు!'

నర్సు సుజాతకి ఇంజక్షనిచ్చింది.

ఇంజక్షనిచ్చిన కొద్ది నిమిషాలకి సుజాత కదిలింది. కనురెప్పలు కదలించింది. కళ్లుతెరచి ఎదురుగా చూసింది.

సుబ్బారావు ఆనందపడి పోయేడు. తనలోవున్న అనురాగాన్ని, ఆప్యాయతని రంగరించి, ప్రేమగా సుజాత తలనిమురుతూ అడిగేడు—

'ఎలా వుందమ్మా బేబి?'

సుజాత అన్నయ్యను గుర్తుపట్టింది. కాని తన బాధన్నే గుర్తుపట్టినట్టుంది—కిలకిలా నవ్వేసింది.

సమయంకాని సమయంలో నవ్వగూడని నవ్వు నవ్విన సుజాత న్నూచున్నంటే సుబ్బారావుకి దిగులేసింది.

'ఎందుకమ్మా బేబి ఆ నవ్వు?'

'సుఖాన్ని కొనుక్కుందుకు మనదగ్గర డబ్బు లేదుగా అన్నయ్యా! అలా అని దానికోసం ముష్టెత్తుకోనూలేమాయె! అందుకని దాన్ని ఉచితంగా సంపాయించేనన్నయ్యా! అందుకే యీ ఆనందం!!'

'బేబి! ఏమిటమ్మా ఆ మాటలు?'

'అవంతేగాని అన్నయ్యా యీ విషయం విన్నావా?'

'ఏమిటది?'

'వరదరాజులని...మా కాలేజీ కుర్రాడే! ఓరోజు నా క్లాస్‌మేట్ పార్వతి దగ్గరకెళ్లి 'మీ పుట్టినరోజు పండక్కి నేనూ రావొచ్చా!' అనడిగేడుట. దానికి పార్వతి 'వస్తే నైలెక్స్ చీర కానుకగా తేవాలి' అందిట. అంతే! అతగాడు ఆ మాట పుచ్చుకుని మన్నాడు పార్వతీవాళ్లింటికెళ్లి ఖరీదైన నైలెక్స్ చీర ఒకటి పుట్టినరోజు బహుమతిగా యిచ్చేట్ట! యిదేమిటంటే అతడికి పార్వతికి అట్టే పరిచయం కూడా లేదుట మా సుందరి చెప్పింది! చూశావా అన్నయ్యా మీ మగాళ్లు ఎంత వెర్రివాళ్లు!'

'ఇప్పుడవన్నీ ఎందుకు బేబి!'

'అవును. ఇప్పుడవన్నీ ఎందుకూ......వన్నీ ఎందుకూ...'—సుజాత కళ్లు మూసుకుంది

సుబ్బారావు కంగారుగా 'బేబి బేబి' అంటూ సుజాతను తట్టేడు. సుజాత లేవలేదు!

'సిస్టర్ !'

నర్సు వో ఇంజక్షనిచ్చింది.

సుజాత కళ్లు తెరిచింది.

'అసలేం జరిగింది తల్లి ! ఎందుకు.. ఎందుకు నువ్విలా అయిపోతున్నావ్?'

'జరిగేందు కేముందన్నయ్యా ! ఇవ్వాళ ఆదివారమైనా ప్రయివేటు క్లాసుంది. అందుకని ఉదయమేలేచి కాలేజీ కెళ్లేను. క్లాసయి బయట కొచ్చేసరికి సరికొత్తకారు, ఎండలో బంగారంలా ధగధగ లాడుతోంది. చిన్నపిల్లలు కార్లూ, విమానాలూ లాటి ఆడుకుని తృప్తిపడతారు, పెద్దవాళ్లు వాటిలో సుఖంగా కూచోగలిగినప్పుడే తృప్తిపడతారు. మరి నేనూ పెద్దదాన్నేగా—అయినా కారెక్కే యోగ్యతలేదు గనక కొత్తకారుని చూసి మెచ్చుట పడుతున్నాను. అంతలోనే మా క్లాస్‌మెటొకత

వొచ్చి కారెక్కబోతూ నన్నుచూసి 'రండి. మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తాను' అన్నాడు. చూశావా అన్నయ్యా. అంతడబ్బున్నవాడైనా యెంతటిదయార్ద్ర హృదయుడో! అందుకే అతడి కక్కడికక్కడే 'థాంక్స్' చెప్పి కారెక్కి కూచున్నాను. కారు బయల్దేర బోతూండగా అతడి స్నేహితులు నలుగురు కాలినడకన పోతూ కన్పించేరు. ముందే చెప్పానుగా అతడు దయార్ద్రహృదయుడని. అంచేత అతను కారాపి ఆ నలుగుర్ని ఎక్కించుకున్నాడు. కారు బయల్దేరేక అతడికో 'అయిడియా' వచ్చింది—ఆదివారమేకదా అలా తోటదాకా షికారుకెళ్లొస్తే ఎలా వుంటుంది అని! ఆ అయిడియా మిగతా నలుగురికీ నచ్చింది. నాకు నచ్చకపోయినా అయిష్టంగి కారాన్ని తెలియచేశాను - మౌనంగా కూచుని. కారు రాజాగారి తోటకెళ్లి ఆగింది ..అక్కడ...అక్కడ...'

సుజాత మళ్లీ మగతలోకి జారిపోయింది. నర్సు మరో ఇంజక్షన్ ఇవ్వబోయేంతలో తేరుకుంది.

'అన్నయ్యా! యముళ్లెందరు?'

'ఇప్పుడెందుకమ్మా ఆ గొడవ?'

'కావాల్లే చెప్పన్నయ్యా!'

'ఒక్కరే!'

'మరి నాకు అయిదుగురు కన్పిస్తున్నారేం!? అవునన్నయ్యా: అడుగో ఒక యముడు...నాదగ్గర కొచ్చి యీ చేయి కదలకుండా పట్టుకున్నాడు. మరొక యముడు యీ చేయి గట్టిగా పట్టుకున్నాడు. మిగతా ముగ్గుర్లో యిద్దరు నా కాళ్లు పట్టుకున్నారు. అయిదోవాడు . అన్న... నా క్లాస్‌మేట్ నరోత్తమరావులా వున్నాడే...అవును అతడే...ఎంతో దయతో నన్ను కారెక్కించినవాడు అంతక్రూరంగాచూస్తున్నాడేవిటి...అయ్యో పైపైకి వచ్చేస్తున్నాడు...నరోత్తమరావ్! ఏమిటిది? ఏం చేయాలనుకుంటున్నావ్? షికారని యిక్కడికి తీసు కొచ్చింది యిందుకా! ప్రజలకు...ముఖ్యంగా దుఃఖిత ప్రజలకు ప్రాతినిధ్యం వహించాల్సిన పెద్దమనిషి హరిశ్చంద్రరావు బావమరదివి...అతడు ప్రాతినిధ్యం వహించేందుకు పీడితులెవరూ దొరక లేదా...యీ దురాగతానికి పూనుకుని నన్ను పీడి స్తున్నావ్! వద్దు...ప్లీజ్...నేను నీ చెల్లెలిలాటి దాన్ని...నన్నేం చేయకు...నీ కాళ్లు పట్టుకుంటా... బుద్ధి గడ్డితిని నీ కారుకెక్కి అలా చూశాను ఏదో మగపురుగు 'అయి'నయిపోయి నన్ను కార్లో పూరే గిస్తుందనే అలా చూశానుగాని యీ మగపురుగు యింత విషపు కాటు వేయగలిగినదని తెలిసికాదు. కాని యిప్పుడు తెల్సుకున్నాను. యిహ నీ కారు చాయలకి రాను. యీ తప్పు ఎప్పోపారి చేయను... నన్ను క్షమించు నరోత్తమరావ్ ..నా జీవితంలో నిప్పులు పోయకు...నా బ్రతుకు బజారుకీడ్చకు... రాకు...రాకు...అలా పైపైకి రాకు...అయ్యో వినవా...నా మాట వినవా......అన్నలారా......మీరూ నా మాట వినరా...నేను మీ చెల్లెల్ని...నన్ను రక్షిం చరా...నవ్వుతున్నారా...నవ్వండి.. బాగా నవ్వండి... నాలుగుపాదాల నడవవలసిన ధర్మాన్ని అయిదు జతల పాదాలతో అణగ త్రొక్కుతున్న విజయగర్వంతో నవ్వండి. నేనుమాత్రం ఏడుస్తుంటాను.....ఏడు స్తుం...అమ్మా!!!'

'బేబీ!!'

* * *

సుజాత దుర్మరణానికి కారకుడైన నరోత్తమ రావుని సుబ్బారావు చిత్రవధ చేసేడా? తనుగా ఆపని చేయలేక అతగాణ్ని చట్టానికి అప్పగిద్దాం అనుకున్నాడా?? అలా అనుకున్న మరుక్షణంలో 'అయ్యో డబ్బు కక్కుర్తిపడి ఆ వెధవ మూర్ఖుడో జాలుగా యిదే హాస్పిటల్లో వున్నాడని దొంగ సర్టిఫి కెట్టిచ్చి, వాణ్ణి చట్టానికి అప్పగించే అవకాశాని పోగొట్టుకున్నానే' అని వాపోయేడా??

లేక...తను చిన్నతనంలో చదువుకున్న ఈగల పాఠం—అదే...'ఈగలను మనము తినుపదార్థములపై వాలనీయరాదు. ఏలననగా ఈగలు అంతకుముందే

రోగుల పుళ్ళమీదా, కళ్ళమీదా వాలివుండవచ్చును. అట్లువాలిన ఈగలకాళ్ళకు రోగక్రిమి అంటుకొనును. ఆ ఈగలు మరల మనము తినుపదార్థములమీద వాలినప్పుడు వాటికాళ్ళకంటి పెట్టుకునివున్న రోగక్రిములు పదార్థములమీద చేరును. ఆ పదార్థములు తినినచో మనకూ ఆ రోగములు వచ్చు ప్రమాదము ఎంతైనా కలదు'—అన్న ఈగలపాఠం జ్ఞాపకం వచ్చి 'హవును! 'కోరికల్తో' వేగిపోతున్న సుజాత ఆలోచనలమీద సుందరిలాంటి ఈగలు వాలినై. ఎవరెవరి కోరికలు ఎక్కడ ఎంత తేలిగ్గా తీరయో చూపించి ఉదాహరణల్తోసహా సుజాతకి చెప్పినై. సుజాత వాటికి లొంగి యిలా కూలిపోయింది. అలాగే ఏ పక్కింటి ఈగో, ఎదురింటి ఈగో సుభద్ర ఆలోచనలమీద వాలి అంచాలు తిని బలసి పందిరి మంచాలమీద పవ్వళిస్తున్న వారిగురించి చెప్తుంటుంది—అందుకే అది అలా తయారైంది. చివరికి అదికూడ ఒక ఈగగా మారిపోయి నా మనసుని కూడా కలుషితం చేసింది—ఫలితం అందరం అనుభవిస్తున్నాం. ఇందులో విడ్డూరమేమీలేదు!!' అని సరిపెట్టుకున్నాడా??

అదీగాకపోతే, న్యాయం చేతిలో అన్యాయం ఓడటమన్నది అతిసహజమైన విషయం కాని అన్యాయాలకు అధిపతి అయిన హరిశ్చంద్రరావు తలపెట్టిన అన్యాయం చేతిలో నేను చేసిన యింత చిన్నతప్పు ఓడిపోయిందేమిటా (!) అని ఆశ్చర్యపోయేడా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు వెండితెరమీద చూడక్కర్లేదు—గుండె తెరమీద చూసుకుంటే చాలు.



వెలుగునకు వచ్చిన క్రొత్తకవులు

డా. తంగిరాల వేంకటసుబ్బారావు

కాటమరాజు కథాచక్రమున ముప్పదిరెండు వీరగాథలున్నవని నా పరిశోధనవలన తెలిసికొంటిని. ఇందు సాహిత్యలోకమునకు తెలిసినవి అయిదు కథలు మాత్రమే. ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట, భట్టు రాయబారము, కొట్టపాటి తాటివృక్షంతెచ్చేకథ, అగుమంచి కథ, ఆద్యంతరహితమైన పోలురాజుకథ - ఈ అయిదును మదరాసు, తిరుపతి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములలో నున్నవి. ఇందు 'ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట'కు రెండు ప్రతులున్నవి. ఒక ప్రతి గంగుల పినయెల్లయ రచనగా తెలియుచున్నది (ఇదియే 'కాటమరాజుకథ' అను పేరుతో మదరాసు ప్ర. ప్రా. లి. పు. భాం. వారిచే ప్రకటింపబడినది.) రెండవది శ్రీనాథుని రచనగా నూహింపబడుచున్నది. తక్కిన కథల రచయితలు తెలియవచ్చుటలేదు.

కాటమరాజు కథాచక్రములోని ముప్పదిరెండు కథలలోను పై అయిదు కథలను మినహాయింపగా మిగిలినవి ఇరువదియేడు కథలు. ఈ యిరువదియేడు కథలలో నేను శ్రమపడి, ఆంధ్రదేశమున పర్యటించి, మఱి పదునేడు కథలను సంపాదింపగలిగితిని. వీనిలో ఏడు కథలలో కవుల నామము లున్నవి. మిగిలిన పది కథలలో లేవు. నాకు లభించిన యీ వీరగాథలనుబట్టి శ్రీనాథుడు, గంగుల పినయెల్లయలతోబాటు మఱి యేడ్వురు క్రొత్తకవులు వెలుగులోనికి వచ్చిరి. వీరినిగూర్చి వివరింతును.

1. వడరుప మద్దులేటికవి :

ఈ కవి కాటమరాజు కథాచక్రమందలి ప్రథమ వీరగాథయగు 'వలురాజుకథ'ను ద్విపదగా రచించెను. ఇతని తాతపేరు (పితామహుడు) 'మూలయ్య'; తండ్రి 'పెద్దనార్యుడు'. ఇతని యింటిపేరు 'ఘనవర్తి'యో లేక 'వడరుప'యో కావలెను. లేదా 'వడరుప' యనునది గోత్రనామమైన కావలెను. వలురాజు కథాంతమున తన్నుగూర్చి యిట్లు చెప్పుకొనెను.

'అనుమతి 'వడరు'పాన్వయుడైన
ఘనవర్తి 'మూలయ్య' కలిత పౌత్రుండు
'పెద్దనార్యుని' కూర్మి ప్రియనందనుండు
'మద్దులేటను' బుద్ధిమంతు 'డొలురాజు'
'చరితను పూర్ణంబు చేయంగ దలచి
యిరువంద రచియించె నవరమంతయును'

ఇందలి 'అన్వయ' శబ్దముచే నీ మద్దులేటి కవి యింటిపేరు 'వడరుప'యే యనియు, 'ఘనవర్తి' యనున దీతని పితామహుడైన 'మూలయ్య'కు విశేషణమనియు నేను భావించుచున్నాను. ఈ తాళపత్ర గ్రంథము నాకు 1966 లో వల్లూరులో లభించినది. (గామాలపాడు గ్రామములో ప్రసిద్ధకవి శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తిగారి సహాయమున 31—8—1966 న సంపాదించితిని.)

2. మల్లయ్య :

ఇతడు 'పంపాద్రి కథ'ను ద్విపదగా రచించెను. ఇతని తండ్రి జంగమయ్య. 'సప్తపెను యదుశాస్త్ర చరితమంతయును' అని చెప్పుకొనిన గంగుల పిన యెల్లయ్యవలెనే యీ మల్లయ్యకూడ యాదవ చరిత్రమంతటిని వ్రాసియుండునని అవతారికనుబట్టి తెలియుచున్నది. ఇతడును (గంగుల పిన) యెల్లయ్యయు నొక్కరు కాదనుటకు, 'మల్లయ్య' యను పేరు యతిస్థానమున ప్రయోగింపబడి యుండుట

గొప్ప నిదర్శనము. ఇతడు తన యవతారికలో 'తెఱచీర భక్తుల'ను స్మరించినాడు. తెరచీర భక్తులనగా కాటమరాజు కథలు పాడు 'మద్దుల గొల్లలు'.

ఈ మల్లయ్య రచించిన పంపాద్రికథయొక్క తాళపత్ర గ్రంథము నాకు నెల్లూరుజిల్లా (ఇప్పుడు ఒంగోలుజిల్లా కాబోలు) దర్శి తాలూకా 'గంగదొనకొండ' గ్రామములో 12—9—1966వ తేదీని లభించినది (పూజారి సుబ్బయ్య యను పూజగొల్ల దీనిని నాకొసంగినాడు). ఈ మల్లయ్యకవి యాదవచరిత్రను వ్రాయుటయేకాక, పాడి, ప్రజలను మెప్పించి, గుఱ్ఱములు గొడుగులు అరిగెలు ధనధాన్య వస్తువులు బహుమానముగా బడసెనట! చూడుడు:

'రయమొప్ప యాదవరాజుల చరిత
చెప్పెను వినరయ్య జనులార
నాకలిగి తన కీర్తి వహించి మించి
ప్రాకటముగ జెప్పి ప్రజల మెప్పించి
గుఱ్ఱము గొడుగులు గురుతైన అరిగెలు
మేరువడి త్యాగములు మెండుగాన ద
ధనధాన్యవస్తువులు తనర అమృతను
అనుదినము తన యింట అతిథుష్టిగాను
వేమారుకీర్తుల వెలసిన ఘనుడు
'జంగమయ్య సుతుండు' జనులు మెచ్చంగ
వంగతిగ కవిత్వపారస్య మెరిగి
దిట్టముగ యాదవధీరుల చరిత
గట్టిగా జెప్పెను కణగిపభవారు
ఆటంకారముగ నవరస అలంకారమునగూర్చి
మాటలు రత్నాలుగాను 'మల్లయ్య' యనువాడు
సొంపుతో వినరయ్య చోద్యవేద్యముగ
పంపాద్రికథ చెప్పెను ప్రఖ్యాతిగాను'

పల్నాటి వీరకథాచక్రమందలి 'కోడిపోరు'కథను రచించిన మల్లయ్యయు నితడును ఒక్కరో లేక భిన్నులో తెలియకున్నది. కోడిపోరు రచించిన మల్లయ్య తన తండ్రిపేరు చెప్పుకొనలేదు. కృష్ణా మండలమున నాకు వేఱొక 'పంపాద్రికథ' లభించినదికాని అందు కవిపేరులేదు. అది మల్లయ్య రచనకంటె భిన్నమైనది.

3. కనకబండి ఘట్టయ్య:

ఈ కవి రచించిన 'ఆవులపోలురాజుకథ' తాళపత్రగ్రంథము నాకు నెల్లూరు మండలమున (ప్రకృతము ఒంగోలు మండలము కాబోలు) దర్శితాలూకా గంగవొనకొండ సమీపమునగల 'వీరబాలెము' గ్రామములో 17-9-1966వ లభించినది. ఈ కథావతారికయందు ఇష్టదేవతా ప్రార్థనము తరువాత, కవి తన్నుగూర్చి చెప్పుకొన్నాడు --- ఈ కవి పేరు 'ఘట్టయ్య' అనియు ఇంటిపేరు 'కనకబండి' వారనియు, తండ్రి 'కోండప్ప'యనియు స్వగ్రామము 'కొండపల్లె'యనియు, ఇతనిది 'ఉన్నెసిరుల గోత్ర'మనియు కథావతారికనుబట్టి స్పష్టమగుచున్నది.

'వింతగా చౌషష్టి విద్యలకు నెలవు
పంతమున ఆ 'కొండపల్లె' లోపలను
కొనసాగు 'కన్నెశిర్ల గోత్ర' పావనుండు
గొనకొని 'కనకబండి కొండప్ప' సుతుడు
నెటింప 'ఘట్టయ్య' నేర్చిన కొలది
తేటతెల్లముగాను తెల్పి చెప్పెదను
....
'ఆవుల పోలురాజుకథ' ఆలకించి వినుడ'

ఈ కనకబండి ఘట్టయ్య యనుకవి పోలురాజు కథనేకాక, 'కంసుడు కథ' లేక 'విష్ణు భాగవతము' అనుకథనుగూడ రచించెను. దీని తాళపత్రగ్రంథముకూడ నాకు లభించినది. ఈ కంసుని కథావతారికయందును పై వివరములే యున్నవి.

4. పినయెల్లన:

ఈ కవి రచించిన 'కతియావుల రాజు కథ' నాకు లభించినది. ఇతనిది కొమనాల గోత్రము, యాదవకులము. తల్లి చెన్నమాంబ. ఇతడును, మదరాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమువారు ప్రకటించిన శ్రీ వేటూరివారిచే పరిష్కృతమైన 'కాటమరాజు కథ'ను రచించిన గంగుల పినయెల్లయ్యయు నొక్కరే కావచ్చును. ఆతనిదికూడ కొమనాల గోత్రమే. కాని యీ కతియావుల రాజు కథలో పినయెల్లన యింటి పేరుకాని, తండ్రిపేరుకాని

కానవచ్చుట లేదు. ఆ భాగము శిథిలమై పోయినది. సోదరుని పేరు మాత్రము 'సరువధీమణి' అని యున్నది. కాటమరాజు కథా రచయితయగు గంగుల పినయెల్లయ్య సోదరుడు 'సర్వన' అని తెలియు చున్నది. కాటమరాజు కథా రచయిత తన తల్లి పేరు చెప్పుకొనలేదు. కాని యీ కఱియావుల రాజు కథా రచయిత తన తల్లి 'చెన్నమాంబ'యని చెప్పుకొన్నాడు.

నాకు లభించిన కఱియావులరాజుకథ—తాళ పత్రగ్రంథము. దీనిని పల్నాడులో గామాలపాడు గ్రామమున 31—8-1966 న సంపాదించితిని. దమ్మాలపాటి లింగప్పయను యాదవుడు దీని వ్రాసంగి నాడు. ఈ గ్రంథమున అవతారికలో ఇష్టదేవతా ప్రార్థనము తరువాత కవినిగూర్చి యిట్లున్నది:

'కొమనాల గోత్రుండు' గుణవిశాలుండు
కొమరొప్ప యాదవ కులవంశ (ఘను)డు
ఆతని కు(లసతియ)గు 'చెన్నమాంబ'
అంగన చెన్నమాంబకు వరసుతుండైన
ధీరుడైన 'సరుసధీమణి' సౌమిత్ర
ఆరూఢి 'పినయెల్లన' అతి(మోద)మునను
కఱియావులరాజును ఘనతతో తలచి
రంగుగ కఱియావులరాజు చరిత్ర
సంగతి చెప్పెను శ్రవణానందముగాను' (ఆకు —1)

ఇందు తండ్రిపేరు, ఇంటిపేరు లేకున్నను, కొమనాలగోత్రము, సోదరుడు సర్వన పేర్కొనబడు టచే నితడు కాటమరాజుకథ (ఎఱ్ఱగడ్డపాటి పోట్లా ట)ను రచించిన గంగులపినయెల్లయ అనియే తలప వలసియున్నది. ఇతడు యాదవకులమువాడనియు, ఆతని తల్లి చెన్నమ్మయనియు నాకు లభించిన తాళ పత్రప్రతినిబట్టి తెలియవచ్చు నధికాంశములు. ఈ గంగులపినయెల్లయ లేక పినయెల్లన యదుశాస్త్ర చరిత్రమంతటిని (కాటమరాజు కథాచక్రమంతయు) రచించెనని శ్రీ నేలటూరివారు పరిష్కరించిన 'కాటమ రాజు కథ'లో నున్నది. నాకు లభించిన కఱియావుల రాజుకథ దీనికి బలమును చేకూర్చుచున్నది.

5. కట్టెబోయిన మారయ్యకవి :

ఇతడు యాదవ గాథాచక్రమున 'కాటమ రాజుకు పట్నంకట్టిన కథ'ను రచించెను. దీనికి 'కాటమరాజు పట్టాభిషేక'మను నామాంతరము గాథాకారులలో వ్యవహారమున నున్నది. 'పట్టము' అను శబ్దమును జానపదులు 'పట్నం'గా నుచ్చరించు చున్నారు. ఈ తాళపత్రగ్రంథమును నేను 1964 వ సంవత్సరములో కృష్ణామండలమున గుడివాడతాలూకా కుచ్చికాయలపూడిగ్రామములో కొడాలి సీతారామాంజ నేయులు అనుకొమ్మలనొకడ సంపాదించితిని. ఈ కథకు ముందు పెద్ద అవతారిక యున్నది. మొదటి మూడు పత్రములలోను కవియున్న పట్టణ వర్ణ నము, కవి వంశాదికము, కృతిపతి వంశాదికము, వివరముగా వర్ణింపబడినది. కవి తన ఊరుపేరును చెప్పలేదు. కాని, ప్రబంధధోరణిలో పురవర్ణన చేసి నాడు. కృతిభర్త కవికి బావగారు. ఆతనిపేరు 'జంగమయ్య'. ఇంటిపేరు గంగాళపువారు. ఇతడు కొమనాలగోత్రుడని చెప్పబడినది. ఇందు చేయబడిన కృతిభర్త వంశక్రమవర్ణన నిట్లు చూపవచ్చును:

గంగాళపు రామకృష్ణ (భార్య : పెద్దమ్మ)
|
రాఘవయ్య
(మొదటి భార్య 'లక్ష్మితిమ్మ'యందు) — (రెండవ భార్య 'ఎఱ్ఱమ్మ'యందు)

- (మొదటి భార్య 'లక్ష్మితిమ్మ'యందు): అయ్యన, జంగమయ్య
- (రెండవ భార్య 'ఎఱ్ఱమ్మ'యందు): గురవయ్య

జంగమయ్య — భార్య : గంగమ్మ
(ఇతడే కృతిభర్త. ఈ గంగమ్మ సోదరుడే కవి మారయ్య)

కవియగు కొట్టెబోయిన మారయ్య కృతి భర్తయగు జంగమయ్య భార్య గంగమ్మకు సోదరుడు. అనగా నీ కవి తన బావగారి పేర వీరగాథ నంకితము చేసెను.

'ఎసగ నా 'గంగ' ప్రాణేశు పేర
వరుస 'గంగాళపు వంశజాని' పేర
గురుతైన 'కొమనాల గోత్రుని' పేర
ధరనెంచ 'రాఘవయ్య' తనయుని పేర
చప్పన్న దేశాది 'జంగము' పేర
చెప్పనిట్లన్న బలి ప్రవిద్ధంబుగాను
కాటమరాజుకు పట్నము గట్టిన కథయు'
(—ఆకు 3)

అవతారికనుబట్టి యీ కవి యింటిపేరు కట్టెబోయిన వారనియు, ఇతడు సకల యాదవ కథలను చదివి చెప్పగల వాడనియు తెలియుచున్నది. కృతిభర్తయగు జంగమయ్య కవిని పిలిచి యిట్లు చెప్పినట్లుగా మారయ్య తన కథావతారికలో వ్రాసి కొనినాడు.

''తన బావమరదిని 'మారయ్యను' తప్పకచూచి
'యినయంగ 'కట్టెబోయ్నువారింట'
మతిగలవాడవు మరి చెప్ప జదువ
నతినేర్పులయందు నమర మారయ్యవు
'సకలయాదవకథలు' చదివి చెప్పితివి
వకటి నిన్నటిగాదు వనరగావించు
ఆవులను కల్యాణమందుండి
యేవిధంబున దెచ్చిరి యెవ్వరింట పెండ్లి
యేవిధంబున జేసిరి యెల్లయాదవులు
సుముఖుండై తొల్లికృష్ణుండు దెచ్చినట్టె
తముక మెక్కించిరే తగవున నతని
మట్టసంబుగ ఆవులమందలకెల్ల
పట్నంబుగట్టిరే పగిది చేపట్టి
ఆ కథ నాపేర అంకితముగాను
చేకొని చక్కంగ చెప్పి అంపుమనుచు''
(—ఆకు: 3)

ఇందుగల 'సకలయాదవకథలు' అను ప్రయోగముచే ఈ కవికాలమునాటికే కాటమరాజునకు సంబంధించి అనేకవీరగాథలున్నవనియు, కాటమరాజు కథయనునదొక్క వీరగాథమాత్రమే కాదనియు, అదియొక సుదీర్ఘకథాచక్రమనియు స్పష్టమగు చున్నది. పంపాద్రికథను రచించిన పుల్లయ్య తాను జంగమయ్య పుత్రుడనని చెప్పుకొన్నాడు. ఆ జంగమయ్యయు, కాటమరాజు పట్టాభిషేకము నంకితము పొందిన ఈ జంగమయ్యయు నొక్కరేమో తెలియదు.

6. మంగళపుతి వెంకటాద్రి :

ఈ కవి 'పాపనూకకథ'ను రచించెను. ఈ వీరగాథకు సంబంధించిన మూడు తాళపత్రగ్రంథములు నాకు లభించినవి. 19—7—1966 న చిత్తూరుజిల్లా చంద్రగిరితాలూకా పెడకంటిపల్లెలో లభించిన ప్రతిలో అవతారిక యిట్లున్నది:

''కదిరిమంగలము చినబసవయ్య' సుతుడు
'శేషవాల్మీకుడు' చెలువొప్ప 'వెంకటాద్రి'
చెప్పిన కథయు
ప్రజలకు ఇంపుగాను 'పాపనూకకథయు'
చెప్పెను వినవయ్య చెవులపండువగాను''

దీనినిబట్టి యీ కవిపేరు 'వెంకటాద్రి' యనియు, 'శేషవాల్మీకుడు' అనునది యితని బిరుదమో లేక నామాంతరమోయనియు, తండ్రిపేరు 'చినబసవయ్య'యనియు, ఇంటిపేరు 'మంగలము'వారనియు, నివాసము 'కదిరి'యనియు గ్రహింపవచ్చును.

5—9—1964 న కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, కుచ్చికాయలపూడిగ్రామములో లభించిన ప్రతిలో అవతారిక యిట్లున్నది:

'భావింపంగ 'మంగళపురి' 'చిన్ని
బస్వన్న' పుత్రుండు ప్రఖ్యాతిగాను
'శేషువాల్మీకుండు' చెలువొప్ప 'వెంకటి'
ప్రజలకు ఇంపుగాను 'పాపనూకకథయు'
రాజితంబుగా ఈ కథ రయమునగూర్చి
గొనకొనిచెప్పెను కులము వినరయ్య'

ఇందు 'కదిరి'పేరులేదు; ఇంటిపేరు 'మంగళపురి'యని కలదు. తండ్రిపేరు పెడకంటిపల్లె

ప్రతిలో 'చినబసవయ్య' అనియుండగా, దీనిలో 'చిన్ని బసవన్న'అని యున్నది. (రెండింటికిని పెద్దభేదము లేదు.) కవిపేరు 'వెంకటి'అని యున్నది: 'శేషవాల్మీకుడు'అను బిరుదమును చెప్పబడినది. కుచ్చికాయలపూడిగ్రామములోనే లభించిన వేఱొక తాళపత్రప్రతిలో అక్షరములన్నియును తప్పులుగా నున్నవి. అందు 'కదిరి' నామమున్నది. కవిపేరు 'వెంకట'అని కలదు.

మొత్తముమీద పైన తెల్పిన మూడు ప్రతులకును రచయిత ఒక్కడే యనుట స్పష్టము. అతని పేరు 'వెంకటాద్రి' లేక 'వెంకటి'. అతని తండ్రి 'చినబసవయ్య' లేక 'చిన్నిబసవన్న'. అతని యింటి పేరు 'మంగళపురి'కాని 'మంగళము'కాని యగును. ఇతడు కదిరిగ్రామమునకు చెందినవాడని యూహింపవచ్చును. లేదా మొత్తము 'కదిరి మంగళము' అనునదియే యితని యింటిపేరును గ్రామముపేరును కావచ్చును.

7. పల్యా(పల్లె) చెన్నయ్య:

ఇతడు 'అగుమంచికథ'ను రచించిన జానపద కవి. తాను 'అరుంధతి పుట్టింటి ఘనుడ'నని చెప్పుకున్నాడు. ఇతడు పూర్వకవిస్తుతిలో కాళిదాసుని పేర్కొనుటచే మంచిసంస్కారముగల కవియని చెప్పవచ్చును. ఈతని రసవంతమగు కవిత్వమును దీనికి పోషకముగా నున్నది. ఈ చెన్నయ్యకవి కాళిదాసుని స్తుతించినతరువాత బాణావీరుల ప్రజ్ఞను కొనియాడినాడు. ఇష్టదేవతాప్రార్థన, పూర్వకవిస్తుతి తరువాత తన్నుగూర్చి యిట్లు వ్రాసికొన్నాడు:

'వాలాయముగ నందరిని వాక్కున దలచి
సంధి లక్షణమెరిగి చెప్పనేర్చిన యట్లు
ముందుగా సంభువులు ముద............
......(శిథిలము)......ఘనత విలసిల్లు
చెలగి జరుగున 'పల్యాచెన్నయ్యను'వాడు
పుడమి 'అరుంధతికి పుట్టింట ఘనుడు'
కడువేగ అగుమంచికథ...(శిథిలము)...
శ్రీకరంబుగ చెప్పెద చెలగి యాదవులకథ
ప్రాకటంబుగ వినుడా ప్రఖ్యాతిగాను'

ఈ 'అగుమంచికథ' తాళపత్ర గ్రంథము చిత్తూరుజిల్లా, చంద్రగిరితాలూకా, పెడకంటిపల్లె గ్రామములో 1—3—1966 న లభించినది. తోడేటి సుబ్రహ్మణ్యము అనుభట్టువాడు (కొమ్ములవాడు) ఇచ్చినాడు. ఈ గ్రంథలేఖకుడు తోడేటి పాపయ్య కుమారుడు కోటయ్యయనియు, ఇతడీ వ్రాతను 1891 లో చేసెననియు గ్రంథాంతమున నున్నది. ఈ లేఖకుడు నాకీ గ్రంథము నిచ్చిన సుబ్రహ్మణ్యము వంశములోనివాడేయని ఆ గ్రామ వృద్ధులు నాకు చెప్పిరి. ఈ లేఖకునకు 'పల్లె'అను శబ్దమును 'పల్యా'అని వ్రాయుఅలవాటు కలదు. గ్రంథాంతమున 'పెడకంటిపల్లెగ్రామ'మని వ్రాయుటకుబదులు 'పెడకంటిపల్యాగ్రామం'అని వ్రాసినాడు. దీనినిబట్టి యితడు వ్రాసిన 'పల్యాచెన్నయ్య'అను కవినామము నిజమునకు 'పల్లె చెన్నయ్య'అని గ్రహింపవలసి యున్నది.

'చెలగి జరుగున పల్యాచెన్నయ్యనువాడు' అను పాదములో 'జరుగున'అను శబ్దమున కర్థము కుదురుటలేదు. ఇదికూడ కవి యింటిపేరులోని భాగమేమో! అగుచో కవి పూర్తిపేరు 'జరుగు(న)పల్లె చెన్నయ్య' కావచ్చును. నెల్లూరుజిల్లా, గూడూరు తాలూకాలో 'జరుగుపల్లె' (జరుగుమిల్లి) గ్రామమున్నది. ఈ గ్రామనామమును గృహనామముగా కలవారున్నారు.

డా. వేటూరి ఆనందమూర్తిగారు 'పరిశోధన' సంచికలలో ప్రకటించిన అగుమంచికథయు, నాకు లభించిన తాళపత్రగ్రంథమును నొక్కటే. కాని ఆనందమూర్తిగారి గ్రంథమున మొదట అవతారికతోబాటు కథాభాగముకూడ చాల లోపించినది. (చూ. పరిశోధన, 1955, సంచికలు 5, 6, 7). నా తాళపత్రగ్రంథములో మొదటి యేడు పత్రములలో నున్న కథాభాగము వారు ప్రకటించినదానిలోలేదు. అనగా సుమారు 500 పాదములు డా. ఆనందమూర్తి

గారి గ్రంథములో లోపించినవి. అందుచే వారు కవి నామమును నిర్ణయింపలేకపోయిరి.

ఇట్లు నాకు లభించిన తాళపత్రగ్రంథములనుబట్టి కాటమరాజకథా క్రమములోని వివిధగాథలను రచించిన యేడ్వురు నూతనజానపదకవిపుంగవులు తెలియవచ్చుచున్నారు. నేను చెప్పిన 'పినయెల్లనయ్యు, సదరాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖితపుస్తకభాండాగారమువారు ప్రకటించిన 'కాటమరాజుకథ'నుబట్టి తెలియుచున్న 'గంగుల పినయెల్లయ'యు నొక్కరే యగుచో—అర్వురు నూతనకవులు నా పరిశోధనము వలన వెలుగునకు వచ్చిరని చెప్పవచ్చును. వారుప (?) మద్దులేటికవి, మల్లయ్య, కనకబండి ఘట్టయ్య, కట్టెబోయిన మాచయ్యకవి, మంగళపురి వెంకటాద్రి, పల్లె చెన్నయ్య (జరుగుపల్లె చెన్నయ్య)— ఈ యార్వురును ఆంధ్రసాహిత్యచరిత్రకు నూతనముగా చేర్చదగిన సహజకవిశేఖరులు !!

అనుబంధము

నాకు లభించిన తాళపత్ర గ్రంథముల వివరములు!

1. 'వలరాజుకథ' లేక

'ఆవుల వలరాజు కథ'

గుంటూరుజిల్లా పల్నాడు తాలూకా, గామాలపాడు గ్రామములో 1966 ఆగస్టు 31 వ తేదీని లభించిన తాళపత్ర గ్రంథము. మిత్రులు శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తిగారి సహాయమున దమ్మాలపాటి లింగప్ప అను యాదవుని దగ్గర తీసికొంటిని. ఇందు శైథిల్యము కలదు. వ్రాత తప్పులు హెచ్చు. ఆకు పొడవు=15 అంగుళములు, వెడల్పు 1.6''. మొత్తము 45 ఆకులున్నవి. ఒక్కొక్క పుటలో 6 పంక్తులున్నవి. ద్విపదచ్ఛందము సమగ్రము. ప్రారంభము:

'శ్రీశ్రీ రమాధీశుడా! శ్రీవారిజాక్ష!
పారిజాతహరణ! భక్తజనపోష!
రవికోటిసంకాశ! రాధావిలాస!
భవరోగ సంహారు పన్నగహారు
పదిలముగ మదిమంచి ప్రస్తుతినెంచి
మదనసంహారుని మగువ పార్వతిని
కొనియాడి వెన్నుని కొడుకు పరమేష్ఠి
ఘనశక్తిచే నుమాకాంత శాంభవిని
నియమంబుతో మ్రొక్కి విలచి తరువాత
కాయజా శత్రునకు గోగినయట్టి
విద్దెలకు మొదలైన విఘ్నవాయకుని
ప్రొద్దు ప్రొద్దున లేచి పొగడి యటు వెనుక
ఇలవేల్పు యాదవుల యిష్టదైవంబు
కలకంఠి దొనకొండ గంగను దలచి
మంజుల మృదుపాణి మగువ పూబోణి
కంబాలు రాజరాణి గంగాభవాని
హృదయ పద్మమునందు నుంచి సేవించి
బుధులను కొనియాడి పూర్వ సత్కవుల
నిరతంబు సేవించి యిటుమీద నింక
వరుసతో ఆవుల వలురాజు చరిత
ఘనచర్య ఘనవిద్యాకార్య లక్షణము
వినరయ్య జనులార విన్నవించెదము.'

అంత్యము :

'అల్లుడు పల్లెకొండయ్య కృపచేత
వల్లవుల పెద్దభూవల్లభు డింత
సొంపుగా సింహాద్రి సిరిదితమ్ములతో
సంహాద్రి యెలమంచి పాలింపుచుండె
అని మాధవునిపేర సహితల్పుపేర
మునివిధేయునిపేర మురవైరిపేర
భక్తవత్సలుపేర పరమాత్ముపేర
కరిరక్షకునిపేర కమలాక్షుపేర
వరమద్దులేటి నివాసునిపేర
అనుమతి వడరుపాన్వయుడైన
ఘనవర్తిమూలయ్య కలితపౌత్రుండు
పెద్దనార్యుని కూర్మి ప్రియనందనుండు
మద్దులేటను బుద్ధిమంతు డొలురాజు
చరితను పూర్ణంబు చేయంగదలచి
యిరువంద రచియించె ఇవరమంతయును'

2. (a) 'పంపాద్రికథ'

(కుచ్చికాయలపూడి ప్రతి)

కృష్ణాజిల్లా, గుడివాడతాలూకా, కుచ్చికాయలపూడి గ్రామములో 5—1—1964 న, కొడాలి సీతారామాంజనేయులు అను కొమ్ములవాని కడ లభించిన తాళపత్ర గ్రంథము. ఇందు శైథిల్య గ్రంథపాతములు లేవు. ఒక్కొక్క పత్రము పొడవు 14.2"; వెడల్పు 1.2". మొత్తము 89 పత్రములున్నవి. ఒక్కొక్క పుటలో 6 పంక్తులున్నవి. సమగ్రము. కాని కవిపేరు లేదు. ఇందు 1 నుండి 31 వఱకునుగల ఆకులలో పంపాద్రికథయు, 32 నుండి 89 వఱకును గల ఆకులలో పెద్దిరాజుకథయు వర్ణింపబడినవి.

ప్రారంభము :

> 'సిరిదేవి సిరివి మతిలోన శ్రీమించు విందు
> వాక్కున శారదాంబను వందనము ఒడిగి
> విఘ్నేశ్వరుని గణపతి(ని) వినయాన తలచి
> కరకంఠుని ధనముకొండగంగను తలచి
> ఆ యెనక రక్షణి ఒదిన మునదల
> సభలోన ముందుగ సరస్వతిని దలచి
> పూర్వమున కణకరేపల్లెలో వుండిన దుర్గను
> పంపాద్రిలో భగవతి పైడమ్మను దలచి
> సొంపుతో యాదవ సుజనుల కథయు
> ఇంపుతో జనులకు ఇదరు మీరు
> పంపాద్రి కథయు తరముగ వినుడి'

అంత్యము: —

> 'ఆ మాటకు పల్లికొండ అపుడిట్లనగనియె
> 'మామరో వోమామ పెద్దిరాజ
> పరగంగ యలమంచిలో సన్న పట్టముగట్టిన వెనుక
> పరిణెనాన పదకొండు ఏండ్లు ఏలితివి
> అంతట వొకనాడు ఆనల వొలురాజు
> కరణాల కొరకునై కపుకండెలలోను
> పోరాడి చెరలు పోకుండ విప్పించె
> పారి కల్లుగవ వలురాజు చెల్లిన వెనుక
> పదివేండ్లు వెనుకను పంపాద్రికి వొస్తిమి
> యేదేండ్లు పంపాద్రి యేలితిరి మీరు.'

(b) 'పంపాద్రి కథ'

(దొనకొండ ప్రతి)

నెల్లూరుజిల్లా, దర్శి తాలూకా, గంగదొనకొండ గ్రామమున, 1966 సెప్టెంబరు 12 వ తేదిని, పూజారి సుబ్బయ్య (70) అను వృద్ధ యాదవగాథాకారుని యొద్ద లభించిన తాళపత్ర గ్రంథము. శైథిల్యము లేదు. వ్రాత స్పష్టముగా నున్నది. కుచ్చికాయలపూడి ప్రతికంటె రచన భిన్నమైంది. అసమగ్రము అయినను అవతారికలో కవిపేరు 'మల్లయ్య'యని స్పష్టముగానున్నది. మొత్తము పత్రములు = 48, కొలతలు = 14 8" × 1 4". ఒక్కొక్క పుటలో 6 పంక్తులున్నవి.

ప్రారంభము :

> '(శ్రీ) సిలకంఠుని చిత్తానదలచి
> దీనమందారు విష్ణుదేవునకు మ్రొక్కి
> వారిజ గర్భునకు వందనముచేసి
> శారదను కొనియాడి శివుని ప్రార్థించి
> కూర్మితో పార్వతి పెద్దకుమారుడైన
> చేరి విఘ్నేశునకు సంతత మొనర్చి
> యేలమితో తన యింటి యిలవేల్పులయిన
> కలకంఠి తంగిరేల గంగనువేడి
> కాళిదాసు మొదలైన కవివరులకు నెల్ల
> తాల్మితో సాష్టాంగ దండంబు లిడి
> అఖిలదేవతలకు ఆదికవులకు నెల్ల
> మ్రొక్కి ప్రార్థనచేసి ముందుగా దలచి
> దీపింప యాదవ నృపతుల చరిత
> పరగంగ పెరపిర భక్తులకు మ్రొక్కి
> సరవితో వ్రాయ చెప్ప చదువగలయట్టి
> దయమొప్ప యాదవరాజుల చరిత
> చెప్పేను వినరయ్య జనులార మీరు'

అంత్యము :

> 'వేయి నేనూరు దివటీలు పిణెభోగాలు
> కైవారము చుట్టు గానపాటలవారు
> గిడిగిళ్లు భేరీలు పెద్దఢమామీలు

ఆరూఢి మోవంగ అష్టభోగముల
తిరుమందులు వల్లవులు తేజీల నెక్కిరి
బరాబరులు సేయుచు బారుల ముందర'

3. 'పోలురాజుకథ' :

నెల్లూరుజిల్లా, దర్శితాలూకా 'ఎర్రబాలెము' గ్రామములో 17-9-1966 న మోడి మునలయ్య యను పూజగొల్లనికడ లభించిన తాళపత్రగ్రంథము. సమగ్రము. శైథిల్యగంధ్రసితములు లేవు. ఆకు పొడవు = 12.3" వెడల్పు 1.1". మొత్తము ఆకులు = 69. ఒక్కొక్కపుటలో 6, 7 పంక్తులున్నవి. అవతారికలో కవి పేరు 'కనకబండి ఘట్టయ్య' యని కలదు.

ప్రారంభము :

'శ్రీ లంబోదరు శ్రీకంఠతనయు
పాలంబు వెడ నా పాలిటివేల్పు
శివా భవాని సుతుని చిత్తాన దలచి
దేవాసుర మహాదేవునికి మ్రొక్కి
నాగయజ్ఞోపుని నాగభూషణుని
నాగబంధుని బొజ్జ నమరినవాని
శశిధర పుత్రుండు శశివర్ణు దలచి
ప్రసన్నునికి మ్రొక్కి ప్రస్తుతిచేసి'

అంత్యము :

'కలియుగాన వుప్పు నీరు కలిగినన్నాళ్ళు
ధర్మయాదవకథ ధరవెలయ సేతు
అని భస్మాంగము ధరియించి హరుడు వేంచేశ
శిలామంతులు పోలురాజునుచేరి దీవించిరి
శంఖుతీర్థము తులసిప్రసాద మిచ్చిరి
పొంకముగ ప్రాణనీరుపోశ పల్లికొండ
జీవనస్తుడాయ పోలురాజు శివుని కొలువాయ
పన్నుగ పోలురాజు ప్రవేశమాయను
అంతట పల్లికొండ ఆవుల దోలించుకోని
అనోవేగ పల్లికొండ అర్ధనీడు చరెను'

ఈ పోలురాజుకథకు మఱి రెండు తాళపత్ర గ్రంథములుకూడ లభించినవి. ఒకటి కనిగిరితాలూకా లోని కంకణంపాడులో తాళ్ళూరికోటయ్యఅను కొమ్ముల వానినుండి తీసికొనిన ప్రతి (16-9-1966). కొలతలు : 13.6" × 1.5". పత్రములు = 63, పుటలో పంక్తులు = 7. ఇందు ఆద్యంతములు సరిగా లేవు. అవతారికలేదు. వ్రాతనిండుగా తప్పులున్నవి. చివరలో ఒకటిరెండు పాదములు లోపించినట్లున్నది. సర్వసమగ్రము కాకపోయినను సమగ్రమే. పైన తెల్పిన ఎర్రబాలెము ప్రతికన్నను భిన్నమైనదిగా కన్పట్టుచున్నది. ఇది వేఱొక కవిరచన కావచ్చును. కాని దురదృష్టవశమున ఆ కవిపేరు కానవచ్చుట లేదు. ఇది నాలుగు కాండలు (చాటువలు)గానున్న పెద్దకథ.

పోలురాజుకథకు సంబంధించిన మఱియొక తాళపత్రగ్రంథము కృష్ణాజిల్లా, గుడివాడతాలూకా కచ్చికాయలపూడిగ్రామములో 5-9-1964 న కొండలి సీతారామాంజనేయులు అనుకొమ్ములవానికడ లభించినది. ఇది బహుదుష్టముగా దురవగాహముగా నున్నది. పత్రసంఖ్య గుర్తింపబడలేదు. ఆద్యంతములు లేవు.

4. కఱియావులరాజు కథ :

గుంటూరుజిల్లా, పల్నాడుతాలూకా, గామాల పాడుగ్రామములో దమ్మాలపాటి వెంకన్న కుమారుడు లింగప్పయను యాదవునికడ 31-8-1966 న లభించిన తాళపత్రగ్రంథము. శైథిల్యము కలదు. అయినను సమగ్రము. ఆకు కొలతలు = 12.6" × 1.2". మొత్తము ఆకులు = 34. పుటలో పంక్తులు = 6. ఛందస్సు మంజరీ ద్విపద. అయినను అచ్చటచ్చట శిథిలమై ఖండగతి తోచుచున్నది. అందుచే మధ్యమధ్య హరిహరీపదముల జంపెవరుసయా యను అనుమానము వచ్చును. ఇందలి యితి వృత్తము ప్రత్యేకమైనది. దీనిని 'ముగ్గురు మాష్టీల కథ' అందురు. దీని కవి పినయెల్లన.

ప్రారంభము :

'శ్రీసతి రమణ ఆశ్రితపారిజాత
కేశవనాథునికి ఎలమితో మ్రొక్కి

వారిజగర్భునికి వందనముచేసి
శారదను కొనియాడి చెయ్యెత్తి మ్రొక్కి
......మి గణపతిని నయమొప్పదలచి
గరిమతో యలమంచి గంగకు మ్రొక్కి'

అంత్యము :

'భూతలంబున చిటిగోపు భూమితా గొనెను
శకరుల పిలిపించి త్రవ్వించె గుండము
సంధనపు మాకు..................
పొందుగా అగ్నిలో పురుషుని ధరిగొల్పె
పుణ్యపు నీరాడి భూసురులు పతులకు
వస్త్రాలు మాడలు వయ్యన నిచ్చె
జనులెల్లచూడ తన విభునిపై వారిగె
తరుణి చిటిగోపు'

చిత్తూరుజిల్లా, చంద్రగిరితాలూకా, పెడ కంటిపల్లెగ్రామములో కటియావులరాజుకథకు సంబంధించిన వేఱొక తాళపత్రగ్రంథము లభించినది. తోడేటి సుబ్రహ్మణ్యమను కొమ్ములవాడు 1—3—1966 న నాకిచ్చినాడు. ఇది పై కథకంటె భిన్నమైనది. దీనిని 'ఒంటిమాళ్లనికథ' అందురు. ఇందలి ఛందస్సు ఖండగతిలో నున్నది. ఆ ఖండగతికూడ బింకముగాలేదు. ఇందు అవతారికా భాగమును, కథాప్రారంభమున కొంతభాగమును లేవు. తక్కినదంతయును సమగ్రముగనే యున్నది. అందుచే దీని కవి యెవరో తెలియవచ్చుటలేదు.

5, కాటమరాజుకు పట్నం కట్టినకథ:

5—9—1964 న కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, కుచ్చికాయలపూడిగ్రామములో కొడాలి సీతారామాంజనేయులు అను కొమ్ములవానికడ లభించిన తాళపత్ర గ్రంథము. శైథిల్యగ్రంథపాతములులేని చక్కనిప్రతి. కవి కట్టెబోయిన మారయ్య: 75 పత్రములు. పుటకి ఆఱు పంక్తులు. ఆకు కొలతలు = 13.7"×1.1". సమగ్రము. వ్రాతలో తప్పులు హెచ్చుగా నున్నవి. ఈ కథ జుజ్జవరపు రామయ్య కుమారుడు చింతయ్యచే—శోభకృతునామ సంవతరము ఫాల్గుణ బహుళ షష్ఠి సోమవారమువఱకు వ్రాయబడినది.

ప్రారంభము :

'శ్రీమహాదేముడు శ్రీనాథవుండు
కామిత బలయుండు కమలసంభవుడు
శంకరు మహాలక్ష్మి శారదాదేవి
పంకజ వితడు కుముదబాంధవుండు దాను
మరిగ్రతరష్ట దినపాల్కులు మరియు
నముటు ధయగధ నాయకుండైన
వానికి జంగమను వానికి బ్రోవా
మానితంబుగ నతని మహిమగొనియాడ
అతడున్న పట్నం బతని వమిశంబు —
చతురత వర్ణింతు జగమెల్ల వెరుగంగా.'

అంత్యము :

'విని సకల యాదవులు యివరంబునొంది
వొనర యాదవులు మనుచు వక్కటైయుండె
పొందుగా మరికాలు భూపాలకుండు
మందలకెల్లను శ్రీమంతుడైయుండె
ఆవులమంద పట్నం ఆ రాజుకు అరుళముజేసిరి
ఆ వీరా తమకముమీద అప్పుడు కూర్చుండె.
యీకథ భూమియందు యెల్లకాలంబు
చేకొని తరతరము నిత్యంబులోను
చదివినవారికి చస్త్రాపద్మశ్రీని
తప్పులు వొప్పులు వొనరంగ దిద్దరయ్య
బుద్ధి జనులార !'

6. (a) 'పాపనూకకథ'

(పెదకంటిపల్లెప్రతి) :

చిత్తూరుజిల్లా, చంద్రగిరితాలూకా, 'పెడ కంటిపల్లె'అను గ్రామములో 1966 జూలై 19 వ తేదిని తోడేటి సుబ్రహ్మణ్యము అనుకొమ్ములవానికడ లభించిన తాళపత్ర గ్రంథము. పుటకు అయిదాఱు పంక్తుల చొప్పున 80 పత్రము లున్నవి. ఆకు కొలత = 15"×1.3". కథ సమగ్రముగా గలదు.

వ్రాతదుష్టము. అయినను స్పష్టము. ప్రారంభమున కొంత ప్రాసనియతి కలదు. తరువాతలేదు. కొన్నితావులనుంజరి శిథిలమై ఖండగలిగా మారినది.

ప్రారంభము :

'శ్రీమించు గోపికా శ్రీహరికి మ్రొక్కి
భ్రమరాంబని శివుని ప్రార్థనజేసి
తామరశయనునికి దండంబుబెట్టి
ఉమరంగ శారదాంబకు అంజలిజేసి
చి తలపాటి నూకలాంబను చిత్తానదలచి
సంతోషమున గణపతిని స్వామిని దలచి
యెలమంచిగంగను ఎంతయు దలచి
కలకంఠి దొనకొండగంగను వేడి
కవిరాజ సోమ్రసిష్యఘనులను దలచి
కదిరిమంగలము శినబసవైయ్య సుతుడు
శేషవాల్మీకుడు చెలువప్ప వెంకటాద్రి
చెప్పిరా కదయు
ప్రజలకు యింపుగాను పాపనూక కదయు
చెప్పెను వినవైయ్య చెవులపండువగాను'

అంత్యము :

'పందముల యరణప్ప పయిడివారితల్లి
లందరు పెద్దలు అంత నిట్లనిరి
'అమ్మరో పాపమ్మ అతివేగ నీవు
శలవుయిచ్చిపంపవే చెల్లెలా నీవు'
అప్పలమాటలకు పాప అతివేగ బలికె
'పోరమ్మా పెద్దలార పాలతులందరూను
అడివిపక్షినిగూడి అమ్మలార మీరు
యీల వున్నరమ్మ వేగమే పోరమ్మ'
అతివెలకు శలవుయిచ్చె అలివేణి పాప
పాప శలవుయిచ్చిన పణతులందరు వచ్చిరి
లంగణలు మేడదిగి అతివె లందరు వచ్చిరి
వారివారి యిండ్లకు వయినాన బోయిరి.

(b) పాపనూకకథ

(కుచ్చికాయలపూడి ప్రతులు) :

కృష్ణాజిల్లా, గుడివాడతాలూకా, కుచ్చికాయలపూడిగ్రామములో 5—9—1964 న కొడాలి సోమయ్యయను కొమ్ములవానికడ లభించిన తాళపత్ర గ్రంథము. ఒక్కొక్కపుటలో ఆయిదారు పంక్తుల చొప్పున 62 పత్రము లున్నవి. ఆకు కొలతలు = 13.8" × 1.2". కథ సమగ్రముగనున్నది. వ్రాత మాత్రము దుష్టముగనున్నది. పైన తెల్పిన పెదకంటిపల్లె ప్రతికిని దీనికిని ఏమియును భేదము లేదు.

ఇదే గ్రామమున వేఱొక ప్రతికూడ లభించినది. అందు పుటకో యైదు పంక్తుల చొప్పున 54 కులున్నవి. ఆకు కొలతలు: 15.8" × 1.4" ఇందలి రచన పై రెండింటివి పోలుదేకాని భిన్నమైనదికాదు. వ్రాత మిక్కిలి దుష్టమును అస్పష్టమును.

7. 'అగుమంచి కథ' :

చిత్తూరుజిల్లా, చంద్రగిరి తాలూకా, పెదకంటిపల్లిలో తోడేటి సుబ్రహ్మణ్యము అను కొమ్ములవానికడ 1—3—1966 న లభించిన తాళపత్రగ్రంథము. ఒక్కొక్క పుటలో 7 పంక్తుల చొప్పున 43 అకులున్నవి. కొలతలు-13" × 1.4" ఇందు మొదటి 42 అకులలో 'అగుమంచి కథ' సంపూర్ణముగాను, తరువాత 21 అకులలో 'బొబ్బిలి యుద్ధము' అసంపూర్ణముగాను, దాని తరవాత 6 చిన్నఆకులలో 'బొంగరాలు కథ' అసంపూర్ణముగాను నున్నవి. ఇందు 'అగుమంచి కథా' ప్రారంభమిట్లున్నది.

'శ్రీ కృష్ణదేవుని చింతనదలచి
ఉంచితంబుగ శారదాంబను ఆత్మలోతల్చి
రమణి తోడ్కుత విఘ్నరాజుకు మ్రొక్కి
భ్రమరాంబికను మదిని ప్రార్థనచేసి
శ్రీ గిరిజాధీశు శిరస్సునవున్న
భాగీరథిగంగను ప్రార్థనచేసి
వాణిత భాషించి వెన్నుకు నెక్కి

బాణావీరులం ద్రెగ్గ గొనియాడి
కాళిదాసుభువి కవివరుల కెల్లా
తాల్మితో పాష్టాంగదండంబుబెట్టి
వాలాయముగ నందరిని వాక్కున దలచి ...'

అంత్యము :

'కడసారి కల విను గంగరో నీవు
దొడ్డివెల్లి బనువన్న తురుతువార్తలు గొంచెన్
శంకరుడిక్కడి జయవార్త గొంచన్
రంకెలువేయుచు రామ కలగంటినీవు
ఈ కల జెప్పవే శ్రీరంగా నీవు

కలియుగమున మన మాటలు కథలై ముందర
విలువగలిగి యిది వేదు లుగా కథలకు
ఆవులమంద పరిణామము అందరు చేరినా
దేవా దేవడిక్కడ తెల్లవారి వొచ్చిని'.

ఈ తాళపత్రగ్రంథ లేఖకుడు తోడేటి పాపయ్య కుమారుడు కోటయ్యయని తెలియుచున్నది. ఇతడీ గ్రంథమును 1891 వ సంవత్సరము — నందన సంవత్సరము, ఆవణినెల 5 వ తేదిని వ్రాసినాడట. కాబట్టి ఈ తాళపత్రగ్రంథము 80 సంవత్సరముల క్రిందటిదని నిస్సంశయముగా చెప్పవచ్చును.



కళాతపస్వి

శ్రీ శనగన నరసింహస్వామి

సహజ కర్కశ పాషాణ జాతులందు
మధుర మంగళమూర్తులు మలచినాడ
వోయి! అజ్ఞాతశిల్పి! మా యూహకంద
రానిదైపోయె నీ యశశ్శ్రీ నిరీహ.

వైరుల కృపాణధారకు వన్నె కొంత
తరిగియును గూడ నేఁడు నబ్బురము గొలుపు
గోపురంబులు గుడులు శిల్పాపణములు—
సచ్చరిత్రుల కృషి వృధా చనునె యెపుడు?

నీ కరస్పర్శ రోమాంచ నిర్వృతిగని
మార్దవము జూపి గండాశ్మమండలమ్ము
లేకశిలయందు నొదిగిన యీ శతాంగ
మద్భుత కళావిభూతికి నవధిరేఖ.

రేలు బవలును విశ్రాంతి జోలిమాలి
మొండి బండలకును గూడ గుండె లదికి
ప్రాణములు బోసి దరహాసభంగి నేర్పి
యుర్వి బాసితె? నిష్కామయోగినీవు.

లీల—నులి కేలగొని పెనురాలలోన
శిల్పకృతి వ్రాసి రసరాజ్య సీమలందు
ద్రిప్పజాలితి భావుక దిగ్గజముల
గలద కవిశేఖరుండు నీ కంటె శిల్పి!

జానపద సాహిత్యసంపద-
విసరురాతిపాటలు

శ్రీ ఎస్. గంగప్ప

జానపద సాహిత్యంలో విసరురాతిపాటలకు ఒక ప్రముఖస్థానమే కలదు. సామాన్యంగా ఆనందాన్ని కలిగించడమేగాక శ్రమ నవనవయింపజేయడంగూడ జానపదసాహిత్య ప్రయోజనం. ఇందుకు విసురురాతి పాటలుగూడ ఉదాహరణం కాగలవు. విసురురాతిపాటల గురించి పరామర్శించేప్పుడు నూరారు జానపద గేయాలు—ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోనివి — సేకరించి, వ్యాసాలు ప్రకటించిన డా. తూమాటి దొణప్పగారి కృషిని ప్రశంసించకుండ ఉండలేము. వీరు అనంతపురంమండలంలో ఉరవకొండప్రాంతంలోని విసరురాతిపాటలనుగూర్చి ఉత్తమవ్యాసాన్ని స్రవంతిలో ప్రకటించారు. అందులో వీరు విసరురాతి నిర్మాణం, స్థాపన, ప్రయోజనం, వీనినిగూర్చి విపులంగా చర్చించారు. కన్నులకు గట్టినట్లుగా వర్ణించారు.

నేను అనంతపురంజిల్లా పెనుగొండప్రాంతం లోని కొన్నివిసరురాతిపాటలను సేకరించాను. (సేకరణలో నా మేనల్లుడు ఏ. క్రిష్ణప్ప B. Sc; తోడ్పడ్డాడు) వాటి పరామర్శమే ఈ వ్యాసోద్దేశం. ఇచట విసరురాతిని 'రాగురాయి'అనిగూడ వ్యవహరిస్తారు. ఇందరి పాటకజనుల ముఖ్యాహారధాన్యం రాగులు కావడమే బహుశః ఇందుకు కారణం కావచ్చును. రాగులే ఎక్కువగా విసరి 'సంకటి' చేసుకొని ఆహారంగా గ్రహిస్తారు. రాగులు విసరడం వాళ్ల నిత్యకృత్యాలలో ఒకటి. అందుచేతనే 'రాగురాయి' అనబడుతూందని తలంచవచ్చును.

పాటకజనం పగలల్లా పనిచేసి సాయంత్రం ఇల్లు చేరుకోగానేగాని, భోజనాదికాలు ముగించిగాని తరువాతిరోజులలో వంటకు అవసరమైన పిండిని తయారుచేసుకొంటారు. రాగులు, జొన్నలు మున్నగు వాటిని విసరురాతితో విసరుకొంటూ ఉత్సాహంతో పాటలు పాడుతూ ఉంటారు. ఈ పాటలవల్ల కొంతకు కొంత పనిభారాన్ని మరచిపోతారు. కనుక ఈ విధంగా విసరురాతి పాటలు ఉత్సాహంతో పాడేప్పుడు ఆనందం కలుగడమేగాక శ్రమగూడ తగ్గిపోతుందనడం తథ్యం. విసరురాతిని విసిరేప్పుడు గిర్రుమని శబ్దము ఉత్పన్నమవుతుంది. విసరడానికి కూర్చున్న ఇద్దరు లేక ముగ్గురు స్త్రీలు విసరురాతి శబ్దానికి శ్రుతి కలిపి పాడుతూఉంటారు.

ఈ క్రిందిపాట(పాడినవారు: శ్రీమతి క్రిష్ణమ్మ) పెనుగొండలో వెలసిన యాదవకులదైవం శ్రీకృష్ణుని మీద చెప్పబడినది. భక్తులు భగవంతుని భజింపగా తమ కోర్కెలు ఫలించినట్లైతే తమ భక్తి ప్రపత్తుల్ని ఏ విధంగా తెలుపుకొంటారో ఇలా చెప్పుకొంటున్నారు.

[1]'శుక్కురారమునాడూ చుక్కపుట్టింది.
[2]సుక్కురుతము పెనుగొండా ఓ చిన్నికృష్ణా
ఒచ్చేము పొయ్యేము నీకు మొక్కేము
మొక్కన్ని మొక్కులూ మాకు నిజమైతే
గుడిగెట్టి గుండమింది సి[4]గన మెత్తింతూ
అచ్చమావుల నెయ్యి అలికింతు గుళ్లూ,

1. శుక్రవారము 2. సుకృతము 3. మీద 4. శిఖరము.

[5]ఏదుమావుల నెయ్యి [6]ఏక జగనజోతి
గుడిమెట్లు బంగారి తీగచుట్టింతూ
[7]గుళ్లోకి బంగారి [8]పరక చేయింతూ
అందరీ గుళ్లకీ ఎఱ్ఱమంటీ పూతా
క్రిష్ణయ్య నీ గుడికీ గంధమ్ము పూతా
అందరీ గుళ్లాకీ వేపాకు [9]దెళ్లా
క్రిష్ణయ్య నీ గుడికీ దవణమ్ము దెళ్లా
పందుము వచ్చిపెనుల పానకము వన్యారమూ.'

ఈ గేయంలో మ్రొక్కిన మ్రొక్కులు నిజమైతే గుడి, గుడిమీద గోపురం కట్టించి గుడి అలుకడానికి, దీపారాధనకు ఆవునేయినే ఉపయోగిస్తారట. గుడిమెట్లూ బంగారు తీగ, ఊడ్చేందుకు బంగారు పొరక చేయించి, గంధం పూత పూసి, దవనందళ్లు గట్టించి పానకవన్యారం చేయిస్తారట. ఈ పాట విసరురాతిని విసరడానికి ప్రారంభించే సమయంలో పాడుతారు. విసరురాతిని విసిరేవాళ్లలో పురుషులు ఉన్నప్పటికి స్త్రీల సంఖ్యయే ఎక్కువ. ఈ పాటలు కట్టినవారుగూడ స్త్రీలే కావచ్చును. అంటే జానపద సాహిత్యంలో గేయకవులతోపాటు గేయకవయిత్రులుగూడ కలరని తెలివది.

ఈ క్రిందిపాట (పాడినవారు: శ్రీమతి క్రిష్ణమ్మ) అన్నాచెల్లెండ్ర సంభాషణలో అలిగినవదిన కొన్న వదినమగూర్చి ఆడపడచు అన్నతో విచారిస్తున్నది. అందు వచ్చిన కోడలికి అన్నిఅమరాయని, తత్ఫలితంగా గర్విస్తున్నదన్న సంగతిని వ్యక్తం చేస్తున్నది చెల్లెలు. అన్నభార్యమీద ప్రేమతో చెల్లి ఎన్నిచెప్పినా భార్యకోపం తగ్గించడానికి ఇంకా ఎక్కువ సౌకర్యాలు సమకూర్చి సంభావించవలసిందని చెబుతాడు.

'అన్న : ఇనుపుదే మంచము జనుపుదే నార
ధనముమిందా పండుండే [10]జాణతెవరమ్మా
చెల్లి : అలిగిపండిందన్న అన్నానీ ఆలో
అన్న : సన్నముగ్గలుతెచ్చి చల్లి లేపమ్మా
చెల్లి : చల్లినా లెయ్యదన్నా సావుకారిబిడ్డ,
అన్న : కొబ్బరిగిన్నెలుతెచ్చి కొట్టిలేపమ్మా
చెల్లి : కొట్టినా లెయ్యదన్నా [11]కొడుకుల్లాతల్లి,
అన్న : విసనకఱ్ఱతెచ్చి విసరి లేపమ్మా
చెల్లి : విసిరినా లెయ్యదన్నా ఈశ్వరునిబిడ్డ.
అన్న : పూలగంధాలుతెచ్చి పూసిలేపమ్మా
చెల్లి : పూసినా లెయ్యదన్నా పుణ్యాత్మునిబిడ్డ,
అన్న : [12]ఆకులొక్కలుతెచ్చి అందిలేపమ్మా
చెల్లి : అందినా లెయ్యదన్నా [13]ఆతేకారునిబిడ్డ'.

ఇట్లు వదినకు గర్వకారణం ఆమె షావుకారి బిడ్డ, కొడుకులుగల తల్లి కావడం, అవిచెప్పి ఆమె తండ్రి ఈశ్వరుడని, పుణ్యాత్ముడని, చెప్పింది. అంతేగాక చివర 'ఆతేకారుని' అంటే డబ్బు దస్కంతో పాటు హోదా ఉన్నవాడని అట్టివాని కూతురు గనుక లెక్కచేయదని చెల్లి తెలిపింది. కోడలుగా వచ్చిన ఆమె నిజంగా ధనవంతుని కూతురు కాకపోయినా, అత్తలతోపాటు, ఆడపడుచులు—కొందరే అను కొండి—ఇంటి కోడండ్రను వేపుకొనితినే పద్ధతిలో గూడ, అన్నతో చెల్లెలు ఈ విధంగా వర్ణించి ఉండ వచ్చునని మనం తెలుసుకోవచ్చు.

అత్తా కోడండ్రమధ్య కొట్లాటలు, వాదులాటలు బాగ ప్రసిద్ధమే. కోడలుమీద నేరం మోపడాని కోసం సమయానికై వేచి ఉంటుంది అత్త. వినయ విధేయతలుగల కోడలైతే లోలోపల బాధపడినా సమాధానం ఇవ్వడానికి సాహసించదు. కాని గడుసు గత్తె అయితే అత్తకు తగిన సమాధానం యిస్తుంది. ఈ క్రింది గేయంలో (పాడినవారు శ్రీమతి క్రిష్ణమ్మ) గడుసుదనంగల కోడలికి అత్తకు జరిగిన సంవాదంలో! తగాదా తీర్చడానికి భర్తగూడ ప్రయత్నిస్తాడు— కోడలు తన గొప్పదనాన్ని లేదా చేతగాని తనాన్ని ఇలా చెబుతూంది.

---

5. ఏందుము ఐదుతూములు 6. ఒకే ఒక పెద్దజ్యోతి 7. గుడిలోనికి 8. చీపురుకట్ట 9. దడి-దళ్లు. 10. జాణ. 11. కొడుకులుగల తల్లి. 12. ఆకులు వక్కలు తాంబూలం 13. ఆస్తితోపాటు హోదాకలవాడు.

'రాగుటినరా లేనూ రాయెత్తలేనూ
రాజ్యంబు లేలేటి రాజు బిడ్డాను
వడ్లు దంచలేనూ వా యెత్తాలేనూ
వాకిట్లో కూచోనీ వదురాడేనూ'

ఇలాంటి కోడలికి తన పని చేయాలని తలంచి అత్త యీ విధంగా అంటూంది.

'కోడలా కోడలా కొత్త కోడలా
పచ్చిపాలలోనా మీగడేదమ్మా'

అప్పుడు కోడలందుకొన్నది తన సహజ ధోరణిలో

'అత్తమ్మ నీచేతి [14]అరిడీకన్న
అడవిలో [15]సిరిపొన్న మానైన చాలు
కూచోనే అన్నలకు నీడైనచాలు.'

ఇట్లు అత్తవల్ల అరడిపొంది కోపగించుకున్న సమయంలో భర్త భార్యనుజూచి ఆమె కోపానికి కారణ మేమని అడుగుతాడు.

'పచ్చి పసుపుగొమ్మా, బంగారి బొమ్మా
[16]పణితి విన్నెవరూ ఏమన్నారూ.'

అప్పుడు భార్య అత్తమీదున్న అక్కసంతా వెళ్లగక్కుతూ భర్తకు సమాధానమిచ్చింది.

'చింపిరి తలాదీ, చీమిడి ముక్కుదీ
[17]చిత్తిరిది మీయమ్మ పేరె బొమ్మానా.'

అని చెప్పిందంటే ఆ కోడలు చాల గయ్యాళి గంపలాగ కనిపిస్తుంది. అయినా కుమారుడు తల్లిని అడుగుతున్నాడు :

'అమ్మరో వో యమ్మ మముగన్నతల్లీ
నీ ముద్దు కోడలనీ ఏమంటివమ్మా.'

కుమారునితో తల్లి కోడలిమీద నిందమోపలేదనీ, నీతి మాత్రం చెప్పానని అంటుంది.

'పొద్దుపొయ్యి పొరుగిండ్లు తిరుగొద్దంటి,
వీధిలో కురులిడిసి కట్టవద్దంటి
ముంజేతి [18]మునుసూరు పీకవద్దంటి.'

అన్న సమాధానంతో సంతృప్తిపడిన కుమారుడు తల్లిని ఏమీ అనలేకపోయాడు. ఇవి పల్లెటూళ్లలో చాల సహజమైనవే. ఈ పాటలో కవిత్వపుపాలుగూడ అధికంగా గలదు. అటువంటి అత్తకు కోడలు కావడం కంటే అడవిలో సిరిపొన్న చెట్టయి పుట్టడం మంచిదట. ఎండలో వచ్చిన జనులకు చల్లని నీడనిచ్చి సేదదీర్చి, పుణ్యం కట్టుకోవచ్చునని కోడలు చెప్పింది. భర్త భార్యను 'పచ్చిపసుపుగొమ్మ బంగారి బొమ్మ' అని సంబోధిస్తాడు. ఇందలి ఔపమ్యం గమనార్హం. ఇది కవిత్వం కాదనగలమా? ఇలాంటి పట్టులు జానపద సాహిత్యంలో తళుక్కున మెరిసి సహృదయ హృదయాలను రంజింపజేస్తాయి.

విసరురాతి పాటలలో శృంగారంగూడ వర్ణింపబడిన పట్టులు లేకపోలేదు. అందులోని సరసం కొంతవరకు మోటుగ ఉండవచ్చును. కాని అది జానపదులకు సహజంగానే ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ క్రిందిగేయం (పాడినవారు. శ్రీమతి క్రిష్ణమ్మ) మగనారిమీద మనసుపోయిన ఒకవ్యక్తి జోగి రూపంలో వచ్చి వంచన చేయబోయి తానే మోసపోయిన సంగతిని తెలియజేస్తుంది.

'చక్కని చక్కన్ని ఎంత చక్కన్నీ
సుద్ద కుంట్లోన ఎంత చక్కన్నీ
[19]సొక్కులా సోలుతా బిచ్చమడిగేనూ
ఆనందమాడుతా అన్నమడిగేనూ
వరి కూడొల్లదే వసాల జోగీ
[20]సద్ద కూడొల్లదే చక్కానిజోగీ
కొర్రకూడొల్లదే [21]కొవిని బంగాము
ఏమిఒల్లని జోగి యా లొస్తివయ్యా
వరికూటిలేకీ [22]వెన్నకావలెనూ
కొర్రకూటిలేకీ కోడికావలెనూ
సొద్దకూటిలేకీ చల్లకావలెనూ
ఏమివొల్లని జోగి యా లొస్తివయ్యా

14. అరడి. 15. సిరిపొన్న. 16. పణితి.
17. చెడ్డదన్నఅర్థము. 18. మునుచూరు.
19. సొక్కుచు, సోలుచు, 20. సజ్జ,
21. క్రొవ్వినకావచ్చును, 22. కూటిలోనికి.

ఇల్లెడుగ, పరుపడుగా ఇల్లాలివడుగ
మగ్గల్లపరుపడుగా మగనాలినడుగ
మావిపండ్లు తిన్నా ఓ మోసకాడ
మగనాలి పొందు కోయాలొస్తివయ్యా
కండ్లకాటుక చూసి పండ్లెరుపు చూసి
నువు నవ్వేనవ్వులకీ నే మోసపోతి.'

ఈ విధంగా చివరికి తాను మోసపోయినట్లు మారు వేషంలో వచ్చిన వ్యక్తి తెలుసుకొంటాడు. ఈ గేయంలో 'వరికూటిలేకి వెన్నకావలెనూ, కొర్ర కూటిలేకి కోడికావలెనూ. సొద్దకూటిలేకి చల్ల కావలెనూ' అన్నవి పీటివి రుచి చూచినవారికే ఇందలి సారస్యం తెలియగలదు. ఇది గేయరచయిత విజ్ఞతకు నిదర్శనం కాగలదు. అంతేగాక ఈ గేయంలో యతిప్రాసలు తమంతకుతమే కుదిరిపోయినట్లున్నవి. ఇది సహజ కవిత్వం!

ఇక్కి ఈ క్రింది గేయం పాడినవారు :(శ్రీమతి క్రిష్ణమ్మ)లో తనవాడు అనుకొన్నవాడిని వదలి పెట్టిపోయిన స్త్రీని తప్పక ఏలుతానని చెప్పుతూ శపథంచేయడం గమనార్హం.

'పొన్నమాని క్రిందా పొయ్యేటి క్రిష్ణా
నీ చేత చెండుంది నా కియ్యరాదా
ఇస్తానురమ్మానె విరుపాక్షితిదంకా
విరుపాక్షి దాటా ఇకనన్ను ఈవా
నిన్ను నమ్మివస్తి నావోసి విడిసి
నమ్మితేనే విడను నామాలతోడూ
వేలి బెత్తంతోడు చెల్లెంద్రలతోడూ
అగ్నిగండముతోడు అన్నల్లతోడూ
ఎదురిల్లు కట్టించి ఏలుదునే నిన్నూ
పక్కిల్లు కట్టించి పొందుదునే నిన్నూ'

ఇలాగా శృంగార సంబంధి గేయాలు నడుస్తూ ఉంటాయి.

విసరురాతిని పవిత్రంగా తలంచడమే గాదు. గౌరిదేవిగా పూజిస్తారు. (ఈవిషయాన్ని డా.తూమాటి దొణప్పగారు స్రవంతిలో ప్రకటించిన వ్యాసంలో విపులంగా వివరించి ఉన్నారు.) రాగులు విసరడం పూర్తి అయ్యే సమయంలో ఈ క్రిందిపాట పాడుతారు. (పాడినవారు శ్రీమతులు చిన్నక్రిష్ణమ్మ, ముత్యాలమ్మ.)

ఇవ్వాడూ దున్నేది ఈ దుక్కిలోనా
[24]ఇపురీతమ్మె పుట్టా నా బుడుము చెట్లా
[25]బూమి బుడమా చెట్లు [26]బూమరులుకోనా
బుద్ధిమంతుడు మా తాత భూమిపాలాయ
నేల బుడమా చెట్లా నేలరులూ కోనా
నేరుపుల మా అవ్వ నేల పాలాయా
నల్లకోడీ రాయా పిల్ల లాడించూ
పుట్టేడూరాగుల్లు ఈరాతి పాలూ
పుణ్యవంతులమ్మా ఈ ఇంటివారూ
పుట్టెడూ జొన్నలూ ఈరాతి పాలూ
భాగ్యవంతులమ్మా ఈ ఇంటివారూ
ముత్యాలు తెచ్చుండా తెయ్యి గౌరమ్మ
ముత్యాలు గాదమ్మా ముగ్గజొన్నల్లో
పగడలు తెచ్చుంటా తెయ్యి గౌరమ్మ
పగడాలుగాదమ్మా పాతరాగుల్లో
[27]చాటడు రాగులాయా చాల పనులాయా
చెయ్యిడే గౌరమ్మ ఆడి వచ్చేనూ
[28]గంపడూ రాగులాయా గౌరి పనులాయా
కూర్చోయ గౌరమ్మ కుర్చిలపైనో
మా రాగు లయిపాయా మేము పోతామూ
అయిపోయి సిగిరిమింద ఆడిరావమ్మ'

జొన్నల్ని ముత్యాలతో పోల్చడం, రాగుల్ని పగడాలతో పోల్చడం ఎంతయిన సొగసుగ ఉంది. గౌరిదేవి కిచ్చేందుకు తమవద్ద ముత్యాలు, పగడాలు లేవు. ముగ్గనజొన్నల్లు, పాతరాగులు మాత్రమే ఉన్నాయట. ఇది వారి పరిస్థితిని గూడ తెలియ జేస్తూంది.

---


23. దాక. 24. విపరీతము, 25. భూమి, 26. భూమిపై వ్యాపించు. 27. చేటెడు. 28. గంపెడు.

'అయిపోయె గౌరమ్మా అయిపోయెనమ్మా
అయిపోయె నీ గిరిమింద ఆడిరావమ్మా
రేపు రావమ్మ గౌరమ్మ నీవూ
రేపూ మా ఇంట్లో మల్లెలా పూజా
మాపురావమ్మ గౌరమ్మ నీవూ
మాపటికి మా ఇంట్లో మల్లెలా పూజా
[29]మల్లెపూ వస్త్రాలు ఒల్లాటలేస్తా
అలికిన్ని ఇల్లిస్తా ఆకుదోటిస్తా
పూసిన్ని ఇల్లిస్తా పూలతోటిస్తా
అయిపోయె గౌరమ్మా అయిపోయెనమ్మా
అయిపోయె నీ గిరిమింద ఆడిరావమ్మా.

ఈ విధంగా రాగులు విసరడం పూర్తి అవుతున్న సమయంలో ముక్తాయింపుగా ఈపాట పాడి తమ భక్తిని ప్రకటిస్తారు. మల్లెపూలతో పూజిస్తారట. మల్లె పూవులవంటి వస్త్రాలను గౌరికి ధరింపజేస్తారట మరి పిండిగూడ తెలుపే! గౌరికిగల తెల్లదనంమీది ప్రీతి అభివ్యక్తమవుతూంది దీనివల్ల! ఇది పామరప్రజలలో ఉన్న సహజసుందరమైన, అప్రయత్న పూర్వకమైన కవిత. కవిత్వం సహజసుందరమైనప్పుడే రాణించగలదు. సహృదయ హృదయ స్పందన కలిగించి ఆనందాతిశయాన్ని ఆపాదించగలదు. ఇలాంటివి ఇంకా ఎన్నో గేయాలున్నాయి. విస్తరభీతిని విరమించాను. ఇవిగాక నేను సేకరించిన వాటిలో కోలాట పాటలు, కపిల పాటలు, చంద్రమ్మ పాటలు ఉన్నాయి. ఇలాగే ప్రతిప్రాంతంలోను మరుగుపడిపోయిన పామర ప్రజాసాహిత్యాన్ని వెలుగులోకి తీసుకరావడం ప్రతిసాహిత్య విద్యార్థి కర్తవ్యం! అలాంటి ప్రయత్నం ఫలించాలని ఆశిస్తున్నాను.

---

29. మల్లెపూవువంటి వస్త్రాలను ధరింపజేస్తానని అర్థం.



వ్యావహారికంలో "ఆక"

"స్పూర్తిశ్రీ"

1

సాధారణంగా వాడుకలో మనం వాడుతున్న ప్రతి మాటకూ, ప్రతి పలుకుబడికీ మూలం వట్టి గ్రాంథికంలో కన్పిస్తూనే ఉంటుంది. దానికి కారణం చాలావరకు స్పష్టంగా తెలుస్తూనే ఉంటుంది. కొన్నిచోట్ల అస్పష్టత సన్నగిల్లితే కష్టం కలగడంకూడా సహజమే. పలుకుబడి బడిలో పాఠాలు చదువుకోదలుచుకున్నప్పుడు కష్టంకూడా ఇష్టంగానే మారి అభీష్టానికి మనల్ని అభిముఖుల్ని చేస్తుంది.

అసలు ఇదంతా ఎందుకంటే శిష్టులు గ్రంథస్థమైన భాషనే కొంచెం ముందూవెనకా మార్చుకుని వాడుకలో వాడుతూ ఉండడం జరుగుతుంది. అందువల్ల శిష్టవ్యావహారికం గ్రాంథికానికి, ఒకవిధంగా చూస్తే, ప్రతిరూపం వంటిది. 'వంటిది' అని అనడం ఎందుకంటే, అద్దంలో చూచినప్పుడు కనిపించే ప్రతిరూపంవంటి ప్రతిరూపంకన్నా, పెద్దల రూపానికి తమపిల్లల్లో కనిపించే ప్రతిరూపం వంటిదే యిక్కడ ఎక్కువగా కనిపిస్తుంది. అందుచేత మనం మాట్లాడుతున్నభాష గ్రాంథిక భాషకు పుత్రికలాంటిది. అంటే, తల్లి గ్రాంథికమనీ పుత్రిక వ్యావహారికమనీ చెప్పినట్లే అవుతుంది. అయితే, అది అన్నప్పుడూ యథార్థంకాదు.

మొదట్లో నిత్యవ్యవహారంలో ఉన్నభాషనే గ్రంథాలకు ఉపయోగించుకోవడం జరిగిఉండాలి. కొన్నాళ్ళు పోయేసరికి గ్రంథస్థమైన భాషకూ, వ్యవహారస్థమైన భాషకూ దూరం ఏర్పడడం మొదలుపెట్టింది. అంటే గ్రంథస్థమైన భాష మొట్టమొదట ఏస్థితిలో ఉందో ఆ స్థితిలోనే ఉండిపోయింది. వ్యవహారస్థమైన భాష ప్రజల నోళ్ళల్లోపడి నలిగి నలిగి రూపాంతరాన్ని పొందుతూనే ఉంది. దీన్నిబట్టి వ్యావహారికం మాతృస్థానాన్ని పొంది గ్రాంథికం పుత్రికాస్థానాన్ని పొందిందనవలసి వస్తుంది. ఇదికూడా అన్నప్పుడూ యథార్థంకాదు.

శిష్టులు గ్రాంథికరూపాల్ని వ్యావహారికంలో కలబోసి వాడుకుంటున్నట్టే సమర్థులయిన కవులూ పండితులూ వ్యావహారిక రూపాల్ని గ్రహించి గ్రాంథికంలో కలియగలుపుకోవడం జరుగుతూనే ఉంటుంది, ఆ విధంగా వాటిని ప్రమాణీకరించడమూ జరుగుతుంది. వ్యావహారికంలో ఉన్న ప్రతిరూపానికీ అలాంటి ప్రమాణం లభిస్తుందని అనుకుంటే విలువునా ప్రమాదంలో పడ్డట్టే. బాగా వ్యవహారంలో పాతుకుపోయి, అందచేత అల్లారుముద్దుగా ఆదరింపబడుతూ, తమ విరూపాన్నికూడా విశేషరూపంగా వ్యాపింపజేసే ప్రయోగాలు మాత్రమే అటువంటి సుయోగానికి అర్హమవుతాయి.

2

ఇంత చూశాక మనమొక నిర్ణయానికి రావచ్చు. వ్యావహారికంలోనుంచి గ్రాంథికంలోకి వచ్చినా, గ్రాంథికంలోనుంచి వ్యావహారికంలోకి వచ్చినా ఒకే ఆకారంలోఉన్న రూపాల విషయమై ఆలోచింపవలసిన అవసరం లేదు; కొంచెం మారుపాటు పొందిన రూపాలయితే ఆలోచనలను ఉద్దీపింపజేయుడానికి అవకాశం ఉంది. ఆ మారుపాటుకూడా సహజమార్గంలోనే సాగినట్టయితే సమన్వయానికి అనుకూలంగానే ఉంటుంది; అందులో అబ్బురపడవలసిన అవసరమేమీ లేదు. ఆ మార్పులు వేర్వేరు మార్గాలలోసాగి, భిన్న భిన్న మనస్తత్వాలను ఆవిష్క

రించేటట్లయితేమాత్రం భాషాతత్త్వజిజ్ఞాసువుకు ఆసక్తిని, అనురక్తిని కలిగించడానికెంతయినా సామగ్రి లభిస్తుంది. కొన్నిచోట్ల వ్యావహారికంలో ఉన్నమాట గ్రాంథికంలో కనిపించకపోయిందనుకుందాము అప్పుడు దాని ఆనుపానులు తెలుసుకుందామనీ, దాని పుట్టు పూర్వోత్తరాలు ఆరా తీద్దామనీ అనిపిస్తుంది.

ఆ ఆనుపానులు తెలుసుకున్నాక, పుట్టు పూర్వోత్తరాలు ఆరా తీశాక ఎంతో తృప్తి లభిస్తుంది. ఈ 'తెలుసుకున్నాక' అన్నచోట 'అక' అన్నరూపం ఒకటి ఉంది. ఇది పదమో ప్రత్యయమో కూడా ఇదమిత్థంగా చెప్పడం వీలుకాదు. మన భాషలో 'అవరోధం' అనే అర్థంలో 'ఆక' అని ఒక పద ముంది. దీనికి 'ఆగుట' అనే అర్థంకూడా చెప్ప వచ్చు. 'పోవు' అనే క్రియాధాతువుమీద 'క' ప్రత్యయం చేరడంవల్ల 'పోక' యేర్పడినట్టే 'ఆగు' అనే క్రియాధాతువుమీద 'క' ప్రత్యయంచేరి 'ఆక' యేర్పడుతుంది. ఇలాంటివే రాక, పీక, మొలక, అలుక మొదలయిన రూపాలుకూడా. వీటిని కృదంత రూపాలని పిలుస్తారు. పైని చెప్పిన కృదంతరూప మైన 'ఆక'కు ఉన్న అర్థం 'తెలుసుకున్నాక' అన్న చోట ఏ మాత్రమూ పొసగదని తెలుసుకున్నాక, ఇంక దానినీ దీనినీ ఒకటనుకోవడం వీలుకాదు.

'తెలుసుకున్నాక' అని అన్నప్పుడు 'తెలుసు కున్న తర్వాత' అని నిశ్చింతగా అర్థాన్ని నిర్ణయం చెయ్యవచ్చు. ఇక్కడ 'అక' అన్నది ఆనంతర్య బోధకమన్నమాట! గ్రాంథికంలో ఈ అర్థాన్ని చెప్పవలసి వచ్చినప్పుడు 'అనవుడు' మున్నగు రూపాల్లో ఉన్నట్లు డువర్ణకాన్నో, 'అనన్, వినన్' మున్నగు రూపాల్లో ఉన్నట్లు 'అన్' అన్న ప్రత్యయాన్నో, 'అనుటయు, వినుటయు' అన్నట్లు భావార్థద్యోతక మైన టవర్ణంమీద సముచ్చయార్థకాన్నో చేర్చడం జరుగుతుంది. కొన్నిచోట్ల అనంతరార్థకములైన పిదప, పిమ్మట, తర్వాత మొదలయిన పదాలనే బాహాటంగా చేర్చి వాడడం జరుగుతుంది. అంతేకాని యినా 'అక'తో రూపసామ్యం కలిగిన ప్రత్యయంకాన్నీ పదంకాని మనకు కనిపించదు

3

ఇక్కడే ఇంకొకవిషయం చూద్దాము. ఈ 'అక'ల అంత్యప్రాసను కలుపుకుంటూ అందాక, ఇందాక, ఎందాక మొదలయిన రూపాలు రూపు దిద్దుకున్నాయి. ఇక్కడ పూర్వమున్నవి అంత, ఇంత, ఎంత అనే పరిమాణార్థకాలు. పరమందున్నది 'దాక' అనేది. ఇది 'దనుక' అనేదానికి రూపాంతరం. మధ్యలోవున్న 'ను' వర్ణం లోపించిపోతే ఉచ్చారణ కాలాన్ని సరిపెట్టడానికిగాను మొదటి అచ్చు కొంచెం సాగింది. 'దనుక'అని అన్నప్పుడు దీని ఉచ్చారణకాలం మూడు మాత్రలు. లోపం కలిగినప్పుడు 'దక'అని మాత్రమేఉండి ఉచ్చారణకాలం రెండు మాత్రలకు తగ్గింది. మూడుమాత్రల పొడవున్న మాటను రెండు మాత్రలలో పలకాలంటే కొందరు చాలా అన్యాయం చేయవలసివచ్చినట్టు గిలగిల్లాడిపోతారు అందువల్ల పోయినవర్ణంపోగా, మిగిలినదానికే మూడు మాత్రలకు సరిపెట్టుకోవడం జరుగుతుంది. ఆ సరిపెట్టుకో వడంకోసమే 'దక'అని మిగిలిఉన్న రూపాన్ని 'దాక' అని పొడిగించి, వాడుకోవడం జరుగుతుంది. 'దుముకు' అనేమాట 'దూకు'అనీ, 'ఉముకు' అనేది 'ఊక'అనీ యీ సిద్ధాంతాన్ని అనుసరించే మార్పు చెందుతూ ఉన్నాయి.

కాగా 'అందాక' మొదలయిన చోటనేకాక నీదాక, నాదాక, ఊరిదాక, ఇంటిదాక మొదలయిన చోట్లకూడా ప్రయోగించడం జరుగుతుంది. ఇది వ్యావహారికంలోనేకాకుండా గ్రాంథికంలోకూడా బాగానే చోటు చేసుకుంది. 'ఇంటిదాక'అని అన్నప్పుడు ఇంటి వరకు' అన్న అర్థం కలుగుతుంది. అంటే 'దాక' అనేది పర్యంతార్థంలో ప్రయుక్తమవుతున్నదన్నమాట!

ఈ 'దాక' మొత్తంగా కాకుండా వ్యావహారి కంలో బహురూపధారణంచేసిన శబ్దాలను కొన్నింటిని చూద్దాము, అప్పుడుకూడా మూలరూపాలు లీలగా

దర్శనమిస్తూనే ఉంటాయి. వంక, ప్రక్క, వైపు మొదలైనవి ఉభయభాషల్లోనూ సమానంగానే కని పిస్తాయి. 'నా కెల్ని చూడకు'అని అవి యేభాషనూ తిరస్కరించవు. 'కెల్ని'అనే మాటనే తీసుకుందాము. ఉన్నది ఉన్నటుగా ఇది గ్రాంథికంలో కనిపించదు. కొంచెం నిదానించిచూస్తే అసలు రహస్యం బయట పడుతుంది. 'కెలను'అంటే 'ప్రక్క'అని అర్థం. 'కెలకులనున్న తంగెటిజున్ను'అనిఅన్న పెద్దన్నగారి కెల కులలో ఉన్నది యీ 'కెలను' శబ్దమే. దీనిమీద ద్వితీయాది విభక్తులేమయినా చేరినప్పుడు 'కెలనికి' మొదలైన విధంగా మారుతుంది. ఇది వాడుకలో 'లన'లు సంయోగం చెందడంవల్ల 'కెల్నికి' అనిమారి, తరువాత నకారం స్థానంలో లకారాన్నిపొంది 'కెల్లికి' అని అయింది. ఇది తెలుగులో చాలా స్వాభావికమైన పరిణామమన్న సంగతి రెండు మూడు రూపాలను చూస్తే స్పష్టమవుతుంది. 'వలనన్' అనే పంచమీ విభక్తి ప్రత్యయం వాడుకలో 'వల్ల' అని మాత్రమే వినిపిస్తుంది ఎవరయినా ఒల్లమాలిన గ్రాంథికం వినిపించాలని అనుకుంటేతప్ప. అయినా గ్రాంథికంలోనూ 'వల్ల'ను వల్లకాదనే అవకాశం లేదనే చెప్పాలి. 'చలిమలవల్ల మల్లసిలు' చక్కని స్థానం దానికి ఏనాడో సమకూడింది. ఇలాగే 'కొలను' అనేది కొన్నిచోట్ల 'కొల్లు' అనే రూపాంతరంతోనే విశేష ఖ్యాతిని సంపాదించుకుంది. ఇంతకూ 'కెలనికి' అనేది 'కెల్లికి' అని కావచ్చునన్నది చూశాము.

ఇక్కడే యింకొక్క చిన్నమెలిక ఉంది. దాన్ని కూడా ఒక్కకొలిక్కి తీసుకువస్తేనే కాని సంపూర్ణ రూప సాక్షాత్కారం జరుగదు 'విభక్తి ఉన్నప్పుడు 'కెల్లికి' అని అన్నట్టుగా ఉండవచ్చుగాని విభక్తి లేనప్పుడు ఉదంతంగానే ఉండాలికదా' అని ఎవరయినా ప్రశ్నించవచ్చు. అదీ సమంజసమే. అవసరాన్నిబట్టి ఒక ధోరణికి అలవాటుపడ్డాక, అవసరం లేనప్పుడు కూడా దానినే అనుసరిస్తూ ఉండడం మనలో ఉండే ఒక దౌర్బల్యం. మన మనస్తత్వంలో ఉండే అల సత్వంవల్లనే యీ పొరపాటు పరిపాటయిపోయింది. 'అదేమిటి?' అని నిలదీసి అడుగుదామని ఎవరికయినా అనిపించవచ్చు. మాటలో ఉన్న దోషాన్ని మనిషి మీదికి నెడుతున్నానని కోపం రావచ్చు. కాని, నిజం నిజమే; అంగీకరించక తప్పదు. 'అదేమిటి?' అన్న ప్రశ్ననే చూడండి. 'ఏమిటి' అన్నరూపం ఎలా వచ్చింది? అసలురూపం 'ఏమి' అని మాత్రమే ఉండాలి, ఇది ఔప విభక్తిక రూపం కావడంవల్ల ద్వితీయాది విభక్తులు చేరినప్పుడు 'ఏమిటికి' మొదలైన విధంగా మారుతుంది. దాన్ని చూచి చూచి మనం ప్రథమైకవచనంలోకూడా 'ఏమిటి' అని వాడడం మొదలుపెట్టాము. ఇంతటితో అపు చేశామా? కొందరు 'ఏటి' అని, కొందరు 'ఏంటి' అనికూడా తమ మనస్సుకు నచ్చే రూపాలను సిద్ధంప జేసుకున్నారు. ఇంతకూ 'ఏమి' అనేది 'ఏమిటి' అని మారినట్టుగానే 'కెలను' అన్నది, ఔపవిభక్తికమైన ఇవర్ణంతోకూడి 'కెల్లి' అని మారిపోయింది. అసలు పద్ధతికి కొంత విరుద్ధంగానే ఏర్పడినప్పటికీ, మొత్తంమీద 'దీనికి మూలం ఇదీ' అని స్పష్టంగానే చెప్పగలుగుతున్నాము.

4

'కడకు' అనేది మార్పుపొంది వాడుకలో 'కాడి'కి అని అయింది. అయిన కాడికి అమ్మేశాను, నా కాడికి నేను నమ్ముతాను — మొదలయిన ప్రయోగాలను శిష్టులుకూడా పరిహరించడంలేదనే చెప్పవచ్చు. అంతే కాదు. అలా అంటేనే నుడికారాన్ని ఆత్మీయం చేసుకున్న ఆత్మసంతృప్తి చేకూరుతుంది. కాని ప్రథమైక వచనంలో 'కడ'కు బదులుగా 'కాడ'అని కొందరు వాడుతుంటారు. 'నా కాడ ఏమున్నా దాచబెట్టావా?' అనిఅంటే దీనిని పామరభాషగా కొట్టిపారేసేవాళ్ళు కొందరుంటారు. 'ఇంటికాడుంటాడు' మొదలయిన వన్నీ యీ కోవకే చెందుతాయి. ఈ 'కాడ'కు షష్ఠ్యంతరూపమే 'కాడికి' అనేది. మరి, దీన్ని గ్రహించేవాళ్ళు దాన్ని చూస్తేనే ఎందుకు ఆగ్రహిస్తారో అర్థంకాదు. 'అభ్యాసం కూసువిద్య' అని అంటారు. అలవాటుకు లొంగిపోయి, అభిమానాన్ని

పెంచుకోవడం తప్పిస్తే దీనికి మరొక కారణంలేదు. ఇంతకూ 'కాడికి' అనేదానికి 'కడకు' అనేది మూల రూపం.

అలా, ఇలా అని కొందరంటూఉంటే అట్లా, ఇట్లా అని కొందరూ - అట్టు, ఇట్టు అని మరి కొందరూ—అలాగా, ఇలాగాఅని యింకొందరూ—అలాగ్గా, ఇలాగ్గా అని యింకా కొందరూ అంటూ ఉండడం వినిపిస్తుంది. ఈ ప్రకారార్థకాలు ఇన్ని ప్రకారాలుగా 'ఎలా' వచ్చాయో నిదానిస్తే తెలుసుకోవచ్చు.

'లాగు' అనే దానికి పూర్వమందు ఆ, ఈ అనే నిర్దేశాత్మక సర్వనామాలు చేరుతాయి. అప్పుడు ఆలాగు, ఈలాగు అనే రూపాలు వస్తాయి. త్రికం మీది అసంయుక్త హల్లుకు ద్విత్వం కలిగితే, ద్విత్వానికి పూర్వమందున్న అచ్చుక దీర్ఘానికి హ్రస్వం కలుగుతుంది. అప్పుడు అల్లాగు, ఇల్లాగు అనే రూపాలు కలుగుతాయి. ఇంతవరకూ, అంటే ఆలాగు, అల్లాగు, ఈలాగు, ఇల్లాగు, అనేటంతవరకూ గ్రాంథికంలోకూడా వాడుకోదగినవే. ఇంక ఉచ్చారణంలో మొదటి అక్షరంమీద ఉండే ఊనికమూలంగా చివరి అక్షరం జారిపోగా ఆలా, అల్లా, ఈలా, ఇల్లా అన్న రూపాలతో వ్యవహారంలో ఉన్నాయి. వాటినే యింకా తేల్చి పలకడంవల్ల అలా, ఇలా అనే రూపాలుకూడా ఏర్పడ్డాయి. అలాగు, ఇలాగు అని అన్నప్పటికీ వీటికి ఎలాగో అయిపోయే గుణం లేదు. అర్థగ్రహణకు గ్రహణం పట్టనంతవరకూ ఏ మాటను గట్టిగా పలికినా, ఏ మాటను తేల్చి పల్కినా పెద్ద యిబ్బంది లేదు. అందువల్లనే 'ఏలాగు' అనడానికి బదులుగా ఎల్లాగు అన్నా, ఎల్లా అనో ఎలా అనో ఏలా అనో అన్నా అస్పష్టత కలగడం లేదు. వీటిమీద ఇంకా అలాగ్గా, ఇలాగ్గా, ఎలాగ్గా అనీ, అల్లాగా, ఇల్లాగా, ఎల్లాగా అనీ ఎల్లా అయినా లాగవచ్చు.

కొందరు అట్లు, ఇట్లు, ఎట్లు అనే రూపాలను ఆధారంగా చేసుకుని అట్లా, ఇట్లా, ఎట్లా అని అంటుంటారు. కొందరు. వీటికి కూడా ఇంకా మూలరూపాలున్నాయన్న సంగతిని గుర్తు చేసుకుంటారు. 'అట్లు' అనే దానికి మూలరూపం 'అట్లులు' అనేది. ఇక్కడ 'అట్లు' అనే దానిమీద 'లు' అనే ప్రత్యయం చేరింది. న్యాయంగా మాత్రం లువర్ణకం బహువచనంలో రావాలి. ఇక్కడ కేవలమూ ఊతంకోసం వస్తున్నది. దీనికి ప్రత్యేకమైన అర్థస్ఫోరకశక్తి యేమీ లేదు ఈ సందర్భంలో. 'విత్తు' అనే దానికి 'విచ్చు' అనేది వికృతి రూపం. ఇది యిలా వాడకుంటూ 'లు' వర్ణాన్ని కలిపి 'విచ్చులు' అనికూడా వాడుకోవడం జరుగుతుంది. అలాగే యిక్కడకూడా 'అట్లు' అనే శబ్దం మీద లు వర్ణకం చేర్చి 'అట్లులు' అని వాడుకోవడం జరుగుతుంది. ఇట్లులు, ఇట్లు, ఎట్లులు, ఎట్లు అనేవికూడా ఇలాగే ఏర్పడుతాయి. అటులు, ఇటులు, ఎటులు అని చేర్చికూడా పలుకవచ్చు ఇవన్నీ గ్రంథాలలోకికూడా ఎక్కిన రూపాలే. వాటి సంగతి అలా ఉంచుదాము. 'అట్లు' మొదలయిన రూపాల మీద ఆకారాన్ని చేర్చి అట్లా, ఇట్లా, ఎట్లా అని కొందరు వాడుతుంటారు వీటిమీదకూడా 'గా'ను చేర్చి అట్లాగా, ఇట్లాగా, ఎట్లాగా అనికూడా వాడుతుంటారు. అట్లా, ఇట్లా, ఎట్లాలనేవాటిమీద 'గా'ను చేర్చి అట్లాగా, ఇట్లాగా, ఎట్లాగా అని కూడా వాడుతారు

కొందరు అటు, ఇటు, ఎటు అనే వాటిమీదనే 'లాగు'చేర్చి అట్లాగు, ఇట్లాగు, ఎట్లాగు అని వాడుతుంటారు. దీనితో తృప్తిపాలకపోతే 'గా'నుచేర్చి అట్లాగా, ఇట్లాగా, ఎట్లాగా మొదలయిన విధంగాకూడా అక్కడక్కడ వాడుతుంటారు. మొత్తం మీద ఈ ప్రకారర్థకాలు ఎన్నిప్రకారాలుగా ఉన్నా, ఎన్నిఆకారాలు మార్చినా, ఆకారాన్నిమాత్రం వదులుకోలేదు. వ్యావహారికంలోఉన్న యీ రూపాలకు సదృశరూపాలను గ్రాంథికంలో కనిపెట్టవచ్చు.

5

'కాస్త, కూస్త'అని కించిదర్థంలో మనం వాడుతూంటాము. వీటికి సరియైన గ్రాంథికరూపాలు 'కాసంత, కూసంత' అనేవి. 'కాసు' అనేది నాణాల్లో అత్యంతఅల్పమైనదాన్ని సూచిస్తుంది. 'కూసు'అంటే 'బిడ్డ'అని అర్థం. 'గుడ్డూకూసూ'అని అంటుంటారు. గుడ్డుతరువాతఉండే అవస్థను తెలిపే యీ శబ్దం వయసులో అల్పత్వాన్ని తెల్పుతుంది. అయితే యీ రెండు శబ్దాలూకూడా వాటివాటి ప్రత్యేకతలను కోల్పోయి సామాన్యమయిన అల్పత్వాన్ని బోధిస్తున్నాయి. 'కాసంత' అన్నప్పటికీ 'కూసంత' అన్నప్పటికీ 'స్వల్పమైన'అని మాత్రమే అర్థం. ఇక్కడ సకారం తకారంతో సంయోగం చెందేసరికి పూర్ణానుస్వారం కాస్తా నిజంగా పూర్ణానుస్వారమైపోయింది. అప్పుడు 'కాస్త, కూస్త'అన్న రూపాలు ఏర్పడ్డాయి. వీటికన్నా తక్కువ పరిధిలో ఇవే శబ్దాలు ఇంకొక రూపం ధరించి వ్యవహారికంగా ఉన్నాయి. అక్కడ [illegible] నిబ్బరంగా నిలదొక్కుకుని, తన ప్రక్కనున్న సకారాన్ని స్వాహా చేస్తున్నది. దానితో 'కాంత, కూంత'అనే రూపాలు ఏర్పడుతాయి. కావాలనుకుంటే, ఉచ్చారణంలో బలంకోసం, చిట్టచివర దీర్ఘాన్నికూడాచేర్చి 'కాస్తా, కూస్తా'అని 'కాంతా, కూంతా'అనికూడా వాడుతూంటారు.

గ్రాంథికభాషలో అయితే, ఇట్లాంటిచోట్ల 'అంత'మాత్రమే అనుప్రయుక్తమవుతుంది. వ్యావహారికభాషలోకూడా బహుళ ప్రచారంలో ఉన్నది 'అంత' శబ్దమే. అయితే అంతా అదే ఆక్రమించుకున్నదనడానికి వీలులేకుండా 'కాసింత, కూసింత' లాంటి రూపాలుకూడా వాడుకలో ఉన్నాయి. ఇక్కడ పూర్వశబ్దాలు పూర్వం చూపిన 'కాసు, కూసు' అనేవే. వాటికి పరమందు 'ఇంత' అనేది చేరుతుంది.

ఇక్కడ ఇంకొక చమత్కారంకూడా ఉంది. 'అంత' చేరుతున్న స్థానంలో 'ఇంత' అనేది చేరుతున్నా దానికిలేని విశేషరూపాన్ని యిది పొందగల్గడం విశేషం. 'అంత, ఇంత' అనడానికి అర్థవిశేషంలో

'అన్ని, ఇన్ని'అనే రూపాలు ఏర్పడతాయి. 'కాసింత, కూసింత' అనేచోట 'ఇంత'కు బదులుగా 'ఇన్ని'అనే దాన్ని చేర్చి 'కాసిన్ని, కూసిన్ని' అన్నట్లుగా పలుకవచ్చు. 'కాసంత' మొదలయినచోట్లమట్టుకు 'ఇన్ని'ని చేర్చి పలికే అలవాటు ఎక్కడా ఉన్నట్లు కనిపించదు. అల్పత్వానికి మరింత అల్పత్వబోధకత్వం చేకూర్చడానికేమో అన్నట్లు కొందరు తాలిదీర్ఘాన్ని హ్రస్వీకరించికూడా పలుకుతారు. అప్పుడు 'కసింత, కుసింత' అనీ 'కసిన్ని, కుసిన్ని'అనీ రూపాలు ఏర్పడతాయి ఎన్నిరూపాలు ధరించినా, ఎన్నిమెరుగుల్లు దిద్దినా ఇక్కడకూడా స్వరూప సాక్షాత్కారానికి సదుపాయం ఉండనేఉంది.

6

వాడుకలో ఇంకా కొన్నిచమత్కారాలు జరుగుతూంటాయి. వ్యవహారం నడుస్తూఉన్నంతసేపూ, మనలో చాలామంది వెనుకముందులు చూడవలసిన అవసరం ఉందన్న సంగతినే గమనించరు. అందువల్ల కొన్నిఅపరూపాలే అపురూపంగా అనిపించి కనీసం కొందరికయినా విందులు చేస్తున్నాయి.

'రాత్రి' అనేది తత్సమశబ్దం. 'రేయి' అనేది తెలుగు శబ్దం. దీనికి మూలం ప్రాచీన ద్రావిడంలో 'ఇరా' అని ఉండేదనీ, అదే అచ్చు కొంచెం ముందుకు కదలగా 'రే' అని మారి 'రేయి'గా పరిణామం పొందిందనీ అంటారు. దానితో మనకిప్పుడు సంబంధం లేదు. కాని యీ 'రేయి, రాత్రి' అనే రెండు పదాలూ అల్లుకుపోయి, వక్త మనసులో ఒక గజిబిజిని లేవదీసి ఉంటాయి. దానితో అటూ యిటూ తేల్చుకోలేని వక్త రెండింటినీ కలిపేసి 'రేత్రి' అని పలికి విశ్రాంతిగా ఊపిరి పీల్చుకోవడం జరిగి ఉంటుంది. రేయి + రాత్రి—అని అన్నప్పుడు మొదటి మాటలోని మొదటి అక్షరాన్నీ, రెండవమాటలోని తుది అక్షరాన్నీ ముడిపెట్టడం జరిగిందన్న మాట! అయితే, ఇదంతా భద్రంగా కూర్చుని 'యీ విధంగా చేద్దా'మనిచేసిన పనిమాత్రం కాదు. దానికదే ఒక రకమైన ఉపచేతనావస్థలో ఇటువంటి రూపాలకు పాళ్లు కలవడం జరుగుతుంటుంది. వీటికీ కూడా ఒక క్రమమూ, నియమమూ ఉంటుందన్న విషయం మట్టుకు గుర్తుపెట్టుకోవడం ఎంతయినా అవసరం.

'అన్వేషించు' అనే అర్థంలో 'వెదుకు, వెదకు' అని రెండు క్రియాధాతువులున్నాయి. వీటిని వ్యవహారంలో కొంచెం మార్చి వెముకుతున్నాడు, వెదుకుతున్నాడు, మున్నగు విధంగా వాడుకోవడం జరుగుతూంది. కొందరు దకారస్థానంలో తకారాన్ని ప్రయోగించడం కూడా కద్దు. అప్పుడు 'వెతుకు' అనే రూపం సిద్ధిస్తుంది. 'వెముకు' అనే ధాతువూ 'వెతుకు' అనే ధాతువూ ఏకాత్మకత్వంతోపాటు ఒకే శరీరంలో ఒదిగిపోయినప్పుడు 'నెతుకు' అనే రూపం ఏర్పడుతుంది. ఇదీ కొందరి ఉబలాటాన్ని వాటంగా తీర్చ గలుగుతూనే ఉంది.

ఇలాగే 'వృద్ధిపొందు' అనే అర్థంగల 'పెరుగు, ఎదుగు అనే రెండు ధాతువులూ పెరిగిపోయి, ఒక దానిలో ఒకటి ఒదిగిపోయి 'పెదుగు' అనే ఆకారాన్ని ధరించాయి. 'మెదలు, మసలు' అన్న రెండు ధాతువులూ 'చలించు' అనే అర్థంతో ఉన్నాయి. వీటిలో కదలిక మొదలై, యివి రెండూ కలిసిపోయి 'మెసలు' అనే రూపాన్ని ధరించాయి.

ఈ విధంగా రెండేసి రూపాలు పరస్పర సహకారంతో స్వరూప సంసర్జనం చేసుకుంటున్నాయి. వ్యవహారంలో జరుగుతున్న యీ పరిణామానికి కొంత పరిహారం చెల్లించుకోవలసిన అవసరంకూడా కలుగుతూంది. అయినా, నూతన సృష్టి జరుగుతున్నప్పుడు కొంత పాత ఇంధనంగా ఉపయోగపడక తప్పదు. అప్పుడు దాన్ని అంటిపెట్టుకుందామంటే కుదరదు. ఇంతకూ ఇక్కడకూడా వాడుకలో ఉన్నరూపాలకు పూర్వ రూపాలేమిటో స్పష్టంగానే నిరూపించగలుగుతూ ఉన్నాము.

7

వీటన్నిటినీ ఇంత యిదిగా చూశాక, మళ్ళా మొదటికివచ్చి కొంచెం విదానించడం మంచిది. నేను 'చూశాక' అని అంటే కొందరయినా 'చూచినాక'

అని అంటారు. నేనన్నదే సరియైనదని, ఇతరులు చెప్పినది తప్పని చెప్పడం నా మతం కాదు; చెప్పినా లోకసమ్మతం కాదు. పదిమందీ మాట్లాడుతుంటే విన్నాక, యే నిర్ణయమూ [illegible] వారి అలాక్కూడా [illegible] ఆనాక, ఎంత చదివినా ఏమీ లాభం లేదు. అందుకే బాగా పరిశీలనం చేశాక, మన అంతరాత్మ పూర్తిగా తృప్తిపడ్డాక మన నిర్ణయాన్ని బయటపెట్టడం మంచిది. విన్నాక, అన్నాక, చేశాక, తిన్నాక మొదలయిన రూపాలతోపాటు విని నాక, అనినాక, [illegible] నాక, తీరినాక అనే వాటిని కూడా వ్యావహారికంగా ఉపయోగించడం జరుగుతున్నవన్న సంగతి [illegible] సమంజసం. పట్టి సమంజసం కాదనం మాత్రమే కాదు. అవే కాస్త పురాతనత్వాన్ని పులుముకున్నట్లుగా కూడా కనిపిస్తున్నాయి. వీటి వాలకం చూస్తే, కీలకం వీటిలోనే ఉందేమో కూడా అనిపిస్తుంది. చూద్దాము.

'తీరాక' మొదలైన రూపాలను చూస్తే, 'ఎలా విశ్లేషించాలి' అన్న సందేహం పుడుతుంది. తీరు+ఆక అని అనాలా తీర+ఆక అని అనాలా? తీరి+ఆక అని అనాలా? ఏమనాలో తెలియదు. ఆలోచించే కొద్దీ యింకా ఎన్ని రకాలుగా నయినా అనవచ్చు ననిపిస్తుంది. వీటిలో ఏ ఒక్కటీ సరియైనది కాదని కాని అన్నీ సరియైనవని కావడానికి [illegible] కాదు పై వాటిలో ఏ ఒక్కటీ [illegible] సరియైనది కాకపోవచ్చు. ఇప్పుడే మనకు ప్రాచీన రూపాల అవసరం కలుగుతుంది. 'తీరినాక' మొదలయిన రూపాలనుచూస్తే 'తీరిన+ఆక' అని మాత్రమే విశ్లేషించడం వీలవుతుంది. అదే సరియైన పద్ధతికూడా. దీన్నిబట్టి భూతకాలిక క్రియాజన్య విశేషణంమీద 'ఆక' అనేది చేరుతుందన్న నిర్ణయానికి రావచ్చు. ఇప్పుడు 'తీరినాక' మొదలయిన రూపాల నిష్పత్తిని చూపించడం సులువే. కాని 'తీరాక' మొదలయిన రూపాల విషయంలో కొంత చిక్కు [illegible] మాట మాత్రం నిజం. అసలే ఆ చిక్కు విప్పడానికి యత్నించడం కన్నా ముందు, ఇలాంటి మార్పులే పొందిన మరొక ఉదాహరణం నిదర్శనంగా గ్రహిద్దాము. లక్షణం ఎంత చెప్పుకున్నా అర్థంకాని విషయం కూడా లక్ష్యం చూపించి నిరూపించేటప్పటికి క్షణంలో అర్థమవుతుంది. పోనీ! అర్థమవుతుందని నిశ్చితంగా చెప్పడం దేనికి? అర్థం కావడానికి ఎక్కువ వీలున్నదనుకోవడానికి ఆక్షేపం లేదు కదా! అందువల్ల ఆ ఉదాహరణం చూద్దాము.

భూతకాలంలో ప్రథమ పురుషైక వచన క్రియగా 'వచ్చాడు' అనే రూపాన్ని మనం వాడుతూ ఉంటాము. కొందరు 'వచ్చినాడు' అనికూడా వాడుతూ ఉంటారు. నిజానికి 'వచ్చినాడు' అనేది తొలి రోజుల్లో క్రియాజన్యవిశేషణంగానే ప్రయోగింపబడింది. ఏమయితేనేం? క్రమంగా గ్రాంథికంలోనూ, వ్యావహారికంలోనూ కూడా క్రియా సామర్థ్యాన్ని సంపాదించుకుంది. భూతకాలిక క్రియాజన్య విశేషణం మీద 'వాడు' అనే తచ్ఛబ్దం చేరగా 'వచ్చిన+వాడు' అని యేర్పడ్డాయి. ఇక్కడ తచ్ఛబ్దవకారానికి లోపం రాగా 'వచ్చిన+ఆడు' అయియ్యి, సంధి కలిసి 'వచ్చినాడు' అనే రూపం సిద్ధించింది. దీన్నిబట్టి తక్కిన ప్రక్రియనంతటినీ బుట్టలో పెట్టి ప్రక్కకు నెట్టి 'వచ్చినావు, వచ్చినాను' అనే రూపాలూ వాటి బహువచన రూపాలూకూడా ఏర్పడ్డాయి. వ్యవహర్తల మనస్సులో 'డు' ప్రథమ పురుషైక వచన ప్రత్యయంగా నిల్చినట్లే 'వు, ను' అనేవి మధ్యమోత్తమ పురుష ప్రత్యయాలుగా నిల్చి ఉన్నాయి, అందువల్లనే 'వచ్చినాడు' అన్నచోట ఉన్న 'డు'ను తొలగించి మిగిలిన భాగానికి 'వు,ను'లను తగిలించడం జరిగింది॥ వచ్చినా+వు=వచ్చినావు। వచ్చినా+ను=వచ్చినాను॥ నిజానికి 'వచ్చినా' అనే రూపం దీర్ఘాంతమై ఉండే అవకాశం లేనే లేదు. 'వచ్చినాడు' అనేచోట ఉన్న దీర్ఘం 'వాడు' యొక్క అవశిష్ట రూపానికి సంబంధించినటువంటిదన్న సంగతిని పై ప్రక్రియను బట్టి మనం స్పష్టంగా తెలుసుకున్నాము. అయినా, అసలు తత్త్వంవేరు; ఆచరణ వేరు. ఇక్కడకూడా అభిలాషకో, అభ్యాసానికో, మరిదేనికో లొంగిపోవడం

వల్ల 'వచ్చినావు, వచ్చినాను' అనే రూపాలను కూడా కొందరు తమ రచనల్లో ఆదరించడం జరిగింది. ఇంక వాడుక సంగతి చెప్పనే అక్కరలేదు. 'వచ్చినావు' అనేది 'వచ్చావు' అనీ, 'వచ్చినాను' అనేది 'వచ్చాను' అనీ, 'వచ్చినాడు' అనేది 'వచ్చాడు' అనీ రూపు మార్చుకున్నాయి. అంటే నవర్ణం వాడుకలో నలిగిపోయి తొలగిపోయిందన్న మాట! అప్పుడు 'వచ్చి+ఆడు=వచ్చాడు' అని అవుతుంది. తక్కిన రూపాలుకూడా ఇలాగే ఏర్పడతాయి.

పై పోలికనుబట్టి 'తీరాక' మున్నగు రూపాలను పరిశీలిస్తే ప్రక్రియను గుర్తించవచ్చు. 'తీరినాక' మొదలయిన రూపాలు ఏర్పడినాక నకారలోపం చేస్తే 'తీరి+ఆక' అని మిగిలి 'తీరాక' అవుతుంది. ఇలాగే 'వచ్చాక, చెప్పాక, తన్నాక' మొదలయిన రూపాలు ఏర్పడతాయి.

ఇప్పుడింకొక సందేహం కలుగవచ్చు 'వచ్చిన' అనే భూతకాలిక క్రియాజన్య విశేషణాన్ని తీసుకోవడ మెందుకూ? తీసుకున్నాక చివరి నకారాన్ని లోపింప జెయ్యడమెందుకూ?' అని. ఈ ప్రశ్న పైకి చూచే సరికి సముచితంగానే కనిపిస్తుంది. ఎందువల్లనంటే పైని చెప్పిన దాన్నిబట్టి పూర్వరూపంగా నిలిచేది ఒక్క 'వచ్చి' అనేదే. కాబట్టి అంత పొడుగు ఏదో చెప్పుకోవడంకన్నా క్త్వార్థకంమీదనే యీ 'ఆక' చేరుతుందని అనుకోవచ్చుగదా! కాని యిది యింతటితో ఆగేదికాదు. అయినా 'వచ్చినాక' మొదలయిన చోట్ల ఉన్న పూర్వ శబ్దాన్ని ఒక రకంగానూ, 'వచ్చాక' మొదలయినచోట్ల మరొక రకంగానూ పేర్కొనవలసివస్తుంది. 'పోనీ! అక్కడకూడా క్త్వార్థకమే చెప్పుకుని పైని నకారం ఆగమంగా విధించుకుందా' మంటే అలాంటి అవకాశం కనిపించదు. 'వచ్చినాడు' మొదలయినచోట్లఉన్న ప్రక్రియ తద్భిన్నంగా స్పష్టంగా కనిపిస్తూఉంది. కనిపిస్తూఉన్న దాన్ని కన్పించడం లేదనుకోవడమూ, చూస్తూ ఉన్న దాన్ని చూడలేదనుకోవడమూ లోకజ్ఞత అయితే కావచ్చుగాని ఉచితశాస్త్రమార్గం కాదు. ఇది యిలా ఉండగా, ఇంకొక యిబ్బంది ఉంది.

తెలుగు ధాతువుల్లో కొన్ని, అంటే 'అను, కొను, పడు, చెడు' మొదలయినవి నకారాంతము లయినప్పుడు వైకల్పికంగా రూపాంతరధారణం చేస్తాయి. చివరి హల్లు ద్విత్వాన్ని పొందుతుంది; పైని అత్వం చేరుతుంది. అప్పుడే 'అను' అనే ధాతువు 'అనిన' అనే రూపంతోపాటుగా 'అన్న' అనే రూపాన్నికూడా పొందుతుంది. దీనిమీద 'ఆక' అనేది చేరితే 'అనినాక' అనే రూపంతోపాటుగా 'అన్నాక' అనే రూపంకూడా ఏర్పడుతుంది. పూర్వం సందేహించినట్టుగా 'అని' అనే క్త్వార్థకం మీదనే 'ఆక' చేరితే 'అనాక' అనే అనిష్టరూపం కలుగవలసివస్తుంది. అలాంటిది వాడుకలో ఎక్కడాలేదు. కాబట్టి క్త్వార్థకాన్ని పూర్వరూపంగా గ్రహించడం కుదరదు. ఈ పద్ధతిలోనే 'కొనినాక, కొన్నాక, పడినాక, పడ్డాక, చెడినాక, చెడ్డాక' మొదలయిన రూపాలన్నీ ఏర్పడతాయి.

ఇంకొక ధాతువుపోయే పోకళ్ళు కూడా ఇక్కడే చూద్దాము. 'పోవు' ధాతువు 'పోయే' అని మారినట్లు 'అగు' ధాతువు 'అయ్యే' అని మారుతుంది. గ్రాంథికంలో ఉన్న 'పోయెదు, అయ్యెదు' మొదలయిన వాటికీ పరిణత రూపాలే యివి. ఇక్కడ శేషం, అగు ధాతువులయొక్క చివరి హల్లులకు యకారం ఆదేశంగా వస్తున్నది. ఇది ఇత్వంగాని ఎత్వంగాని పరమయ్యేటప్పుడు జరుగుతూ ఉంటుంది. వ్యావహారికంలో ఈ ఇత్వంగాని ఎత్వంగాని గారాలు పోయి దీర్ఘాలు సాగుతాయి. అన్నప్పుడు సాగుతాయనికాదు; సాగినంతకాలమూ సాగుతాయి.

'అగు' అనేదానికి 'ఎను' అన్న భూతకాలిక ప్రథమైకవచనం పరమయిందనుకుందాము. అప్పుడు 'అయు+ఎను' అని అవుతుంది. ఆ తరువాత దీర్ఘం వచ్చి 'అయు+ఎను' అని కావడంవల్ల 'అయెను' అవి అవుతుంది. అదే 'అయ్యెను' అని కూడా కావచ్చు. అయితే 'అగు' ధాతువు నకారాంతమయ్యాక 'అయిన' అన్నరూపంలో ఉంటుంది. దీనిమీద 'ఆక'

చేరితే 'అయినాక' అన్నరూపం ఏర్పడుతుంది. నవరానికి లోపం జరిగితే 'అయి + ఆక' అనియుండి సంధికావడంవల్ల 'అయాక' అని మాత్రమే కావలసి వస్తుంది. ఈ రూపమూ ఉన్న మాట వాస్తవమే. కాని అత్యధిక ప్రచారంలో ఉన్నది 'అయాక' అన్న రూపం మాత్రమే. 'అయ్యేను' మొదలయిన రూపాల్లో వచ్చినట్టుగానే యిక్కడకూడా యకారానికి ద్విత్వం వచ్చిందేమో అనిపిస్తుంది. కాని అలా రావడానికి వీల్లేదు. ఎందువల్లనంటే 'అయ్యేను' అనే దానిలో 'ఆ' అనే దీర్ఘాక్షరంమీద ఉండే యకారానికి ద్విత్వం కలగడమూ, అందువల్ల అది హ్రస్వంగా మారడమూ జరిగింది. ఇక్కడ అసలు దీర్ఘమే లేదు; అందువల్ల ఈ మార్పులకూ అవకాశంలేదు. 'అయి + ఆక' అని ఉన్నప్పుడు రావలసిన అపదాదిసంధి రాకపోతే యడాగమం కలిగి 'అయి + యాక' అని రావాలి. ఇప్పుడుకూడా ద్విత్వానికి అవకాశంలేదు. కానీ, తాలవ్యాలు బాంధవ్యాన్నే గట్టిగా తలచి, ఆ దృష్టితో చెట్టపట్టాలుపట్టాయి. అప్పుడు 'అయ్యాక' అన్న రూపం ఏర్పడుతుంది. అంటే 'అయి' అనేరూపం చివరనున్న ఇత్వానికి లోపం కలిగి 'అయ్ + యాక' అన్నవిధంగా ఏర్పడి అత్యంతసాన్నిహిత్యంవల్ల 'అయ్యాక' అని అయ్యాయన్నమాట!

అయితే, యిదంతా సక్రమమైనా మార్గమేనా? అన్న సందేహం కలుగక మానదు. అందు, అవ, అనేవి తప్ప ఏ అపదం పరమందున్నప్పటికీ సంధి అవుతుందనేది వ్యాకరణ ప్రవచనం. అటువంటప్పుడు ఇక్కడ సంధి కాకపోవడానికి కారణమేమిటి? ఇది అపదం కాదేమో అనుకుంటే, ఇంతకుముందు తప్పిచోట్ల తప్పనిసరిగా సంధిచేయవలసిన బలీయమైన అవసరం కనిపించదు. అయితే, వ్యాకరణంలో 'అవుతుంది' అన్నట్టుగా ఉందే కాని 'నిత్యంగా అవుతుంది' అన్నట్టుగా లేదు. అంటే, సంధికాని చోట్లు ఎక్కడయినా ఉండడానికి అవకాశం ఉందని అర్థం. ఇక్కడకూడా అటువంటి అవకాశమే కలిగిందన్నమాట! ఇది కేవలం ఊహాబలంవల్ల చేస్తున్న వాదం మాత్రంకాదు. అందుకు ఒక నిదర్శనం గ్రాంథిక భాషలో నుంచే చూద్దాము.

అనియును కనియును మొదలయిన వాటిలాగానే 'అగు' ధాతువుయొక్క క్త్వార్థకంమీద సముచ్చయార్థకం చేరినప్పుడు 'అయియును' అని కావాలి. ఇక్కడికిక్కడే పైని చెప్పుకున్న చిక్కు తటస్థపడింది. 'అని + ఉను' అని అన్నప్పుడు 'ఉను' అనేది అపదం. అందువల్ల సంధి కావలసిందే; కాని ఏమాత్రమూ కావడంలేదు. అందువల్లనే యడాగమం కలిగి 'అనియును' అని అవుతుంది. ఆ క్రమంలోనే 'అయియును' అనేదికూడా ఏర్పడుతుంది. అయితే, యిది యీ రూపంలో ఎక్కడా కనిపించదు. ఎప్పుడు కనిపించినా 'అయ్యును' అన్న మోస్తరుగానే కనిపిస్తుంది. అంటే 'అయి + యును' అని ఉండగా ఇత్వానికి లోపంకలిగి 'అయ్ + యును' అనియై అత్యంతసాన్నిహిత్యంవల్ల 'అయ్యును' అని మారిందని అర్థం. వ్యాకరణాలు చెప్పినా చెప్పకపోయినా జరుగుతున్న మార్పును ఒప్పుకోక తప్పదు గదా!

ఇలాగే 'అయి + ఆక' అనేవి 'అయి + యాక' అన్నట్లు మారి, ఆ తరువాత ఇత్వలోపం చెంది 'అయ్ + యాక' 'అయ్యాక' అన్న రూపాన్ని పొందుతాయి.

ఇదంతా అయ్యాక, ఎవరయినా మరొక వంక మంచి సందేహం లేవదీయవచ్చు. 'అను, పడు' మొదలయిన ధాతువుల చివరి హల్లుకు ద్విత్వం కలిగినట్టుగానే 'అగు' ధాతువుక్కూడా కలిగిందనరాదా? అనిపిస్తుంది. ఇది వాటి శ్రేణిలో చేరదు. ఈ 'అయ్యాక' అన్నచోట తప్పిస్తే 'అయిన'యొక్క స్థానంలో 'అయ్య'అన్నరూపం వచ్చిందన్న భ్రమకూడా ఎక్కడా కలుగదు. 'అనినవాడు, అనినది' మొదలయినవి 'అన్నవాడు, అన్నది'అని మారుతాయి. అందులోనూ మొదటిది 'అన్నాడు' అని కూడా మారుతుంది. కాబట్టి 'అయ్యాక' అన్నది 'అన్నాక' మొదలయినవాటి

విధంగా కనిపిస్తున్నా, నిర్మాణక్రమంలో చాలా భేదా ఉన్నదన్న సంగతిని గుర్తించుకోవడం బాగుంటుంది.

యకారంతో అంతమయ్యే 'వ్రాయు, చేయు' మొదలయిన ధాతువులు ఇనాంతములైనప్పుడు వ్రాసిన, చేసిన మొదలయినవిధంగా అవుతాయి. అంటే యకారంస్థానంలో సకారం వస్తుందన్నమాట! 'వ్రాసినాక, చేసినాక' అనే రూపాలు ఆనంతర్యార్థంలో ఏర్పడతాయి. పైని చెప్పుకొన్నట్టు నవర్ణం లోపిస్తే 'వ్రాసి+ఆక' అనీ 'చేసి+ఆక' అనీ అవుతాయి. ఇప్పుడు సంధి జరిగి 'వ్రాసాక' మొదలయినవిధంగా రూపం ఏర్పడాలి. కాని ఆ విధంగా ఉచ్చరింపగా వింటే, తెలుగువాళ్లు ఉలిక్కిపడతారు. 'శ ష స' అనేవి ఊష్మవర్ణాలు. ఇందులో మళ్లా ఉచ్చారణ స్థానాన్నిబట్టి విడమరచి చెప్పాలంటే శవర్ణం తాలవ్యం; షవర్ణం మూర్ధన్యం; సవర్ణం దంత్యం. 'వ్రాసి'అని అన్నప్పుడు సకారం దంత్యమే అయినా 'ఇ'అనే తాలవ్యాచ్చుతో కూడిఉంది. సంధి జరిగేటప్పటికి తాలవ్యోచ్చారణం పూర్తిగా నష్టమైపోతుంది. దాన్ని నష్టంకాకుండా చూసుకునేందుకు సకార స్థానంలో శవర్ణాన్ని ఉచ్చరించడం జరుగుతుంది. 'వ్రాశాక' అనిఅంటే సంధికి సంధినీ పాటించినట్లయింది; ఉచ్చారణకు ఉచ్చారణనూ నిలబెట్టుకున్నట్లయింది. 'చేశాక' అనేది కూడా ఈ విధంగానే ఏర్పడుతుంది.

నిజానికి 'చూచు' ధాతువును ఈ వరుసలో కూర్చోబెట్టవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. కాని 'నగుదునమ్మా' అని తానూ ఒకసీట వేసుకు కూర్చున్నాక, ఏమీ అనడానికి అవకాశంలేదు. చూశాక కూడా చూచీ చూడనట్లు పట్టించుకోకుండా ఉండడం భావ్యంకాదు. ఇక్కడిది 'చూచు' ధాతువే అయినప్పటికీ, రెండవ చకారం కొన్నిచోట్ల యకారంతో తుల్యంగా వ్యవహరిస్తుంది. అందువల్ల 'చూసినాక, చూశాక' అన్నట్లు వ్యవహారం కలిగింది. ఈవిధంగా 'ఆక'తో అంతమయ్యే కొన్నిరూపాల నిష్పత్తిని చూశాము. అయినా, ఇంకా దాని పుట్టుక మట్టుకు గుట్టుగానే ఉండిపోయింది.

8

ఈ 'ఆక' గురించి ఆలోచిస్తూ ఉంటే, ఈలోగా ఇంకొకమాట 'నేనున్నా'నంటూ అడ్డు తగిలింది. వెదకబోయిన తీగ కాళ్లకు చుట్టుకున్నట్టూ, ఆడబోయిన తీర్థం ఎదురైనట్టూ అనిపించింది.

'ఇప్పుడుకాదు; ఆనక చూసుకుందాము' అని అందామనుకున్నాను. ఆ ఎదురైనదేదో, నా మనసులోనే పదిలంగా కుదురుకుని ఉన్నదన్న సంగతి గుర్తింపగలిగాను. 'ఆనాక' అంటేకూడా 'అనంతరం' అనే అర్థం. అయితే యిక్కడ కూడా ఆలోచన రెండుముఖాలుగా సాగడానికి అవకాశంలేకపోలేదు.

'ఆనాక' అన్నది అఖండరూపమా? కాక 'ఆన+ఆక' అని కాని 'ఆని+ఆక' అని కాని 'ఆను+ఆక' అని కాని, విభక్తం కావడానికి అవకాశం ఉందా? మొదటిభాగమూ, చివరిభాగమూ ఏమీ పనికి వచ్చేటట్టు కనిపించడంలేదు. నడుమనున్న 'ఆని+ఆక' అన్నది కొంత పనికి రావచ్చుననే ఆశ పుట్టిస్తూ ఉంది. కాని పైన మనం సాధించుకున్న ప్రక్రియ ననుసరించి చూచినప్పుడు 'ఆనాక' అన్న రూపంతోపాటుగా 'ఆనినాక' అన్నరూపానికి కూడా అవకాశం ఉండాలి. అప్పుడు 'ఆను' ధాతువు యొక్క అర్థాన్నికూడా విమర్శన చేసుకోవలసిన అవసరం కలుగుతుంది. కాని అలాంటి రూపమేమీ ఉన్నట్లు గోచరంకాదు. కాని హ్రస్వమధ్యంగా 'అనక' అన్నరూపం ఒకటి కనిపిస్తున్నది. ఇది మన విభాగానికి ఏమాత్రమూ సహకారం చేయకపోగా, ఇంకా కొంచెం దూరానికి నెట్టుకుపోతున్నది. అందువల్ల 'అనక' అనే దానిని 'ఆనాక' అనే దానికి పర్యాయంగానే గ్రహించడమూ అఖండంగానే గ్రహించడమూ సత్యానికి సన్నిహితంగా ఉండడమవుతుందని ఆశిస్తున్నాను. ఇంకా ప్రక్కప్రక్కల 'అనిక్కి' అనేరూపమొకటి నక్కిఉన్న సంగతిని మనం మరచిపోరాదు.

అయితే, యీ మూడింటిలో దేనికిన్నీ గ్రాంథికంతో సంబంధమున్నట్లులేదు. వ్యావహారికంలోనే పుట్టిన యీమాట వ్యావహారికంలోనే నాని నాని మధ్యనున్న నవర్ణాన్ని కోల్పోవడంవల్ల 'అక' అని మారి ఉంటుందని అనిపిస్తుంది. ఇలా మారిన రూపమే 'చూశాక' మున్నగుచోట్ల ప్రత్యయ రూపంలో పదవీస్వీకారంచేసి ఉంటుందని ఊహించవలసివస్తున్నది.

ఎంత సమర్థత ఉన్నా ఇతరుల సహకారం లేకపోతే తగిన పదవినిపొందడం సాధ్యంకాదు. కొన్ని చోట్ల పూర్వపూర్వం సాధనఫలం అనంతరులకు అనంతబలం అందిస్తుందన్నా ఆశ్చర్యంలేదు. 'ఆనాక' అన్నదానికి ముందు ఇందాక, అందాక అన్న వాటిని కలుపుకుని చూస్తే ఒక ఆనుపూర్వి కనిపిస్తుంది. వీటి అర్థాలిని మొదట్లో ఒకరకంగా చూశాము. 'ఇందాక' అని అంటే 'ఇంతవరకు' అనీ 'అందాక' అని అంటే 'అంతవరకు' అనీ అర్థాలు చెప్పుకున్నాము. యౌగికంగా వాటికి రావలసిన అర్థాలు కూడా అవే. కాని, దేనికయినా ఒకరూఢి యేర్పడ్డ తర్వాత అదే గాఢంగా పనిచేస్తుంది: అదే చప్పున స్ఫురిస్తుంది. అదే లోకధర్మం. అయినప్పటికీ రూఢి యిక్కడ యౌగికాన్ని చంపకుండానే నిరూఢిని సంపాదించుకుంది. అందుచేత అంతకుముందు చెప్పుకున్న అర్థాలూ వ్యవహారంలో ఉన్నాయి. అవి ఉండగానే 'ఇందాక' అంటే 'కొంతసేపటికి పూర్వం' అనీ, 'అందాక' అంటే 'ప్రస్తుతానికి' అనీ కొత్త అర్థాలు పెత్తనాన్ని పాగిస్తున్నాయి. ఈ వరుసలోనే 'ఆనాక' అనేది 'కొంతసేపటికి తరువాత' అనే అర్థాన్ని అందిస్తూ ఉంది. అంటే 'అందాక' అనేది ప్రస్తుతాన్ని తెలుపుతూ ఉండగా 'ఇందాక' అనేది తత్పూర్వసమయాన్ని 'ఆనాక' అనేది తదనంతర సమయాన్ని తెలుపుతూ ఉన్నాయి.

కేవలమూ అంత్యప్రాసచేతనే ఐక్యాన్ని భజిస్తున్నట్లుగా కనిపించే ఈ మూడు మాటలూ అర్థవిశేషంచేతనూ, ప్రయోగవిధానంచేతనూ కూడా తదైక్యాన్ని నిలబెట్టుకుంటున్నాయి. అంతేకాదు. మూడు కాలాలకూ ముచ్చటగా మూడుముళ్లూవేసి ఆంతర్యానికి అనుకూలమైన ఒక నైరంతర్యాన్ని సాధిస్తున్నాయి.



శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవుల విజయ యాత్రలు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

6

శ్రీ తిరుపతికవుల విజయయాత్రలలో నానారాజ సందర్శనము ప్రత్యేకఘట్టము. వారు లబ్ధ ప్రతిష్ఠులైన తర్వాత ఎందరో రాజులు వారిని ఘనముగా సమ్మానించిరి. ఈ గౌరవమునకు రాచబాట పడకముందు వారెంతో చిక్కులుపడవలసి వచ్చినది. మొదట వెంకటగిరిలో, తర్వాత గద్వాల, ఆత్మకూరు, వనపర్తి, విజయనగరములలో! తక్కినచోట్ల చిక్కులు స్వల్పమైనవి.

అప్పటి రాజాల సంగతి ముందు కొంత ప్రస్తావించుట అవసరము. నైజాము సంస్థానములోని ప్రభువులకు తప్ప, బ్రిటిషు భాగములోని వారికి రాజమహారాజబిరుదములున్నను ఎవరికిని ప్రభుత్వాధికారములు ఏమిలేవు. కొద్దిగ్రామములకో, ఎక్కువ గ్రామములకో మేలువరను శిస్తు వసూలుచేసికొను అధికారము మాత్రమే కలవారు. పాలిత ప్రజలపైన సివిలు క్రిమినలు అధికారాలు లేవు. ఐనా వారికున్న పలుకుబడిని బట్టి ప్రభుత్వమున్నవారివలెనే వ్యవహరించేవారు.

వారి ఆస్థానాలను ఆశ్రయించి పండితులు, పెద్దలో పిన్నలో ఉండేవారు. ఎటువంటివారైనా వారి మాటలకే ఆయాప్రభువులవద్ద చెల్లుబాటు ఉండేది.

అప్పటి ఆస్థానములన్నిటిలో దిగ్దంతులైన పండిత ప్రకాండులున్నది విజయనగరము. ప్రభువు ఆనంద గజపతులు స్వయముగా పండితుడేకాక విస్తార సంస్కృతికలవారు.

ఇక నైజాము రాజ్యములోని గద్వాల, ఆత్మకూరు, వనపర్తి ప్రభువులకు సివిలు క్రిమినలు అధికారాలుకూడా ఉండేవి. అక్కడ ప్రధాన విద్వాంసులు శ్రీ వైష్ణవులు. వారు పెద్దపెద్ద విద్వాంసు లవుటచే వారి మాటకు తిరుగు ఉండేదికాదు. స్మార్తులైన తిరుపతికవులకు తమ ప్రభువులు సమ్మానములు చేయకుండా ఎన్నో ఆటంకాలు కలిగించినారు. అన్నిటిని ప్రతిఘటించి గద్వాల ఆత్మకూరులలో తిరుపతి కవులు విశేషగౌరవములు పొందగలుగుట, వారు ప్రదర్శించిన ప్రజ్ఞాప్రభావమువల్లనే. అట్టి విజయము వనపర్తిలో మాత్రము సాధ్యపడినట్లు తోచదు. కాని ప్రభువు సమక్షములో అవమానకరముగా చాటువులు చెప్పిరాగలుగుటే వారి మహత్త్వమునకు నిదర్శనము.

వనపర్తిలోవలెనే విశాఖపట్టణములో శ్రీ గోడె గజపతిరావుగారు కవులను సరిగా సమ్మానింపలేదు. వారికి కవులు పెట్టుకున్న అర్జీపైకి వినయము, అంతరములో కొంతధూర్తత్వమూ ప్రదర్శిస్తుంది. అది చాలా మరిచిచాటువు!

'సంగరశక్తి లేదు, వ్యవ
సాయముచేయుట సున్న, సంతలో
నంగడివేసి యమ్ముటది
యంతకుమున్నె హుళక్కి, ముష్టికిన్
బొంగు బుజాన వేసికొని
పోయెద మెక్కడికేని, ముష్టి చెం

బుం గొనిపెట్టు మొక్కటే, య
మోఘ మిదేకద యంతిరాణ్ణృపా'

వనపర్తిలో దానినే మరియొక విధముగా ప్రద
ర్శించినారు. గద్వాల, ఆత్మకూరు, విజయనగరాదు
లలో సమ్మానములు పొందినతర్వాతనే కవులు వనపర్తి
ప్రభువును దర్శింపగలిగిరి. అప్పటికి ఏనిమిదేళ్లనుండి
వెళ్ళుచున్నను దర్శనము కాలేదు. వనపర్తి ప్రభువు
వదాన్యుడని ప్రసిద్ధి. కవులు వ్రాసిన పద్యాలను
బట్టి, తమవలన ప్రభువు కావ్యమొకటి అంకితము
గొని ఘనముగా గండపెండారమువంటి బిరుదము
లతో సమ్మానించునను నాశతో ఉన్నట్లు కనబడును.
కాని ప్రభువు కృతి పొందలేదు. అవధానమైన
చేయి ఏక పది రూప్యము లిచ్చెను. కవులు మండి
పడి యిట్లనిరి:

'తరుడుగ వత్తురంచును మ
హాకవులంచును దోడివారలం
దొరు నవధాన కీర్తిగని
నూరులు వేలు నొసంగిరంచు నీ
వెరిగియు, మేటిదాతవయి
యే, పదిరూపిక లిచ్చినావుగా
తిరుపతి వెంకటేశకవి
ధీరుల కో వనపర్తి భూవరా!'

'అన్నములేక వచ్చితి మ
టంచు మనమ్మున నెంచినావొ?,
చిన్నగజాచు లేట యశము
సేయునటంచు దలంచినాడవో.'

'అనుభవించితిమి దివ్యభోగములను రా
జాధిరాజులకన్న నధికముగను
సంచరించితిమి రాజ్యస్థానముల బూర్వ
కవులకన్నను నిరాఘాటముగను
ఆర్జించితిమి యింత యతిథుల కిడి మేము
ననుభవింపగ జాలినట్టి వృత్తి
రచియించితిమి వచోరమణి తోడుగ రస
వంతమ్ములైన ప్రబంధములను
రాజమిత్రుల మదిగాక రాజబంధు
వులము కవిరాజులను పదువురుగలట్టి
కులప్రవాహము మాకెందు గొదవలేదు
కీర్తికై రాక చుమి వనపర్తిభూప.'

'ఏదుకేతెంచితి మటంచు నెడద దుఃఖ
పడుటయేమేటి లాభమ్ము పార్థివేంద్ర,
ద్రవ్యమిదియేల కైకొమ్ము దయయె చాలు,
దానికింత యనెడి వెల లేదర ధిప.'

'సివిలు మొదలగు నధికృతి చెలగు మీర
లేమి యొసరించినను మంచిదే యటంచు
సంతసింతుము మాకెట్లు సంభవించె
నేని యది హెచ్చు గౌరవమింతకన్న.'

కవులను చెరసాలలో వేయించగల అధికార
మున్న ప్రభువు వనపర్తిరాజా! ఆకాలపు నైజాము
రాజ్యములో చిన్న నేరానికే ఒకసారి జెయిలులోవేసిన
మనిషి పతా దొరకడానికి నెలలుపట్టేదని మనము
గుర్తుంచుకోవలె!

వనపర్తినుండి తిరిగి వచ్చుచు శ్రీ తిరుపతి
చెప్పిన పద్యములో ఒకటి.

'పొందు గద్వాల కాత్మకూర్పురమునకును
ఏమొసంగిన సరసు లా భూమిపతులు
వినుడు మామాట, పైనెందు జనకుడయ్యు
పాకనాటి నృపాలు రెప్పట్టు లేరు.'

శ్రీ వెంకటశాస్త్రి చెప్పిన పద్యము ఇంకొక
విధముగా ఉన్నది.

'ఒక యేగానికి జిన్నికుర్రనికి
నాయుష్కర్మ జేయించి దా
నికినై కాని యొసంగి తక్కునగమున్
దెమ్మన్న నాచేత లే
దక యాగాను, క్షౌరపు గృతికి
ద్దా నంగీకృతిం జొన్పు లా
భ్యకులాయమ్మగు ముద్దరాలి
చరితం బాలించితే తిర్పతీ!'

ఈ రెండు పద్యాలలో కవులిద్దరిలో వ్యత్యాసము కూడా కనిపిస్తుంది. తిరుపతి సూటిదనము, వెంకటకవికి లోకామనుభవమువలన కలిగిన వ్యంగ్య వైభవము గోచరిస్తవి.

7

తక్కిన ఆస్థానాలలో వివాదాలన్నీ ఒక ఎత్తూ, గద్వాల ఆత్మకూరులలో జరిగిన తగాదాలు ఒక ఎత్తూ. ఆ రెండు సంస్థానాలలో తుదకు వారికి ప్రాప్తించిన విజయాలుకూడా నిస్తులమైనవే. రెండు సంస్థానాలకు కృష్ణానదియే అడ్డము. రాజధానులకు మూడుక్రోసులే ఎడము. ఇద్దరూ రెడ్డి ప్రభువులే. రెండు సంస్థానాలూ పండితులను పరీక్షించి ఘనముగా సన్మానించినవే! రెండిటిలోను ఆస్థానవిద్వాంసులు గట్టివారే. గద్వాలవారికి కేశవస్వామి ఇష్టదైవము. అక్కడ ఏటేట కార్తికములో వేదశాస్త్ర పండితులకును, మాఘములో కవిగాయకులను సన్మానములు జరుగును. ఆత్మకూరువారికి కురుమతిస్వామి ఇష్టదైవము. అక్కడ ఫాల్గుణ మాసములో కవి పండిత గాయక నాట్యవేత్తలకు సన్మానమొనర్తురు. విద్వత్కవిపోషణలో రెండు సంస్థానములకును స్పర్థ కూడా కలదు. ఆరెండు సంస్థానములలో రెండు చిన్న భారతయుద్ధములు జరిగన తర్వాతగాని తిరుపతికవులకు సన్మానములు జరుగలేదు. సన్మానములు పొందువరకు వా రా యాస్థానములకు పోక మానలేదు. తిరుపతికవుల విజయయాత్రలకు ఆ రెండు సంస్థానముల సన్మానములును రెండు ఉన్నత జయపతాకలు. ముందు గద్వాలలో జయపత్రికపొందిన తర్వాతనే ఆత్మకూరుయాత్ర కావించిరి.

గద్వాలకు మొదటిసారి 1895 సం. మాఘ మాసప్రాంతములో వెళ్లిరి. వేళ కన్నములేక చాల బాధపడిరి. కష్టమైన ప్రయాణము. కవుల మనవులు ప్రభువు చెవి కెక్కలేదు. అక్కడ నప్పుడు గాయకులతో ఘనగౌరవముకాని విద్వత్కవులకు లేదని విరక్తితో తిరిగి వచ్చిరి

ఆ పిమ్మట విజయనగర యాత్రచేసి అక్కడ సన్మానము సాధించి, 1896 లో మరల గద్వాల వెళ్లిరి. ప్రవేశపరీక్షలో వారికి త్రిపాదసమస్య నిచ్చిరి.

> 'రామాయ రామభద్రాయ
> గురుం నత్వా2ఒకరోత్కవిః
> వేణీసంహార నాటకమ్...'

దానిని వెంటనే కవు లిట్లు చక్కగా పూరించిరి :

> 'తపస్స్వాధ్యాయనిరతం గురుం నత్వా ఒకరోత్కవిః
> రామాయ రామభద్రాయ వేణీసంహార నాటకమ్.'

అక్కడ ధర్మాధికారి ప్రభువు చెవిలో ఏవేవో నూరిపోసి అవధానసభ కాకుండ విఘ్నము కావించెను కోపముతో కవు లిట్లనిరి :

> 'ఆవాసమా, గౌతమాపత్యతటినీ త
> టీ రాజితంబైన యూరు మాకు......
> అట్టి మేమిట్టి గద్వాల కరుగుదెంచి
> కుటిలధర్మాధికారి వాక్కులను వినిన
> రాజుచే మన్ననలు పొందలేక యూర
> కేగుచుంటిమి మా శక్తి యీ నృపాలు
> చెవినివేయు మీవైన గేశవ, మహాత్మ!'

ఆ మాటలలో ప్రౌఢి కలసిన బెదరింపున్నది. గద్వాల ప్రభువులకు కేశవస్వామియెడలగల భయభక్తులచేతనే వారు కవిపండిత సన్మానములు చేయుట. అప్పు డాస్థానములోని ఆదిపూడి ప్రభాకర కవి ప్రభువుల కిట్లు ఆశువుగా సిఫారసు చేసెను:

> 'కనకాభిషేకమ్ము గావింపు మనలేదు
> వెయ్యారు లిమ్మనిమాడలేదు.........
> గండ పెండేరమ్ము గావలె ననలేదు
> మాన్యమ్ము లిమ్మని మనవి లేదు
> ఒక్కసభచేసి తోచిన వక్కలాకు
> లిచ్చి పంపించుమనుటకే యింతలాయె...'

దానితో ప్రభువు మనస్సు తిరిగినది. సంస్కృ

తాంధ్రములలో కవులచే 21—2—1896 న 57 మందికి శతావధానము చేయించి ఆనందించి, ప్రభువు కవులకు రాంకవములు హేమబిరుదములు నూరార్లు బహూకరించి ప్రతిపక్షి సమక్షములోనే 'తగిన కవి చంద్రు' లని ప్రశంసించి గద్వాల మొహరుతో జయపత్రిక సమర్పించిరి. అవధాన సమయములో కవులు ప్రతిపక్షులను నిశ్శంకముగా దుయ్యబట్టిరి.

* ఈ సమ్మానమునకు పూర్వమే 'శనిగ్రహము' అనుపేర పరోక్షముగా ధర్మాధికారిని నిందించినారు. అది 27 పద్యముల లఘు కృతి. ఐనా తిట్టు కవిత్వములో అద్వితీయమైనది. అన్ని తిట్టు కవితలలో వలెనే, అందులోను ప్రత్యక్షముగాను వ్యంగ్యముగాను కొంత అసభ్యత కూడా కలదు. మొదటి పద్యములో శ్లేషానుప్రాణితమైన వ్యంగ్య మెంతో యున్నది.

'ధరణీ నాయకు డుత్తముండవని నిన్
ధర్మాధికారమ్ము నం
దు రహిన్నిల్పుట, తుచ్ఛ బుద్ధివయి క్రిం
దున్ మీదునుం గాన కె
ల్లరి కార్యమ్ములు పాడు సేయుటకె నీ
లక్ష్యమ్ము మా బోటు లెం
చరు, చండాల, శనిగ్రహంబ యిక మా
సామర్థ్యముం జూడుమా!

ధర్మాధికారి శబ్దమును ధర్మ+అధిక+అరి అని కూడ విరువవచ్చును ధర్మము అనగా ధనుస్సు అను నర్థమున్నది. ధనుర్లగ్నము బృహస్పతికి స్వస్థానము. శని చండాలగ్రహము. ధరణీ నాయకుడు, రాజు—అనగా చంద్రుడు.

శని నింకా కవులిట్లు తిట్టినారు.

'నీ తోబుట్టువు దున్ననెక్కు......'

'నిరుడేతెంచిన, వచ్చువత్సరమటంటే కాదె...'

'కుంకా, పాపమటంచు నెంచక వృథా
కొండెంబులన్ రాజుతో...'

'నీకంటెన్ ఘనులంచు మమ్ము బనులెం
తే బేంగ్యాసం దాన బల్
శోకం బందకదా' సభన్ జెరచి నీ
శూరత్వముం జూపి తి
శ్శోకంబే. కడతేర్చు నిన్ను...

'గురుడున్ సూర్యుడు చంద్రుడున్ గుజుడు శు
క్రుండున్ బుధుండుం బర
స్పరముం గార్యము నిర్వహించుటకునై
పల్మారు యత్నించుచుం
డిరి కాకుండునె, రాహుకేతువులతో
నీ వాక్కుడుం జేరి మ
త్సరముం జూప శనిగ్రహంబ యిక మా
సామర్థ్యముం జూడుమా!'

ఆస్థానములోని ఇతర పండితులెందరో తిరుపతికవుల పక్షమైరి. ఇద్దరుమాత్రము— రాహుకేతువులు శనిపక్షము. తిరుపతికవుల యత్నము నెరవేరినది.

తిరుపతికవు లెంతబాధతో తిట్టుకవిత్వమునకు దిగినారో ఈ పద్యములో వ్యక్తమవుతుంది.

'అకళంకమ్ముగ దేవతాకృతులుగా
నైనన్ మహారాజ వ
ర్యకృతుల్ గాగనునైన గ్రంథములు వేయం
బూనువహాచేత ది
ట్టుకవిత్వమ్మును జెప్పజేసితివి
పాడుం బుద్ధి చూపించి
దుష్టా, కులభ్రష్టా, శనిగ్రహంబ యిక
మా సామర్థ్యముం జూడుమా.'

---

* 'శనిగ్రహము' ఆత్మకూరు విద్వాంసుని గూర్చి వ్రాసినదని శిష్టా లక్ష్మీకాంత శాస్త్రిగారు వ్రాసిరి. ధ్వనినే శ్రీ రావూరి దొరస్వామి శర్మగారుకూడ ననుసరించిరి. అది పొరపాటని తోచును. శ్రీ వెంకటశాస్త్రిగారి జాతక చర్యకు ప్రామాణ్య మిచ్చితిమి.

శనిగ్రహబాధ తొలగిన తర్వాతినుండి గద్వాలకు తిరుపతి కవులు నిరాఘాటముగా వార్షిక యాత్రలు సాగించిరి. ఐనను శత్రుపక్షమువారి యలజడి పూర్తిగా పోలేదు. 1902 లో వారు ఆత్మకూరు మీదుగా గద్వాల వెళ్లిరి. గద్వాల రామభూపాలుడు చనిపోవుటచే ఆయన సంవత్సర దినమువరకు గద్వాల రాణి కవుల నుండుడని యాపినది. అప్పుడు ఆత్మకూరు రాజు మేనల్లుడు గద్వాల వారికిని బంధువగు శ్రీనివాసుడు వచ్చిగా పూరింపదగిన సమస్య ఈయగా, కవులు దానిని తగిన విధమున పూరించిరి. అది శత్రువులైన వారు తమకే అన్వయించుకొని కుపితులై, కవులపై పేరు పెట్టియే బూతుపద్యము వ్రాసి, తమ శిష్యుడైన భట్టును కర్తగా కల్పించి, కవులకు పంపిరి. ఇది తెలిసి గద్వాల రాణిగారు వెంటనే ఆ బట్టును ఖైదులో వేయించిరి. అంతట ఆ పండితులు తామే ఆ పద్యము వ్రాసినట్లు ఒప్పుకొని, బట్టుకువేసిన ఖైదు తమకు వేసినట్లేయని వేడుకొనగా, రాణిగారు మన్నించి భట్టును ఖైదునుండి విడిపించిరి. ఇదంతయు సరిగా వేలకొలది బ్రాహ్మణ్యము పండితులు రామభూపాలుని దినమునకు వచ్చిన రోజుననే జరుగుటచే పండితులందరు కవుల శత్రువులను గర్హించిరి. ఆరేడు సంవత్సరములు సాగిన గద్వాల తగాదా ఈ ఉదంతముతో శమించినట్లు తోచును.

8

ఆత్మకూరు తగాదా ఒకటిరెండు సంవత్సరములే సాగినా అది తీవ్రతరమైనది; కవుల అంతిమ విజయముకూడా అఖండతరమైనది.

అప్పటి ఆత్మకూరురాజు సీతారామరాజుగారు. ఆస్థానపండితులలో ప్రధానుడు తర్కతీర్థ, బాల సరస్వతీత్యాది బిరుదాంకితుడైన శ్రీ తిరుమల బుక్కపట్టణము శ్రీనివాసాచార్యులుగారు. ఆయన వరుసగా ఎనిమిది తరాలుగా మహావిద్వాంసులుగా ప్రసిద్ధి నొందినవారి వంశములో పుట్టిన విద్వత్కవి. ఇందోరు, గ్వాలియరు, దర్భాంగా, ధారానగరము సంస్థానములలో వైదుష్యము ప్రదర్శించి మెప్పులందినవారు. వారినిగూర్చి శ్రీ వెంకటశాస్త్రి జాతక చర్యలో 'ఆయన చదివినది తర్కము, సంగ్రహించి నది వ్యాకరణము. వైష్ణవుడు గనుక అన్నివిద్యలు వేరునను. గద్వాల నృసింహాచార్యులకన్న తాము కవితలో నధికుడనను. ఆయనకు తెలుగు రానందున పికవట్లు కలిగెను' అని వ్రాసిరి. వారే 'కథలు గాథలు'లో ఇట్లు వ్రాసిరి. 'ఆత్మకూరు సంస్థానంలో ఒక పండితుడున్నాడనిన్నీ, ఆయన నాలుగు శాస్త్రాలు వచ్చినవారనిన్నీ, ఆశుకవిత్వము చెప్పేవారనిన్నీ, చాలా సనుద్ధులనిన్నీ చెప్పడంమాత్రం వింటూ ఉన్నాము. ఆయనకున్న ఆపేరు ఆప్రాంతంలో ఎవ్వరికిన్నీ లేదు.'

ఆ యాస్థానంలో ప్రాచీనకవియైన కంసాల్య భామ శేషమర్త్య కృష్ణమాచార్యులు 'శ్రీనివాస విలాసము' అను చంపూకావ్యమును సంస్కృతములో రచించిరి. సీతారామప్రభువు దానిని ఆంధ్రీకరింపుమని ఎందరికో ఇచ్చినను, అందరును చేతకాదని వదలుకొనిరి. అట్టి దాని నాయన, కొంత పరీక్షార్థమే తిరుపతికవుల కిచ్చిరి. వారు చదివి చెప్పెదమని ఒక రాత్రిలో చదివి మరునాడు దాని నాంధ్రీకరింతుమని ప్రభువుకు నివేదించిరి. ప్రభువాశ్చర్యముతో నాదరించెను.

ఆ యాదరము చూడగా ఆస్థానకవి శ్రీనివాసాచార్యులకు అసూయ కలిగినది. ఆయన కవులకు మీసములుండుటనుబట్టి చూడగా వీరు పండితులు కారని పలికెను. ఆసందర్భములోనే జగత్ప్రసిద్ధమైన 'దోసమటంచెరింగియును' ఇత్యాది మీసము పద్యము పుట్టినది.

మాకాలోచింపగా, కవుల కట్టుడు మీసముండుటకు కారణము తండ్రి జీవించియుండగా మీసములు తీయుట కొంతనుండి వైదికులు తప్పుగా భావించు నాచారముండుట వల్లనని తోచును. ఏమైన

నేమి, మీసము లెందుకుంచినారనగా, పౌరుషముగా కవులు ప్రత్యుత్తరమిచ్చిరి.

తర్వాత నొకనాడు రాజసభలో కవులు తమ దేవీభాగవతము వినిపించుచుండిరి. అందులో 'గుణాలయ' శబ్దము, 'దేవతలు ధర్మవర్తులు' అనుటయు సంస్కృత వ్యాకరణ విరుద్ధములగుటచే అపశబ్దములని ఆచార్యులు నిరూపించిరి. కవులు నన్నయాదుల ప్రయోగములు చూపి సమర్థించగా, ఆచార్యులవి అచ్చు తప్పులనిరి. ఆయన వాదమును సభలోని ఇతర పండితులొప్పలేదు. రాజాతో కవులిట్లు చెప్పిరి:

'ఆంధ్రభాషకు నన్నయ రచించినట్టి భా
రతము కవీంద్ర సమ్మతమయేని
అస్మత్ప్రయుక్త గుణాలయ పదము భా
రత ప్రయోగానుగతమయేని
అచ్చు లోపంబన్న యట్టి మీ ధర్మాధి
కారి వాదము వట్టి కల్లయేని
మన పండితుని కడ్డు మాటాడిరని పట్టు
దల నీ మనమ్మున గలిగెనేని
కుర్మతిక్ష్మాధరస్వామి దుర్మతులకు
శిక్షకుండయ్యెనేని మా చేయు ప్రతిన
త్రిప్పవేయంగ నల బ్రహ్మదేవుతరమె!'

ఈ సందర్భముతో గద్వాల వారికి కేశవస్వామియందువలెనే ఆత్మకూరు వారికి కుర్మతిస్వామి యెడల భయభక్తులు కలవని గుర్తించుకోవలెను.

ప్రభువు కేమి చేయను తోచక సభనుండి లేచిపోవుచుండగా తిరుపతికవు లీ పద్యము చెప్పిరి:

'మదనాభిరాము రాణ్మణి బిల్హణ కవీంద్రు
తో విరోధించి తా జేవ చెడడె?
రాజ కళింగ గంగరాజు భీమ కవీంద్రుతో...చెడడె
అల్లనీలాద్రి రాజుల జగ్గనుకవీంద్రుతో...చెడడె ?
మున్నుదమ్మన పిండిప్రోలు లక్ష్మణ కవితో...చెడడె
యేము గెల్చితి మనుమాట కీవె సాక్షి
తగ వెరింగియు బక్షపాతమ్ము పూని
మమ్ము నిరసించు టంతక్షేమమ్ము గాదు
ఆత్మకూరు పురీరాజ, యతులతేజ!'

కవులకెంతటి ధైర్యసాహసములు !

ప్రభువుకును కవులకును రాయబారములు జరిగినవి. రు. 50/-లు సేల్జోడు ఇత్తుము! సభ చేసెదరా యని కబురువచ్చినది. కవుల సమాధానమిది.

'తక్కువా బహుమానము మా
కక్కరయే లేదు బత్తెమది చాలునయో,
నిక్కమిది దంపినమ్మకు
బొక్కినదే కూలిగాదె భూపలలామా!
శివుడెవ్వరికైన సేవనీయుడుగాడె
వైష్ణవోత్తముల పాపము గాక,......
విష్ణువెవ్వరికైన వినతిపాత్రుడుగాడె
శైవుల దురదృష్ట సరణిగాక
మాదు దురదృష్టమునబట్టి మమ్ము గార
వింపకున్నంతనే మీకు వెలితియగునె...'

ఈ జవాబు పంపగా, ప్రభువు 'మా పండితులకును మీకును కలహమేల? మీరు శ్రీనివాస విలాసము నాంధ్రీకరించి తెచ్చినతర్వాత సమ్మానించెద' నని సద్దిచెప్పెను. అప్పుడు కవులు,

'భారతమ్ము తెలుంగు పరప రాజనరేంద్ర
నృపతి నన్నయకవి కిచ్చినట్లు......
శ్రీనివాస విలాస మాంధ్రీకరింప
సరస తిరుపతి వేంకటేశ్వరుల కిప్పు
డొసగిచ్చుట మిగుల భాగ్యంబుగాదె
యాత్మకూరుపురీరాజ, యతులతేజ!'

కుర్మతి శ్రీశుని ఉత్సవ సమయానికి ఆంధ్రీకృతగ్రంథముతెచ్చి విన్పించెదమని కవులు రాజువద్ద సెలవు తీసికొనుచునిట్లనిరి :

'వేసవి దగ్గరాయె, మిము
వీడుటకున్ మనసొగ్గదాయె, మా
వాసము దూరమాయె, బర
వాస మొనర్చుట భారమాయె, మా

కోనము తప్పి దుర్గడు లిది
గో పదగో యని చూచుట యె ప
శ్వాన మెలప్ప వే సెల వొ
సంగిన బోయె సముయ్య, భూవరా!'

కవులు మాటతప్పక శ్రీనివాస విలాస మాంధ్రీకరించి ఆ తర్వాత పల్గుణమాసములో కుర్మతి స్వామికి జరుగు ఉత్సవ సమయానికి ఆత్మకూరు వెళ్ళిరి ప్రభువు కుర్మతి తిరునాళ్ళ ఉత్సవానికి లంబాపురము వెళ్లిరని తెలిసి కవు లక్కడికి వెళ్ళిరి. గ్రంథము ఆ స్వామిని గూర్చి దీనిమూలక అక్కడనే ప్రభువు వినదలచెనుగాని అందరికి జ్వరములు వచ్చుటచే వీలుపడలేదు. ఉత్సవానంతరము ఆత్మకూరు వచ్చినతర్వాత ప్రభువు పండిత సమక్షములో 15 రోజులు గ్రంథము వినెను. పండితులు కొందరు గుణములు, మరికొందరు దోషములు ఎన్నిరి. ఆ వివాదములు వివరించుట భారతమంత గ్రంథమగునని 'జాతకచర్య' చెప్పుచున్నది.

సీతారామభూపాలుడు ఆనందతన్మయుడై కవులను ఘనముగా గౌరవించెను. ఆ సమయమున కవు లిట్లు ప్రతిజ్ఞ చేసిరి.

'పసిగొని విమ్ము, కంఠమున
ప్రాణముగల్గిన యంతలోప నో
జనవర, యింతకన్న నర
సమ్మగ దీని దెలుంగు చేసెన్
విషయమునన్ నమస్కృతులు
వేయొనరించి భవద్విశీర్ణ పరా
ధన మఖిలంబు నాతనికి
దానము చేసి తరింపకుందుమే!'

ప్రభువు కవులకు మంచిజరీవస్త్రములు, శాలువలు, బంగారుచంద్రహారములు, ఒక్కొక్కటికు చీలు, పైన రెండు మారార్లు ఇచ్చి, గ్రంథములో కవులను ఏనుగుపై నెక్కించి, సకలపండితులును వెనువెంట నడువగా, శత్రువులకు ఖేదము, మిత్రులకు మోదము ఇనుమడింపగా ఊరేగింప జేసెను. అంతే కాక సం.కు రు 200/— లు ఆదాయము వచ్చు భూమినిగూడ సమర్పించెను.

కాని క్రమముగా కరినెక్కి దిగిన దాదిగా తిరుపతి వెంకటేశ్వరుల కిద్దరికి తీవ్రముగా జ్వర మారంభించినది. ఇదేమని ప్రభువు మనస్సులో పొగిలెను. శత్రువుల క్షుద్రప్రయోగమని యందరు సందేహించిరి.

ఇంతాచేసి, శ్రీనివాస విలాస మూలకావ్యము మీద తిరుపతి కవులకంత గౌరవము లేదు. అది వారు దాచలేదు. ఉపోద్ఘాతకలో ఇట్లు వ్రాసిరి

'......ద్వాకలనంబునం దితని కాదర మెక్కువ.'

'కేవల శబ్దముల్ దగుల
గించి బిగించిన యట్టి సంస్కృతం
బేవగ విప్పి చెప్పగు
నేపుల గుడ్డలు రైక లోపలం
ద్రోచినట్లు సమ్మకుచ
పాకము లైటకు బెట్టినన్ రసం
బావహింగ నేర్చునె, మ
హాకవులార, యనుగ్రహింపుడీ!

'అల్లితిమి తోచుగతి గని
తల్లజా లొనరించు గ్రంథతతి కిది సముమ్మా,
ఢిల్లికి ఢిల్లే, వలి
పల్లెయని చెప్పునట్టి పలుకులు వినరే!'

9

విజయనగరములో ఆనందగజపతుల దర్శనము అతికష్టముమీదగాని కవులకు సాధ్యపడలేదు. మొదట మహారాజాలు తామే తిరుపతి కవుల నాహ్వానించినట్లు శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రిగారు వ్రాసినట్లొక ఉత్తరము దొరికినది. దానిని తీసికొని కవులు విజయనగరములో రాయడుశాస్త్రిగారిని దర్శింపగా వారు తామా యుత్తరము వ్రాయలేదనుచు, 'ఈ దస్తూరీ శ్రీ కాశీనాథశాస్త్రులుగారిది. గత సంవత్సరము మీరు విశాఖపట్టణము వచ్చి ఇక్కడికి రాకుండుట తనకు భయపడియే యనుచున్నాడు.

అన కవధానములు ఎవ్వరును నాటలేరని ఆయన విర్రవీగుచుండును. మీరాయన గర్వమడచుట కష్టము కాదు. నేను మీ కనుకూలుడనే' అని సెలవిచ్చిరి.

అక్కడ ప్రాడ్వివాకుడగు లక్ష్మినరసింహంగారు ఆదరించి దివాను కోదండరావుగారికి పరిచయము చేసెను. దివానుగారు తాను సేవకుడు గనుక రాజ దర్శనము చేయించలేననెను. అప్పుడే 'అటు గద్వా లిటు' ఇత్యాది పద్యము 'రాజు మాకే దర్శన మీయనిచో మరి ఎవరికిచ్చ'నని దర్పముతో పద్యము చెప్పిరి. దివాను తానే సమ్మానము చేతు ననగా కవులు దర్శన మీయని రాజద్రవ్యము తామొల్లమని నిరాకరించిరి.

పట్టణములో మహారాజాకాలేజీ అధ్యాపకులు కవులచేత సభ చేయించిరి. దానికి కాలేజి ప్రిన్సిపాలు శ్రీమాన్ కిళాంబి రామావతారముగారు వచ్చి అనందించిరి. ఆయన ఎం. ఏ. మాత్రమేకాదు, సంస్కృత ములో విద్వాంసుడు, కవి. ఆయనకు మహారాజులతో మిత్రులకుండు చనవుండుటచే, చెప్పి కవులకు రాజ దర్శనము చేయించెను. అనందగజపతి హయాణమున, గానమున, కవనమున, నానా శాస్త్రములందు నిపుణుడు. మహాబలశాలి. సుందరరూపుడు. వారి యాస్థానములో ఉన్నంతమంది విద్వత్ప్రకాండులు మరి ఎవరి యాస్థానమునందును ఆ కాలములో లేరు. వారియెదుట శ్రీ తిరుపతి వెంకటేశ్వర కవులు సంస్కృతాంధ్రములలో చెప్పిన పద్యములుకూడ ఉత్తమశ్రోత యధికారమునకు తగినట్లేఉండి వారి సర్వతోముఖప్రజ్ఞకు నిదర్శనములుగా రాణించు చున్నవి. అందులో కొన్నిమాత్రము ఉదాహరిస్తున్నాము.

'అల పతంజలికృతంబైన భాష్యముననే
పరిఢవిల్లును మహాభాష్య పదము
అల దేవదేవుడై యలరారు శివుననే
తేజరిల్లును మహాదేవ పదము
అల త్రివిష్టపవిభుండైన పాకారికే
యెన్నంగదగును మహేంద్రపదము
అల కాళికాదాసుడౌ కవీశ్వరుననే
గణన కెక్కును మహాకవిపదమ్ము
రమణ బరికింప నల మహారాజపదము
నీకు తగుగాక యన్యులౌ లోకపతుల
కొకరికైనను జెల్లునే యోగ్యరూఢి
విజయనగర మహారాజ, విపులతేజ!'

'రాజరాజనగనే రాజాయెనే చంద్రు
డల రాజశేఖరు నాశ్రయించె......
......రాజనిన రాజరాజన్న రాజులందు
నీక తగుగాక యన్యులౌ...........

'తత్కిం చంద్రాతపోఽయం,
నను భవతి దివావ్యస్య కస్మాత్ప్రచారః
సత్యం స్యాచ్చంద్రస్య, సత్యేప్యరుణకిరణతోఽ జాగళస్తనోఽయమ్
నోచే దానందదంతీశ్వర
విమలయశ, స్సత్య, మిత్యాది వాక్యైః
శాస్త్రార్థంకుర్వతే త్వద్యశసి నృపమణే
తార్కికా స్తర్కరీత్యా.'

'అర్థవత్తని యనధీనమని సమస్త
దేశసంగతమనియు నదేహమనియు
సర్వవత్స్వాత్మ మందు నీ యశము కొంత
గూఢముగ జెప్పె బాణిని కువలయేశ!'

'......నను పరమపరో
వర్తతే కీర్తిచంద్రః
సోఽపి శ్రీచక్రకక్షాజమురితి కవయ
శ్చక్రవాక్యై వదంతి.'

'కొందరు పచాద్యజంతం
బందురు మరికొంద రర్శ ఆద్యంతంబే
యందురు, మే ముభయంబని
యందుము నీ నామధేయ మానందనృపా!'

'మాపసమా నిపాగమ
గాపసమా మాపధాపగాగమనిసమా
మాపస నిపసగని గా
దా పరిపరి పరితుష్టిచెందె నానందనృపా!

వ్యాకరణము, తర్కము, కవిత్వము, గానము, సమస్తకళలు శాస్త్రాలూ అభిమానించే ఆనందగజపతి మహారాజా ఆనందించేవిగా తిరుపతి కవుల పద్యా లున్నవి.

విజయనగరసభలో కవులను వ్యాకరణ మహా భాష్యములో పరీక్ష చేయింపగా, వారు నిలువలేక పోయిరని యొకరు వ్రాసినది నిజము తెలిసి వ్రాసి నదిగా తోపదు. ఆనందగజపతి కవులకు నూరార్లు బహూకరించి ప్రతిసంవత్సరము రమ్మని యాన తిచ్చెను. జాతకచర్యలో 'రాజంటే అతడే, మంత్రి రాట్టంటే అతడే, మునసబంటే అతడే, పురమంటే అదే' అని శ్రీ వెంకటశాస్త్రి యా రాజును, మంత్రిని, మునసబునూ, ఆ పురమును విశేషముగా కొని యాడుటే అందులకు నిదర్శనము !

10

పై వాటితో పోలిస్తే, కవులకు వెంకటగిరిలో సమ్మాన మాలస్య పరోట ప్రణయ కలహము వంటి దనిపిస్తుంది. తిరుపతి కవుల నానారాజ సందర్శన ములో వెంకటగిరి యాత్ర మొదటిదిగా తోస్తుంది. చెన్నపట్టణములో బెసెంటు వగైరాలచేత ఘన గౌర వముపొందియున్న ఉత్సాహముతో కవులు వెంకటగిరి వెళ్లినారు. అడుగులోనే హంసపాదు పడినది. పెద్ద రాజాగారికి అర్జీ పంపగా దర్శనమిచ్చే వీలులేదని రూపికలంపిరి. వారు నలుగురుసోదరులు. తర్వాతి సోద రుడు ముద్దుకృష్ణయాచేంద్రుడు మంచిదాత. ఆయన వద్దఉన్న బట్టుకవి సలహాలేనిది ఏమీ చేయరు. ఆ బట్టుకవి యప్పుడు ఊరిలో లేనందున కవులకు అస్తి నాస్తి కబురు రాలేదు. కవులు సత్ర భోజనము, మధ్య మధ్య స్వహస్తపాకముతో అవస్థపడి, ఇంతలో నెల్లూరునుండి యాహ్వానమురాగా వెళ్లిరి. నెల్లూరు వెళ్లుచు వారు చెప్పిన పద్యము ద్రాక్షపళ్లందక పుల్లగాఉన్నవన్న పంచతంత్ర కథనే తలపించును.

'ఈశుండో హరియో చతుర్ముఖుడో
దేవేంద్రుండో యీ ముద్దుకృ
ష్ణేశుం డీతని దర్శనమ్మునకుగా
నింతేల చింతింపగా
గాశీసేతులమధ్య నిప్డు నృపతి
క్ష్మామమ్ము జన్మించెనే
ఆశా, నన్నిటు లేల వేపెదవు
నీ కాయాసమున్ బుట్టదే!'
'కరు లర్పించుచో యగ్ర
హారములు దా గల్పించుచో...'

కవులట్లు నెల్లూరువెళ్లి అద్భుతముగా అవ ధానముచేసి జిల్లాజడ్జిని పౌరులను మెప్పించి శత కముచెప్పి ఘనసమ్మానముతో బాలసరస్వతి బిరుదము పొంది విందులు కుడుచుచుండిరి.

ఇంతలో వెంకటగిరి రమ్మని మిత్రుని యుత్త రము వచ్చెను. అప్పటికి పెద్దరాజా కాశికి వెళ్లుచు బావమరది శ్రీ చెలికాని గోపాలరాయలకు సంస్థాన భార మప్పగించెను. కవులు వెంకటగిరి వెళ్లి సులభ ముగా శ్రీ గోపాలరాయలను దర్శించి అవధానముచేసి నూరార్లు భూషణములు పొందిరి. శ్రీ గోపాలరాయలు తానంత ధనవంతుడను కానందున శ్యాలకుల దర్శ నము చేయింతుననెను. తక్కినవా రొప్పుకొనిరిగాని, కవులు తమవద్ద సెలవు తీసుకొనకుండా నెల్లూరు వెళ్లినందున ముద్దుకృష్ణ యాచేంద్రు డొప్పుకొన లేదు. వారికి కవు లిట్లర్జీ పెట్టుకొనిరి.

'పరదేశ సంపాదన రతి మీకు నరేంద్ర
పరదేశ సంపాదన రతి మాకు.........
మీకు రాజపదము మాకును గవి
రాజపదము కలదికెందు గొదువలేదు
కాన సామ్యమిచ్చి మానించు టొప్పదే
ముద్దుకృష్ణయాచభూవరేణ్య.'

'దేవర యాజ్ఞ గైకొనక
తెంపున నెల్లురిపట్టణమ్ము మున్
బోవుట మంచిగా, దయిన
బోవుటకేమి నిమిత్తమన్న, నో
భూవర, శుద్ధవైదికుల
బుద్ధి మహత్త్వపటుత్వసంపదల్
దేవరవారి చిత్తమణితిన
జోరబాం ముదమ్ముసేయగన్.'

శ్రీ ముద్దుకృష్ణ యాచేంద్రులు తృప్తిగాడి కవులను ఘనముగా సన్మానించిరి. తక్కిన సోదరులును సన్మానించిరి. వారిలో మూడవ సోదరుడగు శ్రీ వెంకటకృష్ణ యాచేంద్రుని మీద కవుల పద్యములలో ఒకటి జగత్ప్రసిద్ధమైనది.

'ప్రాసాద నిర్మాణశక్తి మీకు నృపాల
ప్రాసాద నిర్మాణరక్తి మాకు
సాధువృత్తి విధానశక్తి మీకు నృపాల
సాధువృత్తి విధానరక్తి మాకు
నవరత్న సంపాదరతి మీకు నృపాల
నవరస సంపాదనరతి మాకు
సతత సద్భాగ్యగణాసక్తి మీకు నృపాల
సతత సద్గుణగణాసక్తి మాకు
మీకు యాచక బిరుదు మాకును యాచక
బిరుదు గలదు వర్ణభేదమాత్ర
మంతె, యని చెప్ప కొనగ మీ వేంకట
కృష్ణయాచభూప యిపుడు నమత.'

ఇంతలో చాముండి పెద్దరాజావచ్చి కవులను ఘనముగా సమ్మానించెను. వెంకటగిరి యుదంతములో కవుల పాలిటి కల్పవృక్షమై వేంకుచ్చి సానుకడివది ప్రభువుల బావమరది శ్రీ గోపాలరాయలు. వారు కవులయందెంతో అభిమానము చూపిరి. శ్రీ వెంకటశాస్త్రి కవుడు 24 సం.లు

11

ఈ విధముగా పెద్ద తగాదాలుకాని చిన్నవి గాని జరిగిన పిమ్మట కవులు సమ్మానము పొందుటలో వారి ప్రజ్ఞ ప్రస్ఫుటమగును. కాని ఎందరో ప్రభువులు తిరుపతి కవులను తమంత తాము పిలిచి బహువిధసమ్మానము లొనర్చిరి. వారిలో కొందరినైనను ఈ సందర్భములో స్మరింపకుండుట ధర్మము కాదు.

వారందరిలో, సంపద తక్కువైనను, ముందు స్మరింపదగినవారు చిత్రాడవాసి కావ్యనిధి శ్రీ చెలికాని లచ్చారావుగారు. వారు గొప్ప భాషాపోషకులు. వారు శ్రీ తిరుపతి శాస్త్రిగారిని పోలవరము జమీందారు గారు పరమపదించిన తర్వాత తుదివరకు పోషించిరి. శ్రీ వెంకటశాస్త్రిగారిపై వారు చూపుచు వచ్చిన సమాదరము అసమానమైనది. వారిని స్వయముగా సమ్మానించుటయేగాక తమ సోదరి లక్ష్మీనరసాపురము జమీందారిణియగు శ్రీ రావు రామాయమ్మగారిచేత బహుసత్కారములు సమ్మానింపజేసిరి. శ్రీ లచ్చారావుగారి అకాలనిర్యాణమునకు శ్రీ వెంకటశాస్త్రి విలపించుచు చెప్పిన పద్యములును, ఆ సందర్భములో వారి సోదరి రామాయమ్మగారికి చేసిన ఉపదేశ పద్యములును శాస్త్రిగారికి వారియెడగల ఆప్యాయతను వ్యక్తీకరించును.

ఆ తర్వాత పేర్కొనదగినవారు శ్రీ పోలవరము జమీందారు కృష్ణభూపతి. వారు కవులచేత బుద్ధచరిత్రము వ్రాయించి కృతిభర్త యయ్యెను! తన యవసానకాలముదాక శ్రీ తిరుపతిని ఆస్థానకవిగా 18 సం.లు పోషించెను. ఆయన నిర్యాణమును గూర్చి శ్రీ తిరుపతి వ్రాసిన పద్యములు ఎంతో హృదయవిదారకముగా నున్నవి.

'మా కాప్తుడు మా కొడయుడు
మా కాలంబులు రాజవాక్కిక మపుడే
నాకాలయమున కరిగెన్
మా కృష్ణరాయభూమినాథుం డకటా!

'పీటపై గూర్చుండి పిలువ నంకె యుండ
నే దినమ్మును భుజియింపలేదు
మొదటినుండియు దుట్టతుదదాక నొకరీతి
గురుభావమున కోటు జరుపలేదు...'

వారి నిర్యాణము తర్వాత శ్రీ తిరుపతి రెండేళ్లకంటె జీవింపలేదు.

కిర్లంపూడి ప్రభువు ఇమ్మగంటి చిన్నారాయుడు కవుల నాదరించి వారికి ప్రీతిపాత్రుడయ్యెను.

'ఇనుగంటిన్ ఇమ్మగంటి భేదమొక
యింతేనిన్ గనన్ రాదు, సో
మువిగంటి న్నిమగంటి భేదము ●

వమ్మున్ గానగరాదు; మే
ఘునిగంటి స్నిమగంటి భేదమరయున్
గోరంతయున్ లేదు, మీ
యనుగంట్యన్వయమెంత చేవగలదో యీ
చిన్నారాయాధిపా.'

ఆయన ప్రతిసంవత్సరము శ్రీ దేవీనవరాత్ర పూజలు చేసెడివారు. విలంబి సంవత్సర రాజ చూచి 1898 లో శ్రీ తిరుపతి కవులు దండకముగూడ చెప్పిరి.

ఈ అనుగంట్యన్వయములో ప్రకాశరాయప్రభువు అన్నవరము సత్యనారాయణస్వామి ధర్మకర్తలు వారు శ్రీ వెంకటశాస్త్రిని స్వామివారి ఆస్థానకవిగా నేసి ప్రతిసంవత్సరము ఉత్సవములకు పిలిచి సమ్మానించుచుండిరి. శ్రీ ప్రకాశరాయలను శ్రీ వెంకటశాస్త్రి ఎన్నెన్నో పద్యములలో ప్రశంసించెను.

శ్రీ నూజివీటి శ్రీరామచంద్ర అప్పారాయ ప్రభువు తిరుపతి కవులను మొదట 1903 లో పిలిపించి సంపూర్ణశతావధానము చేయించి సమ్మానించి నూరార్లు వార్షికము ప్రకటించెను. తర్వాత మరియు నెన్నోమార్లు పిలిపించి సమ్మానించెను. ఒకమారు వారి గురువులు వానమామలైస్వాములు మాటాడుచుండగా, వారు కవులను రాకతప్పదని పిలిపించిరి. కవులు వెళ్ళగా వానమామలైస్వామి కవులచేత అవధానము చేయించి నూరార్లు శాలువలతో జయపత్రిక ప్రసాదించిరి. శ్రీరామచంద్ర అప్పారావు గారు పరమపదించినపిమ్మట వారి రెండవ కుమారుడు సింహాద్రి అప్పారావుగారు వార్షికము పంపుచునే యుండెనుగాని ఆ దాత కంతధనములేదని భావించి శ్రీ వేంకటశాస్త్రి రెండు సంవత్సరముల వార్షికమొక్కసారిగా గ్రహించి ఆపై నికనివ్వనలదని మనవిచేసి ఒప్పించెను. ఇందులో శ్రీ శాస్త్రి ప్రతిగ్రహములో ఎంతో ఉదారత ప్రదర్శించెను.

ఇట్టిదే మరియొకటియు గలదు. జమిందారు అనదగినంత ఒక సంపన్నబ్రాహ్మణ గృహస్థు కవులకు వేయిన్నూటపదార్లు, ఇత్తునని ప్రాణిగ్రహీత వ్రాయించి అంకితమిమ్మనెను. ఎన్నిమారు లడిగినను, స్థితి చిదికిపోవుటచేత, ఇయ్యలేక కవులపేర ప్రోనోటు వ్రాసిపంపెను. వెంటనే కవులా నోటు రద్దువ్రాసి పంపివేసిరి. గ్రంథము ఆ గృహస్థు కంకితముగానే ప్రకటించిరి. దీనినిబట్టి తిరుపతి కవులు దాతల శక్తినిమించి వార్షికాదులు గ్రహింప నిరాకరించుచుండిరని తెల్లమగును.

శ్రీ తిరుపతిశాస్త్రి నిర్యాణానంతరము శ్రీ వెంకటశాస్త్రి చల్లపల్లి రాజాగారు శ్రీ అంకినీడు ప్రసాదరాయలయు, శ్రీ శివరామ ప్రసాద ప్రభువులయు పట్టాభిషేకములకువెళ్ళి ఘనముగా సమ్మానము లందెను.

అట్లే బొబ్బిలి రాజాగారి పట్టాభిషేకమునకు శ్రీ వేంకటశాస్త్రి వెళ్ళి, తర్వాత పట్టాభిషేక కావ్యము రచించెను. ఆ కావ్యము వినిపించుటకు శ్రీ శాస్త్రి శిష్యసహితముగా బొబ్బిలి వెళ్ళెను. ప్రభువు శ్రీ శాస్త్రికి వేయిన్నూటపదార్లు, శాలువల జోడు, కంకణములు ఇచ్చి సన్మానించి, నూరార్లు వార్షికము ప్రకటించుటేకాక వెంటవచ్చిన శిష్యులకును నూటపదార్లిచ్చి గౌరవము చేసెను.

ఈ విధముగా శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల నిద్దరినిగాని తిరుపతి నిర్యాణానంతరము వేంకటేశ్వరునిగాని సన్మానించిన ప్రభువులును ప్రభుసమ్మితులును అసంఖ్యాకులు. కొందరిని మాత్రము పేర్కొందుము. విరవ, కోటరామచంద్రపురము, వీరవరము, ఉర్లాము, మరదాపా, తోట్లవల్లూరు, నిత్తువల్లూరు, తేలప్రోలు, కాశింకోట, మైలవరము, ధవళేశ్వరము, గంపలగూడెము, శనివారప్పేట, తంగెళ్ళమూడి, కాట్రావులపల్లి, మురుమళ్ళ, ముక్త్యాల, నూజివీడు, ఘూటాల, దొడ్డంపేట, కోలంక, జయపురం, రామచంద్రపురం ఇత్యాది సంస్థానముల అధిపతులు, యావాము శ్రీ మన్యం మహాలక్ష్మమ్మ జమిందారిణిగారు.

శ్రీ విక్రమదేవవర్మగారు, మోతేగంగరాజుగారు, మోతే నారాయణరావుగారు, చెన్నపట్టణములో శ్రీ అల్లాడి కృష్ణస్వామయ్యగారు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు.

12

శ్రీ వెంకటశాస్త్రికి బందరులో ఉపాధ్యాయ పదవి విరమించు సందర్భములోను, తర్వాత అక్కడనే షష్టిపూర్త్యుత్సవములోను బందరు పౌరులు చేసిన సన్మానములు అద్వితీయమైనవి. తర్వాత వారిని చెన్నరాజధాని ప్రభుత్వము ప్రథమాంధ్రస్థానకవిగా వరించి బెజవాడలో చేసిన ఉత్సవము వారి జయ పతాకలలో ఉన్నతోన్నతమైనది. అవి మూడును ఒక్క వెంకటశాస్త్రికే జరిగినను తిరుపతి వెంకటకవు లిద్దరి విజయములుగానే గ్రహించుట యుక్తము. అవి వారి విజయయాత్రలకు పరమావధులు గావున సంక్షేపముగా వర్ణించుచున్నాము.

1916 లో శ్రీ వెంకటశాస్త్రి ఉపాధ్యాయ పదవి వదలివెళ్ళుచున్నారని తెలియగానే, బందరు పౌరులు గగ్గోలు పడిరి. శ్రీ వల్లూరి సూర్యనారా యణరావుగారి అధ్యక్ష్యమున సభ చేసిరి. అధ్య క్షులు, 'వీరిక్కడికివచ్చి 12 సం.లు దాటినది. విద్యార్థులంతా కవులైరి. మనము ఘనముగా సన్మానింపవలె'ననిరి. 1916 సం. ఆగస్టు 5, 6 తేదీలలో సన్మానసభలు వైభవముగా జరిగినవి.

5 వ తేదీన సాయంకాలం సభ పురమందిర ములో జరిగినది. చల్లపల్లి కుమార రాజాగారు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, వర్తకులు, విద్యా ర్థులు, పండితులు వచ్చిరి: అధ్యక్షత వహించిన కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు 'శ్రీ వెంకటశాస్త్రి కుశాగ్రబుద్ధి. కవితలో పద ముల పొందిక రసౌచితి శ్లాఘ్యములు. ఆంధ్రభాష యున్నంతకాలము వీరి కృతులుండు'నవి శ్లాఘించి పురజనుల పక్షమున వారే కవికి వస్త్రములు కాశ్మీరశాలువకప్పి చేతికి కింకిణీకంకణము తొడిగిరి. శ్రీ వెంకటశాస్త్రి అధ్యక్షులకు పాదాభివాదనముచేసి పౌరులకు కృతజ్ఞత తెలిపిరి. ఆరాత్రి శ్రీ పురాణం సూరి శాస్త్రిగారు విందుచేసిరి.

ఆ మరునా డుదయమున ఊరేగింపు జరిగినది. శ్వేత పతాకముపై పురాతనాధునిక కవీశ్వరుల పేరులువ్రాసి ముందుసాగినది. మకర తోరణముపై 'జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః'అని స్వర్ణాక్షరములతో వ్రాయబడినది. ఆ వెనుక సర స్వతీవిగ్రహము కదళీస్తంభములతో నలంకరింపబడిన పీఠముపై సాగినది. వేదవిదుల స్వస్తివాచనములతో భజనలతో శాంతమల్లేశ్వరస్వామి ఆలయమునకు వెళ్లిరి. అక్కడ కవిగారు సరస్వతీ పూజచేసి ఉపన్య సించిరి. ఆ మధ్యాహ్నము శ్రీ కూనపూడి లక్ష్మి నారాయణగారు విందు చేసిరి.

అపరాహ్ణమున నాటకశాలలో శ్రీహరి నగ భూషణముగారు పాటకచేరీ చేసిరి.

సాయంకాలము హిందూహైస్కూలు ఆవరణ ములో మహాసభ జరిగినది. శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు అధ్యక్షులు. ఉపన్యాసములు జరిగినవి. శిష్యులు దుఃఖభారముతో పద్యపఠనముచేయగా, శ్రీ వెంకట శాస్త్రిగారును కంట తడిపెట్టిరి. జయజయధ్వానము లతో సభ ముగిసినది.

ఆ రాత్రి హిందూథియేటరువారు పాండవో ద్యోగము ప్రదర్శించుచు ప్రథమాంకమైన తర్వాత నాట్యప్రముఖులగు శ్రీ బసవయ్యనాయుడు పింగళి లక్ష్మికాంతముగార్లు వెంకటశాస్త్రిగారి కిచ్చుటకు గండపెండేరమును అనేకశాస్త్రములలో విద్వద్వరేణ్యు లగు శ్రీ శిష్ట్లా నరసింహశాస్త్రిగారి కీయగా, వారు సంస్కృతాంధ్రములలో నిరర్గళధారతో కవిని ప్రశంసించి కవిగారి కిచ్చిరి. తమ గురువులు శ్రీపాద వారు సెలవొసగి ఆశీర్వదించిననేగాని శ్రీ శాస్త్రిగారు తాము దానిని గ్రహింపమనిరి. అప్పుడు శ్రీపాదవారు

లేచి, 'హా రత్నాలే'యని ఉద్ఘోషించిరి. అంతట నాటక సభ్యులు శ్రీ వెంకటశాస్త్రిగారి పాదమున గండ పెండేర మలంకరించిరి. ఆ రెండురోజులు పౌరులు కవికి బహూకరించిన అమూల్యవస్త్రములకు, శాలువ వలకు, సువర్ణాంగుళీయకములకు లెక్కలేదు. 12—8—16 కృష్ణాపత్రికలో 'కవిపూజ'నుండి కొన్ని వాక్యములు :

'వీరి శిష్యసమూహము భారతస్సైన్యమంత యున్నది. వీరి గ్రంథము లెల్లెడల వ్యాపించియున్నవి. తిరుపతి వెంకటకవులకు సంఘటిల్లిన సంఘర్షణములు మరియొకరికి సంభవించినచో, మరియొక రీతిని వినియుందుము. నలువైపులనుండి నిశాతఖడ్గములు వీరిపై తాండవించినవి. అన్నికత్తులను వీరు తిరిగి ఎదిరించిరి. లోకము వీరిని ధన్యులు ధన్యులు అని పొగడుచున్నది. వీరి వీరాధి వీరత్వము అంగీకరింప బడినది. వీరు ఎవ్వరు బడయని గౌరవములు పడసిరి. అనేక కవీంద్రులు రాజులచే పూజింపబడినారు గాని బహుళ ప్రజానురాగము బడసినవారు వీరు! ఈ పూజ ఆంధ్రకవితకు గౌరవకారణము!'

(సశేషం)



కలగూరగంప:

శ్రీమదాంధ్ర భాగవతము-ఒక వైరుధ్యము

పోతన విరచితమగు భాగవతమును వావిళ్ళవారు, ఆనందాశ్రమ, వెంకట్రామ అండ్కో, నూతనముగా హైదరాబాదులో అకాడమీవారు ఇంకా యితర మైన కంపెనీలు ముద్రించినారు. పండితులచేత పంస్కరింపబడినవి. కాని సప్తమస్కంధములో 11 వ అధ్యాయము తెనిగించుటలో నారదుండు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మంబులు దెలుపు ఘట్టములో ఈ క్రిందిపద్య మీవిధముగనే ముద్రింపబడినది.

సీ॥ 'వినుము కర్షణాదికవృత్తికంటెను మేలు
యాచింపనొల్లనియట్టివృత్తి
ప్రాప్తంబుగైకొని బ్రదుకుకంటెను లెస్స
యనుదినంబును ధాన్య మడిగికొనుట
యాయవారముకంటె నధిక కల్యాణంబు
పతితగయున్నులధాన్యభక్షణంబు
శిలవృత్తికంటెను శ్రేయ మాపణముల
పడ్డగింజలుదివి బ్రదుకుగనుట
యొడరుచోట వృపతి కీ నాల్గువృత్తులుఁ
దగుఁ బ్రతిగ్రహంబు దగదు తలఁప
నాపదవసరముల నధముఁ డెక్కువజాతి
వృత్తినున్న దోషవిధముగాదు.

వ. వినుము శిలవృత్తియు నుంఛవృత్తియు బుతమనియు, నయాచితవృత్తి యమృతమనియు, యాచ్ఞావృత్తి మృతమనియుఁ, గర్షకవృత్తి ప్రమృతమనియు నెన్నుదురు.' అనికలదు.

క్రింద వచనమునుబట్టి బుత, అమృత, మృత, ప్రమృతములు క్రమముగా శ్రేష్ఠత్వము నుండి హైన్యమును సూచిస్తూ ఉన్నవి. పైపద్యము దీనికి విరుద్ధముగా నున్నది.

కర్షణాదికవృత్తి (ప్రమృతము) కన్న యాచింపనొల్లనివృత్తి, అనగా ప్రాప్తంబు గైకొని బ్రదుకుట, అనగా అయాచితవృత్తి (అమృతము) మంచిది. దానికన్న అనుదినంబును ధాన్యమడిగికొనుట అనగా యాయవారము, అనగా యాచ్ఞావృత్తి (మృతము) మంచిదనియున్నది. అమృతముకంటె మృతములెస్స ఎట్లా అవుతుంది? పైగా మూలం చూచినను—

భాగవతమ్ - సప్తమస్కంధమ్ -
ఏకాదశోఽధ్యాయః
జఘన్యో నోత్తమాం వృత్తి
మనాపది భజేన్నరః
ఋతే రాజన్య మాపత్సు
సర్వేషా మపి సర్వశః॥ 17॥

ఋతామృతాభ్యాం జీవేత
మృతేన ప్రమృతేనవా
సత్యానృతేనవా జీవే
న్నశ్వవృత్త్యా కథంచన॥ 18॥
ఋత ముంఛ శిలం ప్రోక్త
మమృతం య దయాచితమ్
మృతంతు నిత్యయాచ్ఞాస్యా
త్ప్రమృతం కర్షణం స్మృతమ్॥ 19॥
సత్యానృతంతు వాణిజ్యం
శ్వవృత్తి ర్నీచసేవనమ్
వర్జయేత్తాం సదా విప్రో
రాజన్యశ్చ జుగుప్సితామ్॥ 20॥

ఇక్కడకూడ ఉంఛవృత్తి, శిలవృత్తి బుతమనిన్ని, అయాచితమ్ అమృతమనిన్ని, నిత్యయాచన అనగా యాయవారము మృతమనిన్ని, కర్షణం ప్రమృతమనిన్ని, వాణిజ్యం సత్యానృతమనిన్ని చెప్పుచూ

జీవికకు అనుసరించవలసినవాటిని క్రమముగా శ్రేష్ఠమునుండి హీన, హీనతర, హీనతమములను పేర్కొంటూ, ఋతము, అమృతము, మృతము, ప్రమృతము సత్యానృతము, శ్వవృత్తి వరుసగా చెప్ప బడినవి. దీనినిబట్టి చూచినను ఆంధ్రీకరణంలో వైరుధ్యము కనబడుతుంది. యాయవారము అయాచితవృత్తికంటె శ్రేష్ఠమనడం కుదరదు.

దీనికి మూలం—మనుస్మృతి, చతుర్థాధ్యాయః

ఋతామృతాభ్యాం జీవేత్తు
మృతేన ప్రమృతేనవా
సత్యానృతాభ్యా మపివా
న శ్వవృత్త్యా కదాచన॥ 4॥
ఋత ముంఛ శిలం జ్ఞేయ
మమృతం స్యాదయాచితమ్
మృతంతు యాచితం భైక్షం
ప్రమృతం కర్షణం స్మృతమ్॥ 5॥
సత్యానృతంతు వాణిజ్యం
తేన చైవాపి జీవ్యతే
సేవా శ్వవృత్తి రాఖ్యాతా
తస్మాత్తాం పరివర్జయేత్.॥ 6॥

ఇక్కడకూడ శ్రేష్ఠంతో ప్రారంభించి వరుసగా ఋతము, అమృతము, మృతము, ప్రమృతము, సత్యానృతం, సేవ తక్కువలని చెప్పబడినవి. యాచించుట, బిచ్చమెత్తికొని జీవించుట మృతమనిన్నీ, అయాచితవృత్తి అమృతమనిన్నీ చెప్పబడినది. మృతముకంటె అమృతం శ్రేష్ఠమనడానికి చర్చ వనిలేదనుకుంటాను.

మఱి ఆంధ్రభాగవతంలో ఈ పొరపాటు దొర్లిందని నేనుచూచిన పైచెప్పిన అన్ని పుస్తకాలల్లోను పైవిధంగా ముద్రింపబడి ఉన్నది. క్రింద వచనం దానికి విరుద్ధంగా ఉన్నా ఇది పొరపాటని యెందుకు తోచలేదో చిత్రము.

పోతనగారట్లు వ్రాసిఉండరనిన్నీ, ఇది లేఖకుల ప్రమాదంవల్లనే దొర్లిందని అనుకుంటాను. అచరణాలను తిరిగి పైవి కొన్ని క్రిందికి, క్రిందివి కొన్ని పైకి వ్రాస్తే సరిపోతుంది. ప్రతులు వ్రాసు కోవడంలో ఎవరో పొరపాటున క్రిందిది పైన వ్రాసి అర్థభేదం గ్రహించలేక పైవి క్రింద వ్రాసి న పుస్తారని పిస్తుంది. పండితులు దీనిని గమనించి నిర్ణయించమని ప్రార్థన. నాకు తోచినది—

సమ కర్షణాదిక వృత్తికంటెను లెస్స
యనుచన బును ధాన్య మడిగికొనుట
యాయవారముకంటె నధికకల్యాణ బు
యాచించ వొల్లని యట్టివృత్తి
ప్రాప్తంబుగైకొని బ్రదుకుకంటెనుమేలు
పతిగియెన్నుల ధాన్యభక్షణంబు

ఇంక తక్కిన దున్నదున్నట్లుగనే తీసుకొనవచ్చును.

లెస్స, మేలు కూడ మార్చ పోతే సంధిలో కొంచెం చిక్కురావచ్చు. అసలు ప్రతిలో ఇట్లే వ్రాయబడి ఉంటుందన్నీ లేఖక ప్రమాదంవల్ల ఈ పొరపాటు వచ్చిందని అనుకుంటాము.

—శ్రీ కారుమంచి కొండలరావు

దీపశిఖ

ప్రాచీనకాలమున మహాకవుల కవితా మాధుర్యమునకు, పాండిత్య ప్రాగల్భ్యమునకు పరవశులైన పండితులు, పండితపరిషత్తులు కవులను బిరుదములతో సత్కరించెడి వారు. రాజులు తమ ఆస్థానకవీశ్వరులను సన్మానించు క్షణములలో బిరుద ప్రదానముచేయుట చారిత్రక సంప్రదాయము. ఈ బిరుదములు సాధారణముగ యుగకర్తకు కవిసమూహమును ప్రభావముచేసిన కారణమున ప్రదానము చేయబడుచుండెడివి. కవి కావ్యమున అనుసరించిన విశిష్ట శిల్పమార్గములను స్ఫురింపజేయు బిరుదములు సహృదయుల ఆలంకారికులచే ప్రసాదింపబడినవియును గలవు. కాళిదాసునకు 'దీపశిఖ' యను ఉపనామము కావ్యాశయం ననుసరించిన అసాధారణ మార్గమును బట్టియే కలిగినది. 'కాళిదాస కవీంద్రస్య సంజ్ఞా దీపశిఖేతి' అను వాక్యము

ననుసరించి పండిత గోష్ఠులలో కాళిదాసును దీప శిఖగా సంభావించెడివారని తెలియుచున్నది. 'సంచారిణీ దీపశిఖేవరాత్రౌ' అను ప్రసిద్ధశ్లోకము కాళిదాసునకు 'దీపశిఖా' బిరుదము నిచ్చినట్లు పండితుల యభిప్రాయము.

దీపశిఖ కాళిదాసుని బహువిధ కల్పనా చమత్కృతికి ఆధారమైనది. వివిధ సన్నివేశములలో సహజనిర్భరభావప్రకటనకు సన్నివేశ ఔచిత్య చారుత్వమునకు దీపశిఖాకల్పనము కారణమైనది. మొదటిది సంచారిణీ దీపశిఖ స్థిర సౌందర్యమునకంటె చలత్సౌందర్యవర్ణనము కళను దీప్తము చేయును. అనుభవమును తీవ్రముచేయును. దీపశిఖను ప్రవాహశీలముగ గమనరీతిలో వర్ణించిన సందర్భము కాళిదాసకవితాకళకు దీప్తి నొసగినది. 'సంచారిణీ... వివర్ణభావమ్'. దీపశిఖ పురోగమించుచుండ వెనుక భాగము మసకలై తుదకు తిమిరమయ మగును. ఇందుమతి శరీరమున నవయౌవనపు నైగనిగ్యము, వివిధ రత్నాభరణ కాంతులు దీపశిఖను గావించినది. ఇందుమతి సభలో దీపశిఖవలె మెల్ల మెల్లగ నడచుచున్నది. వరుసలో ముందున్న రాజకుమారులముఖములు ఆశాకిరణములచే నుత్ఫుల్లము లగుచు ఇందుమతి దాటిపోయినపుడు నిరాశా తమస్సు ఆవరించి చీకటియగుచుండెను. ఈసంచారిణీ దీపశిఖ వర్ణనము వ్యంగ్య పరంపరా తరంగముల నుద్గమింపజేయుచున్నది. నిజమునకు దీపశిఖ సంచరించుటే కళ.

చారుతా పవిత్రతా యుక్తమైన దీపశిఖ: పవిత్రగుణస్పర్శలేని చారుత్వము క్షణికము. సంస్కారపూతముగాని సౌందర్యము ప్రయోజనములేనిది. సౌందర్య పవిత్రతలు మిశ్రమమైన అతిగొప్పవిషయము. మహాగుణము. దీపమునకు దీపశిఖ ప్రాణము. మఱి చారుత్వమునకు పవిత్రత హృదయము. మంచుకొండ 'ప్రభామహత్యాశిఖయా.........తయా స పూతశ్చ విభూషితశ్చ'. ప్రభావిశిష్టమైన శిఖచేత దీపము పూతము, అలంకృతము నైనట్లు పార్వతీదేవిచే పవిత్రుడును, అలంకృతుడును నయ్యెను.

నిర్వాణోన్ముఖ దీపశిఖ: దీపశిఖ నిశ్చలము కాదు. చిఱుచిఱుగాలులకు శిఖకోటి సొగసులు పోవును. వేయి దశాంతరములుగ చలనశీలమైన యవతారములను దాల్చును. సూక్ష్మదర్శియైన మహాకవికి ఒక్క చిరుచరణములో, నొక అల్పమైన కదలికలో జీవన సంగీతము వినిపించును తైలరాహిత్యముననో, వాయుహతినో నిర్వాణోన్ముఖమైన దీపశిఖ వివిధావస్థలను సన్నివేశసహజముగ వర్ణించుట కాళిదాసు కవితా శిల్పములలో నొకటి. తైలశేషమునుబట్టి క్షణమున నెగసి, క్షణమున విరిగి, క్షణమున ప్రకాశించి ఎప్పుడో క్షణమున చీకటి క్రమ్మును. ఇట్టి వివిధావస్థాత్మకమైన దీపశిఖతో వృద్ధకంచుకి పటుత్వము తప్పిన బుద్ధిని పోల్చుట వివిధపరిణామరీతులలో వర్ణించెను. '.........ప్రదీపస్య శిఖేవ జరతో మతిః'. వార్ధక్యముతో విరగనున్న దశరథమహారాజను ఉషఃకాలమున ఆరనున్న దీపశిఖతో నుపమించుట పాత్ర ప్రస్తుత మానసికపరిస్థితిని అభివ్యక్తము చేసినది.

స్థిరదీపశిఖ: కావ్యజగత్తులో రత్నదీపములు, మణిదీపములు ప్రసిద్ధములు ఇవి యెప్పటికి ఆరని దీపములు. చలనాత్మకమైన హొయలుగాని, సుందరమైన నడకలుగాని యీ దీపముల కుండదు. అందుచే నివి స్థిరదీపశిఖలు. తారకాసురునిచే భయభీతులైన వాసుకి మొదలగు మహోగ్రవ్యాళములు దయనీయావస్థను 'స్థిరప్రదీపితా' అని వర్ణించెను. సర్పములు పడగలపైయున్న మణిదీపకాంతులతో తారకుని సేవించుచున్నవి. స్థిరప్రదీపకల్పనచే నుగ్రసర్పములు తారకుని వలన పొందిన భయాతిశయము వ్యక్తమగుచున్నది.

తైలబిందు సహిత దీపశిఖ: రగిలి వెలుగుచున్నదీపమునుండి పడిన నూనెబొట్టుతో దీపజ్వాలాఖండముకూడ కలిసిపడును. ఈ దృశ్యమును ఇందుమతి శరీరత్యాగమును వర్ణించు సందర్భమున దీపజ్వాలాఖండము తైలబిందువుతోగూడి పతితమైన విధమున ఇందుమతి భర్తతోగలిసి క్రిందపడెను. స్వయంవర సందర్భమున నడిచిన దీపశిఖ, తైలబిందు సహిత

ముగా పడిన జ్వాలాఖండమువలె ఇందుమతి శరీర త్యాగమును వర్ణించుట యాద్యంతములను శిల్పకళా బద్ధముజేయుట.

ఇంకను ఓషధీ దీపములు, దీపమునుండి దీపాంతరము, దీపమునుండి అన్యదీపావిర్భావము మొదలగు అనేక కల్పనములు గలవు. కాళిదాసుని కావ్యములలో దీపశిఖగాని, దీపముగాని యనేక సన్నివేశములలో సముచితముగ ప్రయోగింపబడి యుండుటచే కాళిదాసు దీపశిఖ.

—శ్రీ 'రావు'

'పౌరవశబ్ద విచారము'

పౌరవశబ్దము పురుశబ్దముయొక్క అపత్యార్థక (లేక గోత్రాపత్యార్థక) తద్ధితరూపమో లేక పూరు శబ్దముయొక్క అపత్యార్థక (లేక గోత్రాపత్యార్థక) తద్ధితరూపమో అయి యుండవలెను. అపత్యార్థకరూపమైనను, గోత్రాపత్యార్థక రూపమైనను జేరు ప్రత్యయము లొక్కటియే—కాగా—'పౌరవుఁడు' పురు పూరు చక్రవర్తులలో నెవ్వని సంతతికిఁ జెందిన వాఁడన్నదియే ఇక్కడ విచారింప వలసి యున్నది.

తద్ధితే ష్వచామాదేః (7—2—117) ఞితి ణితి చ తద్ధితే పరేఽచామాదే రచో వృద్ధిః స్యాత్ అపత్యం పౌత్ర ప్రభృతి గోత్రం—అపత్యత్వేన వివక్షితం పౌత్రాదిగోత్ర సంజ్ఞం స్యాత్—ఏకో గోత్రే—గోత్రే ఏక ఏవాపత్య ప్రత్యయ స్స్యాత్—పూరోరణ్ వక్తవ్యః - పౌరవః......తస్య రాజన్యస్యేవం—ఇత్యాది సూత్రముల ననుసరించి నిష్పన్న మగుచున్న పౌరవ శబ్దమునకు మూలరూపము 'పూరు' శబ్దముగాఁ గౌముదిలోని అపత్యాధికారము పరిశీలించినచో మనకుఁ దెల్లమగుచున్నది. అనఁగాఁ బౌరవుఁడు పూరుని కుమారుఁడో లేక పూరుని వంశములోనివాఁడో అగునని పర్యవసానము.

ఇది యిట్లుండఁగా శ్రీ మామిడి వేంకటార్యుల శబ్దార్థ కల్పతరువులో— పౌరవః—అ—పుం—దుష్యంతే, పురువంశే—అనియు – పురుః—ఉ. పుం—స్వర్గే, యయాతేః కనిష్ఠ పుత్రే—అనియు నున్నవి. శబ్దార్థచంద్రికలో పురువు=ఒకరాజు అని నానార్థములలో నొకటిగా వ్రాయఁబడి యున్నది. పై రెండు సంస్కృతాంధ్ర నిఘంటువులలో—పూరుశబ్దము మృగ్యమైనది. శబ్దరత్నాకరముకూడ పౌరవ పూరు శబ్దముల జోలికి పోలేదు.

ఇఁక కవిత్రయములో నాద్యుఁడగు నన్నపార్యుఁడు రాజరాజుచే, నాదిలో—

హిమకరుఁదొట్టి పూరు భరతేశ
కురుప్రభు పాండుభూపతుల్,
క్రమమున వంశకర్తలనఁగా
మహిఁ బొల్పిన యస్మదీయవంశమున—

అని చెప్పించినాఁడు (ఆది— ప్రథమాశ్వాసము 14 పద్యము)

ఆదిపర్వముననే కౌరవవంశ వివరణమున—

'కౌరవాన్వయంబుఁ బాండవ నృపరత్నములకు వారి రాజ్యమైన దాని వినఁగవలతుఁ దద్దయుఁ బ్రీతితో విప్రముఖ్యనాకు వినిపింపు—మని యడిగిన జనమేజయునకు వైశంపాయనుఁడు నిరుపమ ధర్మమార్గ పరినిష్ఠితులై మహియెల్లఁగాచు నరంబరఁగిన తొంటిపూరు కురుపాండు మహీశుల పేర్మిఁజేసి...

...పౌరవకౌరవపాండవాన్వయంబు పెరిగి యొప్పెనని పల్కెను. దీనినిబట్టి పౌరవుల మూలపురుషుఁడు పూరుఁడని తెలియుచున్నది. రాజపరంపరను జెప్పుచు—'పూరుఁడను సుతుండు భూరియశుఁడు' (ఆది—తృ—95) తండ్రి ముదిమిగొని జవ్వనం బిచ్చెనని యతఁడుతెల్పెను. ఈ పూరుఁడు శర్మిష్ఠా యయాతులకుఁ గల్గిన ద్రుహ్యు, అను, పూరులలో గనిష్ఠుఁడు. శుక్రశాపగ్రస్తుఁడై జరాభారంబుఁదాల్చు యయాతికి శాపానుగ్రహముగా, శుక్రుఁడు వాని ముదిమిని ఏ కొడుకునకైన వతఁడంగీకరించిన నీవచ్చుననియు, నట్టివాఁడు వంశ

కర్త యగుననియుఁ బల్కెను. పూరుఁడంగీకరించెను. పూరుఁడను 'కొండుకయయ్యును భూరిగుణశ్రేష్ఠుఁడై' రాజ్యము తండ్రియనంతరము గ్రహించెను. కౌసల్యా పూరులకు జనమేజయుఁడు పుట్టె. పూరునితరువాత 18 వ వాఁడు దుష్యంతుఁడు—వాని కుమారుఁడు భరతుఁడు. తర్వాత ప్రసిద్ధులు హస్తి (22 వ వాఁడు) కురుఁడు - (26) శంతనుఁడు— (33) ధృతరాష్ట్ర పాండురాజులు (35)

ఏ రాజులు కౌరవులును,
భారతులును గౌరవులును పాండవులు ననన్
వీరలు పరఁగిరిది యయ
పౌరగ! భవదీయ వంశ పరిపాటి మెయిన్—
(ఆది—చ—119)

అని వంశములు ప్రస్తావింపఁబడినవి.

అదితి కశ్యపుల పౌత్రుఁడు వైవస్వతమనువు. ఇతని పుత్త్రిక ఇల—బుధుని భార్య—వీరికిఁ బురూరవుఁడు పుట్టెను. ఇతని తరువాతనుండి వంశ క్రమమున మూఁడవవాఁడు యయాతి—తత్పుత్రుఁడు పూరుఁడు—అందుచేఁ బూరుని పూర్వులది ఐలవంశమైనది.

నన్నయ భారతమందుఁ గౌరవవంశక్రమమును జూడుఁడు. ఇందు వంశకరులైన రాజుల క్రమము మాత్రము గ్రహింపఁబడినది. అదితి—కశ్యపులు—వివస్వంతుఁడు—వైవస్వతుఁడు— ఇలానామకుమార్తె—భర్త బుధుఁడు—పురూరవుఁడు—ఆయువు, నహుషుఁడు—యయాతి (భార్య శర్మిష్ఠ)—వీరు ఐలులు, పూరుఁడు, జనమేజయుఁడు, ప్రాచీన్వంతుఁడు, సంయాతి, అహంయాతి సార్వభౌముఁడు, జయత్సేనుఁడు, అవాచీనుఁడు అరిహుఁడు. మహాభౌముఁడు, అయుతానీకుఁడు, అక్రోధనుఁడు దేవాతిథి, ఋచీకుఁడు, ఋక్షుఁడు, మతినారుఁడు త్రసుఁడు. ఐలినుఁడు, దుష్యంతుఁడు వీరు పౌరవులు; భరతుఁడు, భుమన్యుఁడు, సుహోత్రుఁడు, హస్తి, వికుంఠనుఁడు, అజామీఢుఁడు, సంవరణుఁడు, వీరు భారతులు కురుఁడు, విదూరథుఁడు, అనశ్వుఁడు, పరీక్షిత్తుఁడు, భీమసేనుఁడు, ప్రతిశ్రవసుఁడు, ప్రతీపుఁడు, శంతనుఁడు, విచిత్రవీర్యుఁడు. ధృతరాష్ట్రుఁడు—వీరు కౌరవులు; పాండురాజు, ధర్మజాదులు పాండవులు వీరు— ఇందెక్కడను పురు నామకుఁడు కన్పింపఁడు.

ఇఁక ఆంధ్రమహాభాగవతమునఁగల గాథ— 'యయాతికిని శర్మిష్ఠ గర్భంబునఁ ద్రుహ్యుండు, అనువు, పూరువు అను ముగ్వురు తనయులఁ గాంచె— యయాతి

'నలుగు చెఱఁగుల నేలయుఁ
బాలింపుండనుచు నగ్రభవులను బంచెన్
భూలోక మేలుమనుచును
బౌరవ్యోదారుఁ బూరుఁ బట్టము గట్టెన్.'
(నవమస్కంధము 586 పద్యము.)

శుకుండు జనమేజయునితో

'భారత నీవు జనించిన
పూరుని వంశంబునందుఁ బుట్టినవారిన్,
జారు యశోలంకారుల,
ధీరుల వినిపింతు నధిక తేజోధనులన్.'
(593 ప)

అని పల్కెను.

ఇందును పౌరవవంశస్థాపకుఁడు పూరువు—పూర్వగాథాలహరియు భారతములోని విషయమే ఉటంకించినది. ఇంకెట్టి గ్రంథమును దడవలేదు.

ఇఁక వ్యాసభారతములో—(ఆదిపర్వణి- సంభవపర్వ—అష్టషష్టితమోఽధ్యాయః — వైశంపాయన ఉవాచ —)

పౌరవాణాం వంశకరో
దుష్యంతో నామ వీర్యవాన్
పృథివ్యా శ్చతురంతాయా
గోప్తా భరత సత్తమ!

— అన్న శ్లోకానికి హిందీ తాత్పర్యముగా. 'వైశంపాయనజీ నేకహా భరతవంశ శిరోమణే పూరువంశ కా విస్తార్ కరనేవాలే ఏక్ రాజా హోగయే హై—ఇనకా నామ్ థా దుష్యంత—అని వ్యాఖ్యాత వ్రాసినాఁడు. అదే పర్వములో వ్యాసమహార్షి (పంచసప్తతితమోఽధ్యాయము) వంశ వివరణముచేయుచు—

ప్రజాపతేస్తు దక్షస్య
మనోర్వైవస్వతస్యచ
భరతస్య కురోః పూరో
రాజమీఢస్యచానఘ
యాదవానా మిమం వంశం
కౌరవాణాంచ సర్వశః
తథైవ భారతానాంచ
పుణ్యం స్వస్త్యయనం మహత్
ధన్యం యశస్య మాయుష్యం
కీర్తయిష్యామితేఽనఘ! (1—2)

అనియు; యయాతి చరిత్రలో—

దేవయాన్యా మజాయేతాం
యదు స్తుర్వసు రేవచ
ద్రుహ్యు శ్చానుశ్చ పూరుశ్చ
శర్మిష్ఠాయాంచ జజ్ఞిరే—(35)

అనియుఁ బూరుని నామమే నిర్ధరించినాఁడు.

కాని కవికులగురువు మహాకవి కాళిదాసు తన యభిజ్ఞాన శాకుంతల నాటకములో—మృగమునేయ శరసంధానము సల్పు రాజును, వైఖానసుని కోరికచే నుపసంహరింపఁజేసి, ... సదృశమేతత్పురువంశ ప్రదీప కస్య భవతః—

జన్మయస్య పురోర్వంశే యుక్తరూపమిదం తవ
పుత్ర మేవంగుణోపేతం చక్రవర్తిన మాప్నుహి-
(ప్రథమ—12)

అనియు, (పురోర్వంశే—పురునామ్నః రాజ్ఞోవంశే—అని వ్యాఖ్యానము) కః పౌరవే వసుమతీం శాసతి శాసితరి దుర్వినీతానాం అయ మాచర త్యవినయం ముగ్ధాసు తపస్వికన్యాసు (ప్రథమ—23) అనియు (పౌరవే—పురువంశోద్భవే దుష్యంతే — అత్రపౌరవ

ఇత్యనేన మహాకులీనత్వం సర్వలోక ప్రసిద్ధత్వ మద్వితీయత్వంచ జ్ఞాప్యతే—అని వ్యాఖ్య) —

యయాతేరివ శర్మిష్ఠా భర్తుర్బహుమతా భవ
సుతంత్వమపి సమ్రాజం చక్రవర్తిన మాప్నుహి—
(చతుర్థ—7)

(యయాతిర్నామ నహుషపుత్రః సోమ వంశ్యో రాజా ... అత్ర యయాతిశర్మిష్ఠా పూరు నిదర్శనం కృతం — అని వ్యాఖ్య)అనియు నాయా పట్టు లందుఁదెల్పియుండుటచే — పురుని వంశకర్తయని స్పష్టపడు చున్నది. (వ్యాఖ్యాత మాత్రము పురు పూరు నామముల రెంటిని గ్రహించినాఁడు.) కాళిదాసునకు ఆధారమేదియో యుండకపోదు గదా!

అభిజ్ఞాన శాకుంతల మాంధ్రాను వాదకర్తలు శ్రీ వీరేశలింగము పంతులుగారు పైశ్లోకమునకు,

అల శర్మిష్ఠ యయాతికి
వలెఁ బ్రేమాస్పదవుగమ్ము వరునకు నీవున్
జెలువంగా! యా సతి పూరుని
పోలుపున సామ్రాజ్యమేలు పుత్రునిగనుమా

అని తెలుగుచేసినారు. శ్రీ రామదాసయ్యంగారు పురు పూరుపదముల రెంటిని గ్రహించినారు—

వీని నన్నిటిని బరిశీలింపఁగా, వ్యాసపాణి న్యాదుల నిరూపణమునుబట్టి, కాళిదాసాదుల ప్రయోగ కుశలతనుబట్టి ఆంధ్ర మహాకవులు, నిఘంటు కారులు పూరు పురు రూపములరెంటిని గ్రహించి పౌరవాన్వయము స్థాపించినట్లు తెలియుచున్నది. అంతియకాని యిరువురు భిన్నవ్యక్తులు (పూరుఁడు, పురువు) కారు. పూరు పురునామము లొకే వ్యక్తికిఁ జెందినట్టివని మనము నిర్ధరింపవచ్చును.

—శ్రీ వావిలాల రామమూర్తి.

గ్రంథ విమర్శలు

పల్లవులు - చాళుక్యులు

(చారిత్రక వ్యాసములు)

(రచయిత—ప్రకాశకుడు. డా. నేలటూరు వేంకటరమణయ్య ఎం. ఏ. పిహెచ్. డి. ప్రతులకు వేదం వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్—మద్రాసు—1. సైజు—డెమ్మి ఆక్టేవో. గ్లేజు పేపర్ ప్రింటింగ్—రాగ్జిన్ బైండింగ్. పుటలు—446+6+2+4+2=460. వెల రు. 16.)

ఇది చారిత్రక వ్యాస సంపుటి. సుప్రసిద్ధాంధ్ర చరిత్ర పరిశోధకులలో సగ్రగణ్యులైన డా॥ నేలటూరు వేంకటరమణయ్యగారు క్రీ. శ. 1928—1950 మధ్యకాలమున 'భారతి'లో ప్రకటించిన వ్యాసములను గ్రంథముగా ప్రచురించుచున్నట్లు 'పీఠిక'లో తెలిపినారు. ఈ గ్రంథము కీ. శే. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారి కంకితమీయబడినది.

గ్రంథమున మొత్తము పదునొకండు వ్యాసములున్నవి. అందు 'జినవల్లభుని గంగాధర శిలాశాసనము'ను వ్యాసము రెండు సంవత్సరములకు పూర్వము 'భారతి'లో ప్రకటింపబడినది.

గ్రంథమునగల పదునొకండు వ్యాసములలో ఐదు శాసనములకు, ఆరు చరిత్రకు సంబంధించినవి. శాసనములలో నాలుగు తామ్రపట్టికలు. ఒకటి శిలా శాసనము.

చరిత్ర రచన, చారిత్రక సంబంధమైన వ్యాసరచన, శాసన పరిశోధన డా. నేలటూరు వెంకటరమణయ్యగారి జీవితదర్శములు. వీరు వ్రాసి ప్రకటించిన ఆంధ్రాంగ్ల గ్రంథములన్నియు ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించినవి: అందు తూర్పు చాళుక్యులకు, వేములవాడ చాళుక్యులకు, విజయనగర సామ్రాజ్య చరిత్రకు సంబంధించినవి ముఖ్యమైనవిగా భావింపవచ్చును. ఇట్టి చరిత్ర గ్రంథములు రచించి డా. నేలటూరి వేంకటరమణయ్యగారాంధ్ర దేశ చరిత్రకు, తద్వారా ఆంధ్రజాతికి మహోపకారము గావించినారు.

పల్లవులు—చాళుక్యులు అను ఈ గ్రంథమున 1. ఆంధ్రదేశమున చరిత్ర పరిశోధన 2. ఆంధ్రులు చరిత్ర 3. పల్లవచరిత్రమునందు కొన్ని సంశయములు 4. పల్లవవంశము—వీరకూర్చవర్మ 5. వేములవాడ చాళుక్యులు - చాళుక్య భీమ 6. గుణగ విజయాదిత్యునినాటి వర్తమానములు 1, 2—గుణగ విజయాదిత్యునినాటి రాష్ట్రకూటులు. అను వ్యాసములును 1. నెడుఙ్గరాయ తామ్రపట్టిక 2. పృథ్వీ మహారాజ తాణ్డివాడ శాసనము 3. జినవల్లభుని గంగాధర శిలాశాసనము 4. రాజరాజనరేంద్రుని కలిదిండి తామ్రశాసనము 5. రాజరాజనరేంద్రుని మండ తామ్ర శాసనము అను శాసనములను ఉన్నవి.

గ్రంథమున రాజరాజనరేంద్రుని కాలపు భారతదేశపటము అందాంధ్రదేశ సీమావధులు గుర్తింపబడినవి. నెడుఙ్గరయతామ్రపట్టిక, తాణ్డివాడ తామ్రశాసనము, రాజరాజనరేంద్రుని కలిదిండి, మండతామ్రశాసనముల ప్రతిబింబముల ప్రచురింపబడినవి. కాని జినవల్లభునిగంగాధర (కుర్క్యాల) శిలాశాసన ప్రతిబింబము ప్రకటింపబడలేదు. 'భారతి'లో ప్రకటించినప్పుడు శాసనమును మూడుభాగములుగా విడగొట్టి ప్రతిబింబము ప్రకటించియుండిరి. ఆ శాసన ప్రతిబింబము ఇందు చేర్చిన బాగుండెడిది.

'ఆంధ్రదేశమున చరిత్ర పరిశోధన'యను వ్యాసమున 'ఆంధ్రదేశమున చరిత్ర పరిశోధనలో జరిగిన

కృషి దిఙ్మాత్రముగ సూచింపబడినది. కర్నల్ మెకంజీగారు, కావలి వేంకటబొర్రయ్యగారు, శ్రీమాన్ బుక్కపట్టణము రాఘవాచార్యులుగారు, కార్మెకేలు గారు, కందుకూరు వీరేశలింగం పంతులుగారు, చిలుకూరు వీరభద్రరావుగారు, కొమర్రాజు వేంకటలక్ష్మణ రావుగారు, డా॥ కృష్ణస్వామిఅయ్యంగారు, రంగస్వామి సరస్వతిగారు, భావరాజు వేంకటకృష్ణారావుగారు, రాళ్లబండి సుబ్బారావుగారు, డా॥ మారేమండ రామారావు గారు, వడ్డాది అప్పారావుగారు, పి. శేషాద్రిశాస్త్రి గారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, వేటూరు ప్రభాకరశాస్త్రిగారు, కుందూరు ఈశ్వరదత్తుగారు, డా॥ చిలుకూరు నారాయణరావుగారు, గిడవర్తి రామదాసు పంతులుగారు, శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్యులుగారు, డా॥ పుట్టపర్తి శ్రీనివాసా చార్యులుగారు, డా॥ నేలటూరు వేంకటరమణయ్యగారల కృషి తెలుపబడినది.

ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్య, శిరుగూరి హనుమంతరావుగారు, జయంతి రామయ్య పంతులువంటివారిని పేర్కొని వారాంధ్రదేశచరిత్రకు గావించిన సేవలను కూడ తెలుపవలసియుండెను.

ఈ వ్యాసమున రచయితలు, వారి కృషి, వారు వ్రాసిన ముఖ్యమైన గ్రంథములు, సంపాదకత్వము వహించిన సంచికలు ఆంధ్రదేశమున చరిత్ర పరిశోధనలో ముందంజవేసిన పత్రికలు, సంస్థలు—అందు ముఖ్యముగా, భారతి, విజ్ఞానచంద్రికాగ్రంథమండలి లక్ష్మణరాయ పరిశోధకమండలి ఆంధ్రసాహిత్యపరిషత్తు, ఆంధ్రేతిహాస పరిశోధకమండలి, మున్నగు సంస్థలొనర్చిన సేవ కొనియాడ బడినది. కాని ఎప్పుడో వ్రాసి ప్రకటించిన వ్యాసములు, ఆయా వ్యక్తులకు సంబంధించిన విమర్శ—1969 లో ప్రకటింపబడిన గ్రంథమునందుండుట సమంజసముగా లేదు. డా॥ మారేమండ రామారావు, డా॥ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులవారి గురించి నేలటూరువారు వెలిబుచ్చిన అభిప్రాయము అంతమంచిదిగా కనిపింపదు.

'రామారావుగారి వ్రాతలలో కొంతతొందరపాటు గానవచ్చును. లభ్యములగు చరిత్రాంశముల నన్నిటిని గ్రోడీకరించి సిద్ధాంతము సేయుటకు దగిన తాలిమియులేదు. కాని యనుభవముమీద నిట్టి నెరసులు దమంతట నవియే పోసిపోగలవు. (పుట 24.)

డా. పుట్టపర్తి శ్రీనివాసాచార్యుల వారి గురించి వ్రాయుచు 'కాని వీరికి ఓపిక తక్కువ. ఎంతటి ప్రతిభాశాలియైనను, ఓపికలేని పరిశోధకుడు నుతికెక్కడు' (పుట 24) అని తెలిపినారు. డా. పుట్టపర్తివారు పరమపదించి చాలాకాలమైనది. ఆ నాటి వ్యాసములు ఈ విధముగా ఈ గ్రంథమున పొందుపరచుట భావ్యమనిపింపదు ఈ విషయమున డా. నేలటూరు వారుకూడా తమ గురించి చారిత్రకులలోగల అభిప్రాయమును తెలిపి, దానికి తగిన సమాధాన మొసగినారు.

రెండవవ్యాసము—'ఆంధ్రులు - చరిత్ర' అనునది క్రీ. శ. 194 డిశంబరు 12 న ఆంధ్ర విశ్వవిద్యాలయ యూనియన్‌వారు నిర్వహించిన ఆంధ్రనారోత్సవముల సందర్భమున నిచ్చిన ఉపన్యాసము. ఇందు ఆంధ్రుల ఆదిమ నివాసములతో పాటు వారి చరిత్ర—తరువాతి కాలమున ఆంధ్రులకు సంబంధించిన, సాంఘిక, వాఙ్మయ, సంగీత సాహిత్య విషయములు చర్చింపబడినవి. కాని 'క్రీ. శ. 7 వ శతాబ్దమునకు తెనుగుభాష యుండెనని నిరూపింప దగిన ఆధారము లెవ్వియు లేవు' (పుట 26, 27) అని డా. నేలటూరువారి వంటివారు వ్రాయవలసిన

వాక్యము కాదిది. క్రీ. శ. 575 లో రేనాటి చోళ రాజగు ఎరికల్ ముత్తురాజు ధనుంజయుని కలమళ్ల శాసనము వేయింపబడినది. ఇది తెలుగు శాసనము. క్రీ. శ. 1, 2 శతాబ్దములలో తెలుగు దేశభాషగా, జనపదములందు ముఖ్యముగా శాతవాహన సామ్రాజ్యమున వాడుకలో నున్నట్లు, గాథాసప్తశతిలోని తెలుగు పదములనుబట్టి తెలియుచున్నది. ఆరవ శతాబ్ది ఉత్తరార్థమున శాసనస్థమైన తెలుగుభాష, 7 వ శతాబ్దమున్ను నాటికి లేదనుట కాధారములు లేవనుట భావ్యముకాదు.

ఈ వ్యాసమున ఆంధ్రుల చరిత్ర క్లుప్తముగా వ్రాయబడినది. శాతవాహనుల నాటి ఆంధ్రుల ధర్మోద్ధరణము, వాణిజ్యము, శిల్పనిర్మాణముల గూర్చి చర్చింపబడినది. ప్రాకృత వాఙ్మయము. ఆంధ్రశాతవాహనుల ప్రాకృత వాఙ్మయ పోషణము బౌద్ధము—ప్రాకృత భాష బౌద్ధమత ప్రచారమున కుపయోగపడిన విధము వర్ణింపబడినది. కాకతీయ మహాయుగ చరిత్రను వదలి, కాకతీయుల యనంతరము, మునుసూరి ప్రోలయ కాపయ నాయకుల స్వాతంత్ర్య పోరాటము, విజయనగర సామ్రాజ్య నిర్మాణమున హరిహర బుక్కరాయ సోదరులకు విద్యారణ్యస్వామివారు సహకరించిన విధము, విజయనగర సంస్కృతి,ప్రాచీన అవశిష్టములు, వాఙ్మయము, శాసనములు, మెకంజీకైఫియతులు, వర్ణింపబడినవి. ఆంధ్రవిశ్వవిద్యాలయము ప్రచురించిన 'History of Reddy Kingdoms' 'Buddhistic Remains in Andhra Desa' అను గ్రంథములు చర్చింపబడినవి.

'పల్లవ చరిత్రమునందు కొన్ని సంశయములు' అను వ్యాసమున డా॥ వేలటూరి వేంకటరమణయ్య గారు ప్రశ్నలువేసి వాటికి చక్కని సమాధానము లొసంగి, ఇదివరలో పల్లవుల గురించి చారిత్రకులలో నున్న అనుమానములకు తావులేకుండ చేసినారు. ఈ విమర్శనావ్యాసమున శ్రీయుతులు చిలుకూరు వీరభద్రరావు, కీల్హారన్, డూబ్రియల్ పండితుల వాదములను ఖండించి, చక్కని సమాధానము లొసంగినారు.

'పల్లవవంశము—వీరకూర్చవర్మ' అను వ్యాసమున కాధారముగా దర్శిశాసన ప్రశంస, ఉరువుపల్లి, నాయులూరు శాసనాక్షరములనుపోల్చి, కాలనిర్ణయము గావించుటయేగాక, వీరకూర్చవర్మ — హిరహడగల్లి శాసనమును వేయించిన స్కందవర్మ తండ్రియని నిరూపించినారు. వీరకూర్చవర్మయే — శివస్కందవర్మ మైదవోలు, హిరహడగల్లి శాసనములందు పేర్కొనబడిన బప్పస్వామియని తెలుపుట సమంజసముగానున్నది. అక్షరములు - లిపి పట్టికతో పోల్చి చూపుటవలన లిపి పరిణామము, శాసనముల కాలనిర్ణయమున కుపకరించుచున్నది.

నెడుంగరాయతామ్రపట్టిక ఐదురేకులు గలది. శాసనము ప్రతిబింబములతో ప్రకటింపబడినది. ఇది పల్లవరాజులచరిత్ర కత్యంతోపయుక్తమైన శాసనము. ఇందు యువమహారాజు విష్ణుగోపవర్మ, సింహవర్మలు పేర్కొనబడినారు. సింహవర్మ 12 వ రాజ్య సంవత్సరమున వేయించిన శాసనమిది. ఈ వ్యాసమున డా॥ వేలటూరువారు డా॥ పిళ్ళెగారి అభిప్రాయముతో నేకీభవించి, ఈ శాసనములో పేర్కొనబడిన సింహవర్మ, ఉదయేందిరశాసనమున పేర్కొనబడిన స్కందవర్మ కుమారుడగు సింహవర్మ ఒక్కరేయని నిరూపించుట చారిత్రకు లంగీకరింపదగిన విషయము. శాసనమున శారణిక గ్రామము 'ఎణ్ణాన్‌పుళిగడ'యని నిరూపింపబడినది.

'పృథ్వీమహారాజు తాణ్డివాడ శాసనము' అను వ్యాసమున పృథ్వీమహారాజు—అతని పరిపాలన—ఆ కాలమునందున్న ప్రసిద్ధరాజవంశములు—విష్ణుకుండిన విక్రమేంద్ర భట్టారకవర్మ ప్రశంస—పృథ్వీమహారాజు, తండ్రి, తాతల ప్రశంస— వారి సామంతత్వము—స్వాతంత్ర్యము, శాసనముగురించి, రాజు కాలనిర్ణయముగురించి, సుప్రసిద్ధ చారిత్రకుల అభిప్రాయముల ఖండన - పృథ్వీమూలుని గోదావరి తామ్ర

శాసన ప్రశస్తి విష్ణుకుండిన నాలుగవ మాధవవర్మ చివరి పరిపాలనాకాలమున గోదావరినదినిదాటి గోదావరికి ఉత్తరమున పూర్వము తమ వంశీయులు గోల్పోయిన భూభాగములను జయించుటకు వెడలుట మున్నగు విషయములు చర్చింపబడినవి. భాష, లిపి, శాసనకాలము, శాసనవిషయము, ప్రతిగ్రహీతవిషయము, స్థలనిర్దేశము—చర్చింపబడి ప్రతిబింబములతో శాసనము ప్రకటింపబడినది.

వేములవాడ చాళుక్యులు అను వ్యాసము వేములవాడ చాళుక్యులకు సంబంధించిన సమగ్రమైన విషయము కలదు. ఇందు చారిత్రకాధారములో—కొల్లిపఱ తామ్రశాసనము—వంశవృక్షము, మల్లంపల్లివారి అభిప్రాయమును రచయిత అంగీకరించి, తరువాత మార్చుకున్నతీరు, చాళుక్యసంశము అంశాఖా సంబంధము, వినయాదిత్య యుద్ధమల్లుడు, మొదటి అరికేసరి, బద్దెగ, సోలద గంగడు, ఇమ్మడి నరసింహుడు, రెండవ అరికేసరి, వాగరాజు, భద్రదేవుడు, ముమ్మడి అరికేసరి మున్నగు రాజుల చరిత్రతోపాటు, మతపరిస్థితులు, వాఙ్మయ పోషణము, వాస్తునిర్మాణములగూర్చి వివరముగా వ్రాయబడినవి. ఇందు చాళుక్య లెవరు? అను వ్యాస భాగమున పూర్వ చాళుక్యులు, ముదిగొండ చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు—కల్యాణీ చాళుక్యులు వారి వంశవర నాదికములున్నవి.

ఈ సంపుటిలోని ఎనిమిదవ వ్యాసము 'జినవల్లభుని గంగాధర శిలాశాసన మనునది. ఈ శాసనము పంప మహాకవి, అరికేసరి మహారాజు, జినవల్లభుడు, ఈ ముగ్గురి విషయము తెలుపుటయేగాక జినవల్లభుని సత్కార్యములను గుణగణములను తెలిసికొనుటలో తోడ్పడుచున్నది. ఈ శాసనమును, గంగాధర శిలాశాసనమనుటకన్న 'కుర్క్యాల శిలాశాసన' మనుట మంచిది. 279 పుటలో 'సిద్ధశిల వృషభాద్రికి దక్షిణదిశా భాగమున నున్నట్లు తెలుపబడినది. ఇది కరీంనగర్‌కు పడమర 13 మైళ్ల దూరమున—కరీంనగర్ కామారెడ్డి రోడ్డునకు—ఉత్తరపువైపు మూడు మైళ్ల దూరమునందు గంగాధర గ్రామములోని బొమ్మలగుట్టయనుట నిశ్చయము' అనియున్నది. ఈ 'గుట్టను' 'బొమ్మలమ్మగుట్ట' యని పిలుతురు. బొమ్మలమ్మ గుట్టపైన సిద్ధశిలపై ఈ శాసనము చెక్కబడినది. కాని ఈ గుట్ట కుర్క్యాలగ్రామ సరిహద్దులలో నున్నది. కుర్క్యాల కరీంనగర్ జగిత్యాలరోడ్డుపైనున్న గ్రామము—కరీంనగర్ కుర్క్యాలమధ్యదూరము 12 మైళ్లు. కరీంనగర్ కామారెడ్డిరోడ్డుపై కొదురుపాకగ్రామము 15 మైళ్లదూరమున నున్నది. కొదురుపాకనుండి కరీంనగర్—జగిత్యాలరోడ్డుపైనున్న గంగాధరగ్రామము 13 మైళ్లు. కావున వేంకటరమణయ్యగారు వ్రాసిన 'కరీంనగర్ కామారెడ్డిరోడ్డునకు—ఉత్తరమువైపు మూడుమైళ్ల దూరమునందున్న గంగాధరగ్రామము, జగిత్యాలరోడ్డుకు మూడుమైళ్లదూరమున నున్నది.

గుణగవిజయాదిత్యునినాటి వర్ధమానములను వ్యాసమున డా॥ నేలటూరువారు 1. అప్పలనాయకునిపేట తామ్రపత్ర ఖండము, 2 మచిలీపట్టణం పట్టికలు, 3 పాములపాడు తామ్రశాసనము, 4. గుంటూరు శాసనము, 5. పోణంగి తామ్రశాసనము, 6. ఉరుటూరు తామ్రపట్టికలు, 7. సాతులూరు తామ్రపట్టికలు, 8. సీసలి తామ్రపట్టికలు, 9. కాట్లపర్రు నాపశాసనము, శిలాశాసనముల ఆధారముగ సమగ్రమైన చర్చ జరిపి, చక్కని విషయముల రూపొందించినారు. కందుకూరు, అద్దంకి, ధర్మవరం శాసనముల ప్రశంస ఇందు గావింపబడినది. గుణగవిజయాదిత్యుని యుద్ధములు, ఆ కాలపు సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మతసంబంధమైన విషయములు, గుణగవిజయాదిత్యుడు—రాష్ట్రకూటులు—అను వ్యాసభాగము చక్కని ఉదాహరణములతో రచింపబడినది.

రాజరాజనరేంద్రుని కలిదిండి తామ్రశాసనమున—శాసనలబ్ధి, శాసనగ్రంథము, శాసనపరిమాణాదులు రాజముద్రిక—లిపి, భాష—ప్రశస్తి, పౌరాణిక చారిత్రక వంశక్రమము, జననము, యౌవరాజ్యాభి

షేకము, రాజ్యాభిషేకము, రణక్షేత్రము, శుభు రాంతకదేవుడు, కర్ణాట దండయాత్ర—ఈ దండ యాత్రా సమయమునమున్న కర్ణాట రాజెవ్వరో? చోళ సేనాధిపతులు, దానవిషయము, దానకాలము, శాసనకావ్యకర్త—లేఖకుడు—మున్నగు విషయములు చర్చింపబడి శాసనము ప్రకటింపబడినది.

రాజరాజనరేంద్రుని మండ త్రామశాసనము అను వ్యాసమున—శాసనలబ్ధి, స్వరూపాదికము—ముద్రిక, శాసనస్థితి—అక్షరస్వరూపము, గుణింతము—భాష, శాసనగ్రంథము—శాసనకాలము—స్థలనిర్ధారణ అది విషయములు చర్చింపబడినవి. ఈ శాసనమున గల తెలుగుపదములగు, ముమ్మడి భీమకోల, పడ్ల పట్లు, పడకు, పన్నన, పాలగరున—కొలపుట్ట—అలమ—రట్టడి, యాచనముమాడ, ఒక్కండ్ర—పూడ్ల మున్నగు పదములు చర్చింపబడి అర్థము తీయ బడినవి. త్రావిణ్డి పదమున కర్థమీయబడలేదు. ఈ శాసనమున కాజ్ఞప్తి కటకరాజు. శాసనకవి నన్నయభట్టు. లేఖకుడు గండాచార్యుడు. ఈ శాస నము ప్రతిబింబములతో ప్రకటింపబడినది.

పదునొకండు వ్యాసముల గ్రంథ సంపుటి వెల 16 రూపాయలు. ఈ గ్రంథమువలన ఆంధ్ర చారిత్రకులకు, పరిశోధనా వ్యాసములు వ్రాయు వారికి, చక్కని విషయములు లభించుట కవకాశము కలిగినది. వ్యాసము తీపరకే ప్రకటింపబడినను ఒకే గ్రంథమున వివిధ విషయములకు సంబంధించిన వ్యాసములతోపాటు పల్లవ, చాళుక్య వంశీయులకును, పృథ్వీ మహారాజునకును సంబంధించిన వ్యాసము లుండుట, చరిత్ర పరిశోధనచేయు వారికి మిక్కిలి ఉపయోగకరము. డా. నేలటూరి వారు సమగ్రాంధ్ర చరిత్ర రచనకు పూనుకొని ఆంధ్రదేశము నేలిన రాజవంశములకు సంబంధించిన సమగ్ర చరిత్రతో పాటు, ఆంధ్రుల సాంఘిక చరిత్రను సమీక్షించి గ్రంథము రచించిన—ఆంధ్రజాతికి ఎంతేని మేలు చేసిన వారగుదురు.

—భిన్నూరి నరసింహ శాస్త్రి

పూర్వాంధ్రకవులు

(రచయిత : శ్రీ పేకుమళ్ల కామేశ్వరరావు. ప్రతులకు : రచయిత, 12/512. పిళ్లయార్ కోయిల్ వీధి, చిత్తూరు. మూల్యము : అయిదు రూపాయలు. విద్యార్థులకు మూడురూపాయలు.)

పూర్వాంధ్రకవులను మొత్తము గ్రంథములో ఇప్పుడు సమీక్షింపబడుచున్నది. ఇది ప్రథమ భాగము మాత్రమే. ఇందులో (1) జయదేవుడు. (2) వేమన. (3) మల్లికార్జునముని. (4) రేచన. (5) గుణగవిజయాదిత్యుడు. (6) మొదటి పండ రంగడు. (7) నన్నెచోడదేవుడు. (8) మొదటి యుద్ధమల్లుడు. (9) కడియరాజు. (10) రెండవ యుద్ధమల్లుడు. (11) పద్మ (పంప)కవి. (12) జినవల్లభుడు. ఈ పన్నెండుగురును నన్నయగారి కంటెను ముందటికాలమునందున్న కవులుగాను, కవిపోషకులుగాను కనిపించుచున్నారని శ్రీ కామేశ్వర రావుగారు ప్రమాణములు చూపించి రుజావుచేయు ప్రయత్నము పుష్కలముగా జేసినారు. కవుల చరిత్రములను వ్రాయుటలోగల సమధికోత్సాహము తెనుగువారియందు సాహిత్య చరిత్రమును వ్రాయుటలో లేకపోవుట ఒక విశేషము. కవుల చరిత్రయనగా ఆయాకవుల దేశకాలముల నిర్ణయము. కొన్నివందల మంది తెలుగు కవుల చరిత్రము లిప్పటికి వ్రాయ బడినవి. ఇందులో ఒక్కని విషయమున — ఇదిగో ఇతనిదీయూరు—ఇతడీ ఫలానాదినమున పుట్టినాడు—ఇంతవరకు చదువుకొన్నాడు— ఇదిగో ఈ కావ్యము నీనాడు మొదలుపెట్టి ఈనాడు సమాప్తము చేసి నాడు—ఇత డిన్ని కృతుల నీ వరుసలో వ్రాసినాడు— అను ఈ మొదలైన అంశములు కచ్చితముగా చెప్పిన కవుల చరిత్రమే లేదు. ఎవరేమి చెప్పినను ఉజ్జా యింపుగా చెప్పవలసినదే. ఈ విషయమున కచ్చిత మైన లెక్కలేదు. మరియు మన కవిచరిత్రకారులకు కొందరు కవులు మరియు చులకనైపోయినారు. వారి నెప్పుడును చరిత్రకారులు ఆసులో గొట్టమువలె

ఊరక అటు— ఇటు పదేండ్లు వెనుకకు— పదహారేండ్లు ముందుకు అన్నట్లుగా త్రిప్పుచుందురు. ఆ విధముగా త్రిప్పలుబడుచు ఈనాటికింకను ఒకచోట కుదురుకొనని తెనుగు కవులలో నన్నిచోడదేవుడు మొదట పేర్కొనదగినవాడు. శ్రీ కామేశ్వరరావుగారీ పుస్తకమున పన్నెండుగురను గురించి వ్రాసినారన్నమాటయే కాని అసలు నిజముగా వ్రాసినది నన్నిచోడదేవుని గురించియే అని చెప్పవలయును. రెండువందల ముప్పదివుటల గ్రంథములో నూట పదునేడు పుటలమేర నొక్క నన్నెచోడుడే ఆక్రమించుకొనియున్నాడు. ఇక మిగిలిన పదకొండు మందికి నున్నది నూటపదమూడు పుటలేకదా!

దేశకాలముల నిర్ణయము లే ఇందు ప్రాధాన్యము వహించినను మరి కొన్ని విశేష విషయములును ఇందున్నవి. (1) వేమన ఒకడుకాదు. చాలామంది వేమనలు కలరు. ఆ యందరు వేమనలు అప్పుడప్పుడు చెప్పిన పద్యములే ఇప్పుడు మనకున్న వేమన పద్యములు. (2) కుమారసంభవములోని యుద్ధము అది తత్కాలమునందలి దేశచరిత్రమును చెప్పుచున్నది. కుమారసంభవ కథలో నొక అంతరార్థమున్నది. (3) మధ్యాక్కర ఛందస్సులోని యతిస్థానము రెండు విధములుగా తయారగుటకు జానపద వాఙ్మయమే కారణము. ఆయా విషయములను శ్రీ కామేశ్వరరావుగారు మిక్కిలి సమర్థతతో నిరూపించిరి. శ్రీ కామేశ్వరరావు ఎక్కువ శ్రమచేసి ఇన్ని నూత్నవిషయములనిందు పొందుపరచినారని అభినందించుటకు మన విద్వాంసుల కభ్యంతరముండదుకాని, ఆయనగారు చేసిన నిర్ణయాలను అంగీకరించుట యనగానే వెలక్కాయ పడ్డట్లగును. అందువలననే ఎందరెంత పరిశ్రమచేసి నూత్న విషయముల నావిష్కరించినను ఉన్నత విద్యాపీఠములయందు వానికి ప్రవేశము లభించుట లేదు. మరియు వాని విషయమున విశ్వవిద్యాలయములలో అధికారులకు శ్రద్ధయు కనిపించుట లేదు. ఉన్నదాని నున్నట్లుంచి మన కాలమును మనము వెళ్లదీసికొని పోవుటయే నీతిగా అనుసరింపబడుచున్నది. నిజానికి శ్రీ కామేశ్వరరావుగారి ఈ కృషి ఉచితానుచితములు విశ్వవిద్యాలయములందున్నత పదవు అలంకరించిన విద్వాంసులు చర్చింపవలెను. నిర్మొగమాటముగా తేల్చి చెప్పవలయును. అది జరుగుట లేదు. మనకు మొగమాట మెక్కువ.

శ్రీ కామేశ్వరరావుగారు నన్నెచోడదేవుని విషయమున క్రొత్తవిషయములను ప్రతిపాదించుట కెంత శ్రమచేసినదియు ఈ పుస్తకము చదివిన తెలియగలదు. ఆంధ్రసాహిత్య విద్యార్థులీ గ్రంథమును శ్రద్ధాళువులై పఠింపవలయును.

కావ్య పరీమళము

(రచన : శ్రీ విశ్వనాథ సత్యనారాయణ; ప్రచురణ : ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ; కళాభవన్— హైదరాబాదు — 4. మూల్యము : మూడున్నర రూపాయలు.)

ఇది శ్రీ గోపాలరెడ్డిగారికి అంకితము చేయబడినది. పెద్దన, రామకృష్ణుడు, ముక్కుతిమ్మన్న, రాయలవారు, రామరాజభూషణుడు, శ్రీనాథుడు, ధూర్జటి, నాచనసోముడు, చేమకూర వేంకటకవి— ఈ తొమ్మిదిమంది కవులు రచించిన పదకొండు కృతు లిందు సమీక్షింపబడినవి. ఆయాకవుల ప్రసిద్ధికి మూలమైన కృతులు ప్రధానముగా గ్రహింపబడినవి. ఆ విధముగా ఒక్కొక్కని దొక్క కృతి శ్రీనాథుని విషయమున కాశీఖండ, హరవిలాస భీమేశ్వర పురాణములు మూడు కృతులు సమీక్షింపబడినవి. ఆంధ్రభాషయందలి కావ్యప్రబంధ వాఙ్మయ రంగమున మూలస్తంభము లనదగిన పదకొండు కృతుల నొక మహాకవి తనకు తోచినట్లు వ్యాఖ్యానింపగా తత్తత్కావ్య పరీమళములు గుబాళించునదియై ఈ విమర్శన గ్రంథ మిట్లు తయారైనది.

వ్యాసకర్తలన్నియును గ్రంథముల పేర్లే. అవి వరుసగా రచింపబడినకాలము ననుసరించ కూర్చబడియున్నచో బాగుండెడిది. అప్పుడాంధ్ర సాహిత్యము

యొక్క ఉత్తరోత్తరాభివృద్ధిలక్షణము మరియు విస్పష్టముగా తెలియవచ్చెడిది.

ఇది గుణదోషవిచారణాత్మకమైన విమర్శ కాదు. ఆయాకృతులయొక్క గుణగణ ప్రశంస మాత్రము మరియు ఆయా గ్రంథములు నామూల చూడముగా చెప్పుకొనిపోయి పరమార్థము త్రవ్వి పోసిన విధానమును ఇందు లేదు. ఆయాకృతులు రచింపబడుటలోగల వైలక్షణ్యములను కొన్నిటిని సావధానముగా వెల్లడించుటయే యిందు కనిపించుచున్నది అందువలన ఈ పదకొండు కృతులను గురించియు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు తమకు తోచినంతవరకును సమగ్రముగా వ్యాఖ్యానించినారని చెప్పుటకు వీలులేదు. 'నేను వ్యాఖ్యానములు వ్రాయుటలో పాఠకులయొక్క మనస్సులు మన సాహిత్యములోని రమణీయకమును తెలిసికొనుటకు ప్రయత్నము చేయుచున్నాను ' (పుట 34) తమ రచించుచున్న ఈ విమర్శన గ్రంథ ప్రయోజనము నట్లుగా శ్రీ సత్యనారాయణగారు భావించిరి. ప్రయోజన విషయమున నింత నిష్కర్షయైన అభిప్రాయమును ప్రకటించిన మహాకవి దానిని సంపాదించకుండనుండునా? మనము మన ప్రాచీన కావ్యముల నెట్లు చదువుకొన వలయునో—ఎట్లు చదివిన అందలి రామణీయకము లనుభవమున కగునో—అసలు రామణీయకమనగా నేమో —ఈ మొదలైన బహుళంశములను శ్రీ సత్యనారాయణగారిందు సోదాహరణముగా నిరూపించినారు. ఈ వ్యాసములు చదివినచో మన ప్రాచీనకావ్యములు అసలు మన కెందు కర్థవంతము లగుటలేదో కూడ తెలిసి వచ్చును. శ్రీ సత్యనారాయణగారి ప్రతిభా విశేషముల నెత్తిమాపుట చాల బాల్యవిచేష్ట. ఆయన బుద్ధివిక్రీడ ప్రసరించినను మిణుగురులను చిమ్ముకొనుచు పోవును. వెలుగులను నింపుకొనుచు పోవును. జ్ఞానవిజ్ఞానఖనియైన లోకజ్ఞుడాయన. మన ప్రాచీనాంధ్రకవుల నాయన లోక స్వభావము నెరిగి యొకసారి, పురాణేతిహాస విజ్ఞాన రహస్యములెరిగి యొకసారి, సాహిత్యవిద్యాతత్త్వ మర్మజ్ఞత్వమువలన నొకసారి, వేదోపనిషద్భాష్య విజ్ఞానతత్త్వవేత్తృత్వ లక్షణము ననుసరించి ఒక సారి—ఈ విధముగా వ్యాఖ్యానించును. ఆ విధముగా మన ప్రాచీనాంధ్రకవుల కావ్యరచనాధ్వములన్నియును ఆయనకు కరతలామలకములు.

ఈ పదకొండు కృతులనుండియు శిల్పాభిరామములైన పద్యముల నెన్నింటినో ఇందు శ్రీ సత్యనారాయణగారు రుదాహరించి వ్యాఖ్యానించిరి. ఈ పద్యములను కంఠస్థములుగా చేసికొని ఆయా వ్యాఖ్యానములను మనస్సునకు పట్టించుకొన్నవాడు మరొకరి ప్రమేయములేకుండ స్వంతముగా నొక మోస్తరు పండితుడుగా చలామణి గావచ్చును.

ఇందు ప్రశంసింపబడిన పదకొండు గ్రంథములును ఒకజాతివికాదు. అవి కొన్ని ప్రబంధములు. అందును కొన్ని శివపారమ్యమును చెప్పునవి. మరి కొన్ని విష్ణుపారమ్యమును చెప్పునవి. అందొక కొన్ని మాహాత్మ్యప్రక్రియా వైలక్షణ్యము కలవి. ఈ విధముగా విలక్షణములైన గ్రంథములను విలక్షణముగానే విమర్శింపవలయును. మునుముందాయా కవుల పట్లను, ఆయాకృతులపట్లను ఒక ప్రీతి పుట్టినచో తరువాత క్రమముగా వానిని వాని ప్రక్రియా వైలక్షణ్యమునుబట్టి అధ్యయనము చేసికొనవచ్చును. శ్రీ సత్యనారాయణగారు పాఠకుల కట్టిప్రీతి పుట్టించు తాత్పర్యముతోడనే ఈ రకము విమర్శనమును వెలయించిరి. సాహిత్యవిద్యార్థులకీ గ్రంథము తప్పక శ్రద్ధగా చదువదగినది. మన ప్రాచీనకవుల పద సంయోజనము, సమాసకల్పనము తెలుగు సంస్కృతములను కలగలిపి కూర్చుట, కవి సమయముల వినియోగము, పద్యరచనములోని విశేషములు — ఈ మొదలైన వన్నియు శ్రీ సత్యనారాయణగారిచేత ఇందాయా సందర్భములయందు విశదీకరింపబడినవి. ఈ విశదీకరణమాధారముగా మిగిలిన కావ్యమును మనము చదువుకొనవలయును.

మహాకవి విషయము. శ్రీనాథ మహాకవిని గూర్చిన శ్రీ సత్యనారాయణగారి అంతర్యము

శ్రీనాథుడు సీసపద్యమును చెడగొట్టినాడని ఆయన ఇదివరలో అన్నదాని అంతర్యము ఈ కావ్య పరిమళ మును—చూచినచో ఆస్వాదించినచో అంతుపట్ట గలదు.

శ్రీ సత్యనారాయణగారిచేత ఈ విధముగా ఈ పుస్తకమును వ్రాయించి ప్రకటించిన ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీ కార్యనిర్వాహకులును అభినందనీయులు.

—క్షేమేంద్ర.

దంతపు దువ్వెన

(రచన : శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, ప్రచురణ : ఎమెస్కో. పే. 224. వెల 2.00)

సాహితీక్షేత్రంలో విశ్వనాథ సత్యనారాయణ గారు చేయని వ్యవసాయము లేదు. పండించని పంట లేదు. ఇటీవల వారు వ్రాస్తున్న నవలలు తెలుగు దేశాన్ని వెనక్కు నడిపించేవిగా వున్నాయి. వైదికమత పునరుద్ధరణకొరకు పడరానిపాట్లు పడుతున్నారు. అక్కరలేనంత పాండిత్యం, ప్రతిభావ్యుత్పత్తులు వున్నా రొమాంటిక్ కథలు వ్రాస్తున్నారు. ఈనాటి పాఠకులు అంత అజ్ఞానంలో లేరని రచయిత గుర్తించాలి. ఈ నవల నేపాళ రాజవంశ కథానవలల్లో ఆరవది. 'బాయ్ మీట్స్ గరల్'ను పోలిన కథ. ఇంతచిన్నకథ రెండువందల పేజీలకు పైన ఎందుకు విస్తరించుకుందా అని ప్రశ్నించవచ్చు. చారిత్రక విషయ వివరణ హెచ్చు. కథాచిత్రణ లొచ్చు. ఈ కథ రొమాంటిక్ లక్షణాలను పుణికి పుచ్చుకున్నది. కథానాయకుడు మనోహరం వైదికధర్మ నిష్ఠాగరిష్ఠుడైనా చూడగానే ప్రేమించటం, ఆమె యిచ్చిన దంతపు దువ్వెనను విలువగల పేటికలో భద్రపరచటం రొమాంటిక్ చేసే పనులు. అందుకని వైదిక ధర్మంలో విశిష్ట లక్షణం ఏమీ కనిపించటం లేదు. మనోహరంలోవున్న వైదిక ధర్మం, యితర ధర్మాల కన్న గొప్పదేమీ కాదు.

ఓపికగా చదవాల్సిన నవల. భాష విశిష్టమై శిష్ట వ్యావహారికం.

జాజిమల్లి

(రచయిత : అడవి బాపిరాజు: ఎమెస్కో ప్రచురణ: వెల రు. 2—00 పే. 138.)

అడవి బాపిరాజుగారు ఆంధ్రలోకానికి చిరపరిచితులు. బహుముఖప్రజ్ఞాశాలి. సకల లలితకళలయందు వ్యామోహంవలన ఏఒక్కదానిలోనూ పరిణతి చెందలేకపోయారు. నవల ప్రక్రియలో పాత్రనిర్మాణము, కథాసంవిధానమూ సరిగా అర్థంచేసుకున్నట్లు తోచదన్న సుదర్శనంగారి వాక్కు యధార్థం. పాత్రలు రచయిత మలచిన ప్రతిమలవలె కనిపిస్తాయి. బాపిరాజుగారిలో సంస్కారదృష్టి వున్నప్పటికీ అది వాస్తవికతకంటె కల్పనమీద ఆధారపడివుంది. రచయితకు తెలిసిన విషయాలన్నీ పాత్రలచేత పలికిస్తారు. అనవసర విషయవివరణకు అధికప్రాధాన్యము నివ్వటంవలన జీవితచిత్రణ కుంటుపడుతున్నది. ఇతివృత్తంలో చెప్పుకోతగ్గ విశేషమేమీలేదు. బెస్త కుటుంబంలో పుట్టిన పద్మాలు, ఆమె భర్త బుచ్చి వెంకులూ పట్నానికి చేరుకుని పద్మావతి బుచ్చి వెంకట్రావు అయ్యారు. వారి జీవితానికి వెండిమెట్ల నిచ్చెన దొరికింది. పద్మావతి సంగీతసరస్వతి అయింది బుచ్చి వెంకట్రావు సినీ ప్రొడ్యూసరవుతాడు. రాధాకృష్ణ, సుశీల ఆదర్శదంపతులతో పరిచయం. తరువాత భార్యాభర్తల ఎడబాటు. పద్మావతి దక్షిణదేశ తీర్థయాత్రల సందర్శన. కథాంతంలో మ్యాధిక్సీలో పునస్సమాగమం. ఈ నవలలో ఐదు పాత్ర లున్నాయి. శ్రీమతి కరుణామయి తీర్థయాత్రా సందర్శనలో పద్మావతికి గైడ్.

రచయిత సౌందర్యోపాసకుడు కావటంవలన, శిల్పకళకు అంకితమవటం వలన శిల్పాలూ సౌందర్య వర్ణనలూ ఎక్కువగా వుంటాయి భాష మధురంగా వుంది.

—శివకుమార్

రెండు నాటికలు

దీనిలో రైల్వేలు జాతీయాదాయం, ఇది నాటకం అనే రెండునాటికలున్నాయి. మొదటి నాటిక రచయిత—శ్రీ కాలనాథభట్ట వీరభద్రశాస్త్రి; రెండవ నాటిక రచయిత—శ్రీ మురళీకృష్ణ. పుటలు—84. వెల – 1—50. ప్రాప్తిస్థానం — సాహితీ సమాఖ్య, 31—6—11, మారుతీనగర్, విజయవాడ—4.

గోత్ర ప్రవరచంద్రిక

సమస్తశాఖలగోత్రాలు, ప్రవరలు తెలిపే పుస్తకం సంకలనకర్త—శ్రీ మునునూరి వెంకట శాస్త్రి. పుటలు—28. వెల—0–50. ప్రాప్తిస్థానం—శ్రీనివాస ప్రెస్, రాజమండ్రి—1.

విశాలాంధ్ర సమైక్యత

వ్యాససంపుటి. రచయిత – శ్రీ కామరాజు హనుమంతరావు. పుటలు—84. వెల – ఒకరూపాయి. ప్రాప్తిస్థానం — ప్రాక్ప్రతీచీ గ్రంథమాల కార్యాలయం, దానవాయిపేట, రాజమండ్రి—3.

దీనిలో మేలుకొలుపు, బ్రహ్మోపాసనగోష్ఠి, వైదికవిజ్ఞానస్రవంతి, వివిధప్రత్యక్షానుభూతి, పూర్ణయోగసిద్ధి, సర్వోదయసేవ, ప్రాక్పశ్చిమసంగమము, విశాలాంధ్ర పురోభివృద్ధి అనే వ్యాసాలున్నాయి.

అంబేడ్కర్ ప్రసంగాలు 2

ఈ ప్రథమ సంపుటిలో బుద్ధుడు కార్ల్ మార్క్స్, ధర్మదీక్ష అనే ప్రసంగాలున్నాయి. అనువాదం శ్రీ బొజ్జా తారకం. పుటలు—60. వెల—అర్థ రూపాయి. ప్రతులకు, బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, 10—1—18/3 శ్యాంనగర్, హైదరాబాద్ 4.

ప్రణయశ్రీ

పద్యకావ్యం రచయిత. శ్రీ నోబుల్ బూర్సు. పుటలు—16 వెల—తెలియదు. ప్రాప్తిస్థానం నోబుల్ ప్రచురణలు, కందుకూరు, ఖమ్మంజిల్లా.

అశోకవనిలో రాముడు

పదిశాఖల పద్యకావ్యం. రచయిత శ్రీ బోయి భీమన్న. పుటలు-78 వెల—3—00. ప్రాప్తిస్థానం సుభేలానికేతన్, ఐ సి. 85, ఇర్రంమంజిల్ కాలనీ, హైదరాబాద్—4.

గాంధీమహాత్మ శతకద్వయము

రచయిత—శ్రీ ఓరుగంటి నారాయణప్ప. పుటలు—66. వెల—1—00. ప్రాప్తిస్థానం—శ్రీ ఓరుగంటి నారాయణప్ప, ప్రవేటు టీచరు డి 6/362, తిమ్మనచెర్లపోస్టు, గుంతకల్లు, అనంతపురంజిల్లా.

యమునాతీరం

జయదేవుని గీతగోవిందానికి గేయరూపాను కృతి. రచన—శ్రీ కె. రాజమల్లాచారి. పుటలు 52. వెల—ఒక రూపాయి. ప్రాప్తిస్థానం వివేకమిత్రకళా సమితి, మార్కాపురం.

దక్షయజ్ఞం

గేయరచన, రచయిత—శ్రీ కపుల ఆంజనేయ శర్మ. పుటలు-44. వెల—1 25. ప్రాప్తిస్థానం—శ్రీ శ్రీనివాసా పబ్లికేషన్స్, అనకాపల్లి, విశాఖజిల్లా.

కవికొండలవారి మాతృదేశ సంకీర్తనము

శ్రీ కవికొండల వేంకటరావుగారి గీతికల సంపుటి. సవోసవో జయ, ఉయ్యాలా, దంబాలా, మోహనగంగా, విమలభారత, మమ్ముగన్న మాతృదేశమా, మాతృదేశమున కది యేనాడో, వడివడి వడుకు మన జీవితమంటే, జాతీయగీతిక, స్వాతంత్ర్య ముహూర్తము,, దేశవిభజన విషాదగీతిక, ఆవేదన—అనే గీతాలున్నాయి. పుటలు - 16. వెల—0—60. ప్రతులకు — శ్రీ కవికొండల సూర్యనారాయణ, 2—12, బ్రాడీపేట, గుంటూరు 2.

గ్రంథ విమర్శలు

ఉద్బోధ

కావ్యం. రచయిత — శ్రీ నారు నాగనార్య. పుటలు - 46. వెల—1—25. ప్రాప్తిస్థానం— రచయిత, ఆత్మారామవిహారము, సి. కె. రాచపల్లి పోస్టు, వయా—రైల్వేకోడూరు, కడపజిల్లా.

నివేదన

భక్తిశతకం. రెండు భాగాలు. రచయిత— శ్రీ మేకా సుధాకరరావు పుటలు—126. వెల— తెల్పియుదు. ప్రాప్తిస్థానం—శ్రీ రాణీగారు, బొబ్బిలి రాజభవనము. బొబ్బిలి.

దీక్ష

సాంఘికనాటకం. రచయిత—శ్రీ పట్నాయిక్. పుటలు—56. వెల—1—50. ప్రాప్తిస్థానం— శ్రీ శ్రీనివాస పబ్లికేషన్స్, అవకాపల్లి.

అనుజశతకము

'అనుజా'అనే మకుటంతో పసివారికి హిత బోధచేసే శతకం. రచయిత—శ్రీ మునుమూరి మహా దేవశాస్త్రి. పుటలు—32. వెల—0 - 60. ప్రాప్తి స్థానం—శ్రీ మునుమూరి మహాదేవశాస్త్రి, ఆలేరు, భువనగిరితాలూకా.

జీవ ప్రబోధము

మేలుకొలుపులు. రచయిత-శ్రీ నారు నాగనార్య. పుటలు—పాకెట్ సైజు 24. వెల—12 పైసలు. ప్రాప్తిస్థానం — శ్రీ నిత్యానందగిరిస్వాములవారు, శ్రీ కైలాసాశ్రమము, ఉపనిషద్విహార్ పోస్టు, శ్రీ కాళహస్తి.

కార్మిక స్వర్గంలో కళాప్రియుడు

రవీంద్రుని కథలు, గల్పికలు, భావచిత్రాల సంపుటి. అనువాదం : శ్రీ కె. వి. రమణారెడ్డి. దీనిలో 32 కథలు, గల్పికలు, భావచిత్రాలు ఉన్నాయి. పుటలు—134. వెల - 2—50. ప్రాప్తిస్థానం— ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు. రాష్ట్రపతి రోడ్డు. సికిందరాబాద్.

మహాత్మాజీ

గాంధీజీ డెబ్బయ్యవ జన్మదినోత్సవంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సంపాదకత్వాన ప్రచురించిన వ్యాస సంపుటి అనువాదం. అనువాదకులు - శ్రీ ముదిగంటి జగ్గన్నశాస్త్రి. పుటలు- 380. వెల - 8 - 00. ప్రాప్తిస్థానం. త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్టణం, మద్రాసు—1. దీనిలో దేశవిదేశ ప్రముఖులు వ్రాసిన 32 వ్యాసాలున్నాయి.

వైద్యక శారీరశబ్దకోశం

సంకలన కర్తలు - శ్రీయుతులు వేటూరి శంకరశాస్త్రి, ముదిగొండ గోపాలరావు. పుటలు : 432. వెల : 10—00. ప్రాప్తిస్థానం : కమలా పబ్లికేషన్సు, చోడవరపు దేవరాజుగారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ - 2.

శారీరశాస్త్రమునకు సంబంధించిన ఆధునిక వైద్య పారిభాషిక పదాలకు సంస్కృత, తెలుగు ఆయుర్వేద పారిభాషిక పదాలు, వాటి అర్థాలు ఇవ్వబడ్డాయి.

'ఆధునిక వైద్యశాస్త్రమున మానవ శరీర సంబంధముగా వాడబడుచున్న, గ్రంథస్థమై యున్న ఆంగ్ల పారిభాషిక పదములను అకారాది క్రమమున సమకూర్చి వానికి ఆంగ్లభాషలోనే వివరముల నిచ్చిన కొన్ని కోశములు గలవు. ఆ విధముగనే ప్రాచీనాయుర్వేద సంహితలలో శాస్త్రీయముగను, ప్రామాణికముగను సంస్కృతభాషలో లభించే పదము లన్నిటిని ఏర్చి కూర్చి అవసరమైనచోట వివరములతోను, గ్రంథస్థమై వాడుకలోనున్న తెలుగు పదములతోను అకారాదిక్రమమున ఆంగ్లపదములకు అర్థవివరణముతోసహా ఈ కోశమును సమకూర్చియున్నాము' అని పీఠికలో సంకలనకర్తలు చెప్పుకొన్నారు.

వీరి చిరకాల పరిశ్రమ ఫలితముగా వెలువడిన

ఈ కోశము ఆధునిక వైద్యులకు, ఆయుర్వేద వైద్యులకు, విద్యార్థులకు, శాస్త్రపరిశోధకులకు ఉపయోగపడగలదని విశ్వసించవచ్చు.

బాలవిజ్ఞాన కథలు

రచయిత — శ్రీ వేలూరి శివరామశాస్త్రి. పుటలు 128. వెల—2-00. ప్రాప్తిస్థానం—త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్నం—1, మద్రాసు—1.

దీనిలో కీర్తిశేషులు శ్రీ శివరామశాస్త్రిగారు చిన్నపిల్లలకోసం బాలపత్రికలో వ్రాసిన కథలు 94 వున్నాయి. పిల్లల మేధను, ఊహాశక్తిని పెంచగల కథలు.

బ్రాహ్మణీకం

రచయిత - శ్రీ చలం. పుటలు 128. వెల—2 00. ప్రాప్తిస్థానం—ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్డు, సికిందరాబాద్.

దీనిలో బ్రాహ్మణీకం అనే చిన్నినవల, భోగం మేళం, హమ్‌కో ముహబ్బత్ అనే కథలూ పునర్ముద్రణ పొందాయి.

పరమార్థ ప్రసంగము

వ్యాస సంపుటి. రచయిత—శ్రీ ద్విభాష్యం వెంకటసూర్యనారాయణమూర్తి. పుటలు — 290. వెల అమూల్యము. ప్రాప్తిస్థానం—శ్రీ ద్విభాష్యం వెంకటసూర్యనారాయణమూర్తి, మేనేజింగ్ పార్ట్‌నర్, వేంకటేశ్వర ఆయుర్వేదనిలయము, చింతలూరు, తూర్పు గోదావరిజిల్లా.

దీనిలో కలౌ సంస్మరణాన్ముక్తిః, పురాణశ్రవణ ఫలము, కాశీ మాహాత్మ్యము, ప్రయాగక్షేత్ర మాహాత్మ్యము, గయా మాహాత్మ్యము, కేదారక్షేత్ర మాహాత్మ్యము, శివరాత్రి మాహాత్మ్యము, వైశాఖ మాస మహిమ, పితృతీర్థము, భాగ్యతీర్థము, సత్యతీర్థము, దానమహిమ, జితేంద్రియత్వము, రామేశ్వరక్షేత్ర మాహాత్మ్యము - అనే 14 వ్యాసాలున్నాయి. శ్రీ వేంపరాల సూర్యనారాయణశాస్త్రి దీనికి విపులపీఠిక వ్రాశారు.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1, Editor : S. Sambhu Prasad.